సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 360

శనివారం 22-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'



నీటిని ఒడిసిపట్టారు

'నీరు ఉన్న చోట ఊరు ఉంటుంది' అనే మాట ఉంది. ఊరు సరే... నీటి మాట ఏమిటి? 'నీటిని డబ్బులా ఖర్చు చేయవద్దు' అనే రోజులు వచ్చాయి. నీటి విలువ గురించి అవగాహన కలిగించడం నుంచి సంరక్షణ వరకు విమెన్ వాటర్ వారియర్స్ క్షేత్రస్థాయిలో, ఉద్యమ స్థాయిలో పనిచేస్తున్నారు.

- వివరాలు IIలో

నేడు ప్రపంచ జల దినోత్సవం

● వాటర్ నారియర్స్



అరుణా దాస్ గుప్తా, 'వాటర్ ఛాంపియన్'



రమణ్‌దీప్ కౌర్



రేణుక

'నీరు ఉన్న చోట ఊరు ఉంటుంది' అనే మాట ఉంది. ఊరు సరే... నీటి మాట ఏమిటి?
'నీటిని డబ్బులా ఖర్చు చేయవద్దు' అనే రోజులు వచ్చాయి.
నీటి విలువ గురించి అవగాహన కలిగించడం నుంచి సంరక్షణ వరకు
విమెన్ వాటర్ వారియర్స్ క్షేత్రస్థాయిలో, ఉద్యమ స్థాయిలో పనిచేస్తున్నారు...

నీటిని ఒడిసిపట్టారు

అస్సాంలోని అమ్డోలా గ్రామానికి చెందిన అరుణా దాస్ గుప్తా సామాజిక సమస్యలపై నిర్వహించే సమావేశాలకు తరచుగా హాజరయ్యేది. ఆ అలవాటే తనని నీటి పరిరక్షణ ఉద్యమంలో భాగం అయ్యేలా చేసింది. గ్రామంలోని వాటర్ యూజర్ గ్రూప్ (డబ్ల్యూయుజీ) అధ్యక్షురాలిగా నీటి సమస్యలపై గళమెత్తడంలో గణనీయమైన పాత్ర పోషించింది. 'ప్రతి విషయం నీటితో ఆరంభమై నీటితో ముగిసిపోతుంది' అంటున్న అరుణ యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఇండియా) ద్వారా 'వాటర్ ఛాంపియన్'గా గుర్తింపు పొందింది.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్ష్మీపూర్ ఖేరీ జిల్లాలోని పాలియ కాలన్ గ్రామానికి చెందిన రమణ్‌దీప్ కౌర్ నీటి సంరక్షణ నుంచి నీటి కాలుష్యం వరకు....ఎన్నో విషయాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ 'వాటర్ ఛాంపియన్'గా గుర్తింపు పొందింది. కౌర్ సోషల్ సైన్సెస్‌లో పోస్ట్–గ్రాడ్యుయేషన్ చేసింది. గ్రామంలో 'వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీ'లు ఏర్పాటు చేసింది.ఇంటికే పరిమితమైన ఎంతోమంది మహిళలను వాటర్ మేనేజ్‌మెంట్ గ్రూపులలో భాగమయ్యేలా చేసింది.

వాటర్ గర్ల్... నీటి పుస్తకాలు

'వాటర్ గర్ల్'గా గుర్తింపు పొందిన గర్విత గుల్హాటీ 'వై వేస్ట్?' అనే స్వచ్ఛంద సంస్థ ఫౌండర్, సీయివో. తన ఫౌండేషన్ ద్వారా నీటి విలువ, నీటి సంరక్షణ గురించి యువ రచయితలు రాసిన రచనలను ప్రచురిస్తోంది.



గర్విత గుల్హాటీ

నీటి నిజాలు

- ప్రపంచంలో 2 బిలియన్ మందికి సురక్షిత తాగునీరు అందుబాటులో లేదని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది
- ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 20 లక్షల మంది కలుషిత నీటి వల్ల సంభవించే వ్యాధులతో మరణిస్తున్నారు
- భవిష్యత్తులో నీటి కొరత ఒక ప్రధాన సమస్యగా మారనుంది. పరిష్కారంగా, డీసాలినేషన్ (సముద్ర జలాన్ని తాగే నీటిగా మార్చడం), వర్షపు నీటి సేకరణ, జల పునర్వినియోగం వంటి టెక్నాలజీలు అవసరం. ప్రతి వ్యక్తి నీటిని పొదుపుగా వాడడం ముఖ్యం.

మహారాష్ట్రలోని కోటంబ గ్రామంలో మహిళలు నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. దీనికి కారణం రేణుక. కోడలుగా ఆ ఊళ్లోకి అడుగు పెట్టిన రేణుక కొంత కాలానికి ఆ గ్రామానికి సర్పంచ్ అయింది. 'వాటర్ ఎయిడ్ ఇండియా' సహకారంతో గ్రామంలో ప్రభుత్వ భవనాలపై రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేసింది. నీటి వృథాను అరికట్టడానికి, నీటి సంరక్షణపై అవగాహన కలిగించడానికి గ్రామీణ మహిళలతో కమిటీని ఏర్పాటు చేసింది.



బబిత లిరోలియా

మధ్యప్రదేశ్‌లోని నయాపూరా గ్రామానికి చెందిన బబితా లిరోలియా నీటి సంరక్షణ, నీటి నాణ్యత పరీక్షించడం, నీటి పంపుల రిపేర్...మొదలైన ఎన్నో విషయాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 'ఇంటర్‌నేషనల్ వాటర్ ఇనిస్టిట్యూట్' బబితాను 'వాటర్ ఛాంపియన్'గా గుర్తించింది.



రాధ మీనా

మధ్యప్రదేశ్‌లోని మహుకల గ్రామానికి చెందిన రాధ మీనా 'విమెన్ ప్లస్ వాటర్ అలయెన్స్' ప్రోగ్రామ్ వాలెంటరీ వర్కర్. గ్రామంలో నీటి సమస్య లేకుండా చేయడం నుంచి కుళాయిల్లో లీకేజీ సమస్య లేకుండా చేయడం, నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించడం వరకు ఎన్నో పనులు చేస్తోంది. ప్రతీ వీధి తిరుగుతూ నీటి సంరక్షణ గురించి లౌడ్ స్పీకర్‌తో ప్రచారం చేసేది.

...దేశ వ్యాప్తంగా ఉన్న ఎంతో మంది విమెన్ వాటర్ వారియర్స్‌లో వీరు కొందరు మాత్రమే. 'వరల్డ్ వాటర్ డే' సందర్భంగా అందరికీ వందనాలు.

– శిరీష చల్లపల్లి



2020 మార్చి 24.. జనతా కర్ఫ్యూ... అదే లాక్‌డౌన్ గుర్తుందా?
ఆ పాడు రోజులను గుర్తుపెట్టుకోవడం కూడానా అని ముఖం చిట్లిస్తున్నారా?
నిజమే చేదు అనుభవాలను అదేపనిగా గుర్తుపెట్టుకోనక్కరలేదు!
కానీ కష్టకాలంలో అందిన సేవలు, సహాయాన్ని మాత్రం మరువకూడదు కదా!
అలా కోవిడ్ టైమ్‌లో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా నిలబడ్డ నర్సులు, డాక్టర్లు, పోలీసులు అందించిన సేవలు,
సాయం గురించి మార్చి 24 లాక్‌డౌన్ డే సందర్భంగా ఒక్కసారి గుర్తుచేసుకుందాం.. ఓ సిరీస్‌గా! అందులో భాగంగా
నేడు .. సికిందరాబాద్ గాంధీ ఆసుపత్రి సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ శిరీష ఏం చెబుతున్నారంటే..



బి. శిరీషా రాణి
సీనియర్ నర్సింగ్ ఆఫీసర్

మహమ్మారి మా గౌరవాన్ని పెంచింది!

ఆ రోజులను తలచుకుంటే ఇప్పటికీ భయమే! నేనప్పుడు ఉస్మానియాలో పనిచేసేదాన్ని. గాంధీ హాస్పిటల్‌ని కోవిడ్ హాస్పిటల్‌గా కన్వర్ట్ చేశారు. కోవిడ్ పాజిటివ్ అని తేలాకే అందులో జాయిన్ చేసుకునేవారు. జనరల్ పేషంట్స్, కోవిడ్ లక్షణాలున్న వాళ్లు ఉస్మానియాకు వచ్చేవాళ్లు. టెస్ట్ చేసి.. పాజిటివ్ అని తేలితే గాంధీకి పంపేవాళ్లం. ఉస్మానియా కోవిడ్ కాదు, ఎన్ 95 మాస్క్‌లు, పీపీఈ కిట్స్ ఖరీదైనవి కూడా .. కాబట్టి వాటిని ముందు డాక్టర్స్‌కే ఇచ్చారు. అయితే నిత్యం పేషంట్స్‌తో ఉంటూ వాళ్లను కనిపెట్టుకునేది నర్సింగ్ స్టాఫే కాబట్టి మాస్క్‌లు, పీపీఈ కిట్‌లు ముందు వాళ్లకు కావాలని మాకు ఇప్పించారు అప్పటి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ సర్.



మామ పోయాడు.. అల్లుడు బతికాడు

ఒక కేస్‌లో మామ, అల్లుడు ఇద్దరికీ కోవిడ్ సోకింది. ఇద్దరినీ గాంధీలో చేర్పించాం. మాకు రెండు ప్రాణాలూ ఇంపార్టెంటే! ఇద్దరికీ ఈక్వల్ సర్వీసే ఇస్తాం. దురదృష్టవశాత్తు పెద్దాయన అంటే మామ చనిపోయాడు. ఆ అమ్మాయి భర్త డిశ్చార్జ్ అయ్యాడు. అల్లుడిని చూసి అత్తగారు తన భర్త కూడా తిరిగొస్తాడనుకుంది. వెంటనే నిజం చెబితే ఆమెకేమన్నా అయిపోతుందన్న భయంతో నెల తర్వాత అసలు విషయం చెప్పారు. ఇలా ఎన్నికేసులో! కోవిడ్ నుంచి బయటపడగలమా అని దిగులేసేది. అలాంటి సిట్యుయేషన్ ఎప్పటికీ రావద్దు!

వెంటిలేటర్ మీదుంచే స్థితిలో..

లాక్‌డౌన్ టైమ్‌లో మాకు వారం డ్యూటీ, వారం సెలవు ఉండేది. రెండో వారమే నాకు కాళ్లు లాగడం, కళ్లు మండటం స్టార్టయింది. దాంతో తర్వాత వారం కూడా సెలవు తీసుకున్నాను. ఇది కోవిడా లేక నా అనుమానమేనా అని తెల్సుకోవడానికి డ్యూటీలో జాయినయ్యే కంటే ముందు రోజు అంటే పదమూడో రోజు టెస్ట్ చేయించుకున్నాను. స్వాబ్ టెస్ట్‌లో నెగటివ్ వచ్చింది. సీటీ స్కాన్ కూడా చేయిస్తే.. సీవియర్‌గా ఉంది కోవిడ్. ఆ రిపోర్ట్స్‌ని మా హాస్పిటల్‌లోని అనస్తీషియా డాక్టర్‌కి పంపాను. వాటిని చూసిన ఆవిడ 'వెంటిలేటర్ మీదుంచే స్థితి తెలుసా నీది? అసలెలా ఉన్నావ్?' అంటూ గాభరాపడ్డారు. కానీ నేను మాత్రం బాగానే ఉన్నాను. అయినా ఆవిడ కొన్ని జాగ్రత్తలు చెప్పారు. తెల్లవారి డ్యూటీలో జాయిన్‌పోయాను. అయితే డాక్టర్స్, కొలీగ్స్ చాలా కేర్ తీసుకున్నారు. ఇంట్లో మా ఆయన, పిల్లలు కూడా! డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చేసరికి మావారు వేడినీళ్లు పెట్టి ఉంచేవారు. మా పెద్దబ్బాయి రోజూ నాన్‌వెజ్ చేసిపెట్టేవాడు.' నువ్వు డ్యూటీ చేయాలి కదమ్మా.. మంచి ఫుడ్ అవసరం' అంటూ. అందరూ చాలా సపోర్ట్‌గా ఉన్నారు.

అంత విషాదంలోనూ సంతోషమేంటంటే..

మా నర్సింగ్ స్టాఫ్‌లో డెబ్బై శాతం మందికి కోవిడ్ సోకింది. ఐసొలేషన్ పీరియడ్ అయిపోగానే వెంటనే డ్యూటీకొచ్చారు.. భయపడలేదు. పీపీఈ కిట్‌తో ఉక్కపోతగా ఉండేది. అది వేసుకున్న తర్వాత ఒక్కసారి తీసినా మళ్లీ పనికిరాదు. దాంతో వాష్‌రూమ్‌కి కూడా వెళ్లేవాళ్లం కాదు. దానివల్ల డీహైడ్రేషన్ అయింది. అయినా, సహనం కోల్పోలేదు. కోవిడ్ మా సర్వీస్‌కి పరీక్షలాంటిది. నెగ్గాలి.. మానవ సేవను మించిన పరమార్థం లేదు అనుకునేదాన్ని! అంత విషాదంలోనూ సంతోషమేంటంటే మా నిబద్ధత, సేవ ప్రజలకు అర్థమైంది. ప్రభుత్వాసుపత్రుల మీదున్న చెడు అభిప్రాయం పోయింది. మమ్మల్ని గౌరవిస్తున్నారు.

– సరస్వతి రమ

పంటపొలాల్లో డ్రోన్ ధీరలు

- వ్యవసాయ పనులకు ఆధునిక డ్రోన్ల వినియోగం
- సంగారెడ్డి జిల్లాలో 54 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలకు శిక్షణ
- రైతులకు అందించనున్న పిచికారీ సేవలు
- ఆర్థిక స్వావలంబనతోపాటు, రైతులకు మేలంటున్న మహిళలు



డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారీ చేస్తున్న దృశ్యం



డ్రోన్ ఆపరేటింగ్‌పై శిక్షణ పొందుతున్న స్వయం సహాయక సంఘాల మహిళలు

ఇంతకాలం పంటలకు పురుగు మందులు పిచికారీ చేయడం, నానో యూరియా వంటి ఎరువులు చల్లడం వంటి క్లిష్టతరమైన పనులను పురుషులే చేస్తున్నారు. అయితే ఇలాంటి పనులను కూడా ఇకపై మహిళలే చేయనున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్లతో వ్యవసాయ పనులను చేయడంపై గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 54 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలను ఎంపిక చేశారు. తొమ్మిది రోజుల పాటు ఈ శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత వారికి ఈ డ్రోన్లను అందించనున్నారు. బెంగుళూరుకు చెందిన ఫ్లైయింగ్ వెడ్జ్ అనే కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు.

80 శాతం సబ్సిడీపై...

కేంద్ర ప్రభుత్వం నమో డ్రోన్ దీదీ పథకం కింద ఈ డ్రోన్లకు 80 శాతం సబ్సిడీపై అందిస్తున్నారు. ఈ డ్రోన్‌తోపాటు, సంబంధిత మెటీరియల్‌తో కలిపి యూనిట్ వ్యయం రూ.పది లక్షలు. ఇందులో లబ్ధిదారులు 20 శాతం (రూ.రెండు లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.ఎనిమిది లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నమో దీదీ, కిసాన్‌దీదీ పథకాల కింద సబ్సిడీ ఇస్తున్నాయి. ఈ డ్రోన్ సేవలను తమ వ్యవసాయ పొలాలకు వినియోగించడంతోపాటు, గ్రామంలో ఇతర రైతుల పొలాలకు సేవలందించనున్నారు. ఇందుకోసం నిర్ణీత మొత్తాన్ని వసూలు చేస్తారు. ఇలా ఎస్‌హెచ్‌జీ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడంతో పాటు, రైతులకు తమ పంటపొలాలకు పురుగుమందుల పిచికారీ కష్టాలు తప్పనున్నాయి.

– పాత బాలప్రసాద్, సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి

ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మేలు..



డ్రోన్ స్ప్రేపై మాకు శిక్షణ ఇస్తున్నారు. వీటిని వినియోగించడం ద్వారా మేము ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు. అలాగే రైతులకు తక్కువ ఖర్చుతో పురుగు మందుల పిచికారీ చేసే సేవలు అందుబాటులోకి వస్తాయి. మా లాంటి మహిళా సంఘాలకు ఈ అవకాశాన్ని కల్పించడం పట్ల సంతోషంగా ఉంది.

– అనిత, ఎస్‌హెచ్‌జీ మహిళ, అల్మాయిపేట, సంగారెడ్డి జిల్లా.

మాతోపాటు, రైతులకూ ప్రయోజనం...



డ్రోన్‌లను వినియోగించి పంటలకు పురుగు మందులు ఎలా పిచికారీ చేయాలనే దానిపై శిక్షణ ఇస్తున్నారు. రైతులకు ఈ సేవలు అందించడం ద్వారా మాకు ఆర్థికంగా కలిసొస్తుందని భావిస్తున్నాము. అలాగే రైతులకు కూడా ప్రయోజనం కలుగుతుంది. మాకు అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నారు. డ్రోన్ల సేవలు అందించేలా గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది.

– లక్ష్మి, ఎస్‌హెచ్‌జీ మహిళ, అన్నాసాగర్, సంగారెడ్డి జిల్లా

ఓనర్‌షిప్

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఉన్న పథకాలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెట్ మెలకువలు, అందుతున్న రుణాలు, వడ్డీ రేటు, సబ్సిడీలు, ఎక్కడ.. ఎలా దరఖాస్తు చేసుకోవాలి, అవసరమైన డాక్యుమెంట్లు, సక్సెస్ రేట్ వంటి వివరాలను "ఓనర్'షి'ప్" పేరుతో ప్రతి శనివారం అందిస్తున్నాం!

ఈ వారం స్కీమ్ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన

లాభాల తీరం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన



పీఎమ్ఎస్సెస్‌వై (ప్రధానమంత్రి స్వస్థ సురక్ష యోజన) కిందకు వచ్చే ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని 2020లో ప్రారంభించారు. కేంద్రప్రభుత్వానికి చెందిన ఈ స్కీమ్ ద్వారా ఎలాంటి పూచీకత్తు లేకుండా చేపలపెంపకందారులకు ఏడు శాతం వడ్డీతో రెండు లక్షల రూపాయల వరకు రుణాన్ని అందిస్తున్నారు. చేపలు, రొయ్యల పెంపకంపై ఉచిత శిక్షణనూ అందిస్తున్నారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన మహిళలకు 60 శాతం వరకు గ్రాంట్ అందుతోంది. ఈ పథకం తీరప్రాంతంలోని చిన్న, సన్నకారు రైతులకు లాభాల పంట పండిస్తోంది. చేపల ఎగుమతిలో భారతదేశాన్ని ముందంజలో నడిపిస్తోంది. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఫిషరీస్, మత్స్యకారుల సంక్షేమశాఖ సహాయసంచాలకుల కార్యాలయంలో మరిన్ని వివరాలను పొందవచ్చు. జిల్లా మత్స్యశాఖ లేదా ఏదైనా హేచరీ నుంచి ఉచితంగా చేప సీడ్‌ను పొందవచ్చు. ఈ పథకానికి అధికారిక వెబ్‌సైట్ https://pmmsy.dof.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వెబ్‌సైట్ హోమ్ పేజీలో స్కీమ్ లింక్‌పై క్లిక్ చేయాలి. నింపాల్సిన ఫామ్ కనిపిస్తుంది. అందులోని వివరాలను పూరించాలి. ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, బ్యాంక్ ఖాతా, భూమి వివరాలనూ పొందుపరచాలి. డీపీఆర్ (డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సహా సూచించిన పత్రాలను అప్‌లోడ్ చేయాలి. తర్వాత సబ్‌మిట్ పై క్లిక్ చేసి.. ఫామ్‌ను సమర్పించాలి. దరఖాస్తుదారు అర్హతలు, సంబంధిత పత్రాలను ఆమోదించిన తరువాత పథకం ప్రయోజనాలను పొందవచ్చు. తీరప్రాంతం లేని చోటా మత్స్య సంపదను అభివృద్ధి చేసేందుకు ఈ పథకం రుణాన్ని అందిస్తోంది. కమర్షియల్ ఆక్వా కల్చర్ సిస్టమ్ కింద ఈ ప్రాజెక్ట్ విలువ రూ. 20 లక్షలు అయితే రూ. 5 లక్షల వరకు సొంత పెట్టుబడి ఉండాలి. అప్పుడు రూ. 15 లక్షల రుణాన్ని పొందవచ్చు. ఇందులో సబ్సిడీ ఉంటుంది.



– బి.ఎస్. రత్న, బిజినెస్ కన్సల్టెంట్, దలీప్

మీ సందేహాలను పంపవలసిన మెయిల్ ఐడీ : ownership.sakshi@gmail.com

నిర్వహణ : సరస్వతి రమ

వంటిల్లు

పుల్లపుల్లగా... తియ్యతియ్యగా...

పచ్చి మామిడికాయతో ఒక్క ఆవకాయేనా? ఇంకా చాలా చేయవచ్చు. పచ్చిమామిడితో వంటకాలే కాదు... పుల్లని మామిడితో తియ్యటి మిఠాయిలూ సృష్టించొచ్చు. షర్బత్‌లూ తాగించొచ్చు.



మ్యాంగో జామూన్స్



కావలసినవి: పచ్చి మామిడి కాయ–1 (మరీ పుల్లగా ఉన్నది కాకుండా కొంచె తీపి, పులుపు కలిపి ఉన్నది తీసుకోవాలి), మైదా–అరకప్పు, పంచదార–1 కప్పు, నీర –1 కప్పు, నెయ్యి– 2 చెంచాలు.

తయారీ: మామిడికాయను పచ్చని భాగం పోయేవరకూ చెక్కు తీసి, ముక్కలుగా కోసుకోవాలి; స్టౌ మీద గిన్నె పెట్టి నెయ్యి వేయాలి; వేడెక్కాక మామిడి ముక్కలు వేసి మెత్తబడేవరకూ మగ్గనివ్వాలి; తర్వాత చల్లారబెట్టి మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి; ఈ పేస్ట్‌లో మైదా వేసి బాగా కలుపుకుని, మృదువుగా అయ్యాక ఉండలు చేసి పక్కన పెట్టుకోవాలి; గిన్నెలో నీరు, పంచదార వేసి స్టౌమీద పెట్టాలి; లేత పాకం తయారయ్యాక... జామూన్లను నూనెలో వేయించి పాకంలో వేయాలి; ఉండలు పాకాన్ని బాగా పీల్చుకున్నాక తరిగిన డ్రైఫ్రూట్స్‌తో అలంకరించి వడ్డించాలి. ఇవి చూడ్డానికి మామూలు జామూన్లలానే ఉంటాయి కానీ తింటే తీపితో పాటు కొద్ది పులుపుగా ఉండి ఓ కొత్త రుచిని పరిచయం చేస్తాయి.

పచ్చి మామిడి హల్వా



కావలసినవి: పచ్చి మామిడికాయ – 1, వెర్మిసెల్లీ – 1 కప్పు, పంచదార – 2 కప్పులు, నీళ్లు – 2 కప్పులు, నెయ్యి – పావు కప్పు, జీడిపప్పు పొడి – 2 చెంచాలు, యాలకుల పొడి – 2 చెంచాలు

తయారీ: మామిడికాయను మెత్తని గుజ్జులా చేసి పెట్టుకోవాలి (గుజ్జు 1 కప్పు ఉండాలి); స్టౌమీద గిన్నె పెట్టి నెయ్యి వేయాలి; వేడెక్కాక సేమ్యా వేసి వేయించాలి; రంగు మారాక నీళ్లు పోయాలి; సేమ్యా కాస్త మెత్తబడ్డాక మామిడి గుజ్జును వేయాలి; రెండు నిమిషాలు ఉడికాక పంచదార కూడా వేయాలి; అడుగంటకుండా కలుపుతూ సన్నని మంట మీద ఉడికించాలి; మిశ్రమం బాగా చిక్కబడ్డాక నెయ్యి, జీడిపప్పు పొడి, యాలకుల పొడి వేసి కలపాలి; హల్వా దగ్గరపడి నెయ్యి గిన్నె అంచులువదులుతున్నప్పుడు దించేసుకోవాలి.

మ్యాంగో బనానా షర్బత్



కావలసినవి: పచ్చి మామిడికాయలు – 2, పంచదార – 1 కప్పు, అరటిపండు – 1, జీలకర్ర పొడి – 1 చెంచా, మిరియాల పొడి – చిటికెడు, ఉప్పు – తగినంత

తయారీ: అరటిపండును చిన్న చిన్న ముక్కలుగా కోసి పక్కన పెట్టుకోవాలి; మామిడికాయల్ని చెక్కు తీసి ముక్కలుగా కోసుకోవాలి; ఈ ముక్కలు, పంచదార కలిపి మిక్సీలో వేసి మెత్తగా చేసుకోవాలి; తర్వాత నీరు పోసి పల్చని జ్యూస్‌లా బ్లెండ్ చేయాలి; దీన్ని గ్లాసులోకి వడపోసుకుని అరటిపండు ముక్కలు వేయాలి; ఆపైన జీలకర్ర పొడి, మిరియాల పొడి, ఐస్ ముక్కలు వేసి సర్వ్ చేయాలి. వేసవిలో ఈ షర్బత్ శరీరాన్ని చల్లబరుస్తుంది.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 360
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



నేటి నుంచి ఐపీఎల్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌కు నేటితో తెరలేవనుంది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడుతోంది. టోర్నీలో భాగంగా మొత్తం 73 మ్యాచ్‌లు జరుగుతాయి. మే 25న కోల్‌కతాలో ఫైనల్ జరుగుతుంది. 15లో

బడ్జెట్‌పై 'సభ'భగలు

శాసనసభలో బడ్జెట్‌పై హరీశ్‌రావు, భట్టి మధ్య మాటల యుద్ధం

ఆర్థిక మాంద్యం కాదు.. మీ బుద్ధి మాంద్యం



- అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చలో మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- అంతా తనకే తెలుసనుకునే సీఎం అజ్ఞానంతో ఆదాయం దిగజారింది
- పాలన చేతకాక నెగెటివ్ రిజల్ట్.. బడ్జెట్ అంకెలు, లెక్కలన్నీ ఉత్తవే
- ఆరు గ్యారంటీలకు దిక్కులేదు గానీ.. అందాల పోటీలా?
- అబద్ధాలకు ఆస్కార్ ఇస్తే.. సీఎం రేవంత్‌రెడ్డికే వస్తుంది

2లో

ఆర్థిక విధ్వంసం చేసిన మీరా విమర్శించేది?

- బడ్జెట్‌పై చర్చకు సమాధానంలో బీఆర్‌ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్
- ఆదాయం లేకున్నా పెంచుతూ పోయింది మీరే... మీరు చేసిన అప్పులు తీర్చలేక చస్తున్నాం
- పదేళ్లు ఎంతో అవమానించారు.. మౌనంగా భరించాం
- అన్నీ అనుభవించే ఇక్కడకొచ్చాం.. మీరెన్ని మాట్లాడినా బాధపడం



న్యాయమూర్తి ఇంట్లో నోట్ల కట్టలు

ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీగా నగదు లభ్యం 6లో

కరెంటు కోత.. హీత్రూ మూత!

- రోజంతా మూతబడ్డ విమానాశ్రయం
- 1,350 విమానాల రద్దు, దారిమళ్లింపు



ఆర్థిక మాంద్యం కాదు.. మీ బుద్ధి మాంద్యం

అంతా తనకే తెలుసనుకునే సీఎం అజ్ఞానంతో రాష్ట్ర ఆదాయం దిగజారింది

శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక మాంద్యంతో ఆదాయం తగ్గిందని ప్రభుత్వం చెబుతోందని.. కానీ ఇది పాలకుల బుద్ధి మాంద్యమని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సభ్యుడు టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ''ఇచ్చిన హామీలను అమలు చేసే దిక్కులేదు, వాటికి సరిపడా ఆదాయం లేదని ప్రభుత్వమే చెప్తోంది. ఆదాయం ఎందుకు లేదంటే ఆర్థిక మాంద్యం అంటోంది. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఏపీ సహా దేశంలో ఎక్కడా కనిపించని ఆర్థిక మాంద్యం తెలంగాణలోనే ఎందుకు ఉంటుంది? ఇది ఆర్థిక మాంద్యం కాదు.. పాలకుల బుద్ధిమాంద్యం. అంతా తనకే తెలుసు అనుకునే సీఎం అజ్ఞానం, అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్ర ఆదాయం దిగజారింది. ఆ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఆర్థిక మాంద్యం మాటెత్తుకున్నారు..''అని పేర్కొన్నారు. బడ్జెట్‌పై చర్చలో భాగంగా శుక్రవారం ఆయన బీఆర్‌ఎస్ పక్షాన శాసనసభలో సుదీర్ఘంగా మాట్లాడారు. వివరాలు హరీశ్‌రావు మాటల్లోనే...

ఇది దిగజారుడు రాజకీయం

రాష్ట్ర ఆదాయం తగ్గిపోవటంతో భూములను తెగనమ్మి నిధులు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కొన్ని భూములమ్మితేనే గగ్గోలు పెట్టిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు రూ.50 వేల కోట్లు లక్ష్యంగా ప్రభుత్వ భూములు అమ్మేస్తున్నారు. ఇది దిగజారుడు రాజకీయం కాదా? పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే రైజింగ్ తెలంగాణ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆరు గ్యారంటీలకు దిక్కు లేదు గానీ, అందాల పోటీలు నిర్వహిస్తారట.

రాష్ట్రంలో అన్ని వ్యవస్థల విధ్వంసం..

రాష్ట్రంలో వ్యవసాయ విధ్వంసం వల్ల రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. హైడ్రా విధ్వంసం వల్ల పేద, మధ్య తరగతి జనం గుండె ఆగి చనిపోతున్నారు. రియల్ ఎస్టేట్ కుప్పకూలి రియల్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సరైన తిండి లేక హాస్టళ్లలో విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. మా హయాంలో గురుకులాల సంఖ్యను 289 నుంచి 1,020కి పెంచి బలోపేతం చేస్తే.. ఇప్పుడు వాటిలో విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే దుస్థితికి తెచ్చారు. దీనితో క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది.

అన్ని వర్గాలను మోసం చేశారు

గతేడాది రూ.2,91,159 కోట్లుగా గొప్పగా చెప్పుకున్న బడ్జెట్ వాస్తవిక బడ్జెట్ కాదని నేను అప్పుడే చెప్పాను. రివైజ్డ్ బడ్జెట్ అంకెల్లో రూ.27 వేల కోట్లు తక్కువ చేసి చూపటం ద్వారా అదే నిజమని తేలింది. ఎన్నికలకు ముందు నో ఎల్‌ఆర్‌ఎస్, నో బీఆర్‌ఎస్ అన్నారు. ఇప్పుడు పేదల రక్తమాంసాలు పిండి ఎల్‌ఆర్‌ఎస్ వసూలుకు సిద్ధమయ్యారు. ఫార్మాసిటీకి మేం భూములు సేకరిస్తుంటే తప్పుపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆ భూములను తిరిగి రైతులకు ఇస్తామని చెప్పి.. ఇప్పుడేమో ఫ్యూచర్ సిటీ పేరుతో అదనంగా మరో 14 వేల ఎకరాలు లాక్కుంటున్నారు. గత బడ్జెట్ ప్రసంగంలో రైతులతోపాటు కౌలు రైతులకు కూడా రైతు భరోసా, రైతు బీమా ఇస్తామని చెప్పి.. ఇప్పుడు కౌలు రైతుల ప్రస్తావనే లేదు.

సభకు క్షమాపణ చెప్పండి..

గత బడ్జెట్‌లో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు అని చెప్పి ఈ 16 నెలల్లో నాలుగు ఇళ్లు కూడా నిర్మించలేదు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష అదనంగా ఇస్తామని.. ఇప్పుడు ఆ మాటే ఎత్తలేదు. ఇది దళిత, గిరిజనులను మోసం చేయడం కాదా. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు జాబ్ కేలండర్ అమలుచేస్తామని చెప్పి జాబ్‌లెస్ కేలండర్‌గా మార్చారు. దాని సంగతేమిటని నిరుద్యోగులు ప్రశ్నిస్తే అశోక్‌నగర్‌లో వారి వీపులు పగలగొడుతున్నారు. తుదిదశలో ఉన్న ఆరు సాగునీటి ప్రాజెక్టులని బడ్జెట్‌లో ప్రస్తావించారు కదా.. ఆ ప్రాజెక్టుల పేర్లేమిటో చెప్పండి. లేదా సభను తప్పుదోవ పట్టించినందుకు క్షమాపణ చెప్పండి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలో 1,913 ప్రభుత్వ పాఠశాలలు మూసేశారు. ఎన్నికల ముందు 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ అని ప్రకటనలు చేసి.. ఇప్పుడు మేమిచ్చిన నోటిఫికేషన్‌కు 5 వేల పోస్టులు మాత్రమే పెంచి దగా డీఎస్సీ చేశారు.

ఉద్యోగాలపై తప్పుడు లెక్కలు..

కేసీఆర్ ముల్కీ రూల్స్ నుంచి 610 జీవో కోసం పోరాడి స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా చేసి.. తొమ్మిదిన్నరేళ్లలో 1.62 లక్షల ఉద్యోగాలిచ్చారు. మా హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు సంబంధించిన నియామక పత్రాలు పంచటం తప్ప కొత్త ఉద్యోగాల కల్పన ఏది? కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్న 57 వేల ఉద్యోగాల్లో 50 వేలు మా హయాంలోనివే. ఈ ప్రభుత్వం ఆరు వేలు కూడా భర్తీ చేయలేదు. రాహుల్ గాంధీ దేశమంతా తిరుగుతూ మొహబ్బత్ కా దుకాణ్ (ప్రేమ దుకాణం) అంటుంటే.. రేవంత్ మాత్రం నఫ్రత్ కా మకాన్ (విద్వేషాల ఇల్లు) అంటున్నారు..''అని హరీశ్‌రావు మండిపడ్డారు.

వాటిని వడ్డీలేని రుణాలుగా పరిగణిస్తారా?

''ఐదేళ్లలో వడ్డీ లేని రుణాల కింద రూ.లక్ష కోట్లు అందజేస్తామని చెప్పారు. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఉంటే ఆ ఉత్తర్వులు సభ ముందుంచాలి. లేని పక్షంలో సభను తప్పుదోవ పట్టించినందుకు సభకు క్షమాపణ చెప్పాలి. ఈ ఆర్థిక సంవత్సరంలో వడ్డీ లేని రుణాలకు సంబంధించి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. మహిళా సంఘాలకు ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు ఇప్పిస్తామంటున్నారు. వాటిని వడ్డీ లేని రుణాలుగా పరిగణిస్తారా చెప్పాలి?''

పాలనా వైఫల్యాలతో దెబ్బతిన్న పురోగతి

''జీఎస్టీ వృద్ధిరేటులో తగ్గుదల, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గడం, వాహనాల అమ్మకాల్లో తగ్గుదల.. ఇలా రాష్ట్ర ఆదాయం తగ్గింది. కేసీఆర్ హయాంలో దివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాలా, దివాలా అని దిక్కుమాలిన ప్రచారం చేయడం వల్ల పెట్టుబడులు తగ్గాయి. ఫార్మా సిటీ రద్దు, ఎయిర్ పోర్టుకు మెట్రో రద్దు, హైడ్రా పేరిట సాగించిన విధ్వంస కాండ, మూసీ ప్రక్షాళన పేరిట, బఫర్ జోన్ల పేరిట చేసిన హంగామా, ఆర్ఆర్ టాక్స్‌లు, సంక్షేమ పథకాల అమలు సరిగా లేక గ్రామాలకు ద్రవ్య ప్రవాహం తగ్గడం, ఉద్యోగులకు పీఆర్సీ, డీఏలు చెల్లించకపోవడం, రియల్ ఎస్టేట్ కుప్పకూలడం.. ఇలాంటి కారణాల వల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గి, వృద్ధి రేటు మందగించింది. పరిస్థితి ఇలా ఉంటే, బడ్జెట్‌లో మాత్రం ఘనమైన అంకెలు చూపి ప్రజలను మోసం చేస్తున్నారు.



ఆర్థిక విధ్వంసం చేసిన మీరు.. మమ్మల్ని విమర్శిస్తారా?

బడ్జెట్‌పై చర్చకు సమాధానంలో బీఆర్‌ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్

మీరు చేసిన అప్పులు, తప్పులు సరిదిద్దలేక చస్తున్నామని విమర్శ



సాక్షి, హైదరాబాద్: ''గత పదేళ్ల పాలనలో రూ.16.70 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టి ఏం సాధించారు? నాగార్జునసాగర్ నిర్మించారా? ఎస్సారెస్పీ, ఓఆర్ఆర్, ఎయిర్‌పోర్టు వంటివేమైనా నిర్మించారా? హైటెక్ సిటీ కట్టారా? ఏం చేశారయ్యా అంటే కాళేశ్వరం అంటారు. ఆ కాళేశ్వరం ఏమైందో రాష్ట్ర ప్రజలంతా చూశారు. ఇక మీరు చెప్పడానికేముంది? సింగరేణికి రూ.77 వేల కోట్లు బకాయిలు పెట్టిపోయారు. పదేళ్ల పాలనలో ఆర్థిక విధ్వంసం చేసి, వ్యవస్థలను నాశనం చేసిన మీరు.. వాస్తవిక బడ్జెట్‌ను పెట్టిన మమ్మల్ని విమర్శిస్తారా?'' అని బీఆర్‌ఎస్‌పై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా విపక్షాల ప్రశ్నలకు శుక్రవారం రాత్రి శాసనసభలో, శాసన మండలిలో భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. బడ్జెట్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర నేతలు చేసిన విమర్శలను ఘాటుగా తిప్పికొట్టారు. భట్టి ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

''బీఆర్‌ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చూపినా నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదు. 2016–17లో రూ.8వేల కోట్లు, 2018–19లో రూ.40 వేల కోట్లు, 2021–22లో రూ.48 వేల కోట్లు, 2022–23లో రూ.52 వేల కోట్లకు పైగా, 2023–24లో రూ.58,571 కోట్లు ఖర్చు చేయలేదు. మేం మీలాగా బడ్జెట్‌ను ప్రతీసారి 20 శాతానికిపైగా పెంచుకుంటూ పోలేదు. అలా పెంచితే ఈసారి బడ్జెట్ రూ.4 లక్షల 18 వేల కోట్లు అయ్యేది. మేం అలా చేయకుండా.. వాస్తవాల మీద బడ్జెట్ పెట్టాం. మీరు ఆదాయం ఉన్నా, లేకున్నా పెంచుతూ పోయారు. ఔటర్ రింగ్‌రోడ్డును రూ.7 వేల కోట్లకే 30 ఏళ్ల కాలానికి అమ్ముకున్నారు. దొడ్డిదారిన ప్రభుత్వ భూములను అమ్ముకున్నారు. తర్వాత వచ్చే ప్రభుత్వానికి దక్కాల్సిన ఆదాయాన్ని కూడా ముందే తీసుకున్నారు.

ఇసుక మాఫియాను కట్టడి చేశాం

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఇసుక అమ్మకాల ద్వారా రోజుకు కోటిన్నర ఆదాయం వచ్చేది. 30 వేల టన్నులు అమ్మేవారు. ఆరేడు నెలలుగా సీరియస్‌గా దృష్టి పెట్టాం. ఇసుక మాఫియాను కట్టడి చేశాం. రోజుకు 70 వేల టన్నులు అమ్ముతున్నాం. ఆదాయం రోజుకు రూ.3 కోట్లకు పెరిగింది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అమ్మకాల ద్వారా ఏటా రూ.600 కోట్ల ఆదాయం కోల్పోయాం. పదేళ్లలో రూ.6 వేల కోట్ల ప్రభుత్వ ధనం ఎక్కడికి పోయిందో బీఆర్‌ఎస్ వాళ్లే చెప్పాలి. ఇకపై రాష్ట్రంలోని అన్ని మాఫియాలను కట్టడి చేస్తాం. ఆదాయం పెంచుతాం.

అవమానాలను పదేళ్లు మౌనంగా భరించాం

రైతు రుణమాఫీ కింద పదేళ్లలో మీరు రూ.28,053 కోట్లు ఇస్తే.. మేం నాలుగు నెలల్లోనే రూ.20,617 కోట్లు ఇచ్చాం. మీరు జాప్యం చేయడంతో రైతు రుణమాఫీ కంటే వడ్డీల కింద రూ.13 వేల కోట్లు జమ చేసుకున్నారు. నిర్బంధం, స్వేచ్ఛ, నిరంకుశత్వం గురించి మీరా మాట్లాడేది? ఏ ఒక్కరోజైనా సభను ప్రజాస్వామికంగా నడిపారా? నేను పదేళ్లు ఎమ్మెల్యేగా, ప్రతిపక్ష నాయకుడిగా, సీఎల్పీ నేతగా అక్కడ కూర్చుని ఉంటే ఎంత అవమానించారో తెలియదా?తలవంచుకుని భరిస్తూ, మీకు సహకరించామే తప్ప అడ్డగోలుగా ఏదంటే అది మాట్లాడలేదు. సభాపతి, సభా నాయకుడు, ప్రభుత్వం గురించి తూలనాడలేదు. మేం పడిన అనుమానాలు ఈ సభలో ఎవరూ పడి ఉండరు. అయినా సభ ఔన్నత్యాన్ని కాపాడాం.

అన్నీ చూసే ఇక్కడికి వచ్చాం..

మీరెన్ని మాట్లాడినా, రన్నింగ్ కామెంట్రీలు చేసినా బాధపడేది లేదు. అవన్నీ చూసి చూసి, అనుభవించి ఇక్కడకు వచ్చాం. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని మహిళలందరికీ లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు బరాబర్ ఇస్తాం. రాష్ట్రంలోని మహిళలందరూ ఆత్మగౌరవంతో తలెత్తుకుని బతికేట్టు చేయాలన్నదే మా ప్రభుత్వం. సీఎం ఆలోచన. మేం ఉద్యోగాలు రాని పిల్లలకు రాజీవ్ యువ వికాసంతో రూ.6 వేల కోట్లు ఇవ్వబోతున్నాం. బ్రాహ్మణ పరిషత్‌కు రూ.50 కోట్లు ఉండే.. ఇంకో 50 కోట్లు కలిపి ఇచ్చాం. వైశ్యులు కార్పొరేషన్ కావాలని అడిగితే మీరు ఇవ్వలేదు. మేం రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.25 కోట్లు ఇచ్చాం..'' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

మీ అప్పులే కడుతున్నాం స్వామీ..

కేసీఆర్ నెరవేర్చని హామీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేశారు. ఈ ఏడాది రూ.1,58,041 కోట్ల అప్పులు తెచ్చి.. రూ.1,53,359 కోట్ల మేర గత ప్రభుత్వ అప్పులు, వడ్డీల కింద చెల్లించాం. మీరు చేసిన అప్పులు తీర్చలేక, తప్పులు సరిదిద్దలేక, నిద్రలేక చస్తున్నాం. మీ అప్పులే కడుతున్నాం స్వామీ. తెచ్చిన అప్పుల్లో కట్టిన అప్పులు పోను ఈ సంవత్సరానికి మా ప్రభుత్వం అవసరాల కోసం వాడుకున్నది రూ.4,682 కోట్లు మాత్రమే. మీలాగా నాలుగు గోడల మధ్య బంధించుకుని ఎవరికీ ఏమీ చెప్పకుండా, ఎవరినీ కలవకుండా మూసేసి పాలన చేయదల్చుకోలేదు. మా ప్రభుత్వం 24/7 తలుపులు తెరిచి ఉంటాయి.

అన్నీ ఉత్త మాటలే..

పదేళ్లలో కృష్ణానది, గోదావరి నదుల మీద నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా ఒక్క ఎకరానికైనా నీళ్లందించారా? కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు అన్యాయం చేసిందే మీరు. పదేళ్లలో దళితుల అభివృద్ధి కోసం రూ.1,81,877 కోట్లు కేటాయించారు. కానీ ఖర్చు చేయలేదు. దళితబంధు గురించి బడ్జెట్‌లో రూ.17,700 కోట్లు పెట్టి ఒక్క రూపాయి అయినా విడుదల చేశారా? అమాయకులైన గిరిజనులను ఆడవాళ్లని కూడా చూడకుండా చెట్టుకు కట్టేసి కొట్టించారు. మేం సబ్‌ప్లాన్ నిధులను తు.చ. తప్పకుండా ఖర్చు చేస్తాం. ఇది మా ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు.

'చెల్లెమ్మా.. నీ వెనుక నేనున్నా' అని వైఎస్ భరోసా ఇచ్చారు

వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో సోదర బంధాన్ని గుర్తుచేసుకున్న సబితా ఇంద్రారెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'చెల్లెమ్మా... నీ వెనుక నేనున్నాను'అని దివంగత మహానేత డా. వైఎస్ రాజశేఖరరెడ్డి భుజం తట్టి ఇచ్చిన భరోసా.. తనలో ఆత్మవిశ్వాసం, ధైర్యాన్ని నింపిందని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి గుర్తు చేసుకున్నారు. తనకు చేవెళ్ల చెల్లెమ్మగా వైఎస్ ఇచ్చిన ప్రాధాన్యం అంతాఇంతా కాదని చెప్పారు. ప్రతిపక్షనేతగా, సీఎంగా అన్ని కార్యక్రమాలను చేవెళ్ల నుంచే ప్రారంభించడం వైఎస్ తనకిచ్చిన గౌరవమని చెప్పారు. శుక్రవారం అసెంబ్లీ లాబీలో మీడియా ప్రతినిధులతో సబితా ఇంద్రారెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్ర కేబినెట్‌లో తొలి మహిళా హోంమంత్రిగా తనను నియమిస్తున్నట్టు వార్తలు రాగానే...సీఎం వైఎస్‌ను కలిసి అంత పెద్ద బాధ్యతను మోయగలనా అనే భయాన్ని ఆయన ముందుంచినట్టు ఆమె తెలిపారు. 'నీకెందుకు భయం...నీ వెనుక నేనున్నాను'అని వైఎస్ పూర్తి భరోసానిచ్చారన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే ప్రాజెక్టులు: రమణారావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలో నిర్మించినవేనని, అవన్నీ ఇప్పటికీ గట్టిగా ఉన్నాయని కాంగ్రెస్ శాసనసభ్యుడు సీహెచ్ రమణారావు అన్నారు. బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ హయాంలో కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని, లక్షల కోట్లు నీళ్లపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఈ ఆరోపణలను విపక్ష నేత హరీశ్‌రావు తిప్పికొట్టారు. కాళేశ్వరంలో కుంగిపోయింది ఒక్క పిల్లర్ మాత్రమేనని వివరణ ఇచ్చారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఒక్క పిల్లర్ కుంగినా ఇల్లు పనికి రాదని వ్యాఖ్యానించారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే రాష్ట్ర పరువు పోయింది

అన్ని విభాగాలు అత్యంత అవినీతిమయమయ్యాయి

- వాటన్నింటినీ ప్రజా ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నం చేస్తోంది.. మండలిలో మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పదేళ్లపాటు కొనసాగిన బీఆర్‌ఎస్ పాలన అత్యంత అవినీతిని మూటగట్టుకుందని మంత్రి సీతక్క ఆరోపించారు. పదేళ్ల పాలనలోనే రాష్ట్ర పరువు పోయిందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ వెలగబెట్టిన ఘనకార్యాలను సరిదిద్ది సుపరిపాలన అందించేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శుక్రవారం మండలిలో బడ్జెట్ ప్రసంగంపై జరిగిన చర్చలో భాగంగా ఆమె మాట్లాడారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం, దోచుకోవడంలాంటి సమర్థత బీఆర్‌ఎస్ డీఎన్‌ఏలోనే ఉందన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోందని, అంతలోనే వారు నిర్మించిన కాలువలు, ప్రాజెక్టులు ఎండిపోవడంలో ఆంతర్యమేమిటన్నారు. ఎన్నో వాగ్దానాలు చేసి అమలు చేయకపోవడంతోనే బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయిందని గుర్తు చేశారు.

- మండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత మధుసూదనాచారి మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటే.. ఇప్పుడు రేవంత్ పాలనలో కరువు తాండవిస్తోందని, పంటలు ఎండిపోతున్నాయన్నారు.
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ రెండో దశ నీటి సరఫరా ప్యాకేజీని ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, 60 శాతం ప్రైవేట్, 40 శాతం ప్రభుత్వ వాటాతో తాగునీటి సరఫరా ప్రాజెక్టుకు ఏర్పాట్లు చేసిందన్నారు.
- ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవాలకు దగ్గరగా ఉందన్నారు. గతంలో కేటాయింపులు భారీగా ఉంటే ఖర్చు మాత్రం పావువంతు తగ్గేదని, జాతీయ సగటు 8 శాతం ఉంటే తెలుగు రాష్ట్రాల్లో 20 నుంచి 25 శాతం ఉందన్నారు.
- బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖకు కేటాయింపులు అంతంతమాత్రంగానే ఉన్నాయని, గత బడ్జెట్‌తో పోలిస్తే రూ.1,800 కోట్లు పెరిగినట్టు కనిపిస్తోందని, కానీ కొత్తగా 11వేల మంది టీచర్లు విధుల్లో చేరారని, వారికి వేతనాల కోసం ఈ పెరుగుదల పనికొస్తుందని, ఇతర కార్యక్రమాలకు కేటాయింపులు నామమాత్రమే అని చెప్పారు.
- ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పెద్దగా ఉపయోగపడని కాళేశ్వరం ప్రాజెక్టుకు గత ప్రభుత్వం రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టిందని, అది ఇప్పుడు ప్రభుత్వానికి గుదిబండగా మారిందన్నారు.

అప్పులు.. ఖర్చులపై వైట్‌పేపర్ ఇవ్వాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు, ఖర్చులపై వైట్‌పేపర్ ఇవ్వాలని బడ్జెట్ సమావేశాల్లో బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తుందని ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. శుక్రవారం శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. 15 నెలలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.58 లక్షల కోట్లు అప్పు చేసిందని, 9 ఏళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం రూ.4.17 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేసిన ప్రతి అప్పుకు కరెక్ట్ లెక్కలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.

తూతూ మంత్రంగా సభ నడిపిస్తున్నారు..

మండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత మధుసూదనాచారి

తూతూమంత్రంగా శాసనమండలి సమావేశాలు నడిపిస్తున్నారని మండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత సిరికొండ మధుసూదనాచారి తీవ్రంగా ధ్వజమెత్తారు. సభ పనిగంటలు కూడా తగ్గించారని, సభలో చర్చించే అవకాశం లేకున్నా.. ప్రజాక్షేత్రంలో పోరాడతామని చెప్పారు. మండలిలో ప్రశ్నోత్తరాలను రద్దు చేయటాన్ని ఖండిస్తున్నామన్నారు. సభలో ప్రజల సమస్యలు చర్చించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలిలో బిల్లులు ప్రవేశపెట్టడం, పాస్ చేయించుకోవడం మాత్రమే జరుగుతోందన్నారు.

మండలి ఆవరణలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీల నిరసన

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలి ఆవరణలో అప్పులు ఘనం..అభివృద్ధి శూన్యం అంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. అప్పులు ఆకాశంలో..అభివృద్ధి పాతాళంలో అంటూ పెద్ద పెట్టున నినదించారు. రూ.1.58 లక్షల కోట్ల అప్పులు చేసి ఎంతమంది మహిళలకు రూ.2,500 ఇచ్చారని ప్రశ్నించారు. ఈ అప్పుతో ఎంతమంది వృద్ధులకు రూ.4వేల పెన్షన్ ఇచ్చారంటూ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. ఎంతమంది ఆడపిల్లలకు స్కూటీలు, ఎంత మంది మహిళలకు తులం బంగారం ఇచ్చారో సభలో వివరించాలంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మండలిలో బీఆర్‌ఎస్ పక్షనేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, ఎల్.రమణ, శేరి సుభాశ్‌రెడ్డి, మహమూద్‌అలీ పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల్లోంచి బయటపడేస్తే రేవంత్‌రెడ్డి హీరో అవుతారు

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అప్పులఊబిలో కూరుకుపోయి సంక్షోభ పరిస్థితిలోకి వెళ్లిందని..ప్రస్తుతం రూ.8.60 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్రం తీవ్రంగా కష్టాల్లో ఉన్న సమయంలో గెలిచి సీఎం అయిన రేవంత్‌రెడ్డి తీవ్ర ఒత్తిడిలో ఉంటే.. ఈ క్లిష్ట సమయంలో ఓడిపోయిన కేసీఆర్ సంతోషంగా ఉన్నారన్నారు. ఈ పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తే రేవంత్‌రెడ్డి హీరో అవుతాడన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా కూనంనేని మాట్లాడారు. అప్పుల్లోంచి బయటపడేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని, భారం లేని పథకాలు అమలు చేస్తూనే.. అవసరమైతే ఆర్థికభారం పడే పథకాలను కొద్దికాలం వాయిదా వేసుకోవాలని సూచించారు. ప్రజాపాలనలో ప్రజాస్వామ్యయుతమైన నిరసనలకు అవకాశం కల్పించాలని కూనంనేని సూచించారు.

హరీశ్ కామెంట్లపై భట్టి, శ్రీధర్‌బాబు ఫైర్

సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌పై చర్చ సందర్భంగా హరీశ్‌రావుకు, మంత్రులకు మధ్య వాదప్రతివాదాలు చోటు చేసుకున్నాయి. ఆర్థిక మాంద్యం కాదు పాలకుల బుద్ధి మాంద్యం అంటూ హరీశ్‌రావు విమర్శించడాన్ని మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబుతోపాటు స్పీకర్ తప్పుపట్టారు. 'హామ్ పద్ధతిలో రోడ్ల నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు చేసే ఖర్చును ఎలా తీరుస్తారు? ఆ భారం జనంపై వేసేలా టోల్ వసూలు చేస్తారా?'అని హరీశ్‌రావు ప్రశ్నించగా.. ఆ రోడ్లపై టోల్ ఉండదని, కాంట్రాక్టర్లు భరించే మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని మంత్రి కోమటిరెడ్డి వివరించారు. ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఔటర్ రింగురోడ్డును కమీషన్ల కోసం అమ్మేసిందని ఆరోపించారు. మరోవైపు సీఎం సభలో మాట్లాడే భాష మార్చురీ కంపు కొడుతోందని, బట్టలూడదీసి కొడతా లాంటి మాటలేమిటని హరీశ్‌రావు ప్రశ్నించగా.. సీఎం, ఎమ్మెల్యేల కుటుంబాలపై కొన్ని యూట్యూబ్ చానళ్లలో తప్పుడు కథనాలు ఇచ్చినవారిని ఉద్దేశించి సీఎం అన్నారని భట్టి పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌తో హరీశ్‌రావు భేటీ

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌తో కలిసి సీఎం చాంబర్‌కు

సీతాఫల్‌మండి కాలేజీ అంశంపై కలిశామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పద్మారావుగౌడ్ శుక్రవారం సమావేశమయ్యారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసనసభ ఇన్నర్ లాబీలోని సీఎం చాంబర్‌లో ఈ భేటీ జరిగింది. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని సీతాఫల్‌మండిలో హైస్కూల్, జూనియర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేసేందుకు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.32 కోట్లు కేటాయించింది. కానీ ఎన్నికల కోడ్ కారణంగా నిధులు విడుదల కాలేదు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు పద్మారావుగౌడ్ వినతి మేరకు వెళ్లినట్లు సీఎంతో సమావేశం అనంతరం హరీశ్‌రావు 'సాక్షి'కి తెలిపారు. ఎస్‌డీఎఫ్ నిధులు విడుదల చేయాలని సీఎంకు వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు.

బడే భాయ్ ఛోటే భాయ్ బంధం బయటపడింది

అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ బంధం బట్టబయలైందని హరీశ్‌రావు విమర్శించారు. 'రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు రాకపోయినా ఆర్థిక మంత్రి భట్టి తన ప్రసంగంలో పల్లెత్తు మాట అనలేదు. బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి బడ్జెట్‌పై చర్చ సందర్భంగా కాంగ్రెస్ కంటే బీఆర్‌ఎస్‌పైనే ఎక్కువ విమర్శలు చేశారు. మేము రేవంత్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపితే, మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు'అని అసెంబ్లీ లాబీలో హరీశ్‌రావు విమర్శించారు. 'సభలో భట్టి విక్రమార్క పచ్చి అబద్ధాలు చెప్పారు. మేము అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా పారిపోయారు. ఫార్మా సిటీ భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు రుణమాఫీ, పీఆర్సీ, ఉద్యోగులకు ప్రయోజనాలు వంటి అంశాలపై ప్రభుత్వం సమాధానాలు చెప్పలేదు'అని అసెంబ్లీ వాయిదా అనంతరం మీడియా పాయింట్ వద్ద ఆరోపించారు.

ఇదం జగత్



ఇది హామీలకు పాతరేసే బడ్జెట్

వరుసగా రెండో ఏడాది కూడా ఆరు గ్యారంటీలకు నిధులు లేవు

- బీజేపీ ఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు పాతరేసే రీతిలో రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ ఉందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం శాసనసభలో జరిగిన సాధారణ చర్చలో మహేశ్వర్‌రెడ్డి బడ్జెట్ తీరుతెన్నులను ఎండగట్టారు. ఇది కమీషన్ల ప్రభుత్వమంటూ తీవ్ర విమర్శలు చేశారు. 'తెలంగాణలో ప్రజల బతుకులు బాగుపడతాయని భావిస్తే అప్పుల కుప్పగా చేశారు. గత పాలకుల అవినీతిని కక్కిస్తామని హడావుడి చేసి 14 నెలలుగా ఎవరిపైనా కేసులు, రికవరీలు లేవు. ఆరు గ్యారంటీలకు నిధుల కేటాయింపు అసమగ్రంగా ఉంది. అనేక పథకాలకు వరుసగా రెండో బడ్జెట్‌లోనూ ఎలాంటి కేటాయింపులు లేవు. కేవలం ఏడాదిన్నరలోపే రూ.1.63 లక్షల కోట్లు అప్పు తెచ్చి పురోగతి ఎలా సాధ్యమో చెప్పాలి. రుణమాఫీకి రూ.42వేల కోట్లు అవసరం కాగా, రేవంత్ కటింగ్ మాస్టర్ అవతారం ఎత్తి రూ.29వేల కోట్లు ఎగవేశారు. మూసీ ప్రక్షాళనపై డీపీఆర్‌లో అంచనాలు పెంచుతూ జేబు నింపుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భూభారతి మార్గదర్శకాలు విడుదల చేయడంతోపాటు ధరణి అవకతవకలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలి. రూ.2.50 లక్షల కోట్ల విలువ చేసే అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైనట్టు గతంలో ఆరోపణలు చేసిన కాంగ్రెస్ వివరాలు బయట పెట్టాలి. రాజీవ్ యువ వికాసం కింద 35 లక్షల మంది యువత ఉంటే 10 లక్షల మందినే ఎలా ఎంపిక చేస్తారు. పదిశాతం జనాభా ఉన్న మైనారిటీ బీసీలకు రూ.3,500 కోట్లు కేటాయించిన ప్రభుత్వం హిందూ బీసీలకు రూ.11వేల కోట్లు మాత్రమే కేటాయించి మోసం చేస్తోంది'అని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు వస్తున్న తనను స్పీకర్‌కు సమాచారం ఇవ్వకుండా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. నిర్మల్ నియోజకవర్గ పరిధిలో నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీతో ఎస్‌ఆర్‌ఎస్‌పీ ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు.

ప్రధానమంత్రి దగ్గరకు తీసుకెళ్లండి.. కలిసివస్తాం

ఏలేటికి మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్



రాష్ట్రాభివృద్ధి విషయంలో కేంద్రం నుంచి నిధుల సాధనకు చర్చించేందుకు పీఎం నరేంద్రమోదీ దగ్గరకు తీసుకెళ్లాలని, తాము ఎలాంటి భేషజాలు లేకుండా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అసెంబ్లీలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని ఉద్దేశించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డికి కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయరమణారావుకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. హామీల అమలు పక్కన పెట్టి..మూసీ ప్రాజెక్టు ఎందుకు ముందు వేసుకున్నారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకొని రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంలోని పెద్దలతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

సీఎం, హరీశ్‌రావు భేటీ మతలబు ఏమిటి?

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి
- పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇవ్వనున్న నేపథ్యంలో ఇద్దరూ కలసి పోయారా?

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో రేవంత్‌రెడ్డితో బీఆర్‌ఎస్ నేతలు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, పద్మారావు భేటీ కావడం వెనక మతలబు ఏమిటని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో చోటుచేసుకున్న అవినీతిపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ త్వరలోనే నివేదిక ఇవ్వనున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య రాజీ కుదిరిందా? అని ఆయన నిలదీశారు. అధికార–ప్రధాన ప్రతిపక్షాలు కలసిపోయాయా? అని ప్రశ్నించారు. శుక్రవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ పీసీ ఘోష్ కమిషన్ విచారణ తుదిదశకు చేరిన తరుణంలో సీఎం, హరీశ్‌రావుల మధ్య ఈ భేటీ జరగడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. మరోవైపు చెన్నైలో తమిళనాడు సీఎం స్టాలిన్ నిర్వహిస్తున్న సమావేశానికి సీఎం రేవంత్, బీఆర్‌ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానుండటంతో వీరిమధ్య ఉన్న స్నేహబంధం మరోసారి బయటపడిందని మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

పీఎంఏవై అర్బన్ 2.0లో 3.53 లక్షల గృహాలు

తెలంగాణ, ఏపీ సహా పది రాష్ట్రాల్లో నిర్మాణాలకు కేంద్రం ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) అర్బన్ 2.0 కింద దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల్లో 3.53 లక్షల ఇళ్ల నిర్మాణానికి గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ ఇళ్ల నిర్మాణాలతో లబ్ధి పొందే రాష్ట్రాల్లో తెలంగాణ, ఏపీ సహా మరో ఎనిమిది రాష్ట్రాలు ఉన్నట్లు మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. ఈ పథకం మహిళా సాధికారతను ప్రోత్సహిస్తుందని, ప్రస్తుతం ఆమోదించిన ఇళ్లలో ఒంటరి మహిళలు, వితంతువులతో సహా 2.67 లక్షలకు పైగా ఇళ్లు మహిళలకు మాత్రమే మంజూరు చేసినట్లు తెలిపింది. 90 ఇళ్లు ట్రాన్స్‌జెండర్లకు కేటాయించినట్లు పేర్కొంది. మొత్తం మంజూరైన ఇళ్లలో ఎస్సీ లబ్ధిదారులకు 80,850 ఇళ్లు, ఎస్టీలకు 15,928, ఓబీసీ వర్గానికి 2,12,603 ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించింది.

బొగ్గు ఉత్పత్తి 1 బిలియన్ టన్నులు

- దేశానికి ఇది గర్వించదగిన క్షణమన్న ప్రధాని
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పోస్ట్‌పై ప్రతిస్పందించిన మోదీ



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో బొగ్గు రంగం కొత్త చరిత్రను లిఖించింది. 100 కోట్ల టన్నుల (1 బిలియన్) బొగ్గు ఉత్పత్తి ద్వారా చరిత్రాత్మక మైలురాయిని దాటింది. ఈ విషయాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బొగ్గు ఉత్పత్తిని పెంచడమే కాకుండా సుస్థిరమైన బొగ్గు ఉత్పత్తి, బాధ్యతాయుత మైనింగ్ నిర్వహించామని పేర్కొన్నారు. దేశంలోని విద్యుత్ అవసరాలను తీర్చడమే కాకుండా, దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడి దేశ యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడంలో ఈ గొప్ప విజయం ఊతమిస్తుందని తెలిపారు. ఈ పోస్ట్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిస్పందించారు. 'దేశానికి ఇది గర్వించదగ్గ క్షణం. బొగ్గు ఉత్పత్తిలో 1 బిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకోవడం చాలా పెద్ద విజయం. ఈ విజయం దేశ ఇంధన భద్రత, ఆర్థిక వృద్ధి, ఆత్మ నిర్భరత విషయంలో మన నిబద్ధతకు అద్దం పడుతోంది. బొగ్గు రంగంలో పనిచేస్తున్న వారందరి అంకిత భావానికి నిదర్శనంగా నిలుస్తోంది'అని ప్రశంసించారు.

ఈ శరీరంలో దేహధారికి బాల్యం, యౌవ్వనం, వృద్ధాప్యం
ఎలా కలుగుతాయో అలాగే మరో దేహం లభించటం కూడా జరుగుతుంది.
వివేకవంతుడు ఈ విషయంలో భ్రమ పడడు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 22 మార్చి 2025

అణచివేతే పరిష్కారమా?!

చాన్నాళ్లుగా ఘర్షణాత్మక ప్రాంతంగా ముద్రపడిన ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో మరోసారి మావోయిస్టులకూ, భద్రతా బలగాలకూ మధ్య గురువారం రెండు వేర్వేరు చోట్ల జరిగిన కాల్పుల్లో 30 మంది మావోయిస్టులూ, ఒక డీఆర్‌జీ జవాను మరణించారు. ఈ ఏడాది ఇంతవరకూ 113 మంది నక్సలైట్లు మరణించారు. నిరుడు ఇదేకాలంలో 29 మంది ఎదురుకాల్పుల్లో చనిపోయారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం రాజ్యసభలో చేసిన ప్రసంగం ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని తెలియజెబుతుంది. మావోయిస్టులను వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తిగా తుడిచి పెడతామని ఆయన ప్రకటించారు. ఈ ఏడాది ఇంతవరకూ 104 మందిని అరెస్టు చేశామని, 164 మంది లొంగిపోయారని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ ఒకప్పుడు మావోయిస్టుల కంచుకోట. ముఖ్యంగా 3,900 చదరపు కిలోమీటర్ల వైశాల్యంగల దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మఢ్ అటవీ ప్రాంతంలోకి మావోయిస్టులు మినహా అన్యులు ప్రవేశించటం అసంభవమన్న అభిప్రాయం వుండేది. అక్కడే మావోయిస్టు శిక్షణ శిబిరాలు, భారీ ఆయుధ డంప్‌లు, ఆహారపదార్థాల గోడౌన్‌లుండేవి. పల్లెసీమల్లో వారికి గట్టి పట్టుండేది. ఇప్పుడక్కడ దాదాపు 300 వరకూ కేంద్ర బలగాల స్థావరాలున్నాయి. ఇవిగాక సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్ దళాల శిబిరాలున్నాయి. బస్తర్ అడవుల్లో అత్యంత మారుమూల ప్రాంతం కావటంవల్ల, చుట్టూ వున్న ఎత్తయిన కొండలు, వాటిపై దట్టంగా విస్తరించిన వృక్షాలుండటంవల్ల మావోయిస్టులకు అది రక్షణ కవచంగా ఉండేది. దాన్ని 'విముక్త ప్రాంతం'గా పరిగణించేవారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉండటంవల్లే వారి అణచివేత వేగం పుంజుకుందన్న అభిప్రాయం పాక్షిక సత్యం మాత్రమే. యూపీయే ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ మావోయిస్టులను 'జాతీయ భద్రతకు పెనుముప్పు'గా ప్రకటించారు. తదనుగుణంగా అనేక చర్యలు మొదలయ్యాయి. అప్పటి హోంమంత్రి చిదంబరం 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతో నక్సల్స్ ఏరివేతకు చర్యలు తీసుకున్నారు. అదిప్పుడు 'ఆపరేషన్ కగార్' అయింది. ఈ క్రమంలోనే మావోయిస్టులపై భద్రతా బలగాలు క్రమేపీ పైచేయి సాధించాయి. కేంద్రంలో ఎవరున్నా నక్సల్స్ అణచివేతలో ఛత్తీస్‌గఢ్‌కు పూర్తి సహకారం అందింది.


రాజ్యానికుండే ఆయుధ సంపత్తి, దాని సుశిక్షిత భద్రతా బలగాల ముందు ఎవరూ సరి పోరన్నది వాస్తవం. ఆ అంబులపొదిలో ఇప్పుడు ఆధునిక సాంకేతికత చేరింది. అందువల్లే కావొచ్చు... దట్టమైన అరణ్యాల్లో సైతం మావోయిస్టు దళాల కదలికలను వెంటనే నిఘా వర్గాలు గుర్తించగలుగుతున్నాయి. అబూజ్‌మఢ్ అరణ్యంలో ఏం జరుగుతున్నదో ఎప్పటికప్పుడు ఆరా తీయగలిగేలా నిఘా డ్రోన్‌లు సంచరిస్తున్నాయి. ఇప్పటికేవున్న భద్రతా బలగాలకు అదనంగా గత నెలలో మరో 2,500 మంది జవాన్లను తరలించినట్టు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వర్గాలు ప్రకటించాయి. జిల్లా రిజర్వ్ గార్డ్(డీఆర్‌జీ) పేరిట ఏర్పాటు చేసిన బలగాలు కేంద్ర దళాల చేతుల్లో తిరుగులేని ఆయుధం. ఎందుకంటే డీఆర్‌జీలో దాదాపు అందరూ ఆదివాసీ తెగలవారు. మావోయిస్టుల్లో పనిచేసినవారు. వీరికి ఆ ప్రాంతం కొట్టిన పిండి. ఎక్కడున్నామో, ఎటుపోతున్నామో తెలియని దుర్గమారణ్యాల్లో వీరు సునాయాసంగా చొచ్చుకెళ్లగలుగుతున్నారు. ఒకప్పుడు మావోయిస్టుల్లో పనిచేసి వెలుపలికొచ్చినవారినీ, ఇతరులనూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం 'సల్వాజుడుం' పేరిట సమీకరించి ఆయుధాలిచ్చి, వారిద్వారా మావోయిస్టుల్ని అణచడానికి ప్రయత్నించింది. ఇలా ప్రైవేటు సైన్యాలను రూపొందించటం రాజ్యాంగ విరుద్ధమని, దాన్ని తక్షణమే రద్దు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది.

దురదృష్టమేమంటే భద్రతా బలగాలకూ, మావోయిస్టులకూ మధ్య జరిగే పోరుతో సంబంధం లేని సాధారణ ఆదివాసీ ప్రజానీకం సైతం భయంతో బతకాల్సి వస్తున్నది. ఘర్షణ జరిగే ప్రాంతాల్లో ఎక్కడైనా ఇదే పరిస్థితి. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ జిల్లాల్లో, ఏజెన్సీ ప్రాంతాల్లో నక్సల్స్‌కు సహకరిస్తున్నారన్న అనుమానంతో సాధారణ పౌరులను పోలీసులు వేధించేవారన్న అభిప్రాయం వుండేది. అలాగే నక్సల్స్ సైతం ఇన్ఫార్మర్ల పేరిట అనేకుల్ని హతమార్చిన ఉదంతాలు ఉండేవి. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్లలో పదులకొద్దీమంది మరణిస్తున్నారు. కానీ వారంతా మావోయిస్టులేనా? ఆ ఉదంతాలు జరిగాక హక్కుల సంఘాలు చేసే ప్రకటనలు తప్ప అక్కడికి మీడియా వెళ్లి జరిగిందేమిటో చెప్పే పరిస్థితులు లేవు. అటు మావోయిస్టులు సైతం ఛత్తీస్‌గఢ్‌లో ఇన్ఫార్మర్ల పేరిట కొందరిని హతమారుస్తున్న ఉదంతాలు వెల్లడవుతున్నాయి.

వచ్చే ఏడాదికల్లా మావోయిస్టుల్ని అంతం చేస్తామన్న అమిత్ షా ప్రకటనలు నెరవేరే అవకాశం ఉండొచ్చని వరస ఉదంతాలు గమనిస్తే అర్థమవుతుంది. 2013లో తొమ్మిది రాష్ట్రాల్లోని 126 జిల్లాలు నక్సల్స్ ప్రభావంలోవుంటే నిరుడు ఆ సంఖ్య 38కి పడిపోయింది. రహదారుల నిర్మాణం కూడా జోరందుకుంది. కానీ ఇవి మాత్రమే తిరుగుబాటునూ, అసంతృప్తినీ అంతర్ధానం చేస్తాయని భావించటం పొరపాటు. ఆదివాసీ సంస్కృతినీ, అక్కడి సహజవనరులనూ పరిరక్షించటానికి చర్యలు తీసుకుంటేనే... ఆ ప్రాంతానికి స్వయంప్రతిపత్తి కల్పించి, రాజ్యాంగం పూచీపడిన హక్కులు సక్రమంగా అమలు చేస్తేనే సమస్య పరిష్కారమవుతుంది. ఇందిరాగాంధీ హయాంలో బీడీ శర్మ వంటి అంకిత భావంతో పనిచేసిన ఐఏఎస్ అధికారులు బస్తర్ ప్రాంత అభివృద్ధికీ, ఆదివాసీల సంక్షేమానికీ ఎన్నో పథకాలు అమలు చేశారు. ఆ నమూనాను ఆదర్శంగా తీసుకోవాలి.

దక్షిణ భారతంతో హిందీ తగువు

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

దక్షిణ భారతదేశానికి (తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ) ఉత్తర భారతదేశానికి ప్రధానంగా కనబడే వైరుధ్యం భాషతో ముడిపడి ఉంది. లిపిలోగానీ, పద ప్రయోగంలో గానీ, ఉత్పత్తి సంబంధిత అవగాహనలోగానీ దక్షిణ భారత భాషలు ఉత్తర భారత భాషలకంటే భిన్నమైనవి. లిపి రూపంలో దక్షిణ భారత భాషలకు ప్రాకృత పాళీ భాషతో సంబంధమున్నా అవి క్రమంగా భిన్నమైన అక్షర రూపం తీసుకున్నాయి. బహుశా దక్షిణ భారత భాషలైన తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం – సంస్కృతం ఈ దేశంలో కాలిడక ముందున్న హరప్పన్ భాషతో ముడిపడి ఉండవచ్చు. ఈ సంబంధం మీద తమిళనాడులో ఈ మధ్యనే కొంత లోతైన పరిశోధన మొదలైంది.

హిందీ, మరాఠీ, గుజరాతీ, రాజస్థానీ పూర్తిగా సంస్కృత ఆధారిత భాషలు. అక్షర రూపంగానీ, పదకోశంగానీ, అవి బోధించిన జీవన విధానంగానీ సంస్కృత భాష సంస్కృతి నుండి రూపొందించబడ్డాయి. బెంగాలీ, ఒరియా ఈ భాషా విధానాలకు కాస్త భిన్నంగా ఉన్నట్టు కనిపిస్తాయి. అవి పదకోశంలో హిందీతో మైత్రిలో ఉన్నట్టు కనిపిస్తాయి. లిపి భిన్నమైందే. అయితే అవి కూడా మాగధి, ప్రాకృతి నుండే ఎదిగాయని వాళ్ళు భావిస్తారు. సంస్కృతం ఇండో–యూరోపియన్ భాష అని, బెంగాలీ పూర్తిగా భారతీయ భాష అనీ బెంగాలీలు కూడా భావిస్తారు. అయితే తమిళం లాగా బెంగాలీకి అతి ప్రాచీన చరిత్ర ఉన్నట్టు కనిపించదు. సంగమ సాహిత్యం లాంటి ప్రాచీన ఉనికి ఆధారాలు బెంగాలీకి లేవనే చెప్పాలి.

ఆంగ్లాన్ని అక్కున చేర్చుకున్న దక్షిణాది

దక్షిణ భారత భాషలు అభివృద్ధి చెందిన ఐదు రాష్ట్రాల ఆర్థిక స్థితి ఆ భాషల వ్యవసాయక మైత్రి వల్ల బాగా మారింది. ఈ ఐదు రాష్ట్రాలు సమతుల్యంగా వ్యవసాయ అభివృద్ధిలో, విద్యాభివృద్ధిలో, ఇంగ్లీష్ భాషను కూడా త్వరగా తమలో లీనం చేసుకోవడంలో ఒకే లక్షణాలను కలిగి ఉన్నాయి. వీటి మీద హిందీ భాషను రుద్దినప్పుడు ఒక్క తమిళనాడులోనే పెరియార్ రామసామి ఉద్యమం ద్వారా బలమైన వ్యతిరేకత వచ్చింది. మిగతా రాష్ట్రాల్లో అటువంటి నాయకత్వం లేక హిందీని మోస్తూ వచ్చాయి.

1960 దశకంలో నేను చిన్న గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నప్పుడు తెలుగు అక్షరాల తరువాత హిందీ అక్షరాలు నేర్పారు. ఆ తరువాత చాలా దూరపు గ్రామంలో ఉన్న మిడిల్ స్కూల్లో చేరాక ఇంగ్లీష్ అక్షరాలు నేర్పడం ప్రారంభమైంది. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ అక్షర జ్ఞానంలో హిందీ నేర్చుకోవడం కష్టతరంగా ఉండింది. ఇంగ్లీష్ అక్షరాలు నేర్చుకోవడం అన్నింటికంటే సులభంగా ఉండింది. పదకొండో తరగతి వరకూ హిందీ ఒక సబ్జెక్టుగా చదివినా అది నాకు జీవితంలో ఎటువంటి పనిలో, నేర్పులో ఉపయోగపడలేదు. నా జ్ఞానాన్ని విస్తృతపర్చలేదు. ఇంగ్లీష్‌లో, తెలుగులో ఎక్కువ జ్ఞానం సంపాదించడానికి నిజానికి హిందీ అడ్డుపడింది. పరీక్షా సమయాల్లో 25 మార్కులు సంపాదించి పాస్ కావడం ఒక టార్చర్‌గా మారేది. నాతో చదువుకున్న మెజారిటీ విద్యార్థుల అనుభవం అదే.

తమిళనాడు హిందీని స్కూళ్లలో బోధించ నిరాకరించి ఇంగ్లీష్, తమిళ భాషలపై మాత్రమే దృష్టి పెట్టినందున తమిళ బ్రాహ్మణులతో పాటు, తమిళులందరూ లాభపడ్డారు. బహుశా అందులో ఇప్పుడు పెరియార్‌ను దూషణలాడే నిర్మలా సీతారామన్, ఇంగ్లీష్ బాగా నేర్చుకున్నందువల్లే విదేశీ మంత్రి అయిన జయశంకర్ కూడా ఉన్నారు. పెరియార్ తమిళ భాషను బార్బారిక్ (ఆటవిక) భాష అన్నారని నిర్మలా సీతారామన్ కొత్త సిద్ధాంతం చెబుతున్నారు.



వాళ్లెందుకు ఇక్కడిది నేర్చుకోలేదు?

నేను మూడు భాషల చదువుతో ఆంధ్రప్రదేశ్‌లో కుస్తీ పడుతున్న రోజుల్లో ఉత్తరాది హిందీ రాష్ట్రాల విద్యార్థులు మాత్రం ద్విభాషా విద్యా విధానంలో చదువుకున్నారు. వాళ్లకు ఏ దక్షిణ భారత భాషనూ మూడో భాషగా నేర్చుకునే అవసరం లేకుండింది. ఇప్పటికీ దాదాపు అదే పరిస్థితి. ఈ మధ్యనే ఉత్తరాదిలో నామమాత్రంగా ఏదో ఒక మూడో భాష పాఠశాల స్థాయిలో ఉండాలని నిర్ణయిస్తే హరియాణా మూడవ భాషగా పంజాబీని చేర్చుకుంది. ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఏ మూడో భాషను త్రిభాషా విధానాల్లో చేర్చారో తెలియదు. అది ఏదైనా అదే సంస్కృత–హిందీ లిపి, పదకోశం ఉన్నవాటిని మూడో భాషగా నామమాత్రంగా పెట్టుకుంటారు. హిందీని దేశ భాషగా అందరి మీదా రుద్దే హిందీవాదుల మాయావాదం ఇది. ఇది స్వాతంత్ర్యం వచ్చిన మొదటి దశకంలో కూడా జరిగింది. ఇప్పుడు ఆరెస్సెస్/బీజేపీ హయాంలో మళ్ళీ మొదలైంది. ఇంకా పెరుగుతుంది. 'ఏక జాతి, ఏక భాష' సిద్ధాంతంలో ఇదంతా భాగం.

దక్షిణాది రాష్ట్రాలు చాలా రంగాల్లో ఉత్తరాది రాష్ట్రాల కంటే ముందున్నాయనే విషయం తెలుసు. బొంబాయి, గుజరాత్, ఇతర ఉత్తరాది పెట్టుబడిదారులు తమ పిల్లల్ని పూర్తిగా ఇంగ్లీష్ బోధించే ప్రైవేట్ స్కూళ్ళలో చదివిస్తూ పాలకులుగా మాత్రం తాము హిందీ వాదులమనే డ్రామా ఆడుతున్నారు. త్రిభాషా నాటకమంతా దక్షిణాది అభివృద్ధిని అడ్డుకోవడానికి ఆడుతున్నది.

అభివృద్ధి ప్రధానంగా ఆధునిక స్కూలు విద్యతో ముడివడి ఉన్నది. ఆ స్కూలు విద్య దక్షిణ భారతదేశంలో ఉత్తర భారతదేశం కంటే మెరుగ్గా ఉంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు స్కూలు విద్యను పూర్తిగా ఇంగ్లీష్ మీడియంలోకి మార్చుకున్నాయి. తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రభుత్వాలు స్కూళ్లలో ఇంగ్లీష్/ప్రాంతీయ భాషల సెక్షన్‌లను సమాంతరంగా నడుపుతున్నాయి.

◆ అభివృద్ధి ప్రధానంగా ఆధునిక స్కూలు విద్యతో ముడి పడి ఉంది. ఉత్తరాది పెట్టుబడిదారులు తమ పిల్లల్ని ఇంగ్లీష్ ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తూ పాలకులుగా మాత్రం తాము హిందీవాదులమనే డ్రామా ఆడుతున్నారు.

◆ హిందీ భాష, దక్షిణాది పార్లమెంట్ సీట్లను తగ్గించే డీలిమిటేషన్ పాలసీలకు వ్యతిరేకంగా దక్షిణాది ఐదు రాష్ట్రాలూ ఐక్యంగా పోరాడవలసి ఉంది. కానీ, ఒకప్పుడు 'నేనే కింగ్ మేకర్‌ని' అన్న చంద్రబాబు ఇప్పుడు కేంద్రానికి అన్నింటికీ తలాడిస్తున్నారు.

ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం విద్య నుండి శ్రమజీవుల కుటుంబాలను, కులాలను కాపాడటానికి ఆంధ్రప్రదేశ్‌లో మొదలైన ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం విద్య దక్షిణాదికంతా పాకింది. ఈ విద్యను హిందీ ఆధిపత్యవాదం అడ్డుకోజూస్తోంది. అందులో భాగంగానే తమిళనాడులో మెడిసిన్, ఇంజినీరింగ్ విద్యను తమిళ భాషలో బోధించాలని దేశ హోంమంత్రి అమిత్ షా కొత్త వాదన ప్రారంభించారు. అది ఆ రాష్ట్రం నిర్ణయించుకుంటుంది. అమిత్ షా ఎలా బలవంతం చేస్తారు? నిర్మలా సీతారామన్ పెరియార్‌పై కూడా దాడి చేస్తున్నారు. హిందీ మీద అంత ప్రేమ ఉన్న నిర్మలా సీతారామన్ తన కూతుర్ని హిందీ మీడియంలో ఎందుకు చదివించలేదు? పూర్తిగా ఇంగ్లీష్ మీడియంలో చదివించి, బ్రిటన్ చదువులకు ఎందుకు పంపారు? ఆరెస్సెస్ సిద్ధాంతాన్ని అధికారం నిలబెట్టుకోవడానికి వాడుకుంటే అది ఆమె ఇష్టం. కానీ మొత్తం దక్షిణ భారతదేశాన్ని దెబ్బతీసే ఆ సిద్ధాంతాలను ఆమె కూడా రోజువారీ వల్లించడం బాగాలేదు.

అన్నింటికీ తలూపుతున్న బాబు!

హిందీ భాష, దక్షిణాది పార్లమెంట్ సీట్లను తగ్గించే డీలిమిటేషన్ పాలసీలకు వ్యతిరేకంగా దక్షిణాది ఐదు రాష్ట్రాలూ ఐక్యంగా పోరాడవలసి ఉంది. అయితే చంద్రబాబు మద్దతుపై ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఆధారపడి ఉన్నప్పటికీ ఆయన వారు ఏమి చేసినా మద్దతు ఇస్తున్నారు. ఒకప్పుడు 'నేనే కింగ్ మేకర్‌ని' అన్న బాబు ఇప్పుడు మోదీ, అమిత్ షా చెప్పింది బడి పిల్లాడిలా పాటిస్తున్నారు. ఆయన ఎంపీలు కూడా ఆయన చేతిలో ఉన్నట్టు కనిపించడం లేదు. సొంత మెజారిటీ లేని బీజేపీ... ఆరెస్సెస్ ఎజెండాను అమలు చేసి దక్షిణ భారతాన్ని దెబ్బతీస్తే అందుకు పూర్తి బాధ్యత చంద్రబాబుదే అవుతుంది.

హిందీ వ్యవహారం గానీ, డీలిమిటేషన్ గానీ ప్రమాదకరమైనవి. పవన్ కల్యాణ్ ఆరెస్సెస్‌ను మించిన రామభక్తుడై మోదీ, మోహన్ భాగవత్ సైతం అసహ్యించుకునే వేషాలు వేస్తున్నారు. వారి హిందీ, డీలిమిటేషన్ వాదనలు తమ వాదనలైనట్టు నటిస్తున్నారు.

స్టాలిన్ మొదలెట్టిన పోరాటానికి ఒక్క ఏపీ తప్ప మిగతా అన్ని రాష్ట్రాలూ మద్దతిస్తున్నాయి. ఇది ముదిరితే ఈ పోరులో చంద్రబాబు ముందుగా మునిగిపోతారు. దక్షిణ భారతదేశం ఆయన్ని ఒక ద్రోహిగా నిలబెడుతుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకుడు

సోషల్ మీడియా

నోట్ల కట్టలు



ఉదయాన్నే దిగ్భ్రాంతి కరమైన విషయం! ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో లెక్కలు చూపని నోట్ల కట్టలు గుట్టలుగా బయట పడ్డాయి. సడీ చప్పుడు కాకుండా ఆయన్ని బదిలీ చేశారు. అంతకుమించిన కఠిన చర్య అక్కర్లేదా? న్యాయమూర్తులు కచ్చితంగా చట్టానికి అతీతులైతే కారు!

– రాజ్‌దీప్ సర్దేశాయ్, సీనియర్ జర్నలిస్ట్

తప్పించాలి



ఏదైనా ఒక భౌగోళిక ప్రాంతంలోనే మొత్తమంతా కేంద్రీకృతం అయ్యే ప్రమాదం నుండి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తప్పించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో నమ్మకమైన, నిలకడైన వస్తుసేవల సరఫరాల గొలుసుకట్టు వ్యవస్థ నిర్మాణంలో మనమూ ఒక సహబంధనాన్ని కలిగి ఉండాలి.

– ఎస్. జైశంకర్, భారత విదేశాంగ మంత్రి

మూడు దశలు



ఏఐ మొదటి దశ నిర్మాణాత్మకమైనది. డేటాను ఉపయోగించుకుని భవిష్యత్తును విశ్లేషిస్తుంది. రెండో దశ జనరేటివ్. భాషా ప్రక్రియలతో భావాంకురాలను మొలకెత్తిస్తుంది. మూడవది రోబోటిక్. అప్పటికిక ఈ కృత్రిమ మేధకు పరిపూర్ణత వచ్చేస్తుంది.

– అరుంధతీ భట్టాచార్య, 'సేల్స్‌ఫోర్స్' దక్షిణాసియా సీఈవో

నిధుల కోత



మానవతా రంగంలో నిధుల కోతలు లక్షలాది మంది ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నాయి. ఆ ప్రమాదం నుండి పారిపోయే ప్రజలపై తక్షణ పర్యవసానాలు విపరీతమైనవిగా, వినాశకరంగా ఉంటున్నాయి.

– ఫిలిప్పో గ్రాండి, ఐక్యరాజ్యసమితి హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్

గీతాంజలి




ద్విభాషా కవయిత్రి స్మితా సెహగల్ రాసిన 'హౌ ఉమెన్ బికమ్ పోయెమ్స్ ఇన్ మలబార్' కవితా సంకలనం చదవటం నా అదృష్టం. ఇది పద్యాల పుష్పగుచ్ఛమే కాదు. ఇదొక ప్రార్థన. కాలం చెల్లిన తీరాలను విడిపించుకుని వెళ్లిన అల. ప్రపంచ కవితా దినోత్సవ (21 మార్చ్) శుభాకాంక్షలు.

– నవనీత వరదపాండే, రీసెర్చ్ స్కాలర్

ఇన్ బాక్స్

జలమే జీవనాధారం

నీరు లేనిదే సమస్త జీవకోటికి మనుగడ లేదు. జీవ పరిణామం ప్రారంభమైందే సముద్ర గర్భంలో అని తెలిసిందే. ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచి నీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నాం. అవసరానికి మించి వాడుతూ వృథా చేస్తున్నాం. సమీప భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు రానున్నాయనడం అతిశయోక్తి కాదు. ఈ పరిస్థితి



రాకూడదనే ఉద్దేశంతోనే ఐక్యరాజ్య సమితి ప్రతి ఏటా మార్చ్ 22న 'ప్రపంచ జల దినోత్సవం'ను నిర్వహిస్తున్నది. 1992లో బ్రెజిల్‌లోని రియో డి జెనీరోలో పర్యావరణం – అభివృద్ధిపై ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ దినోత్సవాన్ని మొదట ప్రతిపాదించారు.

'వరల్డ్ వాటర్ డే- 2025' థీమ్ 'హిమానీ నదాల సంరక్షణ'. హిమానీ నదాలు జీవితానికీ, నీటి చక్రానికీ చాలా ముఖ్యం. తాగునీరు, వ్యవసాయం, పరిశ్రమలు, స్వచ్ఛమైన శక్తి ఉత్పత్తి, ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలకు వాటి కరిగే నీరు అవసరం.

ప్రపంచంలో నేడు ప్రతి ముగ్గురిలో ఒకరికి శుద్ధమైన తాగునీరు దొరకడం లేదు. 2040 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఇంధన డిమాండ్ 25 శాతానికి, నీటి డిమాండ్ 50 శాతానికి పెరగనుందని అంచనా. 2050 నాటికి భూమి మీద నివసిస్తున్న వారిలో సుమారు 5.7 బిలియన్ల (500 కోట్ల పైమాటే) మంది సంవత్సరానికి ఒక నెల పాటు నీటి కొరత ఎదుర్కోనున్నారని అంచనా. మంచి నీటి సరఫరా, పారిశుద్ధ్యం సక్రమంగా ఉంటే ప్రపంచవ్యాప్తంగా ప్రతి యేటా 3,60,000 మంది శిశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కోవాలంటే ఒక వ్యక్తిగా, సమూహంగా, దేశంగా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మనమేం చేయాలని ఆలోచించి ఆచరణలోకి తేవాలి.

– డా॥ పరికిపండ్ల అశోక్, పర్యావరణ కార్యకర్త
(నేడు ప్రపంచ జల దినోత్సవం)

కొంటే... కొరివి దయ్యమే!

విశ్లేషణ



అభిజిత్ భట్టాచార్య

"భారత్ ఒక సరికొత్త ప్రపంచానికి అలవాటు పడాల్సిన అవసరం ఉంది" – ట్రంప్‌ను ఉద్దేశించి విదేశీ వ్యవహారాల మాజీ కార్యదర్శి ఒకరు అన్న మాట. ఈ కొత్త ప్రపంచం కేవలం ఒప్పందాలు, వ్యాపారాలకు మాత్రమే పరిమితమనీ; మిత్రులు, శత్రువులు ఎవరూ ఉండరనీ కూడా ఆయన అన్నారు. ఒక దౌత్యవేత్త ఈ అంచనాకు వచ్చారంటే కచ్చితంగా అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ అనూహ్యమైన వ్యక్తిత్వమే కారణమై ఉంటుంది.

తేలిగ్గా చెప్పాలంటే... ఈ రోజుల్లో పరిస్థితి నాటకీయంగా మారిపోయింది. కొత్త సంవత్సరంలో యూఎస్ఏ తన లావాదేవీలను వేగంగా మొదలు పెట్టేసింది. ఈ ఏకపక్ష ధోరణితో అమెరికా మిత్రులు, శత్రువులు కూడా తమని తాము కాపాడుకునేందుకు దాక్కుండిపోతున్నారు. లేదంటే వ్యక్తిగతంగా ట్రంప్ ముందు ప్రత్యక్షమై ఆయన శీతకన్ను పడకుండా ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రెండింటి వల్ల కూడా ఏదో అర్థవంతమైన పని జరుగుతుందని ఎవరూ ఆశించడం లేదు.

ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే... ట్రంప్ ఇప్పుడు అమెరికన్ కంపెనీ 'లాక్‌హీడ్ మార్టిన్' తయారు చేసిన ఎఫ్–35 యుద్ధ విమానాలు కొనమని భారత్‌కు చెబుతున్నారు. భారత్‌తో ఉన్న సుమారు 3,500 కోట్ల డాలర్ల వాణిజ్య లోటును భర్తీ చేసుకునేందుకు అన్నమాట. అయితే ఏ అంతర్జాతీయ ఒప్పందం, వ్యాపారమైనా కేవలం అమ్ముతామంటే సరిపోదు. కొంటున్నామని అవతలి వారు చెప్పాలి. భారత్ దృష్టి కోణం నుంచి చూస్తే – అమెరికా అమ్ముతాననూ అంది, మరి కొనదలుచుకుంటే ఆ ఎఫ్–35 యుద్ధ విమానాలు ఎలాంటివో పరిశీలించాలి కదా?

తడిసి మోపెడు ఖర్చు

రవాణా, గాల్లోంచి సామగ్రి పడవేసే 'డగ్లస్ డీసీ–3 డకోటా', 'ఫెయిర్ చైల్డ్ ప్యాకెట్ సీ119 జీ' మినహా మరే ఇతర అమెరికా విమానాన్నీ భారతీయ వైమానిక దళం ఇంతవరకు వాడలేదు. 1947 నుంచి చూసినా అమెరికా యుద్ధ విమానం మన వద్ద ఎప్పుడూ లేదు. కాబట్టి అకస్మాత్తుగా ఎఫ్–35లను కొనుగోలు చేయడం అంటే, అది కూడా ట్రంప్ మాటపై ఆధారపడి అంటే... కొంచెం అనుమానంగా చూడాల్సిన వ్యవహారమే! అమెరికా, భారత్‌ల మధ్య సంబంధాలు, చరిత్రలను పరిగణనలోకి తీసుకుంటే ఇలా చూడటం మరీ ముఖ్యమవుతుంది.

ఒక విషయమైతే స్పష్టం. భారత్ వంటి అతిపెద్ద దేశంలో వైమానిక దళం ఒక్క రోజులో సిద్ధం కాదు. వైమానిక దళాన్ని నిర్మించడం అంత తేలికైన వ్యవహారమూ కాదు. భారీ పెట్టుబడులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, రిస్క్ తీసుకోగలిగిన తెగువ, సుశిక్షితులైన సిబ్బంది అవసరం. 'జేన్స్ ఆల్ ద వరల్డ్స్ ఎయిర్ క్రాఫ్ట్' మ్యాగజైన్ ప్రకారం... ఎఫ్–35 యుద్ధ విమానాలకు (ఐదో తరం, బహుళార్థక, స్టెల్త్ రకం) ఆర్డర్ పెట్టిన తరువాత మొదటి విమానం అందేందుకు 15 ఏళ్లు



భారత్‌కు ట్రంప్ అంటగట్టాలని చూస్తున్న ఐదో తరం ఎఫ్-35 నమూనా

పడుతుంది! ఇంకో విషయం – భారత్ ఏ రోజు కూడా లాక్‌హీడ్ తయారు చేసే యుద్ధ విమానపు కొనుగోలుదారుగా కానీ, అమెరికా పారిశ్రామిక భాగస్వామిగా కానీ లేదు. నిజానికి ఎఫ్–35 యుద్ధ విమానాలు హైటెక్ పాశ్చాత్య దేశాల కోసం, అమెరికా రక్షణకు, సెక్యూరిటీ భాగస్వాములైన ఇతర దేశాల కోసం ఉద్దేశించినవి. 1996లో ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, గ్రీస్, ఇజ్రాయెల్, సింగపూర్, స్పెయిన్, స్వీడన్‌లకు ఈ కార్యక్రమం గురించి వివరించారు. ఎఫ్–35లు ఖరీదైనవని అప్పుడే అర్థమైపోయింది (ట్రంప్ సుంకాల తీరుతో తాజాగా నాటో దేశాలు కూడా వీటి కొనుగోలు గురించి పునరాలోచనలో పడ్డాయి).

ముందుగా యూకేతో కలిసి పనిచేయాలని, పది శాతం ఖర్చులు ఆ దేశం భరించాలని యూఎస్‌తో ఒప్పందం జరిగింది. ఇటలీ, నెదర్లాండ్స్ చెరి ఐదు శాతం ఖర్చులు భరించేలా ఒప్పందాలు కుదిరాయి. మూడో దశలో డెన్మార్క్, నార్వే... 1–2 శాతం ఖర్చులు భరించేలా భాగస్వాములైనాయి. అనంతరం, ఆస్ట్రేలియా, కెనడా, టర్కీ తమ ఖర్చు తామే భరించేలా చేరాయి. 2012–13 నాటి 'జేన్స్ ఆల్ ద వరల్డ్స్ ఎయిర్‌క్రాఫ్ట్' పత్రికను చూస్తే ఒక్కో ఎఫ్–35ఎ యుద్ధ విమానం ఖరీదు సుమారు 3.73 కోట్ల డాలర్లు. 2017 నాటికి ఇది 9.43 కోట్ల డాలర్లకు చేరుకుంది. ఇప్పుడు సుమారు పది కోట్ల డాలర్ల పైమాటే (రూ.860 కోట్లు). మారకం విలువలు, రూపాయి బలహీనపడటం వంటివి కూడా పరిగణనలోకి తీసుకుంటే ఎఫ్–35ల కొనుగోలు భారత్ ఖజానాకు భారీగా కన్నమేసేదే! ఇంత భారీ ఖర్చు కచ్చితంగా రాజకీయంగానూ సంచలనం సృష్టిస్తుంది.

దీంతోపాటే ఎఫ్–35 యుద్ధ విమానాలకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞాన సంబంధిత సమస్యలు చాలానే ఉన్నాయి. అమెరికాలోనూ దీని గురించి వివాదాలు ఉన్నాయి. సమస్యలు ఒకవైపు, ఎప్పటికప్పుడు పెరిగిపోయే ఖర్చులు ఇంకోవైపు ఈ యుద్ధ విమానపు కొనుగోలుపై సందేహాలు లేవనెత్తుతున్నాయి. ఆర్థికాంశాలు, సాంకేతిక పరిజ్ఞాన అంశాలూ కాసేపు పక్కన పెడదాం. యుద్ధ విమానం భద్రత కూడా ఇక్కడ ప్రశ్నార్థకమే. 2010 అక్టోబరులో ఇలాంటి ఒక సమస్యను గుర్తించారు. విమానం ఎగురుతూండగానే ఎలాంటి ఆదేశాలూ లేకుండానే ఇంజిన్ ఆఫ్ అయ్యేందుకు వీలు కల్పించే ఓ సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తింది. అప్పట్లో ఎడ్వర్డ్స్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో ఈ విమానాలను కొంత సమయం పాటు నిలిపివేశారు కూడా!

పదిహేనేళ్లు దాటిపోతున్నా ఇప్పటికీ ఈ యుద్ధ విమానం ప్రయాణిస్తూండగా సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. 2014 జూన్, జూలైల్లో ఎగ్లిన్ ఎయిర్‌ఫోర్స్ స్థావరం వద్ద కొన్నింటిలో ఇంజిన్ వైఫల్యం చోటు చేసుకుంది. ఈ ఘటన తరువాత వాటి వాడకాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. కనుక అలాంటి విమానాలను కొని, కొరివితో తలగోక్కునే పరిస్థితిని భారత్ తెచ్చుకోదనే ఆశిద్దాం!

వ్యాసకర్త 'ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' శాశ్వత సభ్యులు

అసలైన ఆరాధన



శ్రీరామకృష్ణ పరమహంస ఏనాడూ విగ్రహారాధన చేయలేదని ఎవరైనా చెబితే, వాళ్లకు ఆయన చరిత్ర బొత్తిగా తెలీదు అనుకుంటాం. ఎందుకంటే ఆయన దక్షిణేశ్వర కాళికాలయంలో పూజారిగా ఉండి పూజలు చేశారని ఎన్నో గ్రంథాలు తెలియజేస్తున్నాయి. అయితే, అందరి దృష్టిలో అక్కడ ఉన్నది కాళికాదేవి విగ్రహం, రామకృష్ణ పరమహంసకు మాత్రం అక్కడ కొలువై ఉన్నది సాక్షాత్తూ కాళికాదేవే! ఆమె విగ్రహం కానే కాదు! ఆమెతో ఆయన నిరంతరం సంభాషించే వారు.

ఒకసారి తోతాపురి బాబా ఆయనతో, 'ఎప్పుడూ విగ్రహంతోనేనా? ఎంతకాలం ఇట్లే ఉంటావు? నిరాకారంలోకి ఎప్పుడు సాగిపోదలిచావు?' అని ప్రశ్నించారు. అప్పుడు రామకృష్ణులు, 'అదంతా అమ్మ అనుమతిస్తేనే' అన్నారు. 'ఏ అమ్మ?' అని ప్రశ్నించారు తోతాపురి. 'మా అమ్మే! గుడిలో ఉన్న కాళీమాత' అన్నారు. అలా అని ఆయన నేరుగా గుడిలోనికి వెళ్ళి, కాళికామాత ముందు నిలబడి, 'అమ్మా! నిన్ను ఆరాధించటం మాని, ఇక మీదట నిరాకారం వైపు పయనించటానికి నాకు అనుమతి నిమ్ము' అని కళ్ళనిండా నీరుపెట్టుకొని ప్రాధేయపడ్డారు. కొంతసేపటికి ఆనందంగా నాట్యం చేస్తూ, 'అమ్మ నాకు అనుమతిని ఇచ్చింది, ఔను ఇచ్చింది' అని గట్టిగా అంటూ తోతాపురి వద్దకు వచ్చి, 'ఇక మీరు వేదాంత బోధ చేయండి, నేను నేర్చుకోవటానికి సిద్ధంగా ఉన్నాను' అన్నారు (ఓషో 'ద హిడెన్ మిస్టరీస్': పుటలు 131–132).



విగ్రహ కాళికాదేవి... సజీవ, సరూప దేవియై; నిరాకార, నిర్గుణ బ్రహ్మం వైపు ఆయన్ను నడిపింది. అలా సాగాలి మనందరి ప్రయాణం కూడా!

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.అష్టమి రా.12.35 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** మూల రా.11.06 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** ఉ.6.11 నుండి 7.55 వరకు, తిరిగి రా.9.25 నుండి 11.06 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.08 నుండి 7.44 వరకు, **అమృతఘడియలు:** సా.4.20 నుండి 6.03 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.07, **సూర్యాస్తమయం:** 6.07.

సీఎంకు బీసీ కమిషన్ అభినందనలు



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం రెండు బిల్లులను రూపొందించి అసెంబ్లీలో ఆమోదించిన నేపథ్యంలో తెలంగాణ బీసీ కమిషన్ హర్షం వ్యక్తంచేసింది. శుక్రవారం అసెంబ్లీలో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి తదితరులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌లను కలిశారు.

యువకుడి ప్రాణాలు తీసిన బెట్టింగ్ యాప్



సాయితేజ

మంథని/యైటింక్లయిన్ కాలనీ: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు అనేకమందిని బలితీసుకుంటున్నాయి. ఈ వ్యసనానికి అలవాటుపడ్డ యువకులు అప్పులపాలై, ఆఖరుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు. తాజాగా పెద్దపల్లి జిల్లా మంథని మండలం విలోచవరం గ్రామానికి చెందిన కోరవేన సాయితేజ (26) ఈనెల 18న రామగిరి మండలం సింగిరెడ్డిపల్లి గ్రామ శివారులో గడ్డి మందు తాగాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయాడు. సాయితేజ గోదావరిఖనిలో చదువుకున్నాడు. అక్కడే ఓ యువతిని ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. సాయితేజ గోదావరిఖనిలోనే ఓ ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడడంతో సాయితేజ దారితప్పినట్లు తెలుస్తోంది. ఏడాది నుంచి సాయితేజ బెట్టింగ్‌లకు అలవాటు పడటంతో రూ.6 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. ఇంట్లో ఈ విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు అప్పులు తీర్చారు. మళ్లీ అటువైపు వెళ్లనని చెప్పడంతో కుటుంబ సభ్యులు నమ్మారు. కానీ, బెట్టింగ్ వ్యసనం బారినపడ్డ సాయితేజ, మళ్లీ అదే తోవలో వెళ్లడంతో మరోసారి అప్పుల పాలయ్యాడని, ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడని తెలుస్తోంది. అతను ఈ సారి రూ.4లక్షలకు పైగా అప్పు చేసినట్లు సమాచారం.

ఇంకా ఈ పాడు సంపాదన ఎందుకు ?

- బెట్టింగ్ ప్రమోషన్లపై సెలబ్రిటీలను తప్పుబట్టిన సీపీఐ నేత నారాయణ



సాక్షి, న్యూఢిల్లీ: సెలబ్రిటీలు, సినీనటులకు ఈ మధ్య సినిమాలు లేకపోయినా, టీవీ సీరియళ్లు, ఓటీటీ వెబ్ సిరీసుల రూపంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, అవన్నీ చాలవన్నట్టు బెట్టింగ్ ప్రమోషన్లతో వచ్చే ఈ పాడు సంపాదన ఎందుకు అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఘాటుగా స్పందించారు. కళామతల్లి ఇచ్చిన గుర్తింపును బెట్టింగ్ వంటి పాడు పనులతో సొమ్ము చేసుకోవడం సరికాదని హితవు పలికారు. శుక్రవారం ఢిల్లీలోని ఏపీభవన్‌లో నారాయణ మీడియాతో మాట్లాడారు. బెట్టింగ్ వంటి అనైతిక కార్యకలాపాలను నియంత్రించేందుకు చట్టాలు ఉన్నా, వాటిలోని లొసుగులు నేరగాళ్లకు వెసులుబాటు కల్పిస్తున్నాయన్నారు. గతంలో కోకాకోలా ప్రకటనలు చేస్తున్న చిరంజీవికి తాను లేఖ రాయగా, దానికి స్పందించిన ఆయన కాంట్రాక్టు ముగిసిన తర్వాత మళ్లీ ఎప్పుడూ ఆ ప్రకటనల జోలికి వెళ్లలేదని నారాయణ గుర్తుచేశారు.

పొంచి ఉన్న 'ట్రూఅప్' భారం!

- ఆదాయ లోటు, ప్రభుత్వ సబ్సిడీ నిధుల మధ్య పొంతన లేదు
- లోటు భర్తీకి భవిష్యత్తులో ట్రూఅప్ చార్జీలు అనివార్యం
- అవసరానికి మించి పునరుత్పాదక విద్యుత్ కొనుగోలు వద్దు
- ఈఆర్సీ బహిరంగ విచారణలో విద్యుత్ రంగ నిపుణుడు వేణుగోపాలరావు
- పరిహారం చెల్లింపు, లైన్లు, టవర్ల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి
- అధికారులకు కమిషన్ ఆదేశం



బహిరంగ విచారణలో మాట్లాడుతున్న టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ. (ఇన్‌సెట్‌లో) ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు భవిష్యత్తులో ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీల (ఎఫ్ఎస్ఏ) ముప్పు పొంచి ఉందని విద్యుత్ రంగ నిపుణుడు ఎం.వేణుగోపాలరావు ఆందోళన వ్యక్తంచేశారు. రెండు డిస్కంలకు రూ.20,151 కోట్ల ఆదాయ లోటు ఉంటుందని అంచనా వేయగా, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీల కింద బడ్జెట్‌లో రూ.11,500 కోట్లు మాత్రమే కేటాయించిందని గుర్తు చేశారు. మిగతా లోటును పూడ్చుకునేందుకు ట్రూఅప్ చార్జీలు విధించాల్సి వస్తుందని తెలిపారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సమర్పించిన 2025–26 వార్షిక ఆదాయ అవశ్యకత(ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలపై రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) శుక్రవారం నిర్వహించిన బహిరంగ విచారణలో ఆయన తన వాదన వినిపించారు. డిస్కంల ఆర్థిక నష్టాలు, ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లుల బకాయిల కలిపి రూ.98,053 కోట్లకు ఎగబాకాయని ఆందోళన వ్యక్తం చేశారు. గరిష్ట డిమాండ్ ఉండే సమయంలో పునరుత్పాదక విద్యుత్ అందుబాటులో ఉండదని, అందువల్ల తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిన కనీస మొత్తం కంటే అధికంగా పునరుత్పాదక విద్యుత్‌ను కొనటం ఏమాత్రం సరికాదని అన్నారు. అలా చేస్తే గరిష్ట డిమాండ్‌ను తీర్చడానికి బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోళ్లకు అనవసర ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. పునరుత్పాదక ఇంధన కొనుగోళ్లకు అడ్డగోలుగా ఒప్పందాలు చేసుకుంటే థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి తగ్గించడానికి బ్యాకింగ్ డౌన్ చేసి నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వచ్చే ఏడాది ఏకంగా 28,504 మిలియన్ యూనిట్ల (ఎంయూ) మిగులు విద్యుత్ ఉంటుందని డిస్కంలు అంచనా వేశాయని, అవసరం లేని ఈ విద్యుత్‌కు చెల్లించే ఫిక్స్‌డ్ చార్జీల భారం వినియోగదారులపై పడుతుందని అన్నారు. సమ్మతి తెలిపిన వినియోగదారులకే ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలని సూచించారు. టైమ్ ఆఫ్ డే పేరుతో రాత్రి పూట విద్యుత్ వినియోగించే హెచ్‌టీ వినియోగదారులకు ఇస్తున్న రాయితీలను ఎత్తివేయాలని కోరారు. బ్యాటరీ స్టోరేజీ సిస్టమ్ ఏర్పాటు చేస్తే విద్యుత్ ధర యూనిట్‌కు రూ.11కి పెరిగిపోతుందని చెప్పారు.

వినతులు, ఫిర్యాదులు..

- రైల్వే ట్రాక్షన్ విద్యుత్ చార్జీలను హైదరాబాద్ మెట్రో రైలు కేటగిరీతో సమానంగా తగ్గించాలని దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఆర్.మల్లికార్జునరావు విజ్ఞప్తి చేశారు.
- విద్యుత్ బిల్లులను నెల పూర్తికాక ముందే జారీ చేసిన సందర్భాల్లో సగటున 30 రోజుల వాడకాన్ని అంచనా వేసి టారిఫ్ శ్లాబులను వర్తింపజేస్తుండటంతో బిల్లులు భారీగా పెరిగిపోతున్నాయని కిరణ్‌కుమార్ అనే వినియోగదారుడు ఫిర్యాదు చేశారు.
- విద్యుత్ ప్రమాదాల్లో మరణించి వారి కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లింపుల్లో జాప్యం ఎందుకు జరుగుతోందని ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ ప్రశ్నించారు. దరఖాస్తులు చేసుకోవడానికి నిర్దేశిత గడువు ఏమీ లేనప్పుడు గడువు పేరుతో దరఖాస్తులు ఎందుకు తిరస్కరిస్తున్నారని నిలదీశారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలంలో సంజీవరెడ్డి అనే వ్యక్తి 2019లో విద్యుదాఘాతంతో మరణిస్తే ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదని అతడి భార్య సరిత ఫిర్యాదు చేయటంతో అప్పటికప్పుడు ఆమెకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును ఇప్పించారు.
- కొత్త వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలతో పాటు లంచాలు ఇచ్చినా సకాలంలో జారీ చేయడం లేదని పలువురు రైతులు ఆరోపించారు. ఈ ఫిర్యాదులపై జస్టిస్ దేవరాజు నాగార్జున్ అక్కడికక్కడే టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీని వివరణ కోరారు.

లైన్లు, టవర్ల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

పంట పొలాల్లో విద్యుత్ లైన్లు, టవర్ల ఏర్పాటు విషయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఈఆర్సీ చైర్మన్ ఆదేశించారు. నోటీసులు ఇవ్వకుండా, తమ సమ్మతి లేకుండా పొలాల్లో లైన్లు వేస్తున్నారన్న రైతుల ఫిర్యాదులపై వివరణ కోరారు. టవర్ ఏర్పాటు చేస్తే స్థలం మార్కెట్ విలువ తో పోల్చితే 200 శాతాన్ని, లైన్లు వేస్తే 30 శాతాన్ని పరిహారంగా ఇవ్వాలని జీవో ఉందని ట్రాన్స్‌కో జేఎండీ సి.శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికి వచ్చే సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు క్షేత్రస్థాయిలోని సర్కిల్ కార్యాలయాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని ఫారూఖీ హామీ ఇచ్చారు.

ఎన్‌కౌంటర్ మృతుల్లో సగానికి పైగా మహిళలే

- బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో 26 మంది మావోయిస్టుల మృతి



ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టులు (తెల్లని కవర్లలో మహిళా మావోల మృతదేహాలు)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 26 మంది మావోయిస్టులు చనిపోగా అందులో 14 మంది మహిళా మావోయిస్టులే ఉన్నారు. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజు శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. మృతుల్లో కద్తి సీతో ఒక్కరే పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యురాలిగా ఉన్నారు. ఆమెపై రూ.8 లక్షల రివార్డు ఉంది. మిగిలిన వారిలో ఐదుగురు ఏరియా కమిటీ సభ్యులు, ప్లాటూన్ కమిటీ సభ్యులు ముగ్గురు, తొమ్మిది మంది పీఎల్‌జీఏ సభ్యులు ఉన్నట్టు ప్రకటించారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు వెల్లడైన వివరాల ప్రకారం 18 మంది మృతుల్లో తొమ్మిది మంది మహిళా మావోయిస్టులున్నారు. ఇందులో ఒకరు డివిజినల్ కమిటీ సభ్యురాలు, ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు, నలుగురు పీఎల్‌జీఏకు చెందిన వారున్నారు. గుర్తించని 8 మందిలోనూ ఐదుగురు మహిళా మావోయిస్టులే ఉన్నారు. ఎన్‌కౌంటర్‌లో ఒక ఏకే 47, ఒక స్నైపర్ ఎస్ఎల్ఆర్, ఒక ఇన్సాస్ రైఫిల్, బోర్ రైఫిల్, బోర్ గన్, బీజీఎల్ రాకెట్ లాంచర్‌లతో పాటు వీటిలో ఉపయోగించే తూటాలు, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఈ ఘటనలో మృతిచెందిన డీఆర్‌జీ జవాన్ రాజు ఓయంకు పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

కాజీపేటలో డిసెంబర్ నాటికి కోచ్‌ల ఉత్పత్తి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్
- కరీంనగర్, రామగుండం, వరంగల్ ప్రాంతాల్లో పనుల పరిశీలన



రైల్వే లోకోపైలెట్ల ముఖాముఖిలో మాట్లాడుతున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

కాజీపేట రూరల్: హనుమకొండ జిల్లా కాజీపేట శివారులో నిర్మిస్తున్న రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని త్వరలో పూర్తి చేసి, ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. కరీంనగర్, రామగుండం, వరంగల్‌లో రైల్వే అభివృద్ధి పనులను తనిఖీ చేస్తూ.. శుక్రవారం ఆయన ప్రత్యేక రైలులో కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా జీఎం విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ నాటికి కోచ్‌ఫ్యాక్టరీలో కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభించే అవకాశం ఉందన్నారు. కాగా, కాజీపేట రైల్వే డ్రైవర్ల (లోకోపైలెట్ల) కార్యాలయంలో జీఎం అరుణ్‌కుమార్, డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేష్‌కుమార్ జైన్, ఇతర రైల్వే అధికారులు లోకోపైలెట్లతో ముఖాముఖి నిర్వహించారు.

రైల్వే జీఎం ప్రత్యేక రైలుకు తప్పిన ప్రమాదం

వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తోపాటు అధికారుల బృందం ప్రయాణిస్తున్న ప్రత్యేక రైలుకు పెద్ద ప్రమాదం తప్పింది. వరంగల్‌లో తనిఖీ చేసిన జీఎం, ప్రత్యేక రైలులో బయలుదేరి వస్తుండగా మార్గమధ్యలో 372/36 కిలోమీటర్ నంబర్ వద్ద రైలు పట్టాపై ఇనుప (పట్టా) ముక్క ఉందని, ఆ ముక్కను జీఎం ప్రత్యేక రైలు తోసుకుంటూ దాదాపు కిలోమీటర్ దూరం వరకు వెళ్లిందని అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని జీఎం, ఇతర అధికారులు గమనించి ఏమైందని ఆరా తీస్తుండగా పట్టాపై మరో ఇనుప ముక్కను గుర్తించారని పేర్కొన్నారు. ఈ ఘటనను సికింద్రాబాద్ రైల్వే అధికారులు సీరియస్‌గా తీసుకొని రైలు పట్టాపై ఆ ముక్క ఎలా వచ్చింది, ఎవరైనా కావాలని పెట్టారా? అన్న కోణంలో ఆరా తీస్తున్నారని తెలిపారు. ఇది విద్రోహ చర్యనా? లేక రైల్వే డిపార్ట్‌మెంట్ తప్పిదమా?, లేక మరెవరి పని అయి ఉంటుందా? అని సీరియస్‌గా అరా తీస్తున్నట్లు తెలిసింది.

దోతిగూడెంలో బర్డ్‌ఫ్లూ కలకలం

- 19వేల గుడ్లు, 40 వేల కోళ్ల పూడ్చివేత



కోళ్లను మూటకట్టి గుంతలో పూడ్చుతున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామ పరిధిలో బర్డ్‌ఫ్లూ కలకలం రేగింది. గ్రామంలోని పిట్ట సుదర్శన్‌రెడ్డికి చెందిన పౌల్ట్రీఫామ్‌లో.. ఈ నెల 12న 500 కోళ్లు మృతి చెందాయి. దీనిపై సుదర్శన్‌రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు పశువైద్యాధికారులు.. చనిపోయిన కోళ్ల నుంచి నమూనాలు సేకరించి వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపించారు. వారు వాటిని మధ్యప్రదేశ్, భోపాల్‌లోని హై సెక్యూరిటీ వీబీఆర్ఐ ల్యాబ్‌కు పంపించారు. అక్కడ నమూనాలను పరీక్షించగా కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిందని నిర్ధారణయ్యింది. దీంతో శుక్రవారం జిల్లా పశుసంవర్థక, వైద్య, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఆ పౌల్ట్రీఫామ్‌ను సందర్శించారు. అక్కడ పశు వైద్యాధికారులు, సిబ్బంది మొత్తం 32 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లుగా ఏర్పడి.. పీపీఈ కిట్లు ధరించి.. ఫాంలోని 40వేల కోళ్లను చంపి మూటగట్టి సమీపంలో గుంతతీసి పూడ్చిపెట్టారు. సుమారు 19 వేల గుడ్లను సైతం పూడ్చారు. దీనిపై యాదాద్రి జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జానయ్య విలేకరులతో మాట్లాడుతూ.. ఫాంలోని 90 టన్నుల ఫీడ్‌తో పాటు కోళ్ల పెంటను సైతం దహనం చేస్తామని తెలిపారు. కోళ్లఫాం నుంచి కిలోమీటర్ పరిధిలో పూర్తి స్థాయిలో శానిటేషన్ చేస్తామని తెలిపారు. మూడు నెలల వరకు పౌల్ట్రీ ఫామ్‌ను సీజ్ చేస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల తరువాతే తిరిగి పౌల్ట్రీఫామ్‌ను నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దోతిగూడెంలో బర్డ్‌ఫ్లూ వల్ల ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దని కోరారు.

41ఏ నోటీసులిచ్చి విచారణ చేయండి

- యాంకర్ శ్యామలపై కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ యాంకర్ శ్యామలారెడ్డిపై దాఖలైన కేసులో చట్టప్రకారం సీఆర్‌పీసీ 41ఏ కింద నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టాలని పంజాగుట్ట పోలీసులను హైకోర్టు ఆదేశించింది. సోమవారం దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని శ్యామలను ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని సూచిస్తూ, విచారణను ముగించింది. బెట్టింగ్ యాప్ కేసులో తనపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ యాంకర్ శ్యామల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.తుకారాంజీ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున రఘు వాదనలు వినిపిస్తూ.. రాజకీయంగా పిటిషనర్ ఎదుగుతున్నారని చూడలేక కేసు బనాయించారన్నారు. ఎలాంటి ఆధారాలు లేకున్నా.. రాజకీయంగా, వ్యక్తిగతంగా దెబ్బ తీయాలని చూస్తున్నారని తెలిపారు. చట్టానికి కట్టుబడి, గౌరవంగా ఉండే పిటిషనర్‌పై కేసు పెట్టడం అక్రమమని పేర్కొన్నారు. పోలీసుల తరఫున ఏపీపీ జితేందర్‌రావు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. శ్యామలకు ఊరటనిస్తూ ఆదేశాలు జారీ చేశారు. 41ఏ నోటీసులు ఇవ్వకుండా ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని పోలీసులను ఆదేశిస్తూ, విచారణను ముగించారు. కాగా, సామాజిక మాధ్యమాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో టీవీ యాంకర్ విష్ణుప్రియ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ రీతూచౌదరిలను పంజాగుట్ట పోలీసులు గురువారం విచారించిన విషయం తెలిసిందే.

ముందు దర్యాప్తు.. ఆపై విచారణ!

బెట్టింగ్ యాప్స్ కేసులో పోలీసుల నిర్ణయం

- తమ వీడియోలకు సంబంధించి సాంకేతిక కారణాలు చూపిస్తున్న ఇన్‌ఫ్లుయెన్సర్లు
- గేమింగ్ యాక్ట్ సవరణకు ముందే చేశామంటూ వాదన
- దీనిపై న్యాయ నిపుణుల సలహా తీసుకోనున్న దర్యాప్తు అధికారులు

సాక్షి, హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన ఆరోపణలపై సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై నమోదైన కేసుల విషయంలో పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. తొలుత ప్రాథమిక దర్యాప్తు పూర్తి చేయాలని, వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా బాధ్యులకు నోటీసులు జారీ చేసి విచారించాలని భావిస్తున్నారు. దేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అస్సోం మినహా మిగతా రాష్ట్రాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ నేరం కాకపోవడం, మరికొన్ని అంశాల నేపథ్యంలో ఆచితూచి వ్యవహరించాలని ఆలోచనకు వచ్చారు. న్యాయ నిపుణుల సలహా తీసుకుని ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉన్న పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో 11 మంది యాంకర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మియాపూర్ పోలీసుస్టేషన్‌లో 25 మంది నటీనటులు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదైన విషయం తెలిసిందే.

రాష్ట్రంలో 2017 నుంచే నిషేధం అమలు..

తెలంగాణలో కొన్నేళ్లుగా పేకాటపై నిషేధం ఉంది. దీనితో పేకాట క్లబ్బులన్నీ మూతపడ్డాయి. కానీ చాలా మంది ఆన్‌లైన్ రమ్మీ, పేకాటకు అలవాటు పడ్డారు. దీనికోసం తొలినాళ్లలో ప్రత్యేక వెబ్‌సైట్లు, యాప్‌లు వచ్చాయి. వాటి సర్వర్లను రాష్ట్రం వెలుపల ఏర్పాటు చేసుకున్న నిర్వాహకులు యథేచ్ఛగా తమ కార్యకలాపాలు సాగిస్తూ వచ్చారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం.. గేమింగ్ యాక్ట్‌కు సవరణలు చేసి, రాష్ట్ర పరిధిలో ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌పైనా నిషేధం విధించింది. 2017లో ఇది అమల్లోకి వచ్చింది. ఇంటర్‌నెట్ సేవలను అందించే సంస్థలకు లేఖలు రాయడం ద్వారా పోలీసులు రాష్ట్రంలో గ్యాంబ్లింగ్ సైట్లు/యాప్‌లు ఓపెన్ కాకుండా చర్యలు తీసుకున్నారు. కానీ ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసలుగా మారినవారు నకిలీ జీపీఎస్, లొకేషన్ యాప్స్, వీపీఎన్‌ల సాయంతో ఆయా సైట్లు, యాప్స్‌ను వినియోగిస్తున్నారు. పలువురు నటులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు డబ్బులు తీసుకుని ఆ గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌కు ప్రమోట్ చేశారు. ఈ క్రమంలోనే వారిపై చర్యలకు పోలీసులు ఉపక్రమించారు.

నాటి ప్రకటనలే అని చెబుతూ..

బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేయడంపై కేసులు నమోదవడంతో చాలా మంది ప్రముఖులు స్పందించారు. ఆ ప్రకటనలన్నీ గేమింగ్ చట్ట సవరణకు ముందే 2016–17 సమయంలో చేసినవని, తర్వాత ఆ ఒప్పందాలు రద్దు చేసుకున్నామని కొందరు చెప్తున్నారు. మరికొందరు తెలుగు రాష్ట్రాల బయట మాత్రమే ఆ ప్రమోషనల్ వీడియోలను వినియోగించుకోవడానికి అంగీకరించామని అంటున్నారు. దీంతో సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, యాంకర్లతో బెట్టింగ్ కంపెనీలకు జరిగిన ఒప్పందాలను సేకరించాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. వాటిని అధ్యయనం చేయడం ద్వారా ఎవరు? ఎప్పుడు? ఏఏ యాప్స్‌తో ఒప్పందాలు చేసు కున్నారు? ఏయే ప్రాంతాల్లో ప్రచారం చేసేలా నిబంధనలు ఉన్నాయి? తదితర అంశాలను పరిశీలించనున్నారు. ఇక ఇన్‌ఫ్లుయెన్సర్లకు, బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులకు మధ్య కొందరు ఈవెంట్ మేనేజర్లు దళారులుగా వ్యవహరించినట్టు పోలీసులు భావిస్తున్నారు. వారి వివరాలు సైతం ఆరా తీసి, నిందితులుగా చేర్చాలని యోచిస్తున్నారు. న్యాయ నిపుణుల సల హాలు తీసుకున్న తర్వాతే నిందితులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తున్నారు.

తెలంగాణలో 7,600 పాముకాటు కేసులు

- లోక్‌సభలో కేంద్ర మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో 2022 నుంచి 2024 డిసెంబర్ మధ్య 7,600 పాముకాటు కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ తెలిపారు. అందులో ఒక్కరు కూడా చనిపోలేదని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అడిగిన ఓ ప్రశ్నకు కేంద్ర మంత్రి శుక్రవారం ఈ మేరకు లోక్‌సభలో లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

న్యాయమూర్తి ఇంట్లో నోట్ల కట్టలు



ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నగదు లభ్యం

అది లెక్కల్లో చూపని అక్రమ సొమ్మేనని అంటున్న అధికారులు

- జడ్జి తీరుపై తీవ్రంగా స్పందించిన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా
- అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు
- అంతర్గత విచారణ ప్రారంభించిన కొలీజియం
- అవినీతికి పాల్పడినట్లు తేలితే శాశ్వతంగా వేటు పడే అవకాశం
- ఈ నెల 14న సొమ్ము దొరికితే 20 దాకా విధులకు హాజరైన యశ్వంత్ వర్మ
- దాదాపు వారం రోజులపాటు గోప్యంగా ఉంచిన అధికారులు

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు లభ్యం కావడం సంచలనాత్మకంగా మారింది. ఇదంతా లెక్కల్లో చూపని అక్రమ నగదేనని అధికారులు చెబుతున్నారు. సాక్షాత్తూ న్యాయమూర్తి ఇంట్లో భారీగా సొమ్ము లభించడం రాజకీయంగా పెనుదుమారం సృష్టిస్తోంది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తీవ్రంగా స్పందించారు. యశ్వంత్ వర్మపై బదిలీ వేటు వేయాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అవినీతికి పాల్పడి అక్రమంగా నగదు కూడబెట్టినట్లు విచారణలో తేలితే యశ్వంత్ వర్మను పదవి నుంచి తొలగించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అంటున్నారు. అయితే, ఆయన ఇంట్లో ఎంత నగదు దొరికిందనే సంగతి అధికారులు ఇంకా బయటపెట్టలేదు. ఈ నెల 14వ తేదీన నగదు లభించగా, ఈ నెల 20దాకా ఆయన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించడం గమనార్హం. వారం రోజులదాకా విషయం బయటకు రాలేదు.

అగ్నిప్రమాదంతో బయటపడ్డ నగదు

ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని అధికారిక నివాసంలో జస్టిస్ యశ్వంత్ వర్మ తన కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. ఈ నెల 14వ తేదీన రాత్రి సమయంలో ఆ ఇంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రాత్రి 11.30 గంటల సమయంలో యశ్వంత్ వర్మ కుటుంబ సభ్యులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఢిల్లీ ఫైర్ సర్వీసు సిబ్బందితోపాటు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు. ఆ సమయంలో యశ్వంత్ వర్మ ఇంట్లో లేరు. మంటలను ఆర్పిన తర్వాత గదులను తనిఖీ చేస్తుండగా, ఓ గదిలో భారీగా నోట్లకట్టలు ఉన్నట్లు గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఢిల్లీ హోంశాఖకు తెలియజేశారు. నగదు వివరాలను తెలియజేస్తూ ఒక రిపోర్టు అందజేశారు. హోంశాఖ ఈ రిపోర్టును సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నాకు సమర్పించింది. ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో అక్రమ నగదు లభించడాన్ని జస్టిస్ సంజీవ్ ఖన్నా తీవ్రంగా పరిగణించారు. ఆయన నేతృత్వంలో సుప్రీంకోర్టు కొలీజియం గురువారం సమావేశమైంది. యశ్వంత్ వర్మను ఢిల్లీ హైకోర్టు నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్రానికి సిఫార్సు చేసింది. వాస్తవానికి యశ్వంత్ వర్మ 2021లో అలహాబాద్ హైకోర్టు నుంచే బదిలీపై ఢిల్లీ హైకోర్టుకు వచ్చారు. తాజా వివాదం నేపథ్యంలో యశ్వంత్ వర్మ శుక్రవారం విధులకు హాజరు కాలేదు. ఆయనపై సుప్రీంకోర్టు కొలీజియం అంతర్గత విచారణ ప్రారంభించినట్లు తెలిసింది. కేవలం బదిలీతో సరిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కొలీజియంలోని కొందరు సభ్యులు సూచించినట్లు సమాచారం. యశ్వంత్ వర్మ వ్యవహార శైలిపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ నుంచి కొలీజియం వివరణ కోరింది. తాజా వివాదంపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సైతం విచారణ ప్రారంభించారు. యశ్వంత్ వర్మ విషయంలో తప్పుడు వార్తలు, పుకార్లు ప్రచారంలోకి వస్తున్నాయని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆయనను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తూ స్వతంత్రంగా నిర్ణయం తీసుకున్నామని, విచారణతో దీనికి సంబంధం లేదని స్పష్టంచేసింది. పూర్తి విచారణ తర్వాతే చర్యలు తీసుకుంటామని తెలియజేసింది.

పనికిరాని చెత్త మాకొద్దు

యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ కొలీజియం సిఫార్సు చేయడాన్ని, అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ శుక్రవారం వ్యతిరేకించింది. తమ హైకోర్టు చెత్తకుండీ కాదని తేల్చిచెప్పింది. పనికిరాని చెత్తను ఇక్కడికి తరలిస్తామంటే అంగీకరించే ప్రసక్తే లేదని హెచ్చరించింది. ఈ మేరకు బార్ అసోసియేషన్ ఒక తీర్మానం ఆమోదించింది.

పదవి నుంచి తొలగించవచ్చా?

న్యాయమూర్తులు అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు తేలితే శాశ్వతంగా పదవి నుంచి తొలగించాలంటూ 1999లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది. హైకోర్టు జడ్జిపై ఫిర్యాదు అందితే తొలుత ప్రధాన న్యాయమూర్తి విచారణ ప్రారంభించాలి. సదరు జడ్జి నుంచి వివరణ కోరాలి. జడ్జి ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందకపోయినా లేక లోతైన దర్యాప్తు అవసరమని భావించినా అందుకోసం అంతర్గత కమిటీని నియమించాలి. ఆరోపణలు నిజమేనని కమిటీ దర్యాప్తులో తేలితే.. పదవికి రాజీనామా చేయాలంటూ జడ్జిని ఆదేశించాలి. శాశ్వతంగా పదవి నుంచి తొలగించడానికి అభిశంసన చర్యలు ప్రారంభించాలంటూ పార్లమెంట్‌కు సిఫార్సు చేయాలి. అభిశంసన తీర్మానాన్ని పార్లమెంట్ ఆమోదిస్తే జడ్జి పదవి ఊడినట్లే.

ఫైర్ సిబ్బందికి నగదు దొరకలేదు: డీఎఫ్ఎస్ చీఫ్

జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో తమ సిబ్బందికి ఎలాంటి నగదు దొరకలేదని ఢిల్లీ ఫైర్ సర్వీసెస్(డీఎఫ్ఎస్) చీఫ్ అతుల్ గార్గ్ శుక్రవారం చెప్పారు. అగ్నిప్రమాదం జరిగినట్లు ఈ నెల 14న రాత్రి 11.35 గంటలకు కంట్రోల్ రూమ్‌కు సమాచారం వచ్చిందని, తమ సిబ్బంది వెంటనే అక్కడికి వెళ్లి మంటలు ఆర్పివేశారని అన్నారు. 15 నిమిషాల్లో ఈ ప్రక్రియ ముగిసిందన్నారు. వారికి నగదేమీ దొరకలేదన్నారు.

ఎవరీ యశ్వంత్ వర్మ?

వివాదానికి కేంద్ర బిందువుగా మారిన జస్టిస్ యశ్వంత్ వర్మ 1969 జనవరి 6న ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో జన్మించారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన హన్స్‌రాజ్ కాలేజీలో బీకాం(ఆనర్స్), మధ్యప్రదేశ్‌లోని రేవా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ డిగ్రీ పూర్తి చేశారు. 1992 ఆగస్టు 8న అడ్వొకేట్‌గా న్యాయవాద వృత్తి ఆరంభించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2014 అక్టోబర్ 13న అలహాబాద్ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులయ్యారు. 2016 ఫిబ్రవరి 1న అదే కోర్టులో శాశ్వత జడ్జిగా ప్రమాణం చేశారు. 2021 అక్టోబర్ 11న ఢిల్లీ హైకోర్టుకు బదిలీపై వచ్చారు.

పార్లమెంట్‌లో అభిశంసించాలి

జస్టిస్ యశ్వంత్ వర్మను బదిలీ చేయాలని కొలీజియం నిర్ణయించడం పట్ల పలువురు సీనియర్ న్యాయవాదులు విస్మయం వ్యక్తంచేశారు. తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న జడ్జిని మరో కోర్టుకు బదిలీ చేయడం ఏమిటని అడ్వొకేట్ వికాస్ సింగ్ ప్రశ్నించారు. ఆయనతో వెంటనే రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. అవినీతిపై కఠినంగా వ్యవహరించాల్సిన వృత్తిలో ఉన్న వ్యక్తి అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకోకుండా వదిలేయడం ఏమిటని అన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని పేర్కొన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపి, పూర్తి నిజాలు బయటపెట్టాలని మరో అడ్వొకేట్ రాకేశ్ ద్వివేది చెప్పారు. యశ్వంత్ వర్మ తప్పు చేసినట్లు రుజువైతే చట్టప్రకారం శిక్షించాలని సూచించారు. యశ్వంత్ వర్మ వ్యవహారంలో సుప్రీంకోర్టు కొలీజియం పూర్తి పారదర్శకంగా, నిజాయతీగా పనిచేస్తుందని ఆశిస్తున్నట్లు సీనియర్ లాయర్ ఇందిరా జైసింగ్ వెల్లడించారు. ఈ నెల 14న నోట్ల కట్టలు దొరికితే ఈ నెల 21న విషయం బయటపడడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు.

బదిలీతో చేతులు దులుపుకోవద్దు: కాంగ్రెస్



అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మను కేవలం బదిలీ చేసి, చేతులు దులుపుకోవడం సరైంది కాదని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా శుక్రవారం పేర్కొన్నారు. ఆ డబ్బు ఎవరిదో, ఎక్కడి నుంచి వచ్చిందో తేల్చాలని డిమాండ్ చేశారు. న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా ప్రభుత్వం వ్యవహరించాలన్నారు. ఈడీ, సీబీఐల కంటే అగ్నిమాపక శాఖే అద్భుతంగా పనిచేస్తోందని పవన్ ఖేరా వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

జడ్జిల నియామకం పారదర్శకంగా జరగాలి: కపిల్ సిబల్



ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో అక్రమ నగదు లభ్యం కావడం నిజంగా ఆందోళనకరమైన అంశమని సీనియర్ అడ్వొకేట్, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ అన్నారు. న్యాయ వ్యవస్థలో అవినీతిని ఎంతమాత్రం సహించడానికి వీల్లేదని చెప్పారు. న్యాయ వ్యవస్థలో అవినీతి అక్రమాలు పునరావృతం కాకుండా న్యాయమూర్తుల నియామకాన్ని మరింత పారదర్శకంగా మార్చాలని అభిప్రాయపడ్డారు. జడ్జిలను చాలాచాలా జాగ్రత్తగా నియమించాలని పేర్కొన్నారు. అవినీతి అనేది మొత్తం సమాజానికే కీడు చేస్తుందని హెచ్చరించారు. దేశంలో అవినీతి తగ్గుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం అవినీతి పెరిగిపోతోందని కపిల్ సిబల్ స్పష్టంచేశారు.

మరొకరైతే పెద్ద వివాదం అయ్యేది: ధన్‌ఖడ్



జడ్జి యశ్వంత్ వర్మ ఇంట్లో పెద్ద ఎత్తున అవినీతి సొమ్ము దొరకడాన్ని కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ శుక్రవారం రాజ్యసభలో లేవనెత్తారు. న్యాయ వ్యవస్థలో జవాబుదారీతనం అవసరమని, అందుకోసం చట్టసభలు చొరవ తీసుకోవాలని అన్నారు. దీనిపై ప్రభుత్వానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కోరారు. ఈ వ్యవహారంపై సభలో నిర్మాణాత్మక చర్చ జరగడానికి ఒక విధానం రూపొందించే విషయం ఆలోచిస్తానని ధన్‌ఖడ్ చెప్పారు. జడ్జి ఇంట్లో అక్రమ నగదు లభ్యమైన వెంటనే ఆ విషయం బయటకు రాకపోవడం తనను బాధించిందని వ్యాఖ్యానించారు. ఒకవేళ రాజకీయ నాయకుడు లేదా ప్రభుత్వ అధికారి లేదా పారిశ్రామికవేత్త ఇంట్లో డబ్బులు దొరికి ఉంటే వెంటనే పెద్ద వివాదం అయ్యేదని అన్నారు.

పౌరసత్వం తీసుకోండి... లేదా రష్యాను వీడండి

ఉక్రేనియన్లకు పుతిన్ అల్టిమేటం

మాస్కో: రష్యాలో నివసిస్తున్న ఉక్రేనియన్లకు అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అల్టిమేటమిచ్చారు. వారంతా సెప్టెంబర్ 10లోగా రష్యా పౌరసత్వం తీసుకోవాలి. లేదంటే దేశం వదిలి పోవాల్సి ఉంటుంది'' అంటూ హెచ్చరించారు. డోనెట్స్క్, లుహాన్స్క్, ఖేర్సన్, జపోరిజియా ప్రాంతాలకు చెందిన ఉక్రేనియన్ పాస్‌పోర్ట్ హోల్డర్లకు ఈ ఆదేశాలు వర్తిస్తాయి. ఆ ప్రాంతాలను 2022లో స్వాధీనం చేసుకున్నట్టు రష్యా చెబుతోంది. 2014లోనే రష్యా స్వాధీనం చేసుకున్నానంటున్న క్రిమియావాసులకు కూడా ఉత్తర్వులు వర్తిస్తాయి. ఆక్రమిత ప్రాంతాల్లోని ఉక్రేనియన్లు పౌరసత్వం తీసుకోవాలని రష్యా అధికారులు ఒత్తిడి తెచ్చారు. ఆ ప్రాంతాల్లో రష్యా పాస్‌పోర్టుల జారీ ప్రక్రియ గతేడాదే దాదాపు పూర్తయింది. దీన్ని ఉక్రెయిన్ తీవ్రంగా ఖండించింది. పాశ్చాత్య దేశాలు కూడా విమర్శించాయి. ఆ పాస్‌పోర్టులను చెల్లుబాటయ్యే ప్రయాణ పత్రాలుగా గుర్తించకూడదని ఈయూ నిర్ణయించింది. మరోవైపు రష్యా, ఉక్రెయిన్ కాల్పుల విరమణ చర్చలు ఆదివారం సౌదీ అరేబియాలోని జెడ్డాలో మళ్లీ మొదలవనున్నాయి.

భారత విద్యార్థి బహిష్కరణ చెల్లదు

అమెరికా ఫెడరల్ కోర్టు తీర్పు

వాషింగ్టన్: హమాస్‌కు మద్దతిస్తున్నాడంటూ భారత విద్యార్థి బదర్ ఖాన్ సూరిని బహిష్కరిస్తూ అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు తప్పుబట్టింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేదాకా సూరిని అమెరికా నుంచి బహిష్కరించొద్దని పేర్కొంది. న్యాయమూర్తి పాట్రిసియా టోలివర్ గైల్స్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్బంధం తమ జీవితాలను పూర్తిగా అతలాకుతలం చేసిందని సూరి భార్య మఫాజ్ సలే వాపోయారు. ''నా పిల్లలకు తండ్రి అవసరముంది. వారు ఆయనను మిస్సవుతున్నారు. ముగ్గురు పిల్లల తల్లిగా వారిని చూసుకోవడానికి నాకు సూరి మద్దతు అవసరం. ఆయన మా దగ్గరికి తిరిగొచ్చేందుకు అనుమతించాలి' అని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. సూరి భార్యకు భారతీయ మూలాలుండటం వల్లే ఆయనను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన తరపు న్యాయవాది వాదించారు. సూరి ప్రసంగాలు రాజ్యాంగబద్ధంగానే ఉన్నాయని పేర్కొన్నారు. సూరి జార్జ్‌టౌన్ వర్సిటీలో పోస్ట్‌డాక్టోరల్ ఫెలో. ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆయనను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ముసుగులు ధరించిన ఇమిగ్రేషన్ ఏజెంట్లు ఆయనను వర్జీనియాలోని నివాసం బయట అరెస్టు చేశారు. హమాస్‌కు మద్దతిస్తున్నారని, అనుమానిత ఉగ్రవాదితో సన్నిహిత సంబంధాలున్నాయని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ఆరోపించింది. ఆయన వీసాను రద్దు చేసింది. అనంతరం దేశం నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి లూసియానాలోని అలెగ్జాండ్రియా స్టేజింగ్ ఫెసిలిటీకి తరలించింది.

హనీట్రాప్, 4 శాతం ముస్లిం కోటాపై...

కర్నాటక అసెంబ్లీ రణరంగం

- కాపీలను స్పీకర్‌పై విసిరిన బీజేపీ ఎమ్మెల్యేలు
- ఆర్నెల్లపాటు 18 మంది ఎమ్మెల్యేల సస్పెన్షన్

బెంగళూరు: ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు ఆమోదం సందర్భంగా కర్ణాటక అసెంబ్లీ రణరంగంగా మారింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదంతో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఆందోళనల మధ్యే బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. దాంతో బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం



ఎమ్మెల్యేలను మోసుకెళ్తున్న అసెంబ్లీ మార్షల్స్

సిద్ధరామయ్యకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. స్పీకర్ పోడియం దగ్గర నిరసనకు దిగారు. బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ఆరోపిస్తూ కాపీలను చించి స్పీకర్‌పైకి విసిరారు. పలువురు సభ్యులు పోడియంపైకి ఎక్కి మరీ కాగితాలు విసిరారు. ''హనీ ట్రాప్ కుంభకోణంపై చర్చించాల్సింది పోయి ముస్లింలకు 4 శాతం బిల్లును మోదింపజేసుకోవడంలో సీఎం బిజీగా ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. దీనిపై అధికార పక్షం మండిపడింది. స్పీకర్‌ను అవమానించారంటూ 18 మంది ఎమ్మెల్యేలపై ఏకంగా ఆర్నెల్ల పాటు సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు న్యాయ, సభా వ్యవహారాల మంత్రి హెచ్‌కే పాటిల్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. అయినా సభను వీడేందుకు వారు నిరాకరించారు. దాంతో మార్షల్స్ వారిని బలవంతంగా బయటికి తీసుకెళ్లారు. సామాజిక న్యాయం కోసమే 4 శాతం రిజర్వేషన్ల నిర్ణయం తీసుకున్నట్టు అనంతరం ప్రభుత్వం పేర్కొంది. శాసనమండలిలో కూడా ఇవే దృశ్యాలు కన్పించాయి. బీజేపీ ఎమ్మెల్సీలు వెల్‌లోకి దూసుకెళ్లడమే గాక బిల్లు ప్రతులను చించి చైర్‌పర్సన్ బసవరాజ్ హొరట్టి వైపు విసిరారు.

'హనీట్రాప్' ప్రకంపనలు

హనీట్రాప్ అంశం కన్నడనాట ప్రకంపనలు సృష్టిస్తోంది. శుక్రవారం ఈ అంశంపై కర్నాటక అసెంబ్లీ దద్దరిల్లింది. ఉదయం సభ సమావేశం కాగానే విపక్ష బీజేపీ, జేడీ(ఎస్) సభ్యులు ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఇందులో రాష్ట్ర మంత్రితో పాటు పలువురు రాజకీయ నాయకులున్నట్టు వస్తున్న ఆరోపణలపై హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణకు డిమాండ్ చేశారు. ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హామీ ఇచ్చినా వారు శాంతించలేదు. హనీట్రాప్‌కు సంబంధించిన సీడీలతో వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలకు దిగారు. తనను హనీట్రాప్ చేసేందుకు ప్రయత్నాలు జరిగినట్టు రాష్ట్ర సహకార శాఖ మంత్రి కె.ఎన్.రాజన్న గురువారం సభకు వెల్లడించడం తెలిసిందే. తనతో పాటు పార్టీలకు అతీతంగా కనీసం 48 మంది రాజకీయ నాయకులు ఇందులో ఇరుక్కున్నట్టు ఆయన ప్రకటించారు. దాంతో ఒక్కసారిగా కలకలం రేగిన సంగతి తెలిసిందే.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

న్యూఢిల్లీ: సోమ, మంగళవారాల్లో తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను బ్యాంకు ఉద్యోగులు వాయిదా వేసుకున్నారు. వారానికి ఐదు రోజుల పని దినాలు, ఖాళీ పోస్టుల భర్తీ తదితర డిమాండ్లపై ఆర్థిక శాఖ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్(ఐబీఏ) నుంచి సానుకూల స్పందన రావడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ)శుక్రవారం తెలిపింది. శుక్రవారం చీఫ్ లేబర్ కమిషనర్ తమ వాదనలు విన్నారని వెల్లడించింది. ఉద్యోగ సంఘాల డిమాండ్లపై నివేదిక ఇవ్వాలని ఐబీఏను ఆదేశించారని, ఏప్రిల్ 22వ తేదీన మరోసారి చీఫ్ లేబర్ కమిషనర్‌తో చర్చలకు వెళతామని తెలిపింది.

టెస్లాపై దాడి చేస్తే 20 ఏళ్లు జైలు: ట్రంప్

వాషింగ్టన్: టెస్లా కార్లను ధ్వంసం చేస్తే 20 ఏళ్ల వరకు జైలు శిక్ష తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ మేరకు పోస్ట్ చేశారు. ''టెస్లా కార్లను నాశనం చేస్తూ పట్టుబడితే 20 ఏళ్ల వరకు జైలు తప్పదు. ఈ విధ్వంసానికి నిధులు సమకూర్చిన వారికీ ఇది వర్తిస్తుంది. మీకోసం వేట మొదలైంది!'' అంటూ హెచ్చరించారు. టెస్లా ఆస్తులపై ఇటీవలి హింసాత్మక దాడులను 'దేశీయ ఉగ్రవాదం'గా అమెరికా అటార్నీ జనరల్ పామ్ బోండీ అభివర్ణించారు. ఈ దాడుల్లో పాల్గొన్న వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. మంగళవారం ఉదయం లాస్‌వేగాస్‌లోని టెస్లా కొలిషన్ సెంటర్‌లో అగ్నిప్రమాదంలో ఐదు టెస్లా వాహనాలు దగ్ధమైన నేపథ్యంలో ఆమె ఈ ప్రకటన చేశారు. ట్రంప్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టిన టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌పై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటం తెలిసిందే.



హీత్రూ విమానాశ్రయంలో నిలిచిపోయిన విమానాలు



విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎగసిపడుతున్న మంటలు

కరెంటు కోత... హీత్రూకు మూత!

రోజంతా మూతబడ్డ విమానాశ్రయం ● విద్యుత్ సబ్‌స్టేషన్లో పేలుడే కారణం

- 1,350 విమానాల రద్దు, దారిమళ్లింపు
- 2.9 లక్షల ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు
- కొద్దిరోజులు సమస్యలే: హీత్రూ వర్గాలు
- చెప్పేదాకా ప్రయాణికులు రావద్దని విజ్ఞప్తి
- రాత్రికల్లా పాక్షికంగా సేవల పునరుద్ధరణ

లండన్: అంతర్జాతీయ ప్రయాణాలకు గుండెకాయ వంటి లండన్ హీత్రూ విమానాశ్రయం శుక్రవారం పూర్తిగా మూతబడింది. ఎయిర్‌పోర్టుకు విద్యుత్ సరఫరా చేసే సబ్‌స్టేషన్‌లో మంటలు చెలరేగడమే ఇందుకు కారణం. దాంతో హీత్రూకు కరెంటు సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో విమానాశ్రయాన్ని రోజంతా మూసేస్తున్నట్టు ప్రకటించారు. ఈ నిర్ణయంతో అంతర్జాతీయంగా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఏకంగా 1,350 విమానాలను రద్దు చేయడం, దారి మళ్లించడం జరిగినట్టు విమాన ట్రాకింగ్ సేవల సంస్థ ఫ్లైట్‌రాడార్24 వెల్లడించింది. దీనివల్ల 2.9 లక్షల మంది ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు లోనైనట్టు సమాచారం. ''విమానాశ్రయానికి విద్యుత్‌ను పూర్తిగా తిరిగి ఎప్పుడు పునరుద్ధరించేదీ చెప్పలేం. విమానాశ్రయాన్ని తెరిచేదాకా ప్రయాణికులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈవైపు రావొద్దు''అని హీత్రూ సీఈఓ థామస్ వోల్డ్‌బీ విజ్ఞప్తి చేశారు. శనివారానికల్లా పూర్తిస్థాయిలో సేవలను పునరుద్ధరిస్తామని ఆయన ఆశాభావం వెలిబుచ్చినా చాలా రోజులే పట్టవచ్చంటున్నారు. ప్రయాణికులు తమ ప్రయాణాలను రీషెడ్యూల్ చేసుకోవడం, అందుకు తగ్గట్టు విమానయాన సంస్థలు విమానాలను, సిబ్బందిని సమకూర్చుకునేందుకు కూడా కొన్ని రోజులు పడుతుందని చెబుతున్నారు. హీత్రూ యూరప్‌లోనే అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయం. ప్రతి 90 సెకన్లకు ఒక విమానం టేకాఫ్/లాండింగ్ జరుగుతుంది! ఇక్కణ్నుంచి రోజుకు 669 విమానాలు టేకాఫ్ అవుతాయి.

> జరిగింది చాలా పెద్ద ప్రమాదం. హీత్రూ విమానాశ్రయానికి ఉన్న అతి పెద్ద బలహీనత విద్యుత్ సరఫరాయే
>
> – విమానాశ్రయం సీఈఓ థామస్ వోల్డ్‌బీ

మండిపడుతున్న ప్రయాణికులు

హీత్రూ మూసివేతతో ఉత్తర అమెరికా, ఆసియా దేశాలకు చెందిన సుదూర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిణామంపై వారంతా తీవ్రంగా మండిపడుతున్నారు. ఒక్క అగ్నిప్రమాదం కారణంగా యూరప్‌లోనే అత్యంత రద్దీ విమానాశ్రయం మూతబడటమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇది అసాధారణమైన పరిస్థితని ఏవియేషన్ కన్సల్టెంట్ అనితా మెండిరట్టా తెలిపారు. ''శనివారానికల్లా సమస్యను సరిదిద్దుతాం. కానీ పూర్తి సాధారణ స్థితికి చేరేందుకు నాలుగు రోజులు పట్టొచ్చు''అని చెప్పారు. హీత్రూ వైపు వెళ్లే అన్ని రైళ్లను కూడా రద్దు చేసినట్లు నేషనల్ రైల్ తెలిపింది. హీత్రూ మూసివేత కారణంగా 4 వేల టన్నుల కార్గో రవాణా కూడా నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రికల్లా కొన్ని విమాన సేవలను పునరుద్ధరించినట్టు చెప్పుకొచ్చారు. ''జొహన్నెస్‌బర్గ్, సింగపూర్, రియాద్, కేప్‌టౌన్, సిడ్నీ, బ్యూనస్‌ఎయిర్స్ వంటి నగరాలకు విమానాలు బయల్దేరాయి. అవన్నీ విమానాశ్రయంలో చిక్కుకుపోయిన ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడానికే పరిమితమయ్యాయి'' అని స్పష్టం చేశారు.

కారణమేంటి?

పశ్చిమ లండన్‌లో హీత్రూ విమానాశ్రయానికి రెండు మైళ్ల దూరంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో గురువారం అర్ధరాత్రి భారీ పేలుడు శబ్దం విన్పించిందని, మంటలు సబ్ స్టేషన్‌ను చుట్టుముట్టాయని స్థానికులు వివరించారు. లండన్ ఫైర్ బ్రిగేడ్ 70 మంది సిబ్బంది 10 ఫైరింజన్లతో హుటాహుటిన చేరుకుని 7 గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చింది. అప్పటికే విమానాశ్రయంలో పవర్ కట్ ఏర్పడింది. ప్రమాదానికి కారణమేమిటనే దానిపై స్పష్టత లేదు. కుట్ర కోణం లేదని ప్రభుత్వం పేర్కొంది.

తీవ్ర వైఫల్యమే: ప్రధాని

హీత్రూకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోవడం తీవ్ర వైఫల్యమేనని ప్రధాని కియర్ స్టార్మర్ అంగీకరించారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిగి తీరుతుందని ఆయన అధికార ప్రతినిధి టామ్ వెల్స్ ప్రకటించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అన్ని చర్యలూ తీసుకుంటామని తెలిపారు.

బిలియన్లలో నష్టం!

హీత్రూ ప్రమాదం విమానయాన సంస్థల నడ్డి విరిచేలా కన్పిస్తోంది. విమానాల రద్దు, బీమా, పరిహారం చెల్లింపులు తదితరాల రూపంలో అవి బిలియన్ల కొద్దీ డాలర్ల నష్టాన్ని ఎదుర్కోవాల్సి రావచ్చని ఆ రంగ నిపుణులు చెబుతున్నారు. హీత్రూ మూసివేత దెబ్బ ఇప్పటికే వాటి మార్కెట్ విలువపై పడింది. బ్రిటిష్ ఎయిర్‌వేస్, లుఫ్తాన్సా, ర్యాన్‌ఎయిర్ వంటి పలు సంస్థల షేర్లు 1 నుంచి 2 శాతం దాకా పతనమయ్యాయి.

ఆ సమయంలో గాల్లో 120 విమానాలు

విద్యుత్ సరఫరా నిలిచి విమానాశ్రయాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించిన సమయంలో సుమారు 120 విమానాలు హీత్రూ సమీపంలో గాల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొన్నింటిని సమీపంలోని గాట్విక్, మాంచెస్టర్‌కు మళ్లించగా మరికొన్ని సమీప యూరప్ దేశాల్లోని పారిస్, ఆమ్‌స్టర్‌డామ్, ఫ్రాంక్‌ఫర్ట్ తదితర విమానాశ్రయాల్లో లాండయ్యాయి. మరికొన్ని విమానాలు వెనక్కు వెళ్లిపోయాయి. హీత్రూ మూసివేత వల్ల పారిస్‌లో లాండైన తమ ప్రయాణికుల కోసం క్వాంటాస్ ఎయిర్‌లైన్ సింగపూర్, పెర్త్ నుంచి విమానాలను పంపింది. లండన్‌కు వెళ్లాల్సిన వారిని బస్సులు, రైళ్లలో తరలిస్తామని తెలిపింది. ర్యాన్‌ఎయిర్ కూడా తమ ప్రయాణికుల కోసం డబ్లిన్, స్టాన్‌స్టెడ్ ఎయిర్‌పోర్టులకు విమానాలు నడుపుతామని తెలిపింది.

అత్యంత బిజీ!

అంతర్జాతీయ ప్రయాణాల విషయంలో ప్రపంచంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయాల్లో హీత్రూ ఒకటి. ఇది 1964లో అందుబాటులోకి వచ్చింది. ఇక్కడినుంచి ఏకంగా 90 దేశాల్లోని 230 గమ్యస్థానాలకు విమానాలు నడుస్తాయి. బ్రిటిష్ ఎయిర్‌వేస్‌తో పాటు 90 సంస్థలకు చెందిన విమానాలు ఇక్కడినుంచి రాకపోకలు సాగిస్తాయి. జనవరిలో రికార్డు స్థాయిలో 63 లక్షల మంది ప్రయాణికులు హీత్రూ గుండా రాకపోకలు సాగించారు! 2010లో ఐస్‌ల్యాండ్‌లో అగ్నిపర్వతం బద్దలై భారీగా దుమ్ముధూళి మేఘాలు కమ్ముకోవడంతో అట్లాంటిక్ మీదుగా విమానాల రాకపోకలకు నెలలపాటు అంతరాయం ఏర్పడింది. అప్పుడు కూడా హీత్రూలో విమాన సేవలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అయినా ఇలాంటి సందర్భాలను ఎదుర్కొనేందుకు బ్రిటన్ సన్నద్ధం కాలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మూడు సబ్‌స్టేషన్లున్నా...

హీత్రూకు కరెంటు సరఫరా కోసం మూడు సబ్‌స్టేషన్లతో పాటు ఒక బ్యాకప్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. కానీ వాటిలో ఒక సబ్‌స్టేషన్ ప్రస్తుతం పని చేయడం లేదు. మరికొటి కొద్ది రోజులుగా సమస్యలు ఎదుర్కొంటోంది. హీత్రూ విమానాశ్రయం నడవాలంటే ఏకంగా ఒక మినీ నగర అవసరాలకు సమానమైన కరెంటు అవసరం!

ఎయిరిండియా సేవలూ రద్దు..

న్యూఢిల్లీ: హీత్రూకు విమాన సేవలను శుక్రవారం నిలిపేసినట్టు ఎయిరిండియా పేర్కొంది. ''ఒక విమానం ముంబైకి తిరిగొచ్చింది. మరొకటి ఫ్రాంక్‌ఫర్ట్ మళ్లించాం. మిగతావి రద్దయ్యాయి'' అని ప్రకటించింది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు నుంచి శుక్రవారం లండన్ వెళ్లాల్సిన 5 వర్జిన్ అట్లాంటిక్, 8 బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానాలు కూడా రద్దయ్యాయి.

సాక్షి హైదరాబాద్

శనివారం । 22 । మార్చి । 2025



కామన్ మొబిలిటీ కార్డుపై..
ప్రజా రవాణా సదుపాయాల్లో వినియోగించు కొనేందుకు వీలుగా ప్రతిపాదించిన కామన్ మొబిలిటీ కార్డుల విషయంలో మరోసారి కదలిక వచ్చింది. -8లో



వాచ్ ఇట్.. వన్స్ మోర్..
నగరంలోని ప్రసాడ్స్ మల్టీప్లెక్స్ వేదికగా రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పలు చిత్రాలు అలరిస్తు న్నాయి. ఈ ఫిల్మ్ ఫెస్ట్ ఈ నెల 23 వరకు కొన సాగనుంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
37.0/23.0

వాతావరణం
నగరంలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 37, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.





తొలిరోజు 99%

ప్రశాంతంగా ప్రారంభమైన 'పది' పరీక్షలు

పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తల్లిదండ్రులు తోడు రాగా.. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ధైర్యంగా కదిలారు. పరీక్ష కేంద్రాల సమీపంలో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల ఫొటోలతో ఆల్‌ది బెస్ట్ అంటూ ముద్రించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో వారిలో ఉత్సాహం పెల్లుబికింది. తొలిరోజు 99 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. నగరంలోని విజయనగర్ కాలనీలోని సెయింటాన్స్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కవాడిగూడ ప్రభుత్వ బాలుర పాఠశాలలో అపశ్రుతి చోటుచేసుకుంది. కేంద్రంలోకి వెళ్తూ ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తు గాయపడి ఆస్పత్రిలో చేరింది. హైదరాబాద్ 99.05, రంగారెడ్డి 99.01, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో 99.72 శాతం చొప్పున విద్యార్థుల హాజరు నమోదైంది. - సాక్షి, సిటీబ్యూరో/విజయనగర్ కాలనీ



సెయింటాన్స్ స్కూల్ పరీక్ష కేంద్రంలో కలెక్టర్ అనుదీప్

సికింద్రాబాద్‌లోని కీస్ హైస్కూల్ వద్ద విద్యార్థుల సందడి

కూకట్‌పల్లిలో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థిని



జగద్గిరి గుట్ట పాఠశాలలో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు





ఐపీఎల్ మ్యాచ్‌లకు భారీ బందోబస్తు

రాచకొండ సీపీ సుధీర్ బాబు



ఉప్పల్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న సీపీ సుధీర్ బాబు తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్‌లో జరగనున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు సుమారు 2,700 మంది పోలీసులతో భారీ బందోబస్తు చేపట్టనున్నట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. ఈ నెల 22 నుంచి 18వ ఎడిషన్ టాటా ఐపీఎల్–2025 క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో పలు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాచకొండ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రాచకొండ సీపీ సుధీర్ బాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. లాఅండ్‌ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులతో పాటు షీ టీమ్స్, ఎస్‌బీ, సీసీఎస్, ఎస్‌ఓటీ, ఆక్టోపస్, ఏఆర్ వంటి అన్ని విభాగాల పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు. గేట్ నెంబర్–1 నుంచి ఆటగాళ్లు, వీవీఐపీలకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. ఉప్పల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లకు ఉప్పల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఆంక్షలు అమలులో ఉంటాయని, ఈమేరకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని కమిషనర్ సూచించారు. స్టేడియం చుట్టూ 450 సీసీటీవీ కెమెరాలతో నిఘా పెట్టనున్నామని చెప్పారు. ఆయా కెమెరాలను జాయింట్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించినట్లు ఆయన తెలిపారు.

నిమ్స్‌లో మరో కొత్త యూనిట్

పీడియాట్రిక్ న్యూరాలజీ, ఎపిలెప్సీ విభాగం ప్రారంభం



లక్డీకాపూల్: అంతర్జాతీయ వైద్య ప్రమాణాలతో కూడిన నిమ్స్ మరో సరికొత్త వైద్య విభాగాన్ని సమకూర్చుకుంది. మూర్ఛ వ్యాధికి గట్టి భరోసా కల్పించే దిశగా నిమ్స్ అధునాతన పీడియాట్రిక్ న్యూరాలజీ, ఎపిలెప్సీ మానిటరింగ్ విభాగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. మొయినాబాద్ రోటరీ క్లబ్, ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థల సహకారంలో నిమ్స్‌లోని మిలీనియం బ్లాక్‌లో ఈ యూనిట్‌ని ఏర్పాటు చేసింది. న్యూరాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సూర్యప్రభ ఆధ్వర్యంలో మరింత మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి. మూర్ఛ వ్యాధులకు సంబంధించి ఖరీదైన చికిత్సలను ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్‌ల ద్వారా ఉచితంగా అందనున్నాయని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప తెలిపారు. శుక్రవారం ఈ విభాగాన్ని ప్రీమియర్ ఎనర్జీస్ చైర్మన్ సురేంద్ర పాల్‌సింగ్, రోటరీ జిల్లా గవర్నర్ శరత్ చౌధురి, రోటరీ గవర్నర్ డాక్టర్ ఎస్. రాంప్రసాద్‌లతో కలిసి రోటరీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రతినిధి డేనియల్ హిమెల్స్‌పాచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ గవర్నర్ నామినీ ఏకేఎస్ ఉదయ్ పిలాని, నిమ్స్ కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ మాలెంపాటి అమరేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.



- ఆబ్లిక్ ఇమేజెస్‌తో త్వరలో అమలు
- నిధుల దుబారాకు చెక్
- అవినీతి పనులకు అడ్డుకట్ట
- అధునాతన సాంకేతికతతో జీహెచ్‌ఎంసీ మరో అడుగు

ప్రతి రోడ్డుకూ ఐడీ!

రహదారుల చరిత్ర సమస్తం నిక్షిప్తం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో 9,013 కిలోమీటర్లకు పైగా రోడ్లున్నాయి. వీటిలో 744 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్వహణను ఐదేళ్ల పాటు ప్రైవేటు ఏజెన్సీలకిచ్చిన గడువు ముగిసిపోయింది. అవి కాక మిగతా రోడ్లను జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగమే నిర్వహిస్తోంది. వాటిలో ఏ రోడ్డును ఎప్పుడు వేశారో.. పైన ఎన్ని పొరలుగా బీటీలు వేశారో తెలియదు. ఎన్ని పర్యాయాలు పాట్‌హోల్స్ పూడ్చివేత పేరిట జీహెచ్‌ఎంసీ ఖజానాకు చిల్లులు పెట్టారో తెలియదు. ఏ రోడ్డు అంటే లిబర్టీ నుంచి హిమాయత్ నగర్ వై జంక్షన్ వరకు అనో, ఖాజామియా హోటల్‌నుంచి మసీదు వరకు అని మాత్రమే రోడ్లను గుర్తిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ పరిస్థితి మారనుంది. ప్రతి రోడ్డుకూ ఒక ఐడీ నెంబర్ రానుంది. అంతే కాదు.. ఇకపై ఆ రోడ్డు పేరిట జరిగే పనులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు కానున్నాయి. ఆ ఐడీ నెంబర్‌ను ఎంటర్ చేస్తే దాని చరిత్ర మొత్తం తెలుస్తుంది. బీటీనా.. సీసీనా.. ఎంత మందంతో వేశారు.. తొలుత ఎంత వ్యయమైంది.. ఎప్పుడు రిపేర్లు చేశారు.. ఎన్ని సార్లు చేశారు. వాటికైన ఖర్చెంత? ఇలా సదరు రోడ్డు చరిత్ర మొత్తం తెలిసే సదుపాయం అందుబాటులోకి రానుంది. ప్రతీదీ పారదర్శకంగా ఉండాలని భావిస్తున్న ప్రభుత్వ ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ ఇందుకు సిద్ధమవుతోంది.

'ఆబ్లిక్'తో నిధుల దుబారాకు చెక్

జీహెచ్‌ఎంసీలో రోడ్ల పేరిట ఏటా వందల కోట్లు ఖర్చవుతున్నాయి. బిల్లుల చెల్లింపుల కోసం పదే పదే ఆందోళనలు చేస్తున్న కాంట్రాక్టర్ల తీరుతో విసుగొచ్చిన కమిషనర్ ఇలంబర్తి .. అసలు వారు చేసిన పనుల్లో నాణ్యత తెలుసుకునేందుకు విజిలెన్స్ విచారణ జరిపిస్తే లోపాలు వెల్లడయ్యాయి. ఔట్ సోర్సింగ్‌పై పని చేస్తున్న ఇంజినీర్ల నుంచి మొదలు పైఅధికారుల దాకా ఎవరికి అందిన కాడికి వారు జేబులు నింపుకోవడం గుర్తించారు. భవిష్యత్‌లో ఇలాంటి పనులకు, నిధుల దుబారాకు అడ్డుకట్ట వేసేందుకు అధునాతన సాంకేతికత వినియోగించుకోనున్నారు. అందుకుగాను ఆబ్లిక్ కెమెరాలను వినియోగించనున్నారు.

ఆబ్లిక్ కెమెరాలు ఎలా పని చేస్తాయంటే..?

సాధారణ శాటిలైట్ చిత్రాల్లో రోడ్డుపై ఉన్నవే కనిపిస్తాయి. ఆబ్లిక్ చిత్రాల్లో రోడ్డు దిగువన ఏముందో కూడా తెలుస్తుంది. ఆబ్లిక్ కెమెరాలు నేరుగా కాకుండా వివిధ ప్రాంతాల నుంచి ఏటవాలు కోణాల్లోంచి (దాదాపు 40–45 డిగ్రీల) కోణంలో ఫొటోలు తీస్తాయి. దాంతో రోడ్లు ఎన్ని పొరలుగా, ఎంత పైకి పెరిగాయో తెలుసుకునే వీలుంటుంది. మొత్తం ఎన్ని పొరలు వేశారో తెలుస్తుంది. ఆ కెమెరాల్లో రెండు లేదా అంతకంటే ఎక్కువ లెన్సులుంటాయి. అవి ఒకే కెమెరాలో అయినా ఉండవచ్చు. లేదా రెండు మూడు కెమెరాలనైనా వినియోగిస్తారు. అలాంటప్పుడు అన్ని కెమెరాల షటర్లు ఏకకాలంలో పని చేసేలా అనుసంధానత ఉంటుంది. వివిధ ప్రాంతాల నుంచి ఏటవాలుగా తీసే చిత్రాలతో భూమిలోతున ఎంత అడుగు వరకు రోడ్డేశారన్నది తెలుస్తుందని ఇంజినీర్లు తెలిపారు. ఏరియల్ ఇమేజెస్‌లో ఆ వివరాలు తెలియవు.

ఆధునిక సాంకేతికత

ఇప్పటికే వివిధ అంశాల్లో ఆధునికతను అందిపుచ్చుకొని పని చేస్తున్న జీహెచ్‌ఎంసీ.. ఇటీవలి కాలంలోనే ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ నుంచి మొదలు పెడితే ఆన్‌లైన్‌లోనే ప్రకటనల పన్నుల చెల్లింపులు,బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి ఈ–చలాన్లు జారీ దాకా వివిధ పనులను స్మార్ట్‌గా చేస్తుండటం తెలిసిందే. ఆబ్లిక్ కెమెరాల వినియోగంతో ఇంజినీరింగ్ విభాగంలోనూ ఆ దిశగా పయనించనుంది. తద్వారా నిధుల దుబారా తగ్గనుంది.

ప్రయోజనాలివీ..

వరదలు వంటివి వచ్చినప్పుడు రోడ్లు ఎంత మేర దెబ్బ తిన్నది.. ఏర్పడ్డ పగుళ్లు, పాట్‌హోల్స్ వంటివి స్పష్టంగా తెలుస్తాయి. నిర్మాణపరంగా లోపాలున్నా వెల్లడవుతాయి. దాంతో అడ్డగోలుగా మరమ్మతుల వ్యయం పెంచకుండా ఉండటమే కాక జరిగిన పనుల నాణ్యత సైతం తెలుస్తుంది.

మట్కాతో మస్కా!

ఆన్‌లైన్‌లో నకిలీ బెట్టింగ్ వెబ్‌సైట్ సృష్టి



పోలీసులకు పట్టుబడిన నిందితులు

- పెట్టుబడులతో లాభాలు అంటూ వీడియోలు
- వ్యవస్థీకృతంగా నడుపుతున్న ఐదుగురు వ్యక్తులు
- వీరికి చెక్ పెట్టిన మధ్య మండల టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: ముంబై కేంద్రంగా దేశంలోని అనేక ప్రాంతాల్లో సాగే సింగిల్ నంబర్ లాటరీలు సట్టా, మట్కా పేర్లతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి.. డమ్మీ వీడియోలు పోస్టు చేసి.. అమాయకుల్ని నిలువునా ముంచుతున్న ముఠాకు మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ పెట్టారు. ఐదుగురు నిందితులను పట్టుకుని, వారి నుంచి నగదుతో పాటు ఈ బెట్టింగ్ నిర్వహణకు ఉపకరించే సామగ్రి సైతం స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వెల్లడించారు.

నిర్వహణ విధానం తెలుసుకుని..
కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన ఎస్.శ్రీకాంత్, జి.హరీష్, జి.సతీష్‌కుమార్, ఎస్.తిరుపతి, ఎ.వినోద్ స్నేహితులు. ఇంటర్మీడియట్ వరకు చదివిన వీళ్లు తమ స్వస్థలంలో కార్పెంటర్లుగా కొన్నాళ్లు పని చేశారు. వీరికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో సట్టా, మట్కా ఆడే అలవాటు ఉంది. ఏళ్లుగా పందేలు కాస్తున్న వీరు.. ఆయా బెట్టింగుల నిర్వహణ విధానం తెలుసుకున్నారు. దేశ వ్యాప్తంగా అనేక మంది వీటి ద్వారా పందేలు కాస్తుండటంతో వారి బలహీనతల్ని క్యాష్ చేసుకోవాలని పథకం వేశారు. వివిధ పేర్లతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి, వాటి ద్వారా అసలు మట్కా, సట్టా పేర్లతో పలువురిని ఆకర్షించాలని నిర్ణయించుకున్నారు.

నెలకు రూ.25 వేల అద్దె ఇల్లు..
దీనికోసం ఈ ఐదుగురూ మూడు నెలల క్రితం హైదరాబాద్ చేసుకున్నారు. మధురానగర్ ప్రాంతంలో నెలకు రూ.25 వేల అద్దెకు ఓ ఇంటిని తీసుకున్నారు. అందులో మ్యాక్‌బుక్, ట్యాప్, రెండు ప్రింటర్లు తదితరాలు సిద్ధం చేసుకున్నారు. తమ స్వస్థలంలో ఉన్న చుట్టుపక్కల పేదలు, డబ్బు అవసరమైన వారిని ఆకర్షించారు. వారికి ఎంతో కొంత ముట్టచెబుతూ వారి పేర్లతో సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు తీసుకున్నారు. వీటి ఆధారంగా నెట్‌బ్యాంకింగ్, యూపీఐ ఖాతాలు యాక్టివేట్ చేసుకున్నారు. ఆపై శ్రీదేవి, కళ్యాణ్, మిలన్, థాయ్ లాటరీల పేర్లతో నకిలీ వెబ్‌సైట్ తెరిచారు. బోగస్ వ్యక్తులతో తాము వాటిలో పెట్టుబడి పెట్టి భారీ లాభాలు పొందామంటూ వీడియోలు చేయించారు.

ప్రత్యేకంగా యూట్యూబ్ చానల్...
ఈ వీడియోలను ప్రచారం చేయడానికి ప్రత్యేకంగా త్రికాల్ మట్కా పేరుతో యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేశారు. అందులోని వీడియోలను చూసిన వాళ్లు సంప్రదించడం కోసం ఫోన్ నెంబర్లూ పొందుపరిచారు. ఇలా తమకు సంప్రదిస్తున్న వారిని బుట్టలో వేసుకుంటున్న ఈ ముఠా తొలుత రిజిస్ట్రేషన్ ఫీజు పేరుతో రూ.1000 చొప్పున తీసుకుంటోంది. ఆపై వారికి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తోంది. వీటి ద్వారా లాగిన్ అయిన వాళ్లు తొలుత చిన్నమొత్తాలు వెచ్చిస్తున్నారు. అప్పుడు వారికి లాభాలు వచ్చినా.. పెద్ద మొత్తాలు పెట్టిన తర్వాత నష్టపోయేలా ఆ వెబ్‌సైట్‌లో ప్రోగ్రామింగ్ చేశారు. చిన్న లాభాలు పొందిన వారికీ ఆ మొత్తాలు తిరిగి ఇవ్వకుండా నిండా ముంచుతున్నారు.

దాడి చేసి పట్టుకున్న టాస్క్‌ఫోర్స్...

ఈ ఐదుగురు నిందితులు కొన్నాళ్లుగా ఈ దందా సాగిస్తున్నారు. వీరి వ్యవహారాలపై మధ్య మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. శుక్రవారం మధురానగర్‌లోని వీరి ఇంటిపై దాడి చేసిన అధికారులు ఐదుగురినీ పట్టుకున్నారు. ఆ ఇంటి నుంచి మాక్ బుక్, ట్యాబ్, రెండు కలర్ ప్రింటర్లు, సట్టా, మట్కాకు సంబంధించిన కరపత్రాలు, బెట్టింగ్ చార్ట్స్, సెల్‌ఫోన్లు, రూ.1.55 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను మధురానగర్ పోలీసులకు అప్పగించారు. ఓవక్క సోషల్‌మీడియాలో 'హ్యాష్ ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్' ప్రచారం జోరుగా సాగుతుండటం... నగరంలో ఈ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్లపై కేసులు నమోదవుతున్న తరుణంలో ఈ నకిలీగాళ్లు చిక్కడం గమనార్హం.

రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తాం

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

- ఉప్పల్ స్టేడియంలో రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ



ఉప్పల్ స్టేడియంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు తదితరులు

ఉప్పల్: 'రానున్న రోజుల్లో రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీ తీసుకు వస్తాం. క్రికెట్‌తో పాటు అన్ని క్రీడలనూ పెద్ద ఎత్తున అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని చేపడతాం. ఫ్యూచర్ సిటీలో భాగంగా మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మిస్తాం' అని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. శుక్రవారం ఉప్పల్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఆవరణలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఆనాడు యువతకు స్ఫూర్తినిచ్చేలా 18 ఏళ్ల వయసుకే ఓటు హక్కుకు చట్టబద్ధత కల్పించిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. కంప్యూటర్ యుగానికి తెరతీసిన గొప్ప వ్యక్తి అని ప్రశంసించారు. ప్రపంచ స్థాయిలో పతకాలు సాధించే విధంగా క్రీడాకారులను తయారు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సిరాజ్, తిలక్ లాంటి వారిని అంతర్జాతీయ స్థాయికి పంపించినట్లు ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు జిల్లాలు, గ్రామీణ స్థాయిలోనూ క్రీడలను అభివృద్ధి చేయనున్నామన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ఉప్పల్ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించామని.. ప్రస్తుతం ఫ్యూచర్ సిటీలో భాగంగా మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మిస్తామని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వి.హన్మంతరావు, తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి విశ్వనాథ్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనా రెడ్డి, హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి, కార్యదర్శి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదికే నూరేళ్లు నిండాయి

చిన్నారిని చిదిమేసిన ఆటో ట్రాలీ



విగతజీవిగా కీర్తి

శంషాబాద్ రూరల్: అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న ఒక్కగానొక్క కూతురును ఆటోట్రాలీ రూపంలో మృత్యువు కబళించడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఏడాది వయసుకే బిడ్డకు నూరేళ్లు నిండటంతో గుండెలవిసేలా విలపిస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా కారణంగా ఆటోట్రాలీ చక్రాల కింద నలిగి ఓ చిన్నారి అసువులు బాసిన విషాదకర ఘటన శుక్రవారం మున్సిపల్ పరిధిలోని రాళ్లగూడ దొడ్డి ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా మరికెల్‌కు చెందిన కంకం శివశంకర్, రేణుక దంపతులు తమ ఏడాది వయసు కూతురు కీర్తిని అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు. ఈ క్రమంలో బతుకుదెరువు నిమిత్తం వీరు రాళ్లగూడకు వచ్చి కూలి పనులు చేసుకుంటూ నివసిస్తున్నారు. ఇందిరానగర్‌లో ఓ ఇంటి నిర్మాణ పనుల కోసం శుక్రవారం దంపతులిద్దరూ కలిసి వెళ్లారు. తమ కూతురు కీర్తిని చూసుకోవడానికి ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో వెంట తీసుకెళ్లారు. దంపతులిద్దరూ ఇంటి నిర్మాణ పనుల్లో నిమగ్నమవగా.. కీర్తి ఇంటి ముందు ఆడుకుంటోంది. ఇదే సమయంలో అక్కడికి సిమెంట్ లోడ్‌తో వచ్చిన ఆటో ట్రాలీ చిన్నారిపై నుంచి దూసుకెళ్లింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలకు గురైన కీర్తి అక్కడికక్కడే మృతి చెందింది. కూతురు మృతితో శివశంకర్, రేణుక దంపతులు రోదనలు మిన్నంటాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మన అవసరాల కోసం చెట్లను కొట్టేయడం తగదు

మంత్రి కొండా సురేఖ

బంజారాహిల్స్: నగరాల్లో, ముఖ్యంగా గేటెడ్ కమ్యూనిటీల్లో పచ్చదనం అన్నదే కనిపించకుండా పోతోందని, మన అవసరాల కోసం చెట్లను కొట్టివేయడం తగదని మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో ప్రపంచ అటవీ దినోత్సవాల్లో మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్కోవాతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. కొన్ని చోట్ల ఎక్కడా చూసినా కనీసం తులసి మొక్క కూడా కనిపించడం లేదన్నారు. రాబోయే వర్షాకాలంలో తెలంగాణ వ్యాప్తంగా భారీ ఎత్తున వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా మిస్ వరల్డ్ క్రిస్టినాను ఈ కార్యక్రమానికి ఆహ్వానించామని తెలిపారు. వాతావరణ సమతుల్యతలో అడవులు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. తనకు బొకేలు, శాలువాలు కప్పేందుకు రావొద్దని వాటికి పెట్టే ఖర్చును పేదవారి కోసం ఖర్చు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంక వర్గీస్, అడిషనల్ పీసీసీఎఫ్ అడ్మిన్ సునీతా భగవత్, పీసీసీఎఫ్ కంపా సువర్ణ, అడిషినల్ పీసీసీఎఫ్ రత్నాకర్ జోహార్, సీసీఎఫ్ ప్రొడక్షన్ రామలింగం, హైదరాబాద్ డీఎఫ్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.



ప్రపంచ సుందరి క్రిస్టినా పిస్కోవాను సత్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

బొటానికల్ గార్డెన్‌లో విద్యార్థుల సందడి



ఫొటోగ్రఫీ పోటీలలో సందడి చేసిన విద్యార్థులు



రాయదుర్గం: బొటానికల్ గార్డెన్‌లో విద్యార్థులు సందడి చేశారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డెక్కన్‌వుడ్స్, ట్రయల్స్ పేరిట అనేక ఎకో టూరిజమ్ కార్యక్రమాలను చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం అంతర్జాతీయ అడవుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వన్యప్రాణుల, ప్రకృతి దృశ్యంపై ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 28 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొని అనేక రకాల పక్షులు, సుందరమైన ప్రకృతి దృశ్యాలను కెమెరాలలో బంధించారు. విద్యార్థులను పులి, నెమలి, గద్ద పేరిట మూడు గ్రూపులుగా విభజించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, ఇతర అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

నటరాజ రామకృష్ణ సేవలు అజరామరం

గన్‌ఫౌండ్రీ: పేరిణి నృత్య వికాసం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి పద్మశ్రీ నటరాజ రామకృష్ణ అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతి తెలంగాణ సంగీత నాటక అకాడమి ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహిత నటరాజ రామకృష్ణ 102వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తారామతి బారాదరిని నటరాజ రామకృష్ణ ఆలోచనలతోనే అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. నేటి యువతరానికి ఆయన చేసిన సేవలను తెలియజేయాల్సిన అవసరం ఎంగానో ఉందన్నారు. ప్రముఖ నృత్యకారిణి అలేఖ్య పుంజాల, డాక్టర్ జొన్నలగడ్డ అనురాధ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కామన్ మొబిలిటీ కార్డుపై

మరో ముందడుగు



మెట్రో, ఆర్టీసీ బస్సుల్లో వినియోగానికి అవకాశం

- ఆర్టీసీలో ఐటిమ్స్ ప్రవేశంతో మరోసారి సన్నాహాలు
- హుమ్టా ఆధ్వర్యంలో ప్రణాళికలు
- దశలవారీగా అన్ని ప్రజారవాణా వ్యవస్థలకు విస్తరించాలని ప్రతిపాదన

సాక్షి, సిటీబ్యూరో: అన్ని రకాల ప్రజా రవాణా సదుపాయాల్లో వినియోగించుకొనేందుకు వీలుగా ప్రతిపాదించిన కామన్ మొబిలిటీ కార్డు ప్రతిపాదనల్లో మరోసారి కదలిక వచ్చింది. ప్రయాణికులు ఒకే కార్డుపైన వివిధ రకాల ప్రయాణ సదుపాయాలను వినియోగించుకునే విధంగా కామన్ మొబిలిటీ కార్డును ప్రవేశపెట్టేందుకు గతంలో ప్రణాళికలను రూపొందించారు. కానీ టిక్కెట్ చార్జీల్లో వ్యత్యాసం, యూపీఐ చెల్లింపులకు ఉన్న ఇబ్బందుల దృష్ట్యా ఈ ప్రతిపాదనలు అనేకసార్లు వాయిదాపడ్డాయి. మరోవైపు దేశవ్యాప్తంగా వినియోగించుకునేందుకు అవసరమైన నేషనల్ కామన్ మొబిలిటీ కార్డు అంశం కూడా అప్పట్లో ప్రస్తావనకు వచ్చింది. కానీ ముందడుగు పడలేదు. ఇలా వివిధ రకాలుగా ప్రతిపాదనలు ఉన్నప్పటికీ అమల్లోకి రాకపోవడానికి ప్రధాన కారణం ..యూపీఐ చెల్లింపులు, చార్జీల్లో వ్యత్యాసాలు వంటి అంశాలే కీలకమయ్యాయి. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని సిటీ బస్సుల్లో డిజిటల్ చెల్లింపులకు అవకాశం కల్పిస్తూ ఆర్టీసీ కొత్తగా ఐటిమ్స్‌ను ప్రవేశపెట్టింది. హైదరాబాద్ మెట్రో రైల్‌లో డిజిటల్ చెల్లింపులకు ఇప్పటికే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఈ రెండు సంస్థల మధ్య సమన్వయం ఏర్పాటు చేసేవిధంగా కామన్ మొబిలిటీ సదుపాయాన్ని అందుబాటులోకి తేవాలని హెచ్‌ఎండీఏ అనుబంధ సంస్థ హైదరాబాద్ యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(హుమ్టా) సన్నాహాలు చేపట్టింది. దశలవారీగా మిగతా రవాణా వ్యవస్థలను కూడా భాగస్వాములను చేయాలని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఐటిమ్స్‌తో 'చిల్లర'కు పరిష్కారం...

సిటీ బస్సుల్లో కొత్తగా ఐటిమ్స్‌ను ప్రవేశపెట్టారు. సుమారు 6500 ఐటిమ్స్‌ను వినియోగంలోకి తెచ్చారు. దీంతో ప్రయాణికులు అన్ని రకాల డిజిటల్ మొబైల్ యాప్‌ల ద్వారా టిక్కెట్ చార్జీలను చెల్లించే సదుపాయం లభించింది. దీంతో ఆర్టీసీలో చిల్లర సమస్యకు కూడా పరిష్కారం లభించింది. సాధారణ టిక్కెట్‌లకు ప్రయాణికులు సరిపడా చిల్లర చెల్లించకపోవడం వల్ల కండక్టర్‌లకు, ప్రయాణికులకు మధ్య తరచుగా ఘర్షణలు జరిగేవి. ఇప్పుడు ప్రయాణికులు గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యాప్‌ల ద్వారా టిక్కెట్ తీసుకోవచ్చు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రతి రోజు సుమారు 2800 బస్సులు తిరుగుతున్నాయి. రోజుకు సుమారు 20 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని బస్సుల్లో ఐటిమ్స్ వినియోగం పెరిగిందని, నగదు చెల్లింపుల వల్ల తలెత్తే చిల్లర సమస్యకు పరిష్కారం లభించిందని ఆర్టీసీ అధికారి ఒకరు తెలిపారు. మరోవైపు డిజిటల్ పద్ధతిలో చెల్లించలేని వారి కోసం సాధారణ టిక్కెట్ పద్ధతులు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కామన్ మొబిలిటీ కార్డు అంశంపైన కూడా చర్చ జరుగుతున్నట్లు చెప్పారు. నగరంలోని వివిధ మార్గాల్లో నడిచే మెట్రో రైళ్లకు అనుగుణంగా ఫీడర్ రూట్‌లలో నడిచే బస్సుల్లో ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.

లాస్ట్‌మైల్ కనెక్టివిటీ ఉంటే మేలే...

నగరంలోని నాగోల్-రాయదుర్గం, ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్ మధ్య ప్రస్తుతం ప్రతి రోజు 57 మెట్రోరైళ్లు సుమారు వెయ్యికిపైగా ట్రిప్పుల్లో ప్రయాణికులకు సదుపాయాన్ని అందజేస్తున్నాయి. 5 లక్షల మందికి పైగా మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు.ఫస్ట్‌మైల్, లాస్ట్‌మైల్ కనెక్టివిటీ కోసం క్యాబ్‌లు, ఆటోలు, బైక్‌ట్యాక్సీలు వంటివి వినియోగిస్తున్నారు.ఇటీవల రాపిడో సంస్థ లాస్ట్ మైల్ కనెక్టివిటీలో భాగంగా మెట్రో టిక్కెట్ బుకింగ్ సదుపాయాన్ని కూడా ప్రవేశపెట్టింది.కామన్ మొబిలిటీ కార్డు అందుబాటులోకి వస్తే లాస్ట్‌మైల్ కనెక్టివిటీ ఉన్న మార్గాల్లో సిటీ బస్సుల్లో వినియోగించుకొనేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఈ అంశం పై అన్ని సమగ్రమైన చర్చలు జరుగుతున్నాయని, వివిధ ప్రజా రవాణా సంస్థల మధ్య సమన్వయం కోసం ప్రయత్నిస్తున్నామని హుమ్టా అధికారి ఒకరు చెప్పారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు రాబిన్ డేవిడ్ తయారు చేసిన శిల్పాల ఎగ్జిబిషన్ ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ఉగాది, రంజాన్ ఉత్సవాలు ఉదయం 11.30 గంటల నుంచి రాత్రి 9.30గంటల వరకు జరుగుతాయి. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తల ఉత్పత్తుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- హ్యాండ్‌లూమ్ ఇండియా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సిల్క్ మార్క్ ధ్రువీకృత ఉత్పత్తుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ సమ్మర్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లో రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్-2025 భాగంగా ప్రదర్శనలు, స్క్రీనింగ్ ఈవెంట్స్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు జరుగుతాయి.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్‌పై పరిశోధనలు జరగాలి

సాక్షి, హైదరాబాద్: కూరగాయలు, పండ్లు ఎక్కువ కాలం తాజాగా నిల్వ చేసేందుకు అవసరమైన బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్‌పై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మామిడి, జామ, పొప్పడి, బత్తాయి, దానిమ్మ పంటల్లో చీడపీడలను నిరోధించేందుకు పండ్ల కవర్లు వాడుతున్నారని అన్నారు. అయితే ఎక్కువ మొత్తంలో కాగితపు కవర్లను వాడడం వల్ల నష్టాలు కూడా ఎదురవుతున్న నేపథ్యంలో బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్ వాడకంతో లాభాలు ఇంకా ఉంటాయని ఆయన అన్నారు. ప్రతి పంటకు ప్రత్యేకంగా అవసరమైన రంగులతో కూడిన ప్లాస్టిక్ మల్చు కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డీన్ డాక్టర్ రాజశేఖర్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, రాజేంద్రనగర్, మోజెర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్‌లు డాక్టర్ పోతరాజు ప్రశాంత్, డాక్టర్ పిడిగం సైదయ్య, ప్రొఫెసర్లు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో తూలి... లిఫ్ట్ గుంతలో పడి ఒకరి మృతి



మృతుడు వికాస్

బంజారాహిల్స్: మద్యం మత్తులో ప్రమాదవశాత్తూ రెండో అంతస్తు నుంచి జారిపడి లిఫ్ట్ గుంతలో పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..మహారాష్ట్ర నుంచి వికాస్ (25) అనే భవన నిర్మాణ కార్మికుడు బతుకుదెరువు నిమిత్తం గురువారం తన స్నేహితుడితో కలిసి హైదరాబాద్‌కు వచ్చాడు. పని నిమిత్తం బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని సాగర్ సొసైటీలో నిర్మాణంలో ఉన్న భవనానికి గురువారం రాత్రి చేరుకున్నారు. ఇరువురూ అదే ఇంట్లో మరో స్నేహితుడితో కలిసి రాత్రి మద్యం సేవించారు. అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం వికాస్ మెట్లు దిగే క్రమంలో తూలి, జారి రెండో అంతస్తు నుంచి లిఫ్ట్ కోసం తవ్విన గుంతలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ముగ్గురూ కలిసి రాత్రి మద్యం సేవించారని, ఈ నేపథ్యంలోనే వికాస్ కిందికి దిగే క్రమంలో జారిపడ్డారని పోలీసుల దర్యాప్తులో తేలింది. బంజారాహిల్స్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పసికందుకు నిప్పంటించిన ఘటనలో ఒకరి అరెస్టు

జువైనల్ హోంకు తరలింపు

కవాడిగూడ: ఎన్టీఆర్ స్టేడియంలో ఇటీవల అప్పుడే పుట్టిన పసికందుకు నిప్పుపెట్టి హత్యచేసిన కేసులో ఓ బాలుడిని దోమలగూడ పోలీసులు అరెస్టు చేసి జువైనల్ హోంకు తరలించినట్లు దోమలగూడ సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయగా.. మైనర్ బాలికకు మాయమాటలు చెప్పిన ఓ బాలుడు (17) ఆమెను గర్భవతిని చేయడమే కాకుండా..పసికందును అంతమొందించాడని తేలిందని పేర్కొన్నారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించి సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించినట్లు సీఐ తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలుడిని అదుపులోకి తీసుకొని, అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి గురువారం అర్ధరాత్రి మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించినట్లు సీఐ తెలిపారు.

అడవుల పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

అబిడ్స్: అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా నాంపల్లిలో అడవుల పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్, వికాస్ భారతి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అడవుల సంరక్షణపై ప్రజల్లో చైతన్యం కలిగించేలా ప్రసంగించారు. భవిష్యత్తు కోసం అడవులను కాపాడుకోవడం అవసరమని, అడవులు లేకపోతే మన జీవన విధానం ప్రాణాపాయ స్థితిలో పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ అడవుల సంరక్షణ పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. జాతీయ పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి మండలి సలహాదారు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పండ్లు, కాయలు, విత్తనాలు, అటవీ జంతువులతో సహా ఆహార భద్రతను అందించడంలో అడవులు కీలక పాత్ర వహిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ, వికాస్ భారతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కె.రామ్‌గోపాల్ రెడ్డి, ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఊహ మల్పూరు, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ కార్యదర్శి హిట్లా ఉదయశ్రీ, కో ఆర్డినేటర్ జి.నవీన్‌కుమార్ తదితరులు ల్గొన్నారు.

ట్రేడింగ్ పేరిట రూ.24 లక్షలు స్వాహా

ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో కాజేసిన సైబర్ నేరగాళ్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ వ్యాపారికి వాట్సాప్ ద్వారా వల వేసిన సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్‌లో ఇన్వెస్టిమెంట్ అని ఎర వేశారు. చిన్న మొత్తానికి భారీ లాభం ఇచ్చి... పెద్ద మొత్తం స్వాహా చేశారు. వర్చువల్ ఖాతాలో రూ.97.47 లక్షలు బ్యాలెన్స్ చూపిస్తూ రూ.24.84 లక్షలకు టోకరా వేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన వ్యాపారికి రెండు వారాల క్రితం వాట్సాప్ ద్వారా ఓ సందేశం వచ్చింది. దాని ద్వారా మిరేర్ అసెట్ సంస్థ మేనేజర్‌గా పరిచయం చేసుకున్న షీ ఖాన్ అనే వ్యక్తి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరాడు. తొలుత బాధితుడు ఆసక్తి చూపకపోయినా... వాళ్లు పదేపదే వెంటపడటంతో ముందుకు వచ్చారు. వాట్సాప్ గ్రూపులో వచ్చిన లింకు ఆధారంగా ఓ వర్చువల్ ఖాతాను యాక్టివేట్ చేసుకున్నారు. దాని ద్వారా తొలుత రూ.5 వేలు పెట్టుబడి పెట్టగా... రూ.15 వేల లాభంతో కలిపి రూ.20 వేలు డ్రా చేసుకునే అవకాశం ఇచ్చారు. ఆపై బాధితుడు పెద్ద మొత్తం పెట్టుబడి పెట్టడం మొదలెట్టారు. ప్రతి సందర్భంలోనూ వర్చువల్ అకౌంట్‌లో లాభాలు చూపించిన నిర్వాహకులు డ్రా చేసుకునే అవకాశం ఇవ్వలేదు. ఇలా ఆయన వర్చువల్ ఖాతాలో రూ.97,47,079 బ్యాలెన్స్ చూపించి.. రూ.24,84,511 కాజేశారు. ఆ డబ్బు విత్‌డ్రా చేసుకోవడానికి అనుమతి ఇవ్వని కేటుగాళ్లు మరింత మొత్తం పెట్టాలని సూచిస్తుండటంతో తాను మోసపోయినట్లు తెలుసుకున్నారు. దీనిపై సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

ప్రజలకు ఉపయోగపడే పరిశోధనలు జరగాలి

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ జగదీశ్వర్‌రావు



అతిథులను సన్మానిస్తున్న చక్రపాణి

బంజారాహిల్స్: భారత్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత విద్యను అభ్యసించడం, నాణ్యమైన విద్య పొందడం చాలా కష్టతరంగా మారిందని, పేదలకు తక్కువ ఖర్చుతో ఉన్నత విద్య, అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందించినప్పుడే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ బాగున్నట్లు అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ బి.జగదీశ్వర్ రావు అన్నారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'హద్దులు లేని సైన్స్: భవిష్యత్తు కోసం బహుళ విభాగ దృష్టి' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్‌ను శుక్రవారం జగదీశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అంతర్జాతీయ పరిశోధన సహకారాన్ని సులభతరం చేయడం ద్వారా, వివిధ శాస్త్రీయ రంగాలలో విద్యార్థులు, నిపుణుల మధ్య విద్య, శిక్షణను విస్తరించడం ద్వారా బహుళ ప్రయోజనం పొందొచ్చని అభిప్రాయపడ్డారు. పరిశోధనలు సామాన్య ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, అప్పుడే సైన్స్‌కు బహుళ ప్రజాదరణ దక్కుతుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బహుళ విభాగాల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తులకు అధిక డిమాండ్ ఉంటుందని, వివిధ రంగాలలో విమర్శనాత్మకంగా ఆలోచించే సామర్థ్యం, విభిన్న దృక్కోణాల నుండి సమస్యలను పరిష్కరించడం కీలకం అని ప్రొ. జగదీశ్వర్‌రావు వివరించారు. కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన మండలి- జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డా.ఆనంద్ కుమార్ పాండే మాట్లాడుతూ తీవ్రమైన వాతావరణ మార్పుల ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ముందుగా ప్రమాదాలను పసిగడుతున్నా, వాటి నిరోధానికి ఇంకా పరిశోధనలు జరగాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఘంటా చక్రపాణి మాట్లాడుతూ దేశంలోనే సైన్స్ విభాగంలో కోర్సులు అందించిన మొట్టమొదటి విశ్వవిద్యాలయం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అని చెప్పారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్, సదస్సు డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి సదస్సు నిర్వహణ ఆవశ్యకతను వివరించారు. రిజిస్ట్రార్ డా. విజయ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా బకాయి ఉన్న రూ.219 కోట్ల ట్రైకార్ రుణాలను మంజూరు చేయాలని గిరిజన సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. అలాగే ఇదే డిమాండ్‌పై ఏప్రిల్ 7న జరిగే సంక్షేమ భవన్ ముట్టడి కార్యక్రమానికి లబ్ధిదారులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చింది. రాజీవ్ యువ వికాసం పథకం పేరుతో ట్రైకార్ రుణాలు రద్దు చేసే కుట్ర అనే అంశంపై శుక్రవారం హిమాయత్‌నగర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ నేతలు ఆర్.అంజయ్య నాయక్, ఎం.ధర్మ నాయక్, అజ్మీర రాంమూర్తి నాయక్, ఆర్.శ్రీరామ్ నాయక్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలోని ట్రైకార్ సంస్థను నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకంలో విలీనం చేసిందని ఆరోపించారు. ట్రైకార్ సంస్థలో యూనిట్ విలువ రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉండగా, కొత్తగా తీసుకువచ్చిన ఈ పథకంలో రూ.4 లక్షల వరకే పరిమితి ఉందని ఆరోపించారు.

తాడి ప్రకాష్‌కు పతంజలి పురస్కారం



సాక్షి, సిటీబ్యూరో: పాత్రికేయుడు, రచయిత తాడి ప్రకాష్‌కు పతంజలి పురస్కారం దక్కింది. ప్రముఖ పాత్రికేయుడు, సినీ మాటల రచయిత కె.ఎన్.వై. పతంజలి 73వ జయంతి సందర్భంగా దీన్ని అందజేయనున్నట్లు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి శుక్రవారం ప్రకటించారు. గురజాడ అప్పారావు గృహంలో వేదిక ప్రతినిధులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం పతంజలి జయంతి సందర్భంగా ప్రముఖులకు పురస్కారం అందచేస్తున్నామని, పురస్కార కమిటీ 2025 సంవత్సరానికి ప్రకాష్ పేరును ఎంపిక చేసినట్లు తెలిపారు. మార్చి 29 సాయంత్రం విజయనగరంలోని గురజాడ గ్రంథాలయంలో పురస్కార ప్రదానం జరుగుతుందని తెలిపారు.

బాలికలను మోసగించిన ఇద్దరి అరెస్టు

అల్వాల్: ఇన్‌స్టాగామ్‌లో పరిచయమైన ఇద్దరు బాలికలను ప్రేమ పేరుతో బయటకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను అల్వాల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్ తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడకు చెందిన ఆకుల సాత్విక్ (26), ఈసీఐఎల్‌కు చెందిన కర్నాటి మోహన్‌చంద్ (28) ఇద్దరు స్నేహితులు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. అల్వాల్ మచ్చబొల్లారంకి చెందిన ఇద్దరు బాలికలు చదువు ఆపేసి ఇంట్లోనే ఉంటున్నారు. వారికి సాత్విక్, మోహన్‌చంద్‌లతో ఇన్‌స్టాగామ్‌లో గత 5 నెలల క్రితం పరిచయం ఏర్పడింది. వీరితో నిరంతరం చాటింగ్ చేస్తూ ప్రేమలోకి దింపారు. బుధవారం సదరు మైనర్ బాలికలు ఇంట్లో ఎవరికి చెప్పకుండా కాప్రా ఈసీఐఎల్‌కి వెళ్లారు. బాలికల తల్లిదండ్రులు అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా శుక్రవారం ఈసీఐఎల్‌లోని ఓయో రూమ్‌లో మైనర్లతో సాత్విక్, మోహన్‌చంద్‌లు పట్టుబడ్డారు. ఈ మేరకు మైనర్లను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి తల్లిదండ్రులకు అప్పగించగా, నిందితులను అరెస్ట్ చేసి వారిపై కిడ్నాప్, పోక్సో కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

వేడుకగా కుంకుమార్చన



బంజారాహిల్స్‌/హిమాయత్‌నగర్‌: తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మ ప్రచార పరిషత్‌ ఆధ్వర్యంలో ప్రతి నెలా మూడో శుక్రవారం జరిగే మహాలక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన కార్యక్రమం హిమాయత్‌నగర్‌ బాలాజీ భవన్‌ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారి సహస్రనామాలతో పూజా కార్యక్రమాలు జరిపారు. పెద్ద ఎత్తున మహిళలు హాజరై అమ్మవారి సేవలో పునీతులయ్యారు. కార్యక్రమంలో టీటీడీ ప్రాజెక్ట్‌ ఆఫీసర విజయలక్ష్మీ, ఏఈఓ చతుర్వేదన సత్యనారాయణ, ప్రోగ్రాం అసిస్టెంట్‌ గూడూరు హరినాథ్‌, పురాణ పండితులు చెంచులక్ష్మీ, దేవాలయ ఇన్‌స్పెక్టర్‌ ప్రభు, ధర్మ ప్రచార మండలి సభ్యులు నిషిత పాల్గొన్నారు.

జీటీఎస్‌ ఆలయ హుండీ లెక్కింపు



వెంగళరావునగర్‌: వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని జీటీఎస్‌ కాలనీలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీటీఎస్‌ దేవాలయం హుండీని శుక్రవారం లెక్కించారు. భక్తులు వేసిన ఆదాయం మొత్తం రూ. 2,29,364లు ఉన్నట్టు అధికారులు తెలియజేశారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ మధు, ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ గుమ్మడిదల సుధాకర్‌ పర్యవేక్షించారు. వెంగళరావునగర్‌ ప్రధాన రహదారిలో ఉన్న దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలోని శ్రీరామాంజనేయస్వామి దేవస్థానం హుండీని కూడా లెక్కించారు. ఈ హుండీ ఆదాయం రూ. 1,91,029 ఉన్నట్టు అధికారులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఈ రెండు దేవాలయాలను పర్యవేక్షించిన ఇన్‌స్పెక్టర్‌ మధు మాట్లాడుతూ... భక్తుల సమక్షంలోనే హుండీలను ఓపెన్‌ చేసి వారి ద్వారానే లెక్కిస్తారన్నారు. భక్తులు వేసే ప్రతి రూపాయినీ సద్వినియోగం చేస్తున్నట్టు చెప్పారు.

కుప్పకూలిన చెట్టు



ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ డివిజన్‌ ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్‌ కమ్యూనిటీ హాల్‌ ముందు శుక్రవారం మధ్యాహ్నం ఓ భారీ చెట్టు రోడ్డుకు అడ్డంగా కుప్పకూలింది. దీంతో స్థానికంగా రాకపోకలు స్తంభించిపోయాయి. సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్‌ వెల్దండ వెంకటేష్‌ జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్‌, విద్యుత్‌ శాఖ, యూబీడీ అధికారులకు సమాచారం ఇచ్చారు. డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కుప్పకూలిన చెట్టును తొలగించారు.

బోరబండ రిజర్వాయర్‌ను సందర్శించిన అధికారులు

రహమత్‌నగర్‌: జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ సభ్యుడు బాబా ఫసియుద్దీన్‌ జలమండలి సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్‌లతో కలిసి శుక్రవారం తెల్లవారు జామున బోరబండ రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈ వేసవిలోపే ఎస్పీఆర్‌ హిల్స్‌ 5ఎంఎల్‌ రిజర్వాయర్‌ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని బాబా ఫసియుద్దీన్‌ జలమండలి అధికారులను కోరారు. పవిత్ర రంజాన్‌ ఉపవాస దీక్షలు కొనసాగుతున్న దృష్ట్యా ఒక నిర్దిష్ట సమయంలో మంచినీటిని విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తన విజ్ఞప్తిపై స్పందించిన ఎండీ అశోక్‌రెడ్డి, సీజీఎం, జీఎంలను రిజర్వాయర్‌కు పంపిచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మేనేజర్‌లు రాజేందర్‌, జయప్రకాష్‌ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఫిలింనగర్‌: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఫిలింనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఫిలింనగర్‌ బీజేఆర్‌నగర్‌ రోడ్డు అంబేద్కర్‌నగర్‌ రోడ్డు నెంబర్‌–9లో నివసించే ఏటూరు భీమయ్య(40), సంతోషిలు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భీమయ్య పెయింటింగ్‌ పని చేస్తుండగా సంతోషి హౌస్‌ కీపింగ్‌ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గురువారం ఉదయం 9 గంటలకు సంతోషి విధులకు వెళ్లి రాత్రి 7.30 గంటలకు వచ్చింది. బెడ్‌రూమ్‌ తలుపులు గడియపెట్టి ఉండటంతో భర్త భీమయ్య నిద్ర పోతున్నాడేమోనని భావించింది. రాత్రి 9.45కు భర్తను లేపేందుకు డోర్‌ కొట్టగా ఎంతకీ తీయకపోవడంతో అనుమానం వచ్చింది. కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే స్థానికుల సాయంతో భీమయ్యను కిందకు దించగా అప్పటికే మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

'పది' పరీక్షలకు... 33 మంది గైర్హాజర్‌!

నిఘా నేత్రాల కింద తెరిచిన ప్రశ్న పత్రాలు

ఖైరతాబాద్‌లో ప్రశాంతంగా పరీక్షలు ◆ అడుగడుగునా తనిఖీలు



బంజారాహిల్స్‌లోని సాయిరాం స్కూల్‌ సెంటర్‌ వద్ద విద్యార్థులు

బంజారాహిల్స్‌: పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకే విద్యార్థులకు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 9 గంటలకు విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతించారు

- విద్యాశాఖ ఖైరతాబాద్‌ జోన్‌ కిందకు వచ్చే జూబ్లీహిల్స్‌, ఖైరతాబాద్‌ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 17 ప్రభుత్వ ఉన్నత, రెండు ఎయిడెడ్‌, ఎనిమిది మైనార్టీ, మూడు రెసిడెన్షియల్‌, 103 ప్రైవేట్‌ పాఠశాలల్లో కలిపి మొత్తం 7851 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా మొదటి రోజు శుక్రవారం 7818 మంది విద్యార్థులు హాజరయ్యారు.
- 33 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఈ రెండు నియోజకవర్గాల్లో కలిపి 35 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు వారి తల్లిదండ్రుల సందడి కనిపించింది.
- ఫ్లయింగ్‌ స్క్వాడ్‌, ఖైరతాబాద్‌ డిప్యూటీ రాజ్‌ శామ్యూల్‌ రాజు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇన్విజిలేటర్లు చిన్న తప్పుకు కూడా అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా ఈ పరీక్షలను నిర్వహించారు.
- ఇదిలా ఉండగా కస్టోడియన్ల పర్యవేక్షణలో పరీక్షా కేంద్రాల డిపార్ట్‌మెంటల్‌ అధికారులు పంజగుట్ట, బంజారాహిల్స్‌ ఠాణాల నుంచి ప్రశ్నాపత్రాలను ఉదయం ఆయా కేంద్రాలకు తరలించారు. నిఘా నేత్రాల కింద ప్రశ్న పత్రాల బండిళ్లను తెరిచారు.
- పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను తమ పరిధిల్లోని పోస్టాఫీసుల్లో పార్శిళ్ల ద్వారా కేటాయించిన కేంద్రాలకు పంపించారు.
- ఖైరతాబాద్‌ జోన్‌ పరిధిలో మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డిప్యూటీ డీఈవో శామ్యూల్‌ రాజు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు ముమ్మరం చేసినట్లు, చీటీలకు అవకాశం లేకుండా ముందే క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



గతి ప్రభుత్వ పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ డిప్యూటీ డీఈవో శ్యామూల్‌రాజు

జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం పరిధిలో...

వెంగళరావునగర్‌: పదో తరగతి పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం పరిధిలోని రహమత్‌నగర్‌, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్‌, యూసుఫ్‌గూడ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల్లో టెన్త్‌ పరీక్షలను విద్యార్థులు రాశారు. రహమత్‌నగర్‌, శాంతి విద్యానికేతన్‌, న్యూటన్‌ హైస్కూల్‌, నలందా విద్యాలయం, సెయింట్‌ ఆల్ఫోన్సిస్‌, సాయిరాం, ఆస్ట్రిడ్‌రో తదితర ప్రైవేటు పాఠశాలలతో పాటు యూసుఫ్‌గూడ, బోరబండ, శ్రీరాంనగర్‌, జవహర్‌నగర్‌, వెంగళరావునగర్‌లలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



నిరంతర విద్యుత్‌ కోసం ఎన్టీఆర్‌నగర్‌ ప్రభుత్వ పాఠశాల వద్ద విధుల్లో ఉద్యోగులు



బంజారాహిల్స్‌ రోడ్‌ నెం. 7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల సెంటర్‌ వద్ద...



కృష్ణానగర్‌ సాయిరాం స్కూల్‌ వద్ద తనిఖీలు చేస్తున్న ఉపాధ్యాయులు



ఎన్టీటీ నగర్‌ ఉన్నత పాఠశాల వద్ద హాల్‌ టికెట్‌ నంబర్లను చూసుకుంటూ...



శ్రీకృష్ణానగర్‌లోని ఓ పరీక్షా కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఆస్తిపన్ను బకాయిదారులపై కొరడా

దిగివస్తున్న బకాయిదారులు



బకాయిపడ్డ కార్యాలయాలను సీజ్‌ చేసేందుకు వెళ్తున్న అధికారులు



బార్‌ను సీజ్‌ చేస్తున్న అధికారులు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నెంబర్‌–2లోని షాంగ్రిల్లా ప్లాజాలో ఆస్తి పన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయి. రూ. 1.38 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్‌ చెల్లించాలంటూ జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–18 ట్యాక్స్‌ విభాగం అధికారులు రెడ్‌ నోటీసులు, డిమాండ్‌ నోటీసులు, వారెంట్లు జారీ చేసినా సంబంధిత యజమాని గోపాల్‌పటేల్‌ స్పందించలేదు. దీంతో ట్యాక్స్‌ విభాగం వారెంట్‌ ఆఫీసర్‌ ఉప్పలయ్య ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం కార్యాలయాలను సీజ్‌ చేసేందుకు వెళ్లారు. దీంతో దిగివచ్చిన యజమాని కొంతమేర పన్ను చెల్లిస్తానని హామీ ఇచ్చారు. షాంగ్రిల్లా ప్లాజాలో 38 టిన్‌ నెంబర్లపై ఈ బకాయిలు పేరుకుపోయాయి. ఒక్కో టిన్‌ నెంబర్‌తో చెక్కులు తయారు చేయాల్సి ఉండగా సాయంత్రానికి సదరు యజమాని ట్యాక్స్‌ విభాగం అధికారులకు చెక్కులు ఇస్తానని హామీ ఇచ్చి ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో శనివారం సదరు ప్లాజాను సీజ్‌ చేసే అవకాశం ఉంది. ఆర్థిక సంవత్సరం ముగిస్తున్నందున లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు ఆస్తుల జప్తునకు ముందుకొస్తున్నారు. దీంతో మొండి బకాయిలు వసూలవుతున్నాయి.

మియా మిలానో బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ సీజ్‌

బంజారాహిల్స్‌: ఏళ్ల తరబడి ఆస్తి పన్ను చెల్లించకుండా కొనసాగుతున్న మియా మిలానో బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్‌ చేశారు. ఆస్తి పన్నుపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్న అధికారులు వ్యాపార సముదాయాలపై కఠిన చర్యలకు దిగుతున్నారు. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌ రోడ్డు నెంబర్‌–36లోని మియా మిలానో రెస్టారెంట్‌ను సీజ్‌ చేశారు. సుమారు రూ.31 లక్షలు ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉండగా జీహెచ్‌ఎంసీ అధికారులు పలు దఫాలుగా నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో చర్యలకు ఉపక్రమించారు. పూర్తి ఆస్తి పన్ను చెల్లించేవరకు కొనసాగినిచ్చేది లేదని స్పష్టం చేశారు. ఆస్తి పన్ను బకాయిదారులు తక్షణమే ఆస్తి పన్ను చెల్లించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

'విలువలతో కూడిన విద్యను అందిస్తాం'

బంజారాహిల్స్‌: విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా సంకల్‌ చంద్‌ పటేల్‌ యూనివర్సిటీ పనిచేస్తుందని ఆ వర్సిటీ అధ్యక్షుడు ప్రకాష్‌ భాయ్‌ పటేల్‌ అన్నారు. జూబ్లీహిల్స్‌ రోడ్డు నెంబర్‌–36లో యూనివర్సిటీ దక్షిణ భారతీయ ప్రాంతీయ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌భాయ్‌ పటేల్‌ మాట్లాడుతూ... సమాజహితం కోసం పనిచేసే ముఖ్యమైన వనరుగా యూనివర్సిటీ నిలుస్తుందన్నారు. గుజరాత్‌లో విద్య, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. తమ యూనివర్సిటీ విద్యార్థులకు స్కూల్‌ స్థాయి నుంచి పీహెచ్‌డీ వరకు ఫిలంత్రోఫిక్‌, విలువ ఆధారిత సమగ్ర విద్యను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్పీయుయూ ప్రోవోస్ట్‌ ప్రఫుల్‌కుమార్‌ ఉదానీ, రిజిస్ట్రార్‌ పరిమిల్‌ త్రివేదీ, ఎస్పీసీఈ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ పీజే పటేల్‌ తదితరులు పాల్గొన్నారు.



ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రకాష్‌భాయ్‌ పటేల్‌

పురుగుల అన్నం పెడుతున్నారంటూ విద్యార్థుల ధర్నా

ఎస్పీఆర్‌హిల్స్‌లో ట్రాఫిక్‌ జాం

రహమత్‌నగర్‌: తమకు పురుగుల అన్నం పెడుతున్నారంటూ హాస్టల్‌ విద్యార్థులు రోడ్కెక్కారు. తమ సమస్యలను పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ జాం అయింది. వివరాలివీ... రహమత్‌నగర్‌ డివిజన్‌ ఎస్పీఆర్‌ హిల్స్‌లోని ఎస్టీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు తమకు పెడుతున్న అన్నంలో పురుగులు వస్తున్నాయని, ఇటీవల ఇద్దరూ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారంటూ శుక్రవారం సాయంత్రం రహదారిపై ఆందోళన నిర్వహించారు. దీంతో హైటెక్‌ సిటీ, బోరబండ, ఎమ్మెల్యే కాలనీ, కార్మిక నగర్‌ వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. బోరబండ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థులను సముదాయించి విరమింపజేశారు.

నిమ్స్‌లో సురక్షిత రక్తానికి భరోసా

నిమ్స్‌ డైరెక్టర్‌ నగరి బీరప్ప

లక్డీకాపూల్‌: నిరుపేద రోగులకు కార్పొరేట్‌ స్థాయి వైద్య సేవలను అందిస్తున్న నిమ్స్‌ రోగులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన రక్తాన్ని అందించేందుకు అడుగులేస్తుంది. ఆ దిశగా ఆస్పత్రిలో న్యూక్లియిక్‌ యాసిడ్‌ యాంప్లిఫికేషన్‌ టెక్నాలజీస్‌ (నాట్‌)ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ నగరి బీరప్ప తెలిపారు. శుక్రవారం నిమ్స్‌ ట్రామా బ్లాక్‌లోని బ్లడ్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో నాట్‌ ద్వారా మెరుగైన స్క్రీనింగ్‌, సురక్షిత రక్తాన్ని అందించడం అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. నిమ్స్‌ బ్లడ్‌ బ్యాంక్‌ హెచ్‌ఓడీ డాక్టర్‌ సుధీర్‌ కుమార్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని డైరెక్టర్‌ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నిమ్స్‌ పట్ల ఉన్న నమ్మకంతో ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు మరింత మెరుగైన నాణ్యమైన రక్తాన్ని అందించడాలన్న కృతనిశ్చయంతో ఆధునిక పరీక్ష విధానమైన నాట్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సహాయంలో దాతల నుంచి సేకరించే రక్తాన్ని పరీక్షించే క్రమంలో హెచ్‌ఐవీని గుర్తించడానికి ప్రస్తుత విధానంలో 16 రోజుల సమయం పడుతుందని.. అదే నాట్‌ ద్వారా కేవలం 6 రోజుల్లో నిర్ధారించడానికి వెసులుబాటు కలుగుతుందన్నారు. డీఎన్‌ఏ కానీ ఆర్‌ఎన్‌ఏ సీక్వెన్స్‌ల సంఖ్యను వేగంగా పెంచడానికి ఉపయోగించే పద్ధతులే ఈ నాట్‌ విధానమన్నారు. ప్రధానంగా ఈ సరికొత్త విధానంతో డయాగ్నొస్టిక్స్‌, పరిశోధన, ఫోరెన్సిక్స్‌ వంటి వివిధ పరీక్షల్లో చాలా తక్కువ వ్యవధిలోనే సంబంధిత అణువులను గుర్తించడానికి వీలు కలుగుతుందన్నారు. నిమ్స్‌ బ్లడ్‌ సెంటర్‌ డాక్టర్‌ మహేష్‌ గౌడ్‌ మాట్లాడుతూ... నాణ్యమైన రక్తాన్ని రోగులకు అందించే ప్రయత్నంగా ఆధునిక పరీక్ష విధానం నాట్‌ గుర్తించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్‌ మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఎన్‌.లక్ష్మీభాస్కర్‌, ప్రొఫెసర్‌ శాంతి, డాక్టర్‌ మురళీకృష్ణ, బ్లడ్‌ సెంటర్‌ సిబ్బంది ఎమ్‌.మల్లికార్జున, బిడుగు శేఖర్‌ హాజరయ్యారు. కార్యక్రమానికి నర్సింగ్‌ సిబ్బంది, పీజీ విద్యార్థులు, పారామెడికల్‌ విద్యార్థులు, ఇతర బ్లడ్‌ సెంటర్ల ప్రొఫెసర్లు, నర్సింగ్‌, టెక్నికల్‌ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిమ్స్‌ డైరెక్టర్‌ బీరప్ప

వెన్నెముక శస్త్రచికిత్సలకు అధునాతన పరికరాలు



స్పైనల్‌ ఎండోస్కోపిక్‌ సిస్టమ్‌ ప్రారంభ వేడుకలో రోటరేయన్లతో పాటు నిమ్స్‌ డైరెక్టర్‌

లక్డీకాపూల్‌: నిమ్స్‌ న్యూరోసర్జరీ విభాగం ఇప్పుడు వెన్నెముక శస్త్ర చికిత్సల్లో గేమ్‌–చేంజర్‌గా నిలుస్తోందని ఆ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్‌ యెర్రంనేని వంశీ కృష్ణ వెల్లడించారు. సికింద్రాబాద్‌ సన్‌రైజ్‌ రోటరీ క్లబ్‌ సహకారంతో బీహెచ్‌ఈఎల్‌–జీఈ గ్యాస్‌ టరబైన్‌ సర్వీసెస్‌ సంస్థ సమకూర్చిన అత్యాధునిక స్పైనల్‌ ఎండోస్కోపిక్‌ సర్జరీ సిస్టమ్‌ (యూబీఈ–బోన్స్‌) ద్వారా రోగులకు మరింత నాణ్యత ప్రమాదాలతో కూడిన శస్త్ర చికిత్సలను నిర్వహించవచ్చన్నారు. ముఖ్యంగా ఇన్వాసివ్‌ స్పైనల్‌ సర్జరీలలో నిమ్స్‌ తన ప్రాధాన్యతను మరింత సంతరించుకుంటుందని చెప్పారు. ఈ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో సంవత్సరానికి సుమారు 3500 వెన్నెముక శస్త్రచికిత్సలు చేయవచ్చన్నారు. శుక్రవారం నిమ్స్‌ ఎమర్జెన్సీ బ్లాక్‌లోని మూడవ అంతస్తులో అందుబాటులోకి తీసుకొచ్చిన స్పైనల్‌ ఎండోస్కోపిక్‌ సర్జరీ సిస్టమ్‌ను నిమ్స్‌ సంచాలకులు ప్రొఫెసర్‌ బీరప్ప, రోటరీ ఇంటర్నేషనల్‌ డైరెక్టర్‌ డేనియల్‌ సి.హిమెల్స్‌పాచ్‌, బీజీజీటీఎస్‌ జేఎండీ బల్లా రాజశ్రీలతో కలిసి రోటరీ జిల్లా గవర్నర్‌ కె.శరత్‌చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిమ్స్‌ డైరెక్టర్‌ బీరప్ప మాట్లాడుతూ... నిమ్స్‌లో ఆధునాతన విధానాలను ఇప్పుడు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్‌ఎఫ్‌ పథకాల ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో రూ. 5 లక్షల కంటే ఎక్కువ ఖర్చయ్యే వెన్నెముక శస్త్రచికిత్సలను నిమ్స్‌లో ఉచితంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రోటేరియన్లు శ్రీనివాస్‌ గుమిడెల్లి, సీఎస్‌ఆర్‌ కమిటీ డైరెక్టర్‌ అనిల్‌ ఘుక్షా, సమీర్‌ గుప్తాల అవిశ్రాంత కృషి ఫలితంగా నిమ్స్‌ ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోగలిందని డైరెక్టర్‌ తెలిపారు. దీంతో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల ప్రజలకు సైతం మరింత మెరుగైన ప్రయోజనం చేకూరుతుందన్నారు.

దారి దోపిడీకి పాల్పడ్డ ముగ్గురి రిమాండ్‌

బంజారాహిల్స్‌: జీతం తీసుకుని మద్యం సేవించి ట్రాన్స్‌జెండర్‌ వద్దకు వెళ్లిన ఓ యువకుడి జేబులో నుంచి పథకం ప్రకారం డబ్బులు కాజేసిన ముగ్గురిని బంజారాహిల్స్‌ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలివీ... ఏపీ లోని కర్నూలుకు చెందిన షేక్‌ రఫీ(24) గత మంగళవారం తాను పని చేస్తున్న హోటల్‌ నుంచి రూ. 13,500 జీతం తీసుకుని రాత్రి కృష్ణానగర్‌లో మద్యం సేవించి ఇందిరానగర్‌ గడ్డ వద్ద ఓ ట్రాన్స్‌జెండర్‌ వద్దకు వెళ్లాడు. ముందస్తుగా వేసుకున్న పథకం ప్రకారం ట్రాన్స్‌జెండర్‌ తన సహచరులతో కలిసి పోలీసులు.. పోలీసులు..అంటూ అరుస్తూ పరిగెత్తుతూ రఫీని బెదరగొట్టింది. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు యువకులు భయంతో ఉన్న రఫీ జేబులో నుంచి రూ. 13,500 లాక్కొని ఉడాయించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే రోజు ట్రాన్స్‌జెండర్‌ కంగానాను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. పరారీలో ఉన్న కర్ణాటకకు చెందిన అల్లూరి మహేష్‌(21), చేగుంట శంకర్‌పేటకు చెందిన ధ్యానబోయిన కిషోర్‌(21), అచ్చంపేటకు చెందిన దాసరి మహేష్‌(22) ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ముగ్గురూ బేగంపేటలోని ఏ2జెడ్‌ టెంట్‌హౌస్‌లో పనిచేస్తున్నారు. వీరిపై గతంలో కూడా పలు పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. దారి దోపిడీకి పాల్పడి డబ్బులు చోరీ చేసిన ఘటనలో ఇప్పటికే ట్రాన్స్‌జెండర్‌ జైలుకు వెళ్లగా, మిగతా ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. బంజారాహిల్స్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక ఆత్మహత్య

రహమత్‌నగర్‌: ఓ మైనర్‌ బాలిక ఆత్మహత్య చేసుకున్న బోరబండ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... బంజారానగర్‌కు చెందిన ఓ మహిళ హౌస్‌ కీపింగ్‌ పనిచేస్తుంది. కొంత కాలంగా భర్తతో విభేదించి తన పిల్లలతో కలిసి వేరుగా ఉంటుంది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె కుమార్తె శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంఘటన స్థలానికి చేరకున్న బోరబండ పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

వెంగళరావునగర్‌: భర్త ఆఫీసు పని మీద బయటకు వెళ్లగానే భార్య అదృశ్యమైన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... యూసుఫ్‌గూడలో నివాసం ఉండే చంద్రకాంత్‌ వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం ఆఫీసు పని మీద నారాయఖేడ్‌ వెళ్లాడు. తన భార్యకు ఫోన్‌ చేసి రియల్‌ ఎస్టేట్‌ ఆఫీస్‌కు వెళ్లమని చెప్పాడు. ఆమె సరేనంది. అనంతరం ఆమెకు ఫోన్‌ చేయగా పని చేయలేదు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా కిటికీ వద్ద ఉన్నాయి. గతంలో కూడా ఆమె ఒకసారి బి.రేమండ్‌ పాల్‌ అనే తమ కారు డ్రైవర్‌తో వెళ్లింది. తర్వాత తిరిగి వచ్చి మరోసారి వెళ్లను అని చెప్పింది, అయితే మళ్లీ అదే పని చేసిందని, తన భార్య జాడ కనిపెట్టాలని బాధితుడు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఏఎంసీని చంపుతానని బెదిరింపు

వెంగళరావునగర్‌: జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్‌ మున్సిపల్‌ కమిషనర్‌ను గుర్తు తెలియని వ్యక్తి చంపుతానని బెదిరించిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం యూసుఫ్‌గూడ సర్కిల్‌–19లో ఏఎంసీగా విధులు నిర్వహించే బాల్‌రాజు గురువారం విధి నిర్వహణలో భాగంగా తన కారు వద్దకు వచ్చాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న వ్యక్తి కారు తలుపు తీయడానికి ప్రయత్నించాడు. ఏఎంసీ ఎవరు నువ్వని అతనిని అడగ్గా కారు ఓనర్‌నని చెప్పి దుర్భాషలాడాడు. అంతేగాకుండా బండరాయితో ఏఎంసీపై దాడి చేశాడు. చంపుతానని బెదిరించాడు. దాంతో ఏఎంసీ మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


వీధి దీపాల సమస్య పరిష్కరించండి

హిమాయత్‌నగర్‌: డివిజన్‌ పరిధిలో నెలకొన్న వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ హిమాయత్‌నగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు కె.నర్సింగ్‌ ముదిరాజ్‌ కోరారు. ఈ మేరకు ఆయన నేతృత్వంలోని బృందం శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులను కలసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 65 శాతం వీధి దీపాలు మూడు నెలలుగా పనిచేయడం లేదన్నారు. ఇది ప్రజల భద్రతకు, విద్యార్థుల రాత్రి ప్రయాణాలకు తీవ్ర సమస్యగా మారిందన్నారు. బీజేపీ సెంట్రల్‌ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్‌, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్‌, నగర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్‌, జాయింట్‌ కన్వీనర్‌ నరహరి, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌, డివిజన్‌ నాయకులు అభిషేక్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

రేపు షహీద్‌ దివస్‌ ర్యాలీ: ఏఐవైఎఫ్‌

హిమాయత్‌నగర్‌: ఏఐటీయూసీ కార్యాలయం నుంచి రామ్‌ కోఠిలోని భగత్‌సింగ్‌ విగ్రహం వరకు ఈ నెల 23న నిర్వహించే షహీద్‌ దివస్‌ ర్యాలీని జయప్రదం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్‌) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయం వద్ద భగత్‌సింగ్‌, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని నిర్వహించారు. ఏఐవైఎఫ్‌ హైదరాబాద్‌ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్‌, నేతలు మాజీద్‌ అలీఖాన్‌, కళ్యాణ్‌, వంశీ, విజయ్‌, హేమంత్‌, జగన్‌, సీపీఐ నేత శ్రీనివాస్‌ పాల్గొన్నారు.











ఏకంగా ఐదు ఆస్కార్‌ అవార్డులను దక్కించుకున్న అనోరా సినిమాను మళ్లీ ఒకసారి బిగ్‌ స్క్రీన్‌ పై చూస్తే ఎలా ఉంటుంది. ఆనాటి ఎన్టీఆర్‌, సావిత్రి నటించిన తెలుగు క్లాసిక్‌ 'మిస్సమ్మ'ను మళ్లీ చూస్తే.. అవును ఇలాంటి సినిమాలను నగర వేదికగా మరోసారి చూస్తూ మురిసిపోతున్నారు సినీ ప్రేమికులు. నగర వేదికగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెడ్‌ లారీ ఫిల్మ్‌ ఫెస్టివల్‌లో ఇవే కాదు సిక్స్‌ జార్స్‌, ఆల్ఫా, జువెల్‌ థీఫ్‌, ప్రెట్టీ వుమెన్‌ వంటి అంతర్జాతీయ ఉత్తమ చిత్రాలతో పాటు తెలుగు క్లాసిక్స్‌, రామ్‌ గోపాల్‌ వర్మ క్షణ క్షణం, కృష్ణవంశీ చందమామ వంటి పలు చిత్రాలు ప్రసాద్స్‌ మల్టీప్లెక్స్‌ వేదికగా అలరించాయి. బుక్‌ మైషో ఆధ్వర్యంలో హైదరాబాద్‌తో పాటు ముంబై నగరంలో ప్రత్యేకంగా నిర్వహించే రెడ్‌ లారీ ఫిల్మ్‌ ఫెస్ట్‌ సినీ ప్రేమికులకు మరపురాని అనుభూతిని అందిస్తోంది.

ఈ ఫిల్మ్‌ ఫెస్ట్‌ ఈ నెల 23వ తేదీ వరకూ కొనసాగనుంది.

- సాక్షి, సిటీబ్యూరో

వాచ్‌ ఇట్‌.. వన్స్‌ మోర్‌..

నగర వేదికగా అలరిస్తున్న రెడ్‌ లారీ ఫిల్మ్‌ ఫెస్ట్‌


జాతీయ, అంతర్జాతీయ స్థాయి సినిమాల ప్రదర్శన

మొదటి రోజు కృష్ణవంశీ, టెస్‌ జోసెఫ్‌, నవదీప్‌ తదితరుల సందడి

రెడ్‌ లారీ ఫిల్మ్‌ ఫెస్ట్‌లో భాగంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ, ప్రయోగాత్మక చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఈ ఫిల్మ్‌ ఫెస్ట్‌తో ప్రపంచంలోని విభిన్న మూలాలకు చెందిన మూవీ లవర్స్‌, సినిమా ఔత్సాహికులకు ఇష్టమైన చిత్రాలను మరోసారి బిగ్‌ స్క్రీన్‌ పై ప్రదర్శిస్తున్నారు. దక్షిణాది సినిమాగా, టాలీవుడ్‌ సినిమాగా పరిగణించే స్థాయి నుంచి ఆస్కార్‌ స్థాయికి చేరిన తెలుగు వేదికపై ఇలాంటి ఫెస్ట్‌ నిర్వాహణతో పండుగ వాతావరణం నెలకొంది.

విభిన్న భాషా చిత్రాలు..

రెడ్‌ లారీ ఫిల్మ్‌ ఫెస్ట్‌లో విభిన్న భాషలకు చెందిన పలు చిత్రాలు నేడు, రేపు ప్రదర్శించనున్నారు. ఇందులో భాగంగా ఈ రోజు ట్టింగ్‌ హిల్‌, క్వీర్‌, ఇట్స్‌ కమింగ్‌, గర్ల్స్‌ ప్లానెట్‌ 999, ది ఫర్గెటెన్‌ గర్ల్స్‌, హైవే 65, రెడ్‌ రూమ్స్‌ వంటి చిత్రాలతో పాటు మాయాబజార్‌, మగధీర వంటి తెలుగు చిత్రాలు సైతం ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అంతేకాకుండా ప్రత్యేకంగా ప్రదర్శించనున్న హ్యాపీడేస్‌ చిత్రాన్ని తిలకించడానికి దర్శకులు శేఖర్‌ కమ్ముల బృందం రానుందని పేర్కొన్నారు.







గుర్తుకొస్తున్నాయి..

సినిమా అనేది నా జీవితంలో అద్భుత ప్రయాణం. దాదాపు రెండు దశాబ్దాల తరువాత మా సినిమా చందమామను మళ్లీ వెండి తెరపై చూడటం సంతోషంగా ఉంది. 1940 మొదలు ఇప్పటి వరకూ వచ్చిన సినిమాల్లో సాంకేతికపరమైన అంశాలతో ఎన్నో మార్పులొచ్చాయి. మార్పు అనివార్యం. ప్రస్తుతం ఇంటర్నెట్‌, డిజిటలైజేషన్‌ పెరిగింది కాబట్టి సినిమా అప్పటి కన్నా వేగంగా ముందుకు సాగుతోంది. 17 ఏళ్ల తరువాత కూడా మా సినిమాను ఎంపిక చేసి ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శించడం గర్వంగా ఉంది. నేను కమర్షియల్‌ హంగుల కోసం, బాక్స్‌ ఆఫీస్‌ కోసం, రికార్డుల కోసం తీయను. మన కోసం, మన జీవితాలను సినిమాగా తీస్తాను. మా గురువు తీసిన, నేను అసిస్టెంట్‌ డైరెక్టర్‌గా చేసిన క్షణక్షణం కూడా ఈ ఫెస్ట్‌లో చూసి సంతోషపడ్డాను. ఈ మధ్య నేను తీసిన రంగమార్తాండకు ఓటీటీలో మంచి స్పందన లభించింది. పలువురు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నాను. థియేటర్‌లో కూడా ఇదే విధంగా ఆడాల్సింది..!! - కృష్ణ వంశీ, సినీ దర్శకులు





దృక్పథం మారింది..

ఈ తరం సినిమాలు వినూత్నమైన ప్రతిభకు నాందిగా నిలుస్తున్నాయి. సినిమాను ఒక దృశ్య కావ్యంగా, ఆసక్తిగా కథను ముందుకు తీసుకెళ్లడంలో అధునాతన సాంకేతికత, ఔత్సాహికుల ఆసక్తి మరో అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా సినీప్రయాణం ప్రపంచీకరణకు అనుగుణంగా కొత్త పుంతలు తొక్కుతోంది.

- టెస్‌ జోసెఫ్‌, ప్రముఖ కాస్టింగ్‌ డైరెక్టర్‌ (లైఫ్‌ ఆఫ్‌ పై)

ఇది మంచి పరిణామం..

గతంలో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న సినిమాలు మళ్లీ ఇప్పుడు చూడటం ఓ నోస్టాల్జియా. ఇలాంటి ఫిల్మ్‌ ఫెస్టివల్స్‌ హైదరాబాద్‌లో జరగడం మంచి పరిణామం. ఈ ఫెస్టివల్‌లో నా సినిమాను చూసుకోవడం కొత్తగా ఉంది.. షూటింగ్‌ సమయంలోని సన్‌ రైజింగ్‌, సన్‌ సెట్‌ అన్నీ మళ్లీ నెమరు వేసుకున్నాను.

- నవదీప్‌, సినీ హీరో

మంచి సినిమాలకు వేదికతో పనిలేదు..

ఇలాంటి ఫిల్మ్‌ ఫెస్టివల్స్‌ గోవాలో ఎక్కువ జరిగేవి. ప్రస్తుతం తెలుగు సినిమా ప్రపంచ వ్యాప్తమైంది. తెలుగులో తీస్తున్న చాలా సినిమాలు పాన్‌ ఇండియా విడుదలవుతున్నాయి. ఓటీటీ, థియేటర్‌ అనే విషయంలో ప్రేక్షకులు ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు. మంచి సినిమా వస్తే చాలు.. అది ఏ వేదికైనా చూస్తున్నారు. కానీ ఓటీటీ వల్ల సినిమాకు మరో అవకాశం లభిస్తోంది. థియేటర్లో సక్సెస్‌ కాకున్నా ఓటీటీలో విజయం సాధించిన సినిమాలు ఎన్నో ఉన్నాయి.

- శివబాలాజీ, సినీ నటుడు



హైలైఫ్‌ సమ్మర్‌ ఎగ్జిబిషన్‌

- ప్రదర్శనలో 350 మంది డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు
- ఈ నెల 23 వరకూ కొనసాగింపు

మాదాపూర్‌ : ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని నోవోటెల్‌లో హైలైఫ్‌ సమ్మర్‌ ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను నటి శ్రవంతి చోకరపు, వర్షిణి, నిర్వాహకుడు డొమినిక్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 350 మంది డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. యువతను ఆకట్టుకునే విధంగా ప్రత్యేక వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో వేసవి దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. వివిధ రకాల డిజైన్లతో కూడిన ఆభరణాలు వివాహాది శుభకార్యాలకు అందుబాటులో ఉన్నాయన్నారు. పలువురు డిజైనర్లు, మోడల్స్‌ ఉత్పత్తులను ప్రదర్శించారు.



రాకేష్‌ రాకింగ్‌..

స్పీడ్‌ మ్యాథ్స్‌ చాలెంజ్‌లో విజేతగా నగర బాలుడు..

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జాతీయ స్పీడ్‌ మ్యాథ్స్‌ చాలెంజ్‌లో నగరానికి చెందిన బాలుడు (గ్రేడ్‌ 3) గ్రేషిన్‌ రాకేష్‌ విజేతగా నిలిచాడు. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన మానవ కాలిక్యులేటర్‌గా గుర్తింపు పొందిన నీలకంఠ భాను నిర్వహించిన స్పీడ్‌ చాలెంజ్‌లో దేశ వ్యాప్తంగా 750 నగరాల నుంచి ఆరు వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 300 మంది చివరి రౌండుకు చేరుకోగా నగర బాలుడు గ్రేషిన్‌ రాకేష్‌ విజేతగా నిలిచాడు. చివరి రౌండులో తనకిచ్చిన కాల పరిమితిలో 150 ప్రశ్నలను సరిగ్గా పరిష్కరించి అబ్బురపరిచాడు. భాంజు ప్లే యాప్‌లో నిత్యం ప్రాక్టీస్‌ చేస్తానని, దీని వల్ల కేవలం 30 సెకండ్లలో సమాధానాలను అందించగలిగానని రాకేష్‌ తెలిపాడు.

భలేరావుకు రంగస్థల పురస్కారం

నాంపల్లి : ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా యేటా రంగస్థల కళారంగంలో విశేష కృషి చేసిన యువ కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ యువ పురస్కారం పేరిట సత్కరిస్తూ వస్తోంది. 2024–25వ సంవత్సరానికి గానూ హైదరాబాద్‌ కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిశోధకులు రంగస్థల నటులు, దర్శకులు, సంగీత దర్శకులు శ్రీకాంత్‌ నందకుమార్‌ భలేరావ్‌ను విశ్వవిద్యాలయం రంగస్థల యువ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రిజిస్ట్రార్‌ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. భలేరావు అంతర్జాతీయ రంగస్థల సదస్సులో పాల్గొని అనేక ప్రశంసలు పొందారు. వీరు తెలుగు, మరాఠీ, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు భాషల నాటకాలతో పాటు నృత్య రూపకాలకు దర్శకత్వం వహించారు. 23 నాటకాలలో నటుడిగా, పది నాటకాలకు దర్శకుడిగా పనిచేసి బంగారు పతకాలను పొందారు. వీరికి మార్చి 27న పబ్లిక్‌ గార్డెన్స్‌లోని తెలుగు వర్సిటీ నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగే ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా పురస్కారాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.





నేను నేచర్‌ లవర్‌ని

ప్రకృతి లేకపోతే మనం లేము

కేబీఆర్‌ పార్కును సందర్శించిన మిస్‌వరల్డ్‌ క్రిస్టినా పిస్కోవా

బంజారాహిల్స్‌ : 'నాకు ప్రకృతి అంటే చాలా ఇష్టం.. జెక్‌ రిపబ్లిక్‌ కంట్రీలోని ఓ చిన్న పల్లెటూరు మాది. నాకు ప్రకృతి గురించి బాగా తెలుసు. అడవులన్నా, పక్షులన్నా నాకు ప్రాణం. సమయం చిక్కిందంటే చాలు ప్రకృతిలో హార్స్‌ రైడింగ్‌ చేసేందుకు ఇష్టపడతా' అని చెప్పారు మిస్‌ వరల్డ్‌ క్రిస్టినా పిస్కోవా. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని కేబీఆర్‌ జాతీయ ఉద్యానవనాన్ని మంత్రి కొండా సురేఖతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో మొక్కను నాటారు. ప్రకృతిపై వేసిన పలు చిత్రాలను చూసి ముచ్చపడి విద్యార్థులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. 'మనం ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఎంతో నిబద్ధత, క్రమశిక్షణ ఉంటే దాన్ని సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. బాల్య దశ నుంచి విద్యార్థులు ప్రకృతిపై, అడవులపై అవగాహన కలిగి ఉండాలి. ప్రకృతి లేకపోతే మనం లేము. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటి పరిరక్షణకు కట్టుబడి ఉండాలి' అని క్రిస్టినా చెప్పారు.



ఇందిరా బజార్‌లో గిరిజన ఉత్పత్తులు



ఉగాది, రంజాన్‌ సందర్భంగా ప్రత్యేక ప్రదర్శన

29వ తేదీ వరకూ కొనసాగింపు

సందర్శకులను ఆకట్టుకుంటున్న ఉత్పత్తులు

మాదాపూర్‌ : వివిధ ప్రాంతాలకు చెందిన మహిళా కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ఉగాది, రంజాన్‌ మేళాను ఏర్పాటు చేశారు. మేళాలో 106 స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలను సందర్శకులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ఆయా ఉత్పత్తులు రోగనిరోధక శక్తిని పెంచుతాయని కొనుగోలుదారులు చెబుతున్నారు. దీంతో పాటు కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 29 వరకూ నిర్వహించనున్న మేళాలో విప్పపూల లడ్డూలు, 130 రకాల అగరుబత్తీలు, ఎంబ్రాయిడరీ ఉత్పత్తులు, పచ్చళ్ల స్టాల్స్‌లో కొలువుదీరాయి.




130 రకాల అగరుబత్తీలు..

ఆదిలాబాద్‌ జిల్లా తొమ్మిది గ్రామాల మహిళలు అగరుబత్తీల తయారీని వృత్తిగా ఎంచుకున్నారు. వీరు తయారు చేసిన దాదాపు 130 రకాలను అందుబాటులో ఉంచారు. ఘర్‌మందిర్‌, గుగ్గిలం, ప్రత్యేక చందన్‌, మధుర్‌ తదితర ఫ్లేవర్లు అందుబాటులో ఉన్నాయి. 1990 నుంచి ఆయా ప్రాంతాల్లో మహిళలు తయారు చేసిన అగరుబత్తీలను వివిధ ప్రాంతాలకు, దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రత్యేకంగా 11కిలోల 800 గ్రాములతో తయారు చేసిన అగరుబత్తీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీని విలువ రూ.400లు కాగా, స్టాల్స్‌లో రూ.100 నుంచి 500 వరకూ ప్యాకెట్‌లు అందుబాటులో ఉన్నాయి.

ఖైదీల ఉత్పత్తులు అద్భుతం..

మహిళా ఖైదీలకు వివిధ రకాల ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇప్పిస్తున్నాం. ఖైదీలకు చంచల్‌ గూడా జైల్లో బేకరీ ఉత్పత్తులు, పచ్చళ్లు, విస్తరాకుల తయారీ, ఎంబ్రాయిడరీ లాంటి వృత్తుల పై అవగాహన కల్పిస్తున్నాము. వారి ఉత్పత్తుల అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయంలో 30 నుంచి 40శాతం వారికి జీతాలగా చెల్లిస్తున్నాము.



- షాహీన్‌ సుల్తానా, హెడ్‌కానిస్టేబుల్‌

ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం..

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇలాంటి మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రత్యేక దుస్తులు, ఎంబ్రాయిడరీ ఉత్పత్తులు ఎక్కువ మొత్తంలో అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్‌ డిజైన్స్‌ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

- అశ్విని, ఎంబ్రాయిడరీ



సాక్షి రియల్టీ
శనివారం
22-03-2025



నీరు ఎత్తు నుంచి పల్లం వైపునకు పారినట్లే.. రియల్ ఎస్టేట్ అవకాశాలు, అభివృద్ధి కూడా మౌలిక వసతులు మెరుగ్గా ఉన్న ప్రాంతం వైపే విస్తరిస్తాయి. నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తో మొదలైన స్థిరాస్తి అభివృద్ధి ఐటీ హబ్ రాకతో గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమ ప్రాంతాల వైపు పరుగులు పెట్టింది. కొత్త ప్రాంతంలో అభివృద్ధి విస్తరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం దక్షిణ హైదరాబాద్ వైపు దృష్టిసారించింది. విద్య, వైద్యంతో పాటు ఏఐ సిటీ, ఎలక్ట్రానిక్స్, లైఫ్‌సైన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లతో కూడిన నాల్గో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనుంది. అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలతో నిర్మితం కానున్న ఈ కొత్త నగరంతో స్థిరాస్తి అవకాశాలు పశ్చిమం నుంచి దక్షిణ హైదరాబాద్ వైపు మళ్లనుంది.

–సాక్షి, సిటీబ్యూరో

ఫ్యూచర్‌పై.. రియల్ ఆశలు!

ఫోర్త్ సిటీతో దక్షిణ హైదరాబాద్ అభివృద్ధి

రోడ్డు, రైలు, విమాన మార్గాలతో మెరుగైన రవాణా వ్యవస్థ

16 శాతం భూమి నివాస, వాణిజ్య భవనాల కోసమే కేటాయింపు	భవిష్యత్తు నగరితో 30–35 వేల ప్రత్యక్ష, 60–70 వేల పరోక్ష ఉద్యోగ అవకాశాలు

మన దేశంలో నోయిడా, గ్రేటర్ నోయిడా, దక్షిణ కొరియాలో ఇంచియాన్ ఫ్రీ ఎకనామిక్ జోన్ సక్సెస్‌లను స్ఫూర్తిగా తీసుకొని.. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నాలుగో నగరం 'ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. నగరం సమీపంలోని మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె, ముచ్చర్ల గ్రామాల పరిధుల్లో 814 చదరపు కిలో మీటర్లు, 2,01,318 ఎకరాల విస్తీర్ణంలో ఫోర్త్ సిటీ విస్తరించి ఉంటుంది. కడ్తాల్, ఇబ్రహీంపట్నం, కందుకూరు, మహేశ్వరం, మంచాల్, యాచారం, ఆమన్‌గల్ 7 మండలాల్లోని 56 గ్రామాలు ఫోర్త్ సిటీ పరిధిలోకి వస్తాయి. ఈ నగరం సాకారమైతే 30–35 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 60–70 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. ఈ విస్తరణ ప్రణాళిక హైదరాబాద్ రియల్ రంగానికి ఊతంగా నిలవనుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ హైవేలలో స్థిరాస్తి పెట్టుబడి అవకాశాలు మరింత మెరుగవుతాయి. నివాస, వాణిజ్య, పారిశ్రామిక స్థలాలకు డిమాండ్ ఏర్పడనుంది. ప్రాపర్టీ విలువలు గణనీయంగా పెరుగుతాయి. నెట్ జీరో సిటీగా నిర్మితం కానున్న ఈ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పర్యవేక్షణ నిమిత్తం ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది.



నెట్‌జీరో సిటీగా..

చుట్టూ పచ్చదనం, విశాలమైన రహదారులు, ప్రణాళికబద్ధంగా నివాస ప్రాంతాలు, వాణిజ్య క్లస్టర్లు, ఐటీ కంపెనీలు, బహుళ జాతి సంస్థలు ఒక చోట వీటన్నింటికీ దూరంగా పరిశ్రమలు, ఇలా పర్యావరణహితంగా కాలుష్యరహితంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నారు. నెట్‌జీరో సిటీగా ఏర్పాటుకానున్న ఈ నగరానికి సంబంధించి ప్రభుత్వం వేర్వేరు ప్రణాళికలను తయారు చేసింది. వచ్చే యాభైఏళ్లలో అక్కడ మారనున్న పరిస్థితులను అనువుగా భవిష్యత్ ప్రణాళికలను రూపొందించారు.

రోడ్డు, రైలు, విమానం.. అన్నీ..

- ఫ్యూచర్ సిటీకి రోడ్డు, రైలు, విమాన మార్గాలతో అనుసంధానించేలా అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులను కల్పించనున్నారు.
- ఫ్యూచర్ సిటీకి హైదరాబాద్ నుంచి సులభంగా చేరుకునేందుకు విమానాశ్రయం నుంచి ఔటర్ రింగ్ రోడ్‌కు, అలాగే ఔటర్ నుంచి ప్రతిపాదిత ప్రాంతాలు బేగరికంచె, మీర్‌ఖాన్‌పేట్, ముచ్చర్ల వరకూ 330 అడుగుల వెడల్పు రహదారులు, ఇతర అంతర్గత రహదారులను నిర్మించనున్నారు.
- రావిర్యాల ఓఆర్‌ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా ముచ్చర్ల, ఆమన్‌గల్ మండలంలోని ఆకుతోటపల్లె వద్ద రీజినల్ రింగ్ రోడ్‌ను కలుపుతూ 40 కిలోమీటర్ల రహదారిని నిర్మించనున్నారు.
- దీంతో పాటు రాజేంద్రనగర్‌లో రానున్న కొత్త హైకోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు మార్గాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.

వ్యర్థాల నిర్వహణ..

పర్యావరణాన్ని కాపాడేందుకు నెట్‌జీరో సిటీలో 33 శాతం గ్రీనరీ ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. చెట్లు, వాణిజ్య పంటలు, రహదారుల వెంట నీడనిచ్చే వృక్షాలు ఉంటాయి. వీటి ద్వారా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కంటే ఇక్కడ 2–3 డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఇళ్లు, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాలు, ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేకమైన వ్యవస్థను రూపకల్పన చేస్తున్నారు. వ్యర్థ జలాలను శుద్ధీకరించి మళ్లీ వినియోగించేందుకు వీలుగా మారుస్తారు. దీంతో పాటు పరిశ్రమలు, ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాల నిర్వహణకు ఇంధనం, విద్యుత్ వినియోగాన్ని తగ్గించి సౌర విద్యుత్ వాడేలా చూస్తారు. పరిశ్రమలు, ఐటీ సంస్థలు, నివాసాలు నిర్మించేటప్పుడు జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా కాలుష్యరహిత వస్తువులను వినియోగించేలా చూస్తారు.

ఫ్యూచర్ సిటీ స్వరూపమిదీ

- ఎలక్ట్రానిక్స్ అండ్ సాధారణ పరిశ్రమలు: 4,774 ఎకరాలు
- లైఫ్ సైన్స్ హబ్: 4,207 ఎకరాలు
- నివాస, మిశ్రమ భవనాలు: 1,317 ఎకరాలు
- నివాస భవనాల జోన్: 1,013 ఎకరాలు
- స్పోర్ట్స్ హబ్: 761 ఎకరాలు
- ఎడ్యుకేషనల్ అండ్ వర్సిటీ జోన్: 454 ఎకరాలు
- ఎంటర్‌టైన్‌మెంట్: 470 ఎకరాలు
- హెల్త్ సిటీ: 370 ఎకరాలు
- ఫర్నీచర్ పార్క్: 309 ఎకరాలు
- ఏఐ సిటీ: 297 ఎకరాలు





ఎలక్ట్రానిక్స్, లైఫ్‌సైన్స్‌కు ప్రాధాన్యం..

ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, లైఫ్‌సైన్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ రెండు రంగాలకే ఏకంగా 64 శాతం భూమిని కేటాయించారు. ఎలక్ట్రానిక్స్, సాధారణ పరిశ్రమలకు 4,774 ఎకరాలు, లైఫ్‌సైన్స్ హబ్‌కు 4,207 ఎకరాలను కేటాయించారు. కొంగరకలాన్‌లో ఆపిల్ ఫోన్ విడిభాగాలను తయారు చేస్తున్న ఫాక్స్‌కాన్ సంస్థ ఎలక్ట్రానిక్స్ జోన్‌లో తన శాఖలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. లైఫ్‌సైన్స్ జోన్‌లో ప్రాణాధార మందుల తయారీ, పరిశోధన సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించనుంది. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ప్రముఖ ఫార్మా సంస్థలు వాటి విస్తరణ ప్రాజెక్ట్‌లను ఇక్కడ ప్రారంభించేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి.



సౌకర్యాలకే ప్రాధాన్యం

మారుతున్న కొనుగోలుదారుల అభిరుచులు

- దగ్గరలో ఉండే మౌలిక వసతులపై ఆరా
- అన్నీ ఓకే అనుకున్న తర్వాతే కొనుగోలుకు సై..

గృహ కొనుగోలుదారుల అభిరుచులు మారుతున్నాయి. గతంలో ధర ప్రాధాన్యంగా గృహ కొనుగోలు నిర్ణయం తీసుకునే కస్టమర్లు.. ఆ తర్వాత వసతులను పరిగనలోకి తీసుకున్నారు. కానీ, కరోనా తర్వాతి నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో ఇంటి ఎంపికలోనూ ఇదే ధోరణి అవలంబిస్తున్నారు. ధర, సౌకర్యాలే కాదు ఇంటికి చేరువలో ఎలాంటి మౌలిక వసతులు ఉన్నాయి? ఆఫీసులు, వినోద కేంద్రాలు ఎంత దూరంలో ఉన్నాయనే అంశాలను సైతం పరిగనలోకి తీసుకొని గృహాలను ఎంపిక చేస్తున్నారు.

–సాక్షి, సిటీబ్యూరో

ఆరోగ్యానికి ప్రాధాన్యం..

నేటి యువతరం ఇల్లు కొనేటప్పుడు చుట్టుపక్కల ఆరోగ్య సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది ప్రధానంగా చూస్తున్నారు. అత్యవసరంలో ఎంత సమయంలో ఆస్పత్రికి చేరుకోవచ్చు? ఎంత దగ్గరలో వైద్య సదుపాయాలు ఉన్నాయనేది ఆరా తీస్తున్నారు. ఇంట్లో పిల్లలు, పెద్దల ఆరోగ్య అవసరాల రీత్యా వీటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఆట స్థలాలు..

ఇల్లు విశాలంగా ఉండటమే కాదు కమ్యూనిటీలో సకల సౌకర్యాలు ఉండాలనేది నేటి గృహ కొనుగోలుదారుల మాట. పిల్లల కోసం క్రీడా సదుపాయాలు, పెద్దలకు క్లబ్‌హౌస్, జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలు ఉండాలని భావిస్తున్నారు. ఎక్కువ ఖాళీ స్థలం వదిలి, పచ్చదనం అధికంగా ఉంటే ఇష్టపడుతున్నారు.

డే కేర్ సెంటర్..

చిన్న కుటుంబాల నేపథ్యంలో పిల్లల ఆలనాపాలనా చూసే డే కేర్ సౌకర్యాలు ఉండాలని గృహ కొనుగోలుదారులు చూస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ కార్యాలయాలకు వెళితే పిల్లలను చూసుకోవడం కష్టం అవుతుంది. వర్క్ ఫ్రం హోమ్ ఉన్నా పిల్లలపై శ్రద్ధ పెట్టలేని పరిస్థితి. కాబట్టి కమ్యూనిటీలో డే కేర్ సదుపాయాలు ఉండాలని కోరుకుంటున్నారు.

ఆఫీసుకు దగ్గరలో..

ఇల్లు కొనేటప్పుడు ఆఫీసుకు ఎంత దూరంలో ఉందనేది కస్టమర్ల ప్రాధామ్యాలలో ఒకటి. నగరంలో ట్రాఫిక్‌లోనే అధిక సమయం వృథా అవుతుంది కాబట్టి దూరం, సమయం అనేది ప్రధానంగా మారాయి. ప్రజా రవాణా సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటున్నారు.

వీకెండ్ ఎంజాయ్..

వీకెండ్ వస్తే కుటుంబంతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు షాపింగ్ మాల్స్, థియేటర్లు ఎంత దూరంలో ఉన్నాయనేవి కూడా కొనుగోలు ఎంపికలో భాగమైపోయాయి. పచ్చని ప్రకృతిని ఆస్వాదించాలని కోరుకునే నివాసితులు శివారు ప్రాంతాలలో ఫామ్‌హౌస్‌లు, విల్లాల కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు.

జీఎస్టీ ఎవరు కట్టాలి?

ల్యాండ్ ఓనర్, బిల్డర్ల మధ్య సందిగ్ధం

కొత్తవైనా, రీ–డెవలప్‌మెంట్ అయినా 5 శాతం జీఎస్టీ

పన్ను చెల్లించాల్సిన బాధ్యత బిల్డర్‌దే..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గృహాలకు డిమాండ్ పెరుగుతోంది. మెరుగైన మౌలిక వసతులు, పారిశ్రామిక ప్రగతి కారణంగా కొత్త ప్రాంతాలలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. మరోవైపు ప్రధాన నగరంలో స్థలం కొరత కారణంగా గృహ నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత ఇళ్లను కూల్చివేసి వాటి స్థానంలో కొత్తవి నిర్మించడం మినహా నిర్మాణదారులకు ప్రత్యామ్నాయం లేదు. ఖైరతాబాద్, అబిడ్స్, బేగంపేట, సనత్‌నగర్, ఈఎస్ఐ, బంజారాహిల్స్ వంటి ప్రాంతాల్లో ఇలాంటి రీ–డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇండిపెండెంట్ హౌస్‌లు, నాలుగైదు అంతస్తుల అపార్ట్‌మెంట్లను కూల్చేసి ఆ స్థలంలో హైరైజ్ భవనాలను నిర్మిస్తున్నారు. ఇందుకోసం భూయజమానులు, ఫ్లాట్ ఓనర్లతో బిల్డర్లు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకుంటారు. ఖాళీ స్థలాలను అభివృద్ధికి తీసుకుంటే 50 నుంచి 40 శాతం, ప్రాంతాన్ని బట్టి 60 శాతం ఫ్లాట్లను భూయజమానికి ఇస్తామని ఒప్పందం చేసుకుంటారు. మిగిలిన వాటినే డెవలపర్ అమ్ముకుంటాడు.

- కూల్చి కట్టినా, ఖాళీ ప్రదేశంలో కొత్త భవనాలు కట్టినా పూర్తయిన ఇళ్లకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చెల్లించాల్సి ఉంటుంది. భూయజమాని వాటా కింద వచ్చిన జీఎస్టీ ఎవరు చెల్లించాలనే అంశంపై ల్యాండ్ ఓనర్లకు, బిల్డర్లు మధ్య వాగ్వాదం నెలకొంటుంది. డెవలపర్ చెల్లించాలని భూయజమాని, ల్యాండ్ ఓనరే కట్టాలని బిల్డర్ల మధ్య సందిగ్ధం నెలకొంది. భవనం కట్టడంతో స్థలం విలువ పెరిగిందని, దీంతో 5 శాతం జీఎస్టీ చెల్లించాలని ప్రభుత్వం బిల్డర్‌కు నోటీసులు పంపిస్తుంది. వాస్తవానికి కొత్తవైనా, పాతవైనా భవనానికి జీఎస్టీ చెల్లించాల్సిన బాధ్యత బిల్డర్‌దే. కాకపోతే భూయజమాని, కస్టమర్ల నుంచి బిల్డర్ జీఎస్టీ వసూలు చేసి కట్టాల్సింది డెవలపరే..

హరిత భవనాలకు ఆదరణ



సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ అనుకూలమైన హరిత భవనాలకు ఆదరణ పెరుగుతోంది. అపార్ట్‌మెంట్లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలే కాదు ప్రభుత్వం నిర్మించిన సచివాలయం, పోలీసు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, జిల్లా కలెక్టరేట్లు, ఇతరత్రా ఆఫీసు భవనాలు సైతం పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మిస్తుండటమే ఇందుకు ఉదాహరణ.. స్వచ్ఛమైన గాలి, వెలుతురు రావడంతో పాటు సహజ వనరులను వినియోగించుకోవడం, విద్యుత్, నీటి పొదుపు, సౌరశక్తి వినియోగం, గృహోపకరణాలు సైతం ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) అనుగుణంగా ఉండటమే హరిత భవనాల ప్రత్యేకత.

- గ్రీన్ బిల్డింగ్స్‌లో 60 శాతం వరకు నీటి వృథాను అరికట్టవచ్చు. నిత్యావసరాలకు వినియోగించే నీరు బయటకు పంపకుండా వాటిని రీసైకిల్ చేసి తిరిగి మొక్కలు, బాత్‌రూమ్ అవసరాలకు వాడుకోవచ్చు. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి వర్షపు నీటిని నిల్వ చేస్తారు. సాధారణ భవనాలతో పోలిస్తే గ్రీన్ బిల్డింగ్స్‌లో నిర్మాణ వ్యయం 8–10 శాతం అధికంగా ఉంటుంది. కానీ.. ఈ భవనాలలో నీరు, విద్యుత్ పొదుపు అవుతున్న కారణంగా ఇంటి నిర్మాణం కోసం అదనంగా వెచ్చించిన వ్యయం 2–3 ఏళ్లలో తిరిగి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.
- ఇంటి నిర్మాణ సమయంలోనే రీసైకిల్ మెటీరియల్స్‌ను ఉపయోగించడం గ్రీన్ బిల్డింగ్స్ మరొక ప్రత్యేకత. పర్యావరణానికి హాని చేయని ఉత్పత్తులనే నిర్మాణంలో వాడుతుంటారు. ఇటుకల నుంచి టైల్స్ వరకు గ్రీన్ ఉత్పత్తులు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో 720కి పైగా గ్రీన్ బిల్డింగ్ ప్రాజెక్ట్‌లు ఐజీబీసీ వద్ద రిజిస్టర్ అయ్యాయి. దేశవ్యాప్తంగా 11 వేల నిర్మాణాలు ఉన్నాయని ఐజీబీసీ ప్రతినిధులు చెబుతున్నారు.

హై.. రైజింగ్!

కోలుకుంటున్న నగర స్థిరాస్తి రంగం

- ఫిబ్రవరిలో 5,900 ప్రాపర్టీల రిజిస్ట్రేషన్
- అంతకు ముందు నెలతో పోలిస్తే 10 శాతం ఎక్కువ
- రిజిస్ట్రేషన్ ప్రాపర్టీల విలువ రూ.3,925 కోట్లు
- నైట్‌ఫ్రాంక్ ఇండియా అధ్యయనం వెల్లడి

కొత్త ప్రభుత్వం, ప్రతికూల ఆర్థిక పరిస్థితులు, వడ్డీ రేట్ల భారం, హైడ్రా దూకుడు కారణాలేవైనా ఏడాదిన్నర కాలంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒడిదొడుకుల్లో ఉంది. ఈ ఏడాది ఆరంభం నుంచి మార్కెట్ క్రమంగా పుంజుకుంటోంది. ప్రభుత్వ స్థిరమైన విధానాలు, కార్యాచరణ, స్థిరపడిన ధరలు తదితర కారణాలతో జనవరి నుంచి నగర స్థిరాస్తి రంగం కోలుకుంటోంది. గత నెలలో గ్రేటర్‌లో రూ.3,925 కోట్లు విలువ చేసే 5,900 యూనిట్లు రిజిస్ట్రేషన్ కాగా.. జనవరిలో రూ.3,293 కోట్ల విలువైన 5,464 ప్రాపర్టీలు రిజిస్ట్రేషన్ అయ్యాయి. నెల రోజుల్లో విలువల్లో 13 శాతం, యూనిట్ల రిజిస్ట్రేషన్లలో 10 శాతం వృద్ధి నమోదైందని నైట్‌ఫ్రాంక్ ఇండియా అధ్యయనం వెల్లడించింది.

–సాక్షి, సిటీబ్యూరో



నగరవాసులు లగ్జరీ ప్రాపర్టీల కొనుగోళ్లకే మొగ్గు చూపుతున్నారు. విశాలమైన ఇళ్ల కోసం ఎంత ఖర్చు చేసేందుకైనా నా వెనకాడట్లేదు. గతేడాది ఫిబ్రవరిలో రూ.50 లక్షల లోపు ధర ఉన్న గృహాలు 59 శాతం విక్రయించగా.. గత నెలకొచ్చేసరికి వీటి వాటా 56 శాతానికి తగ్గింది. వీటి స్థానంలో రూ.కోటి కంటే ఎక్కువ ధర ఉన్న లగ్జరీ ప్రాపర్టీల వాటా గతేడాది ఫ్రిబవరిలో 15 శాతంగా ఉండగా.. ఇప్పుడది ఏకంగా 18 శాతానికి పెరిగింది. అలాగే 2 వేల చ.అ. కంటే విస్తీర్ణమైన ఇళ్ల వాటా 2024 ఫిబ్రవరిలో 13 శాతంగా ఉండగా.. గత నెలలో 17 శాతానికి పెరిగింది. 1,000–2,000 చ.అ. మధ్య ఉన్న ప్రాపర్టీల వాటా 71 శాతం నుంచి 67 శాతానికి తగ్గింది.



ధరల వారీగా రిజిస్ట్రేషన్ గణాంకాలివీ..

యూనిట్ల ధర	2024 ఫిబ్రవరి	2025 ఫిబ్రవరి
రూ.50 లక్షలలోపు	4,243	3,374
రూ.50–రూ.కోటి మధ్య	1,847	1,561
రూ.కోటిపైన	1,045	1,053



ఏజెంట్లపై ఆర్టీఏ ఐ!



ఆర్టీఏ కార్యాలయాల్లో ఏఐ సీసీ కెమెరాలు

- ఖైరతాబాద్ ఆర్టీఏలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు
- కెమెరాలో రికార్డయ్యే ప్రతి వ్యక్తికి ఒక కోడ్
- ఒకే వ్యక్తి పదేపదే కనిపిస్తే ఏజెంటుగా గుర్తింపు
- మొదటి వారంలోనే 45 మందిని గుర్తించిన కెమెరాలు
- దశలవారీగా అన్ని ఆర్టీఏ కేంద్రాలకు విస్తరణ

సాక్షి, హైదరాబాద్: ఏజెంట్లు, దళారుల ఆట కట్టించేందుకు రవాణాశాఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అస్త్రాన్ని ప్రయోగించింది. ఏఐ ఆధారిత సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ నిఘా కెమెరాలు క్లిక్‌మనిపించే ప్రతి వ్యక్తికి ఒక కోడ్ నమోదవుతుంది. ఆ కోడ్ ఆధారంగా సదరు వ్యక్తి ఒక రోజులో ఎన్నిసార్లు ఆర్టీఏ కార్యాలయానికి వచ్చాడు? ఏ పని కోసం వచ్చాడనేది ఇట్టే తెలిసిపోతుంది. సాధారణంగా ఏజెంట్లు, దళారులు మాత్రమే ఆర్టీఏ కార్యాలయాల వద్ద తిష్ట వేస్తారు. నిఘా కెమెరాల్లో వాళ్లకు సంబంధించిన కోడ్ నంబర్లు పదేపదే నమోదవుతాయి. ఒక రోజులో, ఒకవారంలో ఒక కోడ్ ఎన్నిసార్లు కనిపించింది అనే విశ్లేషణ ఆధారంగా దళారులను అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కేంద్ర కార్యాలయంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ సీసీ కెమెరాలు విజయవంతంగా పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవస్థను దశలవారీగా రాష్ట్రంలోని అన్ని రవాణా కార్యాలయాలకు విస్తరించనున్నారు. చెక్‌పోస్టుల్లోనూ వీటిని ఏర్పాటు చేసి రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఒక అధికారి చెప్పారు.

ఏజెంట్లదే హవా

కొన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ఏజెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు, సిబ్బంది సహాయంతో అన్ని రకాల పౌరసేవల్లో హవా కొనసాగిస్తున్నారు. క్లర్క్‌లు, అసిస్టెంట్లుగా పనులు చక్కబెడుతున్నారు. వీరు అధికారుల వద్ద కీలకంగా మారటంతో డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు, తదితర పనుల కోసం వచ్చేవారు ఈ ఏజెంట్లను ఆశ్రయిస్తున్నారు. కొన్నిచోట్ల కార్యాలయాల వెలుపల బాహాటంగానే దుకాణాలు తెరుచుకొని పని చేస్తున్నారు. డ్రైవింగ్ స్కూళ్ల నిర్వాహకులు కూడా ఏజెంట్లుగానే వ్యవహరిస్తున్నారు. దీంతో పౌరసేవలపై ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే రెండు రెట్లు అధికంగా సమర్పించుకోవలసి వస్తోంది. ఏజెంట్లను అరికట్టేందుకు ఇప్పటివరకు 17 రకాల సేవలను ఆన్‌లైన్‌లోకి మార్చారు. కానీ తరచూ సాంకేతిక సమస్యలు వస్తుండటంతో అవి పారదర్శకంగా అమలు కావడం లేదు.

వారంలోనే 45 మందిని పసిగట్టిన ఏఐ

ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏఐ కెమెరాలు వారం రోజుల్లో 45 మంది పదేపదే ఆఫీసుకు వచ్చినట్లు పసిగట్టాయి. ఆర్టీఏ ప్రాంగణంలోనే ఉన్న ఈ సేవా కేంద్రంలో పనిచేసే కొందరు ఉద్యోగులు మినహాయించి మిగతావాళ్లంతా ఏజెంట్లుగా తేలింది. దీంతో ఏజెంట్లను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. బారికేడ్లు ఏర్పాటు చేసి ఆర్టీఏ సేవల కోసం వచ్చేవాళ్లు మినహా ఇతరులు లోపలికి ప్రవేశించకుండా పోలీసులతో ఆంక్షలు విధించారు. ఆ తరువాత రెండు వారాల్లోనే దళారుల రాకపోకలు చాలా వరకు తగ్గుముఖం పట్టినట్లు అధికారులు చెప్పారు. ఈ నిఘా వ్యవస్థను త్వరలో సికింద్రాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్నట్లు ఒక అధికారి చెప్పారు. ఆ తర్వాత మెహిదీపట్నం, ఉప్పల్, బండ్లగూడ, మేడ్చల్, ఇబ్రహీంపట్నం, కొండాపూర్, మణికొండ, కూకట్‌పల్లి, మలక్‌పేట, నాగోల్ తదితర ప్రాంతీయ రవాణా కార్యాలయాలకు, డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లకు విస్తరించనున్నారు. ఆ తదుపరి అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నారు.

రాష్ట్రంలోని అన్ని ఆర్టీఏ చెక్‌పోస్టులకు కూడా ఏఐ నిఘా వ్యవస్థను విస్తరించనున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి ప్రవేశించే వాహనాలను తనిఖీ చేసేందుకు భైంసా, కామారెడ్డి, జహీరాబాద్, అలంపూర్, క్రిష్ణా, విష్ణుపురం, నాగార్జునసాగర్, కోదాడ, మద్నూరు, సాలూరు, వాంకిడి, కల్లూరు, అశ్వారావుపేట, పాల్వంచలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నిజానికి దేశవ్యాప్తంగా నేషనల్ పర్మిట్ విధానం, జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరువాత ఈ చెక్‌పోస్టుల అవసరం లేకుండా పోయింది. ఏపీ సహా పలు రాష్ట్రాల్లో చెక్‌పోస్టులను ఎత్తేసినా తెలంగాణలో మాత్రం కొనసాగుతున్నాయి.

చెక్‌పోస్టుల్లో ఏఐ నిఘా

14 వేల మంది అధ్యాపకులు..
60 లక్షల పేపర్లు..



నేటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ సమాధాన పత్రాల మూల్యాంకనం

19 స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రాలు

- నెల రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసేందుకు ఏర్పాట్లు
- ఏప్రిల్ చివరి వారంలో కంప్యూటరీకరణ.. మే మొదటి వారంలో ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యార్థుల భవితవ్యం తేల్చే.. జవాబుపత్రాల మూల్యాంకనం శనివారం నుంచి ప్రారంభమవుతోంది. దాదాపు నెల రోజుల పాటు జరిగే ఈ ప్రక్రియ కోసం ఇంటర్‌బోర్డు పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. క్షుణ్నంగా, ఎలాంటి లోపాలు లేకుండా, పలు స్థాయిల్లో పరిశీలనతో మూల్యాంకనం ప్రక్రియ చేపట్టనున్నారు. మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత ఫలితాలను విడుదల చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 19 స్పాట్ వ్యాల్యుయేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు.. సుమారు 60 లక్షల జవాబుపత్రాలను దిద్దాల్సి ఉంటుందని వెల్లడించారు.

మూల్యాంకనంలో వివిధ స్థాయిలు..

సమాధాన పత్రాలను అనేక స్థాయిల్లో పరిశీలిస్తారు. తర్వాతే మార్కులను ఖరారు చేస్తారు. రోజు కు ఒక్కో అధ్యాపకుడు 40 సమాధాన పత్రాలను మాత్రమే మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. వారిని అసిస్టెంట్ ఎగ్జామినర్ అంటారు. పరీక్షలో ఇచ్చిన ప్రశ్నలకు తగిన సమాధానాలను నిపుణులు మూల్యాంకన ప్రక్రియ కోసం పంపుతారు. వీటి ఆధారంగా అసిస్టెంట్ ఎగ్జామినర్ జవాబుపత్రాలను పరిశీలించి మార్కులు వేస్తారు. కొన్ని పరిమితుల మేరకు విచక్షణాధికారంతో మార్కులు వేయవచ్చు. తర్వాత ఆ జవాబు పత్రం చీఫ్ ఎగ్జామినర్‌కు వెళ్తుంది. వారు మార్కులను, మూల్యాంకన తీరును పరిశీలిస్తారు. తర్వాతి దశలో జవాబు పత్రం సబ్జెక్టు నిపుణుల వద్దకు వెళ్తుంది. ఎక్కడైనా పొరపాటు ఉంటే నిపుణులు సరిచేస్తారు. ప్రతీ ప్రక్రియ, ప్రతీ మార్పును చీఫ్ ఎగ్జామినర్ రికార్డు చేస్తారు. ఇన్ని దశలు దాటిన తర్వాత మార్కులు బోర్డుకు చేరతాయి. మూల్యాంకన సమయంలో ఇచ్చిన కోడ్‌ను ఇంటర్ బోర్డ్‌లో డీకోడ్ చేస్తారు. ఆ విద్యార్థి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. సాఫ్ట్‌వేర్‌పై ట్రయల్ రన్ కూడా చేస్తారు. కొందరు విద్యార్థుల మార్కులను నమోదు చేసి, సాంకేతిక లోపాలేమైనా ఉన్నాయా? అని మానవ వనరుల ద్వారా పరిశీలిస్తారు. ఇలా 4 రౌండ్లు ట్రయల్ జరుపుతారు. ఎలాంటి సమస్య లేని పక్షంలో తుది దశ ఫలితాలను పొందుపరుస్తారు.

నెలరోజులపాటు మూల్యాంకనం..

ఇంటర్ సమాధాన పత్రాల మూల్యాంకనం శనివారం మొదలై సుమారు నెల రోజుల పాటు కొనసాగుతుంది. మే మొదటి వారంలో ఫలితాలు వెల్లడించే అవకాశం ఉందని ఇంటర్ బోర్డ్ అధికారులు తెలిపారు. మూల్యాంకనం ప్రక్రియను ఈసారి ఆధునిక పద్ధతుల్లో చేపట్టబోతున్నారు. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డ్ కార్యాలయానికి ప్రతీ కేంద్రాన్ని అనుసంధానం చేస్తున్నారు. ఈసారి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. మూల్యాంకనం చేసే అధ్యాపకులు ఏ సమయంలో వస్తున్నారు? ఎప్పుడు కేంద్రం నుంచి వెళ్తున్నారనే వివరాలను రికార్డు చేస్తారు. ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు లేని అధ్యాపకులనే మూల్యాంకనం కోసం ఎంపిక చేయాలని జిల్లా అధికారులకు బోర్డ్ ఆదేశాలిచ్చింది.

మొత్తం 60 లక్షల పేపర్లు

ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 9,96,971 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. వీరందరి అన్ని సబ్జెక్టులు కలిపి సుమారు 60 లక్షల సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ కోసం 14 వేల మంది లెక్చరర్లను ఎంపిక చేశారు.

శాస్త్రీయ విధానంలో మూల్యాంకనం



స్పాట్ వ్యాల్యుయేషన్ జరిగే 19 కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. ఈసారి బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తున్నాం. మరింత శాస్త్రీయ పద్ధతిలో ఈసారి మూల్యాంకనం ఉండబోతోంది. ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నెల రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

\- జయప్రద బాయి, ఇంటర్ పరీక్షల విభాగం ముఖ్య అధికారి

31లోగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలి

కలెక్టర్లకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: అనుమతిలేని లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ నెల 31లోగా ఎల్‌ఆర్‌ఎస్ అమలులో 100% పురోగతి సాధించాలని, తప్పిదాలకు తావు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. దరఖాస్తుదారులు భవన నిర్మాణ అనుమతులు తీసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. శుక్రవారం దానకిశోర్ ఎల్‌ఆర్‌ఎస్‌పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తుదారులకు సంబంధించి ప్రొసీడింగ్ జనరేట్ చేసి అందజేయాలన్నారు. ఇప్పటికీ ఫీజు చెల్లించని దరఖాస్తుదారులకు రెండో దఫా ఫోన్ చేసి మార్చి 31లోగా ఫీజులు చెల్లించేలా చూడాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేందుకు.. జిల్లా కలెక్టర్లు సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ వల్ల కలిగే ప్రయోజనాలు దరఖాస్తుదారులకు తెలిసేలా ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఈ నెల 24న మరోసారి జిల్లా కలెక్టర్లు, కమిషనర్‌లతో సమీక్ష నిర్వహిస్తానని ముఖ్య కార్యదర్శి చెప్పారు.

ఓటర్లకు థ్యాంక్స్ చెబుదాం

- ఎమ్మెల్సీలను గెలిపించినందుకు బీజేపీ కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచిన సి.అంజిరెడ్డి, మల్క కొమరయ్య.. తమ నియోజకవర్గాల పరిధిలోని ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపేలా వివిధ కార్యక్రమాలను చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లోని మండలాల్లో సమావేశాలు నిర్వహించి.. ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపే కార్యక్రమాలు నిర్వహించనుంది. వచ్చే ఆదివారం నుంచి వీటిని నిర్వహించాలని సూత్రప్రాయంగా పార్టీ నేతలు నిర్ణయించారు. రెండు మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశమున్నందున.. ముందుగా ముఖ్యనేతలు, కార్యకర్తలతో రాష్ట్రస్థాయి వర్క్‌షాపు నిర్వహించాలని నిర్ణయించారు. ఆ తర్వాత జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని, 569 మండలాలు, జెడ్పీటీసీ స్థానాలకు ఒక్కొక్క ఇన్‌చార్జిని నియమించి ఇప్పటినుంచే ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ భావిస్తోంది. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి రాష్ట్ర పార్టీ సంస్థాగత ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తివారీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసిన వివిధ కమిటీలతో సమీక్ష నిర్వహించారు.

మండు వేసవిలో ముంచెత్తిన అకాల వర్షం

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఈదురుగాలులతో వడగళ్ల వాన

- వందల ఎకరాల్లో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మామిడి పంటలు
- ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లో గోడకూలి వృద్ధుడి మృతి
- రాష్ట్రవ్యాప్తంగా తగ్గిన గరిష్ట ఉష్ణోగ్రతలు
- మరో రెండ్రోజులూ వానలు కురవొచ్చన్న వాతావరణ శాఖ
- కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశం.. సీఎస్ ఉన్నతస్థాయి సమీక్ష





1. జగిత్యాల జిల్లా బుగ్గారం గ్రామంలో నేలకొరిగిన మొక్క జొన్న పంట
2. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం మద్దుల్ తండాలో కురిసిన వడగండ్లు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, నెట్‌వర్క్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలంగాణలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నిండు వేసవిలో ఉన్నపళంగా అకాల వర్షం ముంచెత్తింది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల్లోని పలు మండలాల్లో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. దీంతో ఆయా మండలాల్లో వందలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి పంటలతోపాటు కూరగాయల పంటలకు సైతం తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల వ్యవసాయ మార్కెట్లలో ఆరబోసిన ధాన్యం, పసుపు రాశులు కొట్టుకుపోయాయి. చెట్లు విరిగిపడి చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని నవేగాంబస్తీకి చెందిన దౌలత్ (65) అనే వృద్ధుడు గోడ కూలి మృతిచెందాడు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని లింగంపల్లి (ఖుర్దు) గ్రామంలో పిడుగుపాటుకు రెండు గేదెలు మృత్యువాతపడగా అదే మండలంలోని పోతాయిపల్లిలో మూడు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. పట్టణంలోని పోచమ్మ గుడి ఎదుట ఉన్న 150 ఏళ్ల భారీ మర్రిచెట్టు నేలకూలింది. పెద్దపల్లిలో అత్యధికంగా 3.28 సెం.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

సాధారణం కంటే 3 డిగ్రీలు తగ్గిన ఉష్ణోగ్రతలు

అకాల వర్షాల వల్ల శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గాయి. చాలాచోట్ల సాధారణం కంటే 3 డిగ్రీల సెల్సియస్ తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు శని, ఆదివారాల్లో రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో శనివారం కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉన్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి.లీలా రాణి తెలిపారు. అలాగే నిర్మల్, నిజామాబాద్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

కలెక్టర్లను అప్రమత్తం చేసిన సీఎం

మరో రెండ్రోజులు వర్షసూచన నేపథ్యంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సంబంధిత జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించాలని సీఎస్ శాంతికుమారికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో శాంతికుమారి శుక్రవారం రాత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వడగళ్ల వాన వల్ల నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయా జిల్లాల అధికార యంత్రాంగం ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అకాల వర్షాల వల్ల ఏర్పడే నష్టాల అంచనాలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు.

చెన్నైకి సీఎం రేవంత్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్

- నేడు డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల సదస్సుకు హాజరు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెన్నై వెళ్లారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలో జరిగే దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలు పార్టీల నేతల సదస్సులో పాల్గొనేందుకు ఆయన శుక్రవారం రాత్రి చెన్నైకి చేరుకున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా ఈ సమావేశంలో పాల్గొనేందుకు చెన్నైకి చేరుకున్నారు. వీరిద్దరూ శనివారం జరిగే సదస్సులో పాల్గొని సాయంత్రానికి హైదరాబాద్ చేరుకుంటారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

డీలిమిటేషన్‌తో ప్రాంతీయ విభేదాలు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలతో ప్రాంతీయ విభేదాలు తలెత్తుతాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం పెరిగి, మరికొన్నింటికి తగ్గడంతో ప్రాంతీయ అసమానతలు ఏర్పడి, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్రం నుంచి అందే నిధులతో పాటు దక్షిణాదికి రాజకీయ ప్రాతినిధ్యం కూడా తగ్గిపోతుందన్నారు. డీలిమిటేషన్‌పై డీఎంకే నిర్వహిస్తున్న అఖిలపక్ష భేటీకి హాజరయ్యేందుకు శుక్రవారం సాయంత్రం చెన్నైకి చేరుకున్న కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. డీలిమిటేషన్ మూలంగా దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై స్పందించకుంటే చరిత్ర మనలను క్షమించదన్నారు. డీ లిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలను బీఆర్‌ఎస్ వ్యతిరేకిస్తోందని, ఈ అంశంపై కలిసి కట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు రాజకీయాలను సమూలంగా మార్చే ఈ అంశంపై అందరూ స్పందించాలన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

ఎంఐఎం నేత అక్బరుద్దీన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పురోభివృద్ధికి యువత రాజకీయాల్లోకి రావాలని, సరికొత్త ఆలోచనలు రాష్ట్రానికి అవసరమని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు నాయకత్వం వహించే యువతను ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్‌పై శాసనసభలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సిన వాటా ఇవ్వడం లేదని, మారుమూల జిల్లాల అభివృద్ధి నిధులు అందడం లేదని తెలిపారు. ఇన్నిసార్లు ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి దీనిపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతి విషయంలోనూ కేంద్రం వివక్ష చూపుతోందన్నారు. ఈ అంశాలను గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించకపోవడం విచారకరమన్నారు.

పదేళ్ల పాలనలో ఆర్థిక విధ్వంసం

రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణలో ఆర్థిక విధ్వంసం జరిగిందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ ఆరోపించారు. ఆయన రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీ సుశీల్ కుమార్‌తో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం శరవేగంతో పురోగతి సాధించినా.. ఇసుక విక్రయాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి అదే నిష్పత్తిలో ఆదాయం సమకూరలేదని విమర్శించారు.

రాష్ట్ర అభివృద్ధిలో నాబార్డ్‌ది కీలకపాత్ర

- రాష్ట్రంలో నాబార్డ్ కార్యకలాపాలకు పూర్తి సహకారం
- సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి.. బ్యాంకు చైర్మన్ షాజీ కేవీతో చర్చలు



షాజీ కేవీని సత్కరిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో కోదండరెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) కీలక భాగస్వామిగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో నాబార్డ్ కార్యకలాపాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. నాబార్డ్ చైర్మన్ షాజీ కేవీ గురువారం సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో నాబార్డ్ సహకారంతో చేపడుతున్న వివిధ కార్యక్రమాలను సీఎంకు వివరించారు. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఆర్ఐడీఎఫ్), నాబార్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ (నిడా), మైక్రో ఇరిగేషన్ ఫండ్ (ఎంఐఎఫ్) తదితర సంస్థల ద్వారా జరుగుతున్న కార్యక్రమాల గురించి తెలిపారు. మహిళా స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ) ద్వారా సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, ఎస్‌హెచ్‌జీల ద్వారా గ్రామీణ గిడ్డంగుల నిర్మాణం వంటి కార్యక్రమాలకు నాబార్డ్ రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. పామాయిల్ ప్రాసెసింగ్, ఎంఎస్‌ఎంఈ రంగం, గ్రామీణ టూరిజం, డెయిరీ, మత్స్య రంగాలు, ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో నాబార్డ్ సహకారంపై ఈ సందర్భంగా చర్చించారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలకు పూర్తి సహకారం అందిస్తామని షాజీ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నాబార్డ్ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ బి.ఉదయ్ భాస్కర్, ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వ్యవసాయ, పశుసంవర్థక శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, సీఎం కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌తో నల్లగొండ జిల్లా ముఖ్య నేతల భేటీ

- వరంగల్ బహిరంగ సభ, రజతోత్సవాలపై చర్చ



కేసీఆర్‌తో గ్యాదరి కిశోర్, జగదీశ్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, సునీత

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావుతో భేటీ అయ్యారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డితో పాటు పార్టీ మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి (భువనగిరి), గ్యాదరి కిశోర్‌కుమార్ (తుంగతుర్తి), గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి ఉన్నారు. పార్టీ రజతోత్సవాల నిర్వహణ, ఏప్రిల్ 27న జరిగే భారీ బహిరంగ సభ ఏర్పాట్లకు సంబంధించి పార్టీ నేతలతో కేసీఆర్ చర్చించారు. త్వరలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మిగతా ఎనిమిది నియోజకవర్గాల ముఖ్య నేతలతోనూ సమావేశం ఉంటుందని కేసీఆర్ ప్రకటించారు. కాగా, వరంగల్ సభకు జన సమీకరణ, వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని జన సమీకరణలో పాటించాల్సిన జాగ్రత్తలపై కేసీఆర్ పలు సూచనలు చేసినట్లు సమాచారం. వరంగల్‌కు సమీపంలో ఉండే జిల్లాలు, నియోజకవర్గాల నుంచి ఎక్కువ సంఖ్యలో జన సమీకరణ జరిగేలా చూడాలని కేసీఆర్ తనను కలిసిన నేతలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను నల్లగొండ నేతలు కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందనే విషయాన్ని కేసీఆర్ వద్ద ప్రస్తావించారు. ప్రభుత్వంలో సమన్వయం లేదని, అనుభవరాహిత్యం అడుగడుగునా కనిపిస్తోందని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు సమాచారం.

సాగును లాభసాటిగా మార్చేందుకు కృషి: శ్రీధర్‌బాబు



జర్మనీ ప్రభుత్వ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధస్సు (ఏఐ) లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీలను వ్యవసాయానికి అనుసంధానించి సాగు రంగాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం అసెంబ్లీ ప్రాంగణంలో జర్మనీ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఫెడరల్ మినిస్ట్రీ ఏషియా హెడ్ రెబెకా రిడ్డర్ ఆధ్వర్యంలో జర్మనీ ప్రభుత్వ ప్రతినిధులు మంత్రి శ్రీధర్‌బాబుతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఎమర్జింగ్ టెక్నాలజీలతో అన్ని రంగాల పరిశ్రమలను అనుసంధానించేందుకు ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి వారికి వివరించారు. రాష్ట్రంలో సుమారు 55 నుంచి 60 శాతం మంది ప్రజలు వ్యవసాయం, వ్యవసాయాధారిత పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. సాగులో రైతన్నలు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు టెక్నాలజీ పరిష్కారం చూపించగలదన్నారు. ఆ దిశగా రైతులకు మేలు జరిగేలా మరిన్ని నూతన ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విదేశాల్లో మాదిరిగానే భారత్‌లోనూ మానవ ప్రమేయం లేకుండా 'అగ్రి రోబో'లే వ్యవసాయం చేసే రోజులు త్వరలో వస్తాయన్నారు. వీటి తయారీకి ఇప్పటికే పరిశోధనలు మొదలయ్యాయని మంత్రి వివరించారు. సాగు వ్యయం తగ్గేలా, రైతన్నలకు మేలు చేసే కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే సంస్థలు, వ్యక్తులను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామని తెలిపారు. వ్యవసాయ రంగంలో టెక్నాలజీ వినియోగంపై జర్మనీ ప్రభుత్వంతో కలసి పని చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.జానయ్య, రీసెర్చ్ డైరెక్టర్ డా.బలరాం, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ డా.రాములు, డిజిటల్ అగ్రికల్చర్ డైరెక్టర్ డా.బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయకపోతే చర్యలు తప్పవు: సీతక్క



సాక్షి, హైదరాబాద్ : అధికారులు సరిగా తాగునీటిని సరఫరా చేయలేకపోయినా, నీటిఎద్దడి ఏర్పడిందంటూ వచ్చే తప్పుడు వార్తలను ఖండించకపోయినా చర్యలు తీసుకుంటామని పీఆర్ మంత్రి సీతక్క అధికారులను హెచ్చరించారు. తాగునీటి సమస్యలు, నీటికి కటకటా అంటూ ఇటీవల పత్రికల్లో వచ్చిన వార్తలపై అధికారుల నుంచి శుక్రవారం వివరణ తీసుకున్నారు. 'క్షేత్రస్థాయిలో సమస్యలున్నట్టు కొన్ని పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. మీడియా కథనాలు తప్పా? మీ నివేదికలు తప్పా' అని అధికారులను ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌కు అధికారం పోగానే తాగునీరు రావట్లేదని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

సాక్షి బిజినెస్
శనివారం
22-3-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
557	160
76,906	23,350

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	17,659	▽	36
డోజోన్స్	41,922	▽	32
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,647	▽	55
డాక్స్	22,892	▽	107
షాంఘై	3,365	▽	123
నికాయ్ (ఇంట్రాడే ముగింపు)	37,677	▽	75

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
88,169	▲	337
బంగారం (99.5 స్వచ్ఛత)		
87,816	▲	336
వెండి (కిలో)		
97,620	▽	772

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.80	86.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	110.40	113.24
€	యూరో	ఎస్‌బీఐ	92.23	94.89
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.17	58.64
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.68	56.54
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.13	66.80
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.03	23.58
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.52	24.30
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.98	12.81

మణప్పురంలో బెయిన్‌కు వాటా

- రూ. 4,385 కోట్లతో 18 శాతం కొనుగోలు
- మరో 26 శాతం వాటాకు ఓపెన్ ఆఫర్
- షేరుకి రూ. 236 చొప్పున కొనుగోలుకి సై
- ఆఫర్‌కు మరో రూ. 5,764 కోట్ల వెచ్చింపు

న్యూఢిల్లీ: పీఈ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ బంగారంపై రుణాలందించే మణప్పురం ఫైనాన్స్‌లో 18 శాతం వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు రూ. 4,385 కోట్లు వెచ్చించనుంది. తద్వారా గోల్డ్ లోన్ కంపెనీ ప్రమోటర్ సంస్థలలో ఒకటిగా అవతరించనుంది. దీంతో నిబంధనల ప్రకారం సాధారణ వాటాదారుల నుంచి మరో 26 శాతం వాటా కొనుగోలుకి ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఒక్కో షేరుకి రూ. 236 చొప్పున ధర నిర్ధారించింది. ఇందుకు మరో రూ. 5,764 కోట్లు కేటాయించనుంది. వెరసి విస్తరించిన తదుపరి మణప్పురం ఫైనాన్స్ చెల్లించిన మూలధనంలో 41.7 శాతానికి బెయిన్ వాటా బలపడనుంది.

6 నెలల సగటు ధర

ప్రిఫరెన్షియల్ పద్ధతిలో బెయిన్‌కు ఈక్విటీతోపాటు.. వారంట్లను మణప్పురం కేటాయించనుంది. గత ఆరు నెలల సగటు ధరకంటే 30% అధిక(ప్రీమియం) ధరతో వీటిని జారీ చేయనుంది. వీటితో విస్తరించనున్న కంపెనీ ఈక్విటీలో బెయిన్‌కు 18% వాటా లభించనుంది. తద్వారా మణప్పురం ఫైనాన్స్‌లో సహప్రమోటర్ కానుంది. దీంతో వారంట్లు మినహా మిగిలిన ఈక్విటీ నుంచి సాధారణ వాటాదారులకు ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఆఫర్ పూర్తిగా విజయవంతమైతే బెయిన్ వాటా వారంట్ల మార్పిడి తదుపరి 41.7%కి బలపడనుంది. ఇదే సమయంలో ప్రస్తుత ప్రమోటర్ల వాటా 28.9 %కి చేరనుంది. అయితే ఈ లావాదేవీలకు నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు లభించవలసి ఉంది.

1949లో ఆవిర్భావం: ఎన్‌బీఎఫ్‌సీ.. మణప్పురం ఫైనాన్స్ 1949లో కేరళలో ఏర్పాటైంది. 5,357 బ్రాంచీలుసహా 50,795 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు కొనసాగిస్తోంది. బంగారు ఆభరణాలపై రుణాలు అందిస్తూ మైక్రో, వాహన, గృహ, ఎస్ఎంఈ ఫైనాన్స్‌లోకి సైతం విస్తరించింది.

షేరు 8 శాతం జూమ్...

సాధారణ వాటాదారులకు బెయిన్ క్యాపిటల్ ఓపెన్ ఆఫర్ ప్రకటించిన నేపథ్యంలో మణప్పురం ఫైనాన్స్ షేరు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో షేరు 7.7 శాతం జంప్‌చేసి రూ. 234 వద్ద ముగిసింది. ఒక దశలో 14 శాతం దూసుకెళ్లి రూ. 248కు చేరింది. ఇది 52 వారాల గరిష్టం.

సంక్షోభంలో 'సూక్ష్మం'

- ఆల్‌టైం గరిష్టానికి మొండిబాకీలు; రూ. 50,000 కోట్లకు ఎన్‌పీఏలు
- నిధుల కొరత సమస్యలు
- సతమతమవుతున్న మైక్రోఫైనాన్స్ కంపెనీలు
- రేటింగ్స్ డౌన్‌గ్రేడ్‌ల ముప్పు



ఆర్థిక సేవలు అంతగా అందని వర్గాలకు రుణాల సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిన సూక్ష్మ రుణాల రంగం సంక్షోభ పరిస్థితులు ఎదుర్కొంటోంది. పెరిగిపోతున్న మొండిబాకీలు, నియంత్రణ నిబంధనల్లో మార్పులు, నిధుల కొరత సమస్యలతో పరిశ్రమ కుదేలవుతోంది. క్రెడిట్ బ్యూరో క్రిఫ్ హై మార్క్ గణాంకాల ప్రకారం గతేడాది డిసెంబర్ ఆఖరు నాటికి మైక్రోఫైనాన్స్ రంగంలో మొండిబాకీలు (ఎన్‌పీఏ) ఆల్‌టైం గరిష్ఠ స్థాయి రూ. 50,000 కోట్లకు ఎగబాకాయి. మొత్తం స్థూల రుణాల పోర్ట్‌ఫోలియోలో ఇది 13%. ఇక ఎన్‌పీఏగా మారే రిస్కులున్న రుణాల పోర్ట్‌ఫోలియో దాదాపు 1% నుంచి 3.3 శాతానికి పెరిగిపోయింది. ఇలాంటి పరిణామాలతో ఇప్పటికే కొన్ని సంస్థల రేటింగ్ పడిపోగా మరిన్ని సంస్థలకు కూడా డౌన్‌గ్రేడ్ ముప్పు నెలకొంది.

ఎడాపెడా రుణాలు..

ఆర్థిక పరిస్థితులపై ఆశావహ భావంతో మైక్రోఫైనాన్స్ రంగం గత ఆర్థిక సంవత్సరం భారీగా రుణాలిచ్చేసింది. 2023-24 నాలుగో త్రైమాసికంలో అత్యధికంగా రూ. 48,322 కోట్ల మేర రుణాలిచ్చింది. ఇలాంటి దూకుడు ధోరణే ప్రస్తుత సమస్యకు కారణాల్లో ఒకటయ్యింది. రెండు మూడు సంస్థల దగ్గర అప్పులు తీసుకున్న వారు, సమయానికి వాటిని కట్టలేకపోతుండటంతో రుణాలిచ్చిన సంస్థలపై తీవ్ర ప్రభావం పడుతోంది. అవి రుణ కార్యకలాపాలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఎంఎఫ్ఐల స్థూల రుణాల పోర్ట్‌ఫోలియో 3.53 శాతం మేర క్షీణించి రూ. 3.85 లక్షల కోట్లకు పరిమితమైనట్లు మైక్రోఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్స్ నెట్‌వర్క్ ఓ నివేదికలో తెలిపింది. అసెట్ క్వాలిటీ కూడా బాగా దెబ్బతిందని వివరించింది. ఇక 91-180 రోజుల వ్యవధి గల మొండిబాకీలు 2023 డిసెంబర్ క్వార్టర్‌లో నమోదైన 0.9 శాతంతో పోలిస్తే 2024 డిసెంబర్ త్రైమాసికంలో ఏకంగా 3.3%కి చేరాయి. 30 రోజులకు మించి బాకీపడిన రుణాల పరిమాణం 3.5% నుంచి 8.8%కి ఎగిసింది. మరోవైపు, క్యూ3లో రుణ వితరణ 35.8% క్షీణించి రూ. 22,091 కోట్లకు పరిమితమైంది.

ఎంఎఫ్ఐలు తమ వ్యాపార కార్యకలాపాలకు కావల్సిన నిధుల కోసం ఎక్కువగా బ్యాంకులు, డెవలప్‌మెంట్ ఫైనాన్స్ సంస్థలపై (డీఎఫ్ఐ) ఆధారపడుతుంటాయి. కానీ, ప్రస్తుత పరిస్థితుల రీత్యా వాటికి నిధులు సమకూర్చే విషయంలో బ్యాంకులు కూడా ఆచి తూచి వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికే ఇచ్చిన రుణాలను కొంత పునర్‌వ్యవస్థీకరించినా, కొత్త రుణాలివ్వడం కాస్త కష్టతరమే కావొచ్చని ఇండియా రేటింగ్స్ వర్గాలు వెల్లడించాయి. ఇలా తామిచ్చిన రుణాలు సకాలంలో వసూలు కాక, అటు వ్యాపారాన్ని విస్తరించేందుకు రుణాలు రాక ఎంఎఫ్ఐలకు క్లిష్ట పరిస్థితి ఏర్పడిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఎంఎఫ్ఐలు, వడ్డీవ్యాపారులు బలవంతపు రికవరీ పద్ధతులకు పాల్పడకుండా కర్ణాటక అమల్లోకి తెచ్చిన కఠినతర ఆర్డినెన్స్ నిబంధనల వల్ల వసూళ్లపై ప్రతికూల ప్రభావం పడొచ్చనే అంచనాలు నెలకొన్నాయి.

డౌన్‌గ్రేడ్ల పరంపర..: ఆర్థిక పనితీరు అంతంత మాత్రంగానే ఉండటంతో పలు మైక్రో ఫైనాన్స్ సంస్థల రేటింగ్స్ పడిపోతున్నాయి. స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్‌ను (ఎస్ఎఫ్ఎల్) ఇక్రా, కేర్ రేటింగ్స్ డౌన్‌గ్రేడ్ చేశాయి. డిసెంబర్ క్వార్టర్లో ఎస్ఎఫ్ఎల్ రూ. 601 కోట్ల నష్టం ప్రకటించగా, రూ. 700 కోట్లు రైటాఫ్ చేసింది. అటు ఊహించిన దానికన్నా అసెట్ క్వాలిటీ, లాభదాయకత గణనీయంగా తగ్గిపోవడంతో ఫ్యూజన్ మైక్రోఫైనాన్స్ రేటింగ్‌ను గతేడాది నవంబర్‌లోనే ఏజెన్సీలు డౌన్‌గ్రేడ్ చేశాయి. క్రెడిట్‌యాక్సెస్ గ్రామీణ్ సైతం క్యూ3లో లాభాల నుంచి నష్టాల్లోకి జారిపోయింది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

మార్చి క్వార్టర్‌పై ఆశలు ..

మొండి బాకీల సమస్య గరిష్ఠ స్థాయికి చేరిందని, ఇక నుంచి ఇది క్రమంగా తగ్గుముఖం పట్టొచ్చని ఎంఎఫ్ఐఎన్ సీఈవో అలోక్ మిశ్రా తెలిపారు. మార్చి త్రైమాసికం నాటికి లిక్విడిటీతో పాటు రుణ నాణ్యత కూడా మెరుగుపడొచ్చని పేర్కొన్నారు. ప్రాధాన్యతా రంగాలకు రుణలివ్వాల్సిన నిబంధనను పాటించాల్సినందున బ్యాంకుల నుంచి నిధులు లభించి, నాలుగో త్రైమాసికంలో పరిస్థితులు బాగుండవచ్చని భావిస్తున్నారు. అయితే, బ్యాంకులు మాత్రం ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. తీవ్ర ప్రతికూల పరిస్థితులు పరిశ్రమలో కన్సాలిడేషన్‌కి దారి తీసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

తెలంగాణలో రూ. 1,000 కోట్ల ఆదాయం లక్ష్యం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వచ్చే రెండేళ్లలో తెలంగాణ మార్కెట్లో రూ. 1,000 కోట్ల వ్యాపారాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు గోద్రెజ్ జెర్సీ సీఈవో భూపేంద్ర సూరి వెల్లడించారు. ప్రస్తుతం ఇది సుమారు రూ. 660 కోట్లుగా ఉంది. అలాగే, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విలువ జోడింపు ఉత్పత్తుల అమ్మకాలను సుమారు రూ. 550 కోట్ల నుంచి రూ. 1,000 కోట్లకు పెంచుకోనున్నట్లు సూరి చెప్పారు. ఇందుకోసం పన్నీర్, బాదం మిల్క్, పెరుగు వంటి ఉత్పత్తులపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో జెర్సీ బాదం మిల్క్ రూ. 100 కోట్ల బ్రాండ్‌గా మారనుందన్నారు. ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవడంతో పాటు మార్కెటింగ్ పైనా గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నామని వివరించారు. రానా దగ్గుబాటి, షెఫ్ తేజాలను (విస్మయ ఫుడ్స్) ప్రచారకర్తలుగా నియమించుకున్నట్లు సూరి చెప్పారు. 2026 ఆర్థిక సంవత్సరంలో కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ కోసం పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై 50 శాతం అదనంగా వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో రోజుకు దాదాపు 2 లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్నట్లు సూరి వివరించారు.



గోద్రెజ్ జెర్సీ సీఈవో భూపేంద్ర సూరి (కుడివైపు)

అయిదోరోజూ లాభాలే..

- సెన్సెక్స్ 557 పాయింట్లు ప్లస్
- నిఫ్టీ లాభం 160 పాయింట్లు



ముంబై: అధిక వెయిటేజీ కలిగిన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో పాటు విదేశీ ఇన్వెస్టర్ల పునరాగమనంతో స్టాక్ సూచీలు వారాంతాన లాభాలతో ముగిశాయి. ఫెడ్ రిజర్వ్ రేట్ల తగ్గింపు సంకేతాలు, డాలర్ ఇండెక్స్ బలహీనత అంశాలు దలాల్ స్ట్రీట్‌లో ఆశావాదాన్ని నెలకొల్పాయి. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 557 పాయింట్లు పెరిగి 76,906 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 160 పాయింట్లు బలపడి 23,350 వద్ద నిలిచింది. సూచీలకిది వరుసగా అయిదు రోజూ లాభాల ముగింపు. ఇంట్రాడేలో సెన్సెక్స్ 694 పాయింట్లు ఎగసి 77 వేల స్థాయిపై 77,042 వద్ద, నిఫ్టీ 212 పాయింట్లు బలపడి 23,403 వద్ద గరిష్టాలు తాకాయి. స్టాక్ మార్కెట్ వరుస ర్యాలీతో అయిదురోజుల్లో రూ.22.12 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.413.30 లక్షల కోటకు చేరింది. శుక్రవారం ఒక్కరోజే రూ.4.91 లక్షల కోట్లు ఇన్వెస్టర్ల సొంతమయ్యాయి.

రూపాయి ఆరోరోజూ జూమ్

38 పైసలు బలపడి 85.98 వద్ద ముగింపు

రూపాయి విలువ ఆరోరోజూ బలపడింది. డాలర్ మారకంలో 38 పైసలు పెరిగి 85.98 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, దేశీ ఈక్విటీ మార్కెట్‌లోని సానుకూలతలు కలిసొచ్చాయి. ఇంట్రాడేలో 44 పైసలు ఎగసి 85.93 గరిష్టాన్ని తాకింది. 6 ట్రేడింగ్ సెషన్లలో 123 పైసలు బలపడింది. కాగా ఫిబ్రవరి 10న 87.95 స్థాయి వద్ద జీవితకాల కనిష్టాన్ని తాకింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

ఐపీవోకు ఫిజిక్స్‌వాలా	స్విస్ వాచీల స్టోర్స్ విస్తరణలో బ్రైట్‌లింగ్

ఎలక్ట్రిక్ త్రీ-వీలర్స్‌లోకి హీరో మోటో



యూలర్ మోటార్స్‌లో 32.5% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: వాహనాల తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ తాజాగా ఎలక్ట్రిక్ త్రీ-వీలర్స్ విభాగంలోకి ప్రవేశించింది. ఇందులో భాగంగా యూలర్ మోటార్స్‌లో 32.5 శాతం వాటా కొనుగోలు చేసింది. దీని కోసం ఏకమొత్తంగా లేదా విడతలవారీగా రూ. 525 కోట్ల వరకు వెచ్చించనుంది. ఎలక్ట్రిక్ త్రీ-వీలర్, ఫోర్-వీలర్ మార్కెట్లో కార్యకలాపాలు విస్తరించడానికి ఈ పెట్టుబడి ఉపయోగపడుతుందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పవన్ ముంజల్ చెప్పారు.

క్లుప్తంగా...

ఎంఓసీసీ కమిటీ చైర్మన్‌గా తెలుగు తేజం

- ప్రతిష్టాత్మక కమిటీకి తెనాలివాసి డాక్టర్ రమేష్ సారథ్యం



తెనాలి: జాతీయ భద్రతా అంశాల అధ్యయనానికిగాను 'మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సు' (ఎంఓసీసీ) రూపకల్పన కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నియమించిన ప్రతిష్టాత్మక కమిటీకి తెలుగు వ్యక్తి డాక్టర్ రమేష్ కన్నెగంటి సారథ్యం వహించనున్నారు. హైదరాబాద్ కేంద్రంగా దేశ అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలపై పనిచేస్తున్న ఏకైక 'మానవ రక్షణ అధ్యయన సంస్థ' (సీహెచ్ఎస్ఎస్) వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అయిన డాక్టర్ రమేష్‌కు ఈ విభాగంలో విశేష అనుభవం ఉంది. జాతీయ విద్యావిధానం ప్రకారం సిలబస్, కోర్సు కంటెంట్‌ను ఖరారు చేయటం, 'స్వయం' ప్లాట్‌ఫామ్‌పై కోర్సును సకాలంలో అభివృద్ధి చేసి అందించటం కమిటీ ప్రధాన బాధ్యతని డాక్టర్ రమేష్ 'సాక్షి'కి తెలిపారు.

లిఫ్ట్ తీగ తెగిపడి వృద్ధురాలి మృతి

- ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఘటన



సరోజనమ్మ

ఖమ్మంక్రైం: గుండెపోటుతో ఆస్పత్రికి వచ్చిన ఓ వృద్ధురాలికి స్టెంట్ వేశారు. అంతా సవ్యంగా జరిగిందని ఆమె కుటుంబసభ్యులు ఆనందంలో ఉన్నారు. కానీ అది కొద్ది గంటల్లోనే ఆవిరైపోయింది. లిఫ్ట్ రూపంలో మృత్యువు ఆ వృద్ధురాలిని కబళించింది. ముదిగొండ మండలం వనంవారి కిష్టాపురం గ్రామానికి చెందిన సట్టు సరోజనమ్మ(64)కు మూడు రోజుల క్రితం గుండెపోటు రాగా, ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. శుక్రవారంరాత్రి మూడో అంతస్తులోని ఆపరేషన్ థియేటర్‌లో ఆమెకు స్టంట్ వేశారు. తిరిగి రెండో అంతస్తులోని ఐసీయూకు తరలించేందుకు లిఫ్ట్ వద్దకు తీసుకొచ్చారు. మొదట వార్డ్‌బాయ్ దుర్గాప్రసాద్ లిఫ్ట్‌లోకి వెళ్లగా స్ట్రెచర్ సగం బయటే ఉంది. మరోబాయ్ రవి బయటే ఉండగా దుర్గాప్రసాద్ లోపల రెండో నంబర్ బటన్ నొక్కాడు. లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య ఎదురై కిందకు రాకుండా తలుపులు మూసుకోకుండానే పైకి వెళ్లింది. అప్పటికే బయట ఉన్న రవి స్ట్రెచర్‌ను లాగే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. దీంతో సరోజనమ్మ సెల్లార్‌లో పడిపోవడంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందింది. దుర్గాప్రసాద్, రవికి గాయాలయ్యాయి.

రాష్ట్రీయం

పేపర్లు తారుమారు

వికారాబాద్ జిల్లా తాండూర్‌లో సంస్కృతం బదులుగా తెలుగు ప్రశ్నపత్రం

- వాట్సాప్‌లో చక్కర్లు కొట్టిన తెలుగు ప్రశ్నపత్రం
- నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో వెలుగులోకి వచ్చిన ఘటన
- గందరగోళం సృష్టించడానికే వదంతుల ప్రచారం: పాఠశాల విద్య డైరెక్టర్
- మంచిర్యాలలో తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రం
- రాష్ట్రవ్యాప్తంగా టెన్త్ పరీక్షలు షురూ.. 99.67 శాతం హాజరు

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, నల్లగొండ/సాక్షి, నెట్‌వర్క్: పదోతరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థులు భాషా పరీక్ష రాశారు. టెన్త్ పరీక్షల కోసం 5,09,403 మంది రిజిస్టర్ చేసుకోగా, తొలి పరీక్షకు 4.95 లక్షల మంది హాజరయ్యారు. హాజరుశాతం 99.67గా నమోదైంది. నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో తెలుగు ప్రశ్నపత్రం వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టింది. దీంతో ఆ సెంటర్‌లో విద్యార్థులు పరీక్ష ముగిశాక కూడా 45 నిమిషాల పాటు వేచి ఉండాల్సి వచ్చింది. వాట్సాప్‌లో ప్రశ్నపత్రం చక్కర్లు కొట్టిన విషయమై పాఠశాల విద్య డైరెక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ గందరగోళం సృష్టించడానికే వదంతులు ప్రచారం చేశారన్నారు. వికారాబాద్, తాండూర్‌లలో సంస్కృతం పేపర్‌కు బదులుగా తెలుగు ప్రశ్నపత్రం ఇచ్చారు. అయితే దీనిని ఆలస్యంగా గుర్తించి అధికారులు మళ్లీ సంస్కృతం పేపర్ ఇచ్చి పరీక్ష రాయించారు. మంచిర్యాలలోనూ తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రం ఇచ్చారు. దీంతో విద్యార్థులు రెండు గంటలు ఆలస్యంగా పరీక్ష రాయాల్సి వచ్చింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదని, ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని టెన్త్ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు.

నకిరేకల్ నుంచి లీక్ అయ్యిందా !


పదోతరగతి పరీక్ష ప్రారంభమైన 20 నిమిషాలకే నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని యువకుల వాట్సాప్‌లలో టెన్త్ తెలుగు ప్రశ్నపత్రం చక్కర్లు కొట్టింది. అందులోని ప్రశ్నలకు అనుగుణంగా టెస్ట్ పేపర్లలోని జవాబు పత్రాలతో యువకులు హల్‌చల్ చేశారు. జవాబులన్నీ ఒకే పేపర్‌లో వచ్చే విధంగా జిరాక్స్‌లు తీసి స్థానిక పరీక్ష కేంద్రాల్లోకి పంపించేందుకు హల్‌చల్ చేశారు. అయితే బందోబస్తులో ఉన్న పోలీసులు విషయం తెలియక పెద్దగా పట్టించుకోలేదు. అయితే ప్రశ్నపత్రంలోని ప్రశ్నలకు అనుగుణంగా జిరాక్స్ తీసిన జవాబుల ప్రతులు ఆ సమయంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు చేరాయా? లేదా? ప్రశ్నపత్రం వాట్సాప్‌లో ఎక్కడెక్కడికి వెళ్లిందన్నది తేలాల్సి ఉంది. ప్రశ్నపత్రం లీకేజీ విషయంపై అధికారులు శాలిగౌరారం, నకిరేకల్ పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం గోప్యంగా విచారణ జరిపారు. బయటకు వచ్చిన ఆ ప్రశ్నపత్రం నకిరేకల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి లీక్ అయినట్టు తెలిసింది. దీనికి బాధ్యుడైన వ్యక్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

45 నిమిషాల పాటు పరీక్ష కేంద్రాల్లోనే విద్యార్థులు

ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో విద్యార్థులను పరీక్ష ముగింపు సమయం గడిచినా, 45 నిమిషాల వరకు శాలిగౌరారంలోని పరీక్ష కేంద్రం నుంచి బయటకు పంపించలేదు. లీకైన పేపర్ ఫొటోతో పరీక్ష కేంద్రాల్లోని విద్యార్థులకు ఇచ్చిన ప్రశ్నపత్రాలతో సరిపోల్చి చూశారు. లీకైన పేపర్ సీరియల్ నంబరుతో మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రాల్లోని పేపర్ సీరియల్ నంబర్లతో పోల్చి చూశారు. లీకైన టెన్త్ తెలుగు ప్రశ్నపత్రం సీరియల్ నంబరు 1495550గా అధికారులు గుర్తించారు. విచారణ తర్వాత మధ్యాహ్నం 1:15 గంటలకు ఉన్నతాధికారుల ఆదేశంతో విద్యార్థులను బయటకు పంపించారు. సీరియల్ నంబరు వేరుగా ఉన్నా, అందులోని ప్రశ్నలకు, విద్యార్థులకు అందజేసిన ప్రశ్నాపత్రాల్లోని ప్రశ్నలకు మధ్య తేడా ఏమీ లేదని అధికారులు గుర్తించినట్టు తెలిసింది. లీకేజీ ఘటనలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుని పాత్రపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నకిరేకల్‌లో నివాసముంటున్న ఆ ఉపాధ్యాయుడు తన కుమార్తె కోసమే ఈ చర్యకు పాల్పడ్డారని అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై విచారణ జరిపామని నల్లగొండ డీఈవో భిక్షపతి పేర్కొన్నారు. పరీక్షల సందర్భంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన చీఫ్ సూపరింటెండెంట్ గోపాల్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ రామ్మోహన్‌రెడ్డిలను పరీక్ష విధుల నుంచి తొలగించారు. ఒక ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశారు. నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో పదో తరగతి తెలుగు పేపరు లీకేజీ ఘటనలోనే వారిపై చర్యలు చేపట్టినట్టు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

సంస్కృతం బదులు తెలుగు పేపర్

వికారాబాద్ జిల్లా తాండూరులోని టీజీఎస్ఆర్ బాలికల గురుకులానికి చెందిన టెన్త్ విద్యార్థి నాగలక్ష్మితో పాటు మరో విద్యార్థి పట్టణంలోని శివసాగర్ కేంద్రంలో పరీక్ష రాసేందుకు వెళ్లారు. అయితే తమకు సంస్కృతం ప్రశ్నపత్రానికి బదులు తెలుగు ప్రశ్నపత్రం ఇచ్చారని చెప్పినా, ఇదే మీ పేపర్ అంటూ ఆ విద్యార్థులతో బలవంతంగా పరీక్ష రాయించారు. మధ్యాహ్నం 12:30 గంటలకు తమ తప్పిదాన్ని గుర్తించిన ఇన్విజిలేటర్లు ఆ ఇద్దరు విద్యార్థులతో 3 గంటల వరకు సంస్కృతం పేపర్ రాయించారు.



వాట్సాప్‌లో వచ్చిన ప్రశ్నపత్రం

- తాండూరులోని ఫ్రంట్‌లైన్ ఎగ్జామ్ సెంటర్‌లోనూ తెలంగాణ గురుకుల పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థి అంకితతో సంస్కృతం బదులు తెలుగు పేపర్ రాయించారు. గంట తర్వాత అసలు విషయం తెలుసుకొని సంస్కృతం పేపర్ అందజేశారు.

తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రం

మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలోకి మొదటిరోజు ప్రశ్నపత్రం బదులు.. రెండోరోజు ప్రశ్నపత్రాలు రావడంతో గందరగోళం నెలకొంది. అధికారుల తప్పిదంతో విద్యార్థులు రెండు గంటల ఆలస్యంగా పరీక్ష రాశారు. తొలిరోజు తెలుగుకు బదులు హిందీ ప్రశ్నపత్రాలు ఉన్నట్టు గుర్తించి, మళ్లీ 20 బాక్సులను వెతికి తెలుగు ప్రశ్నపత్రం తీసుకొచ్చేలోపు సమయం వృథా అయ్యింది. ఈ ఘటనపై కలెక్టర్ కుమార్ దీపక్ వివరణ ఇస్తూ.. ట్రంకు బాక్సులో రెండో రోజు ప్రశ్నపత్రాలు ఉన్నట్టు, ప్రశ్నపత్రాల కవర్ తెరవకుండానే గుర్తించామని, మొదటి రోజు ప్రశ్నపత్రం ఏ బాక్సులో ఉందో వెతికేందుకు గంటన్నర సమయం పట్టిందని, విద్యార్థులు ఆ సమయం నష్టపోకుండా పరీక్షకు 3 గంటలు యథావిధిగా కల్పించామన్నారు. రెండో రోజు పరీక్ష పత్రం లీక్ కాలేదని, పోలీసుస్టేషన్‌లో భద్రంగా ఉందన్నారు. పరీక్ష సజావుగా నిర్వహించని కారణంగా పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సఫ్దర్ అలీఖాన్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ పద్మజలను సస్పెండ్ చేసి, వీరిస్థానంలో మరొకరికి బాధ్యతలు ఇచ్చామన్నారు.

కేంద్రాలకు వెళ్లడమూ ఓ పరీక్షే

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అటవీ ప్రాంతంలోని అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు రోజూ పరీక్షలు రాసేందుకు 25 కి.మీ దూరంలోని దోమలపెంటకు రావాల్సి వస్తోంది. అటవీమార్గం గుండా ఉన్న రహదారిపై ఆర్టీసీ బస్సులో వెళ్లేందుకు గంటన్నర, తిరిగి వచ్చేందుకు గంటన్నర సమయం పడుతోంది. దీంతో ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా, 6.30 గంటలకే వటవర్లపల్లి వద్ద బయలుదేరి, రానూపోనూ కలపి మొత్తం 50 కి.మీ. ప్రయాణించి పరీక్షలు రాస్తున్నారు.

కన్నీటి పరీక్ష

- మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం ముత్తపూర్ గ్రామానికి చెందిన మంచర్ల మల్లయ్య గురువారం రాత్రి అనారోగ్యంతో చనిపోయాడు. శుక్రవారం ఉదయం ఓ వైపు అంతిమ సంస్కారాలు జరుగుతుండగానే ఆయన కూతురు శ్రీలత పరీక్షకు హాజరైంది.
- నారాయణపేట జిల్లా నర్వ మండలం లంకాల్ గ్రామానికి చెందిన పాలెం అంజన్న శుక్రవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఆ బాధతోనూ ఆయన కూతురు అంజలి పరీక్ష రాశారు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం కల్తిరామయ్యగుంపు గ్రామానికి చెందిన కనపటి వీరస్వామి(45) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన ఇద్దరు కుమార్తెలు హర్షిత, ప్రియ రొంపేడులోని బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. తండ్రి చనిపోయిన విషయం పరీక్ష రాశాక కూతుళ్లకు చెప్పారు. ఇంటికి చేరుకున్నాక 'నాన్నా.. లే.. నాన్నా..'అంటూ వారు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.



పరీక్షకు వెళ్లే ముందు



తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న కూతుళ్లు

అనారోగ్యాన్ని లెక్క చేయకుండా...

- సిద్దిపేటకు చెందిన శ్వేత కేజీబీవీ మిట్టపల్లిలో 10వ తరగతిలో చదువుతోంది. ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కింద పడటంతో కాలు విరిగింది. శుక్రవారం ఉదయం రంగధాంపల్లి పరీక్ష కేంద్రానికి వద్దకు శ్వేత అంబులెన్స్‌లో వచ్చింది. స్ట్రెచర్ పైనే బంధువుల సాయంతో పరీక్ష రాసింది.
- పెద్దపల్లి జిల్లా అంతర్గాం టీటీఎస్ జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థి నందన్‌వర్మ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. ప్రథమ చికిత్స అందించిన తర్వాత ఆయన పర్యవేక్షణలో విద్యార్థి పరీక్ష రాశాడు. పరీక్ష పూర్తయ్యాక 108 అంబులెన్స్‌లో అదే పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. బాలుడు కోలుకున్నట్టు డాక్టర్ తెలిపారు.



స్ట్రెచర్‌పై పరీక్ష హాల్‌లోకి వెళ్తున్న శ్వేత

ఉద్యానశాఖ ఎస్టీ అధికారుల ప్రమోషన్లలో అవకతవకలు

- తెలంగాణ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యాన శాఖలో అడిషనల్ డైరెక్టర్ ప్రమోషన్ల విషయంలో ఎస్టీ (షెడ్యూల్డ్ ట్రైబ్) అధికారులపై వివక్ష జరుగుతోందని, ప్రమోషన్లలో అవకతవకలు జరుగుతున్నాయని తెలంగాణ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాంచందర్ నాయక్ ఆరోపించారు. 2010-11 సంవత్సరం నుంచి ఉద్యాన శాఖలో ప్రమోషన్ల విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని, కొంతమంది అధికారులపై అభియోగాలున్నప్పటికీ వారికి ప్రమోషన్లు ఇస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. 2004లో రావాల్సిన ప్రమోషన్లను నీరుగార్చి ఏపీఎంఐపీలో ఫారెస్ట్ అధికారులను పీడీలుగా కొనసాగించారని, 2003లో నియమించిన జేడీహెచ్‌లను పలు శాఖల్లో ఓఎస్డీలుగా నియమించారని వెల్లడించారు. ఎస్టీ రోస్టర్ పాయింట్ల ప్రకారం అర్హత ఉన్న ఎస్టీ అధికారులకు ప్రమోషన్లు ఇవ్వకుండా వారిని కింది స్థాయిలోనే కొనసాగిస్తున్నారని ఆరోపణలొచ్చాయన్నారు. నిబంధనల ప్రకారం, ఎస్టీ అధికారికి అర్హత లేకపోతే రిలాక్సేషన్ ఇచ్చి, క్యారీ ఫార్వర్డ్ స్థానాన్ని ఎస్టీ అధికారికి కేటాయించి, ఆ తర్వాత ప్రమోషన్లు చేపట్టాలని రాంచందర్ పేర్కొన్నారు.

అడవిలో పేలిన మందుపాతర

- ఒకరికి తీవ్ర గాయాలు



మందుపాతర పేలి గాయపడిన కృష్ణమూర్తి

వెంకటాపురం (కె): జీవనోపాధికి వెదురు బొంగుల కోసం అడవికి వెళ్లి మందుపాతరపై అడుగు వేయడంతో పేలి ఒకరికి తీవ్ర, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇప్పగూడెం గ్రామానికి చెందిన బొగ్గుల కృష్ణమూర్తి, సోడి నర్సింహారావు, కుర్సం ఎడమయ్య, పూసూరి నగేశ్ వెదురు బొంగుల కోసం ముత్యంధార జలపాతం అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. ముత్యంధార గుట్టపైకి ఎక్కి బొంగులను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తుండగా పక్కనే మందు పాతరపై కృష్ణమూర్తి కాలు వేశాడు. అది ఒక్కసారిగా పేలడంతో అతని రెండుకాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. మిగిలిన ముగ్గురికి స్వల్పగాయా లయ్యాయి. దీంతో వారిని జెడ్డి కట్టుకుని అటవీ ప్రాంతం నుంచి ప్రధాన రహదారి వరకు మోసుకుని వచ్చారు. అక్కడి నుంచి 108లో వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

నచ్చినట్లే ఉంటున్నారా?



చాలా మంది తెలిసో తెలియక కొన్ని ఫుడ్స్‌ను ఆరోగ్యానికి మంచిదని గుడ్డిగా నమ్మి తినేస్తున్నారు. ఫలితంగా ఆరోగ్యంగా ఉండటానికి బదులు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఇంతకీ ఆ ఫుడ్స్ ఏంటో తెలుసా?

● ఆరోగ్యమేనా?

కొంచెం చూసి తినండి!

ఫ్లేవర్డ్ ఓట్ మీల్...

ఓట్స్ మన ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో అందరికీ తెలుసు. కానీ ఇది స్వచ్ఛమైన, సాదా ఓట్ మీల్‌కి మాత్రమే వర్తిస్తుంది. అయితే రకరకాల ఫ్లేవర్స్‌తో రకరకాల ఓట్ మీల్స్ అందుబాటులో ఉన్నాయి. వీటిలో రుచిని పెంచడానికి కృత్రిమ రంగులు, చక్కెర సిరప్ వంటి అనేక ఆరోగ్యానికి హాని చేసే వస్తువుల్ని కలుపుతారు. ఇవి తినడం మంచిది కాదు.

బ్రౌన్ బ్రెడ్...

ఈ రోజుల్లో మార్కెట్లో లభించే బ్రౌన్ బ్రెడ్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇవి పేరుకు మాత్రమే బ్రౌన్ బ్రెడ్స్. చాలా మంది వీటిని చౌకగా అమ్ముతున్నారు. అంటే ఇలాంటి బ్రౌన్ బ్రెడ్‌లో శుద్ధి చేసిన పిండి, కృత్రిమ రుచి, రంగు, చక్కెరను ఉపయోగిస్తున్నారని అర్థం. అందుకే బ్రౌన్ బ్రెడ్ కొనేటప్పుడు కొంచెం ఖర్చు ఎక్కువైనా సరే మంచి బ్రాండ్ కొనడం మేలు.

ప్యాక్ చేసిన పండ్ల రసాలు లేదా స్మూతీలు...

మార్కెట్లో వివిధ రకాల పండ్ల రసాలు, స్మూతీలు ప్యాకెట్లలో సులభంగా లభిస్తాయి. ఆరోగ్యానికి మంచిదని వీటిని తెగ కొనేస్తున్నారు. నిజానికి, ఈ ప్యాక్ చేసిన జ్యూస్‌లలో కృత్రిమ రంగులు, చక్కెర, కృత్రిమ రుచులు మొదలైన అనారోగ్యకరమైన వస్తువులు కూడా ఉంటాయి. అందుకే వీటిని కొనే ముందు వాటి ప్యాక్ చెక్ చేస్తే పండ్ల రసాలు, స్మూతీల్లో ఏం వాడారో తెలుస్తుంది.

ఎనర్జీ డ్రింక్స్, స్పోర్ట్స్ డ్రింక్స్...

ఈ రోజుల్లో స్పోర్ట్స్ లేదా ఎనర్జీ డ్రింక్స్ తాగే అలవాటు చాలా మందికి ఉంది. అయితే, ఈ డ్రింక్స్ ఆరోగ్యానికి మంచిది కాదు. వీటిని తాగడం వల్ల కొంచెం ఎనర్జీ వస్తుందేమో కానీ.. రాను రాను అనారోగ్యం కూడా వస్తుంది. పిల్లలకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో కూడా ఈ డ్రింక్స్ తాగనివ్వకండి. వీటి బదులు ఇంట్లో చేసుకున్న పండ్ల జ్యూస్‌లు బెస్ట్.

బ్రేక్‌ఫాస్ట్ మిల్లెట్స్...

ఆరోగ్యకరమైన ఆహారం పేరుతో మార్కెట్లో బ్రేక్‌ఫాస్ట్ మిల్లెట్స్ అమ్ముతున్నారు. చాలా మంది ఈ ప్యాకేజ్డ్ మిల్లెట్స్ ఆరోగ్యానికి మంచిదని భావించి కొని తింటున్నారు. నిజానికి వీటిని తయారు చేయడానికి అదనపు చక్కెర, కత్రిమ రుచి కలుపుతారు. అంతేకాకుండా వీటిలో ఫైబర్ కూడా ఉండదు. వీటి బదులు సహజంగా దొరికే తృణధాన్యాలతో ఇంట్లోనే బ్రేక్‌ఫాస్ట్ చేసుకోవచ్చు.

ఇతర పరిస్థితులు ఎలా ఉన్నా సరే, జీవితంలో ఎప్పుడూ సంతోషంగా ఉండాలని అందరూ కోరుకుంటారు. అయితే, డబ్బు, ఆస్తులు, పరపతి ఉన్నా కొందరు సంతోషంగా ఉండలేరు. ఎందుకంటే ఇతరుల మాటలు, సలహాల వల్ల చాలా మంది తమను తాము మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఫలితంగా తమ సెల్ఫ్ ఐడెంటిటీని, తద్వారా సంతోషాన్ని కూడా కోల్పోతున్నారు. జీవితంలో ఇతరుల కోసం మార్చుకోకూడని అలవాట్లు ఏంటో తెలుసుకుందాం.



మీ గుర్తింపును కాపాడుకోండి

ఇలా ప్రవర్తించవద్దు, అలా మాట్లాడవద్దు, ఇలా ఆలోచించవద్దు అని ఇతరుల మీకు సలహాలు ఇస్తుంటే వాటిని అంతగా పట్టించుకోకండి. ఎందుకంటే ప్రతి ఒక్కరికి సొంత నిర్ణయాలు, ఆలోచనలు ఉంటాయి. వాటిని అనుసరించే ముందుకు సాగాలి. ఇతరుల్ని ఫాలో అయితే మీ సొంత గుర్తింపును కోల్పోయే ప్రమాదముంది. ఇతరుల కోసం ప్రతి రోజూ మిమ్మల్ని మీరు మార్చుకుంటూ పోతే.. చివరికి మిగిలేది ఏముండదు. ప్రపంచానికి భిన్నంగా ఉండటం, మీ గుర్తింపును కాపాడుకోవడం ఏ మాత్రం తప్పు కాదని గుర్తుంచుకోండి.

మీకు మీరే ముఖ్యం

మన అవసరాల్ని తీర్చుకుని మిగతావారిని పట్టించుకుంటే చాలా మంది స్వార్థపరులనే ట్యాగ్ వేసేస్తారు. మీకు మీరు ప్రాధాన్యత ఇచ్చుకోవడం స్వార్థం కాదని గుర్తుంచుకోండి. అది మీపై మీరు చూపించుకునే స్వీయ ప్రేమ. మీ ఆనందాన్ని, అవసరాల్ని ఇతరుల కోసం మార్చుకుంటే మిమ్మల్ని మీరు కోల్పోయినట్టే. ఇతరులకు అవసరమైనప్పుడు మాత్రమే సాయం చేయండి. ఎవరో ఏదో అనుకుంటారని ఇతరుల కోసం మీ అవసరాల్ని త్యాగం చేస్తే చాలా కోల్పోతారు.

కలల్ని, ఆశయాల్ని వదులుకోకండి

చాలా మంది మనం ఏదైనా నేర్చుకోవాలని ప్రయత్నం చేస్తుంటే సూటి పోటి మాటలతో వెనక్కు లాగే ప్రయత్నం చేస్తారు. ఈ వయసులో నువ్వు ఏం సాధిస్తావు. ఇందులో నష్టం తప్ప లాభం ఉండదు, వేరే పని చూసుకుంటే మంచిదని లేనిపోని సలహాలు ఇస్తుంటారు. అయితే, ఒకటి మాత్రం ఆలోచించండి. మీ జీవితాన్ని ఇతరుల ప్రకారం జీవించాలనుకోకూడదు. మీకు ఏదైనా సాధించాలని ఉంటే ఆ దిశగా అడుగులు వేయండి. మీ కలలకు విలువ ఇవ్వండి. లేదంటే తర్వాత పశ్చాత్తాపపడతారు.

వ్యక్తిగత వ్యవహారాలలో తలదూర్చనివ్వద్దు

ప్రతి వ్యక్తికి పర్సనల్ స్పేస్ ఉంటుంది. కొన్ని సీక్రెట్స్ దాచడంతో పాటు ఒంటరిగా గడిపే హక్కు ఉంది. అయితే, ఎవరైనా మిమ్మల్ని పదే పదే నియంత్రించడానికి ప్రయత్నిస్తుంటే వారికి దూరంగా ఉండటమే మేలు. వేరే వాళ్లు మీరు చేసే ప్రతి పనిలో జోక్యం చేసుకుంటుంటే అది ఏ మాత్రం సరైనది కాదని గమనించండి. మీ పర్సనల్ స్పేస్‌ని గౌరవించుకోండి. మీ వ్యక్తిగత జీవితంలో దూరవద్దని స్పష్టంగా చెప్పేయండి.

నో చెప్పడం నేర్చుకోండి

ఇతరులు ఎల్లప్పుడూ వారి మాటలే వినాలని, వారి కోసమే సమయం కేటాయించాలని భావిస్తారు. అంతేకాకుండా వారి కోరిక ప్రకారం ఇతరుల జీవించాలని కోరుకుంటారు. అయితే, వేరే వాళ్లు చెప్పే పనులన్నింటికీ యస్ చెప్పకుంటూ పోతే మీకు మిగిలేది ఏమీ ఉండదు. సంతోషం, ఆనందం అన్నీ దూరమైపోతాయి. అందుకే ఇతరులకు నో చెప్పడం నేర్చుకోండి. ఇతరులకు నో చెప్పడానికి ఎందుకు సంకోచం. మీ పరిమితుల్ని మీరే నిర్ణయించుకోండి.

పీస్ ఆఫ్ మైండ్

ఎవరైనా సరే, మీతో సంబంధం ఉన్నా లేకపోయినా మీ మానసిక ప్రశాంతతను చెడగొట్టే వారికి దూరంగా ఉండటమే మంచిది. కొందరు ఏం కాదు అంతా కరెక్ట్‌గా ఉందని మీ మనసును చికాకు పెట్టవచ్చు. కానీ, మీరే సంతోషం లేకుంటే దాని ఉపయోగం ఏంటి? అందుకే ప్రతికూల పరిస్థితులు, వ్యక్తుల నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోండి. మీ ఆనందానికి ప్రాముఖ్యత ఇవ్వండి.

నైతిక విలువలపై రాజీ వద్దు

కొందరు లేదా కొన్ని పరిస్థితులు మిమ్మల్ని మోసగాళ్లుగా, అబద్ధాల కోరుగా మార్చటానికి ప్రయత్నించవచ్చు. కొందరు మీ చేత తప్పు పనులు చేయించడానికి బలవంతం పెడతారు. అయితే, ఇక్కడ నైతిక విలువలు పాటించడం ముఖ్యమని గుర్తించుకోండి. ఎవరో చెప్పారని, వాళ్లు బలవంతం చేశారని చెడ్డ పనులు చేస్తే భవిష్యత్తులో కష్టాలే పలకరిస్తాయి. ప్రపంచం మొత్తం మీకు వ్యతిరేకంగా నిలబడినప్పటికీ.. ఏది కరెక్టో దానివైపే నిలబడండి.


సమతుల్యత... స్థిరత్వ సిద్ధి

ఆంజనేయాసనం అనేది యోగాలో ఒక భంగిమ. దీనిని క్రెసెంట్ మూన్ పోజ్ అని కూడా అంటారు. ఈ ఆసనం హనుమంతుడి తల్లి అంజన చేసే నృత్య భంగిమలోదిగా చెబుతారు. అందుకే ఈ ఆసనానికి ఆంజనేయాసనం అని పేరు.

ఈ ఆసనం ప్రయోజనాలు...

● శరీరాన్ని ఒక కాలు మీద స్థిరంగా ఉండేలా చూసుకోవాలి. దీనివల్ల సమతుల్యత కలుగుతుంది. స్థిరత్వం మెరుగుపడుతుంది. ఈ ఆసనాన్ని క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల శరీరానికి– మనసుకు మధ్య సమతుల్యత ఏర్పడుతుంది. ● హిప్ భాగం ఫ్లెక్సిబుల్ అవుతుంది. శరీరంపై అవగాహన కలుగుతుంది. కండరాలను బలోపేతం చేస్తుంది. కీళ్ల పనితీరును, ఉచ్ఛ్వాస–నిశ్వాసలను మెరుగు పరుస్తుంది. మానసిక, శారీరక సంబంధాన్ని బలోపేతం చేస్తుంది. మనస్సును స్థిరంగా ఉంచుతుంది.

● దిగువ శరీరాన్ని సాగదీయడానికి, ఛాతీని విశాలం చేయడానికి ఈ ఆసనం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.



ఎలా చేయాలంటే...

● ఎడమ మోకాలిని ముందుకు చాపి, కుడి కాలిని వెనక్కి వంచి, కుడి కాలి మునివేళ్లమీద ఉండాలి.

● తలను నిటారుగా ఉంచి, రెండు చేతులను కంటికి ఎదురుగా నమస్కార భంగిమలో ఉంచాలి.

● ఐదు దీర్ఘశ్వాసలు తీసుకోవడం, వదలడం చేయాలి.

శరీరాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ మనసును స్థిరంగా ఉంచే ఈ ఆసనంలో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ప్రతిరోజూ ఈ ఆసనాన్ని సాధనం చేయడం వల్ల మానసిక వికాసం కూడా మెరుగవుతుంది.

● మీకు తెలుసా?

తులసి... అల్లం కషాయం...

కాసిని తులసి ఆకులు, కొద్దిగా అల్లాన్ని నీటిలో మరిగించి కషాయం చేసుకోండి. రుచి కోసం కావాలంటే కాస్త తేనె కలపండి. ఈ డ్రింక్ తాగితే జీవక్రియ పెరుగుతుంది. అంతేకాకుండా బొడ్డు కొవ్వును తగ్గించడంలో సాయపడుతుంది. రోజూ ఈ డ్రింక్ తాగితే శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది.



తులసి టీ...

తులసి టీ తాగడం వల్ల జీవక్రియ పెరుగుతుంది. బెల్లీ ఫ్యాట్‌ని కరిగించే ప్రక్రియ వేగవంతం అవుతుంది. తులసి టీ కోసం ముందుగా 8–10 తులసి ఆకుల్ని నీటిలో మరిగించండి. అందులో కొంచెం తేనె, నిమ్మరసం కలిపి తాగవచ్చు. ఈ టీ బరువు తగ్గడానికి సాయపడటమే కాకుండా జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది.

హావభావాలతో ఆకట్టుకునేలా...



● గౌతమ్



● 'మైమ్' వీడియోలో గౌతమ్

హీరో మహేశ్‌బాబు తనయుడు గౌతమ్ ఘట్టమనేని '1 నేనొక్కడినే' (2014) సినిమా ద్వారా బాలనటుడిగా పరిచయమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ నటించలేదు. అయితే కొంతకాలంగా అమెరికాలోని న్యూయార్క్‌లో టిష్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ యూనివర్సిటీలో నటనలో శిక్షణ తీసుకుంటున్నాడు గౌతమ్. అందులో భాగంగా తనలోని యాక్టింగ్ స్కిల్స్‌ను బయటపెడుతూ కాలేజీలో గౌతమ్ చేసిన మైమ్ ప్రదర్శన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో ఓ అమ్మాయితో కలిసి క్యాండిల్ లైట్ డిన్నర్ చేస్తున్నట్లు కనిపించాడు. తొలుత నవ్వుతూ, తర్వాత కోప్పడుతూ... ఎలాంటి డైలాగులు లేకుండానే తన హావభావాలను వ్యక్తం చేశాడు. గౌతమ్ నటన భలే ఉందంటూ పలువురు నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. గౌతమ్, కాశ్వీ రమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ వీడియోను సెరాఫీనా జెరోమి తెరకెక్కించారు. ఈ వీడియోను గౌతమ్ తల్లి నమ్రత సోషల్ మీడియాలో పోస్ట్ చేసి– ''గౌతమ్ ఫస్ట్ థియేటర్ స్టేజ్ పెర్ఫార్మెన్స్ అద్భుతంగా ఉంది. చూసినవారంతా ఎంజాయ్ చేశారు. చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు 'జాయ్ ఆఫ్ డ్రామా' నిర్వహించే సమ్మర్ ప్రోగ్రామ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఇక్కడికి రావడం హ్యాపీ'' అని పేర్కొన్నారు.

లవ్... యాక్షన్




● ప్రతాని రామకృష్ణ గౌడ్

కిరణ్, అలేఖ్య రెడ్డి జంటగా, అక్సా ఖాన్, తులసి, అనూష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'దీక్ష'. ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో పి. అశోక్ కుమార్‌తో కలిసి నిర్మించారు. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ–''ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పని చేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్‌ని తీసుకుని లవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించిన చిత్రం 'దీక్ష'. రాజ్ కిరణ్ అద్భుతమైన ఐదు పాటలు, నేపథ్య సంగీతం అందించారు. త్వరలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.



రెండు భాగాలుగా కింగ్‌డమ్

విజయ్ దేవరకొండ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'కింగ్‌డమ్' రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. 'జెర్సీ' మూవీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. పీరియాడికల్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో ఇప్పటివరకూ కనిపించని వైవిధ్యమైన పాత్రలో విజయ్ కనిపించనున్నారు. ఈ సినిమాను తొలుత మార్చి 28న రిలీజ్ చేయాలనుకున్నారు మేకర్స్. అయితే ఆ తర్వాత మే 30న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉంటే... ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుందని కొన్నాళ్లుగా ప్రచారం జరుగుతోంది. కథ డిమాండ్ మేరకే ఈ సినిమాను రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారట. ఈ విషయాన్ని నిర్మాతల్లో ఒకరైన నాగవంశీ స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ– ''కింగ్‌డమ్'ని తొలుత రెండు భాగాలుగా రూపొందించాలనుకోలేదు. అయితే స్టోరీ డిమాండ్ చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. రెండో భాగం కోసమని మొదటి పార్ట్ కథను పెంచలేదు. రెండో భాగానికి 'కింగ్‌డమ్ స్క్వేర్' లేదా 'కింగ్‌డమ్ 2'.. ఏ టైటిల్ పెట్టాలి? అన్నది తొలి భాగం ఫలితం తర్వాత నిర్ణయిస్తాం'' అని తెలిపారు. ఇదిలా ఉంటే... విజయ్ దేవరకొండ నటించిన ఏ సినిమా ఇప్పటివరకూ రెండు భాగాలుగా రాలేదు. అలా వస్తున్న ఆయన మొదటి చిత్రం 'కింగ్‌డమ్' కానుండటం విశేషం. ఈ సినిమాకు సంగీతం: అనిరుధ్ రవిచందర్.



● విజయ్ దేవరకొండ

మీరు లేకుండా నేను లేను - సమంత

''సాధారణంగా హీరో లేదా హీరోయిన్లకు తాము నటించిన సినిమా హిట్ అయితేనే అభిమానం, ప్రేమ చూపేవారు ఎక్కువ ఉంటారు. కానీ, గత రెండేళ్లుగా నేను ఒక్క తమిళ సినిమా కూడా చేయలేదు. పైగా ఇటీవల నా ఖాతాలో ఏ హిట్ మూవీ లేదు. అయినా నాపై మీ (అభిమానులను ఉద్దేశించి) ప్రేమ, అభిమానం ఏమాత్రం తగ్గలేదు. మీ అభిమానం, ప్రేమ చూస్తుంటే మాటలు రావడం లేదు. మీ నుంచి ఈ స్థాయిలో ప్రేమాభిమానాలు పొందేందుకు నేను ఏం చేశానో కూడా అర్థం కావడం లేదు. ఏది ఏమైనా మీరు లేకుండా నేను లేను... మీ వల్లే ఈ స్థాయిలో ఉన్నాను'' అని సమంత అన్నారు. స్ఫూర్తిదాయక పాత్రల్లో ఆడియన్స్‌ని ఎంటర్‌టైన్ చేస్తున్నందుకు 'కె. బాలచందర్ హాల్ ఆఫ్ ఫేమ్' అవార్డుతో చెన్నైలో జరిగిన 'బిహైండ్‌వుడ్స్ అవార్డ్స్' వేడుకలో సమంతను సత్కరించారు నిర్వాహకులు. ఈ వేదికపై సమంత మాట్లాడుతూ–''కె. బాలచందర్ సార్ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఆయన సినిమాల్లో మహిళల పాత్రలు ఎంతో సహజంగా ఉంటాయి. ఆయన నుంచి నేనెంతో స్ఫూర్తి పొందాను. అలాంటి బాలచందర్ సార్ అవార్డుని అందుకోవడంతో నా జీవితం పరిపూర్ణం అయినట్లు భావిస్తున్నాను. ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేసినవారికి కృతజ్ఞతలు'' అని తెలిపారు. ఈ అవార్డు మాత్రమే కాదు... 'సిటాడెల్: హనీ బన్నీ' టీవీ సిరీస్‌కిగాను ఉత్తమ నటి అవార్డును కూడా సమంతకు ప్రదానం చేశారు. ఇదిలా ఉంటే... 2022లో విడుదలైన 'కాత్తు వాక్కుల రెండు కాదల్' తర్వాత ఆమె తమిళంలో ఏ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పలేదు. అలాగే తెలుగులో 'ఖుషి' (2023) సినిమా తర్వాత మరో చిత్రంలో నటించలేదు సమంత. ప్రస్తుతం ఆమె 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు. అలాగే తన సొంత నిర్మాణ సంస్థ 'త్రలాలా మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై సమంత నిర్మిస్తున్న తొలి చిత్రం 'శుభం' షూటింగ్ పూర్తయింది.

చెలియా చెలియా



● షాలిని, నవీన్ చంద్ర

నవీన్ చంద్ర, షాలినీ వడ్నికట్టి జంటగా నటించిన చిత్రం '28° సీ'. 'పొలిమేర' మూవీ ఫేమ్ డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించారు. వి. జయప్రకాశ్, ప్రియదర్శి పులికొండ, హర్ష చెముడు, రాజా రవీంద్ర, అభయ్ బేతిగంటి, దేవియాని శర్మ, సంతోషి శర్మ ఇతర పాత్రలు పోషించారు. వీరాంజనేయ ప్రొడక్షన్స్‌పై సాయి అభిషేక్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదలవుతోంది. శ్రావణ్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'చెలియా చెలియా...' సాంగ్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటని రేవంత్ పాడారు. 'నీ నగుమోము కనులారా చూస్తుంటే క్షణమైనా కనురెప్ప వాలేనా, నా కనుసైగ నీ వెనకా... చెలియా చెలియా నిన్ను చూడంగ, చెలియా చెలియా కనులు చాలవుగా..' అంటూ ఈ ప్రేమ పాట సాగుతుంది. డా. అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''మనసును తాకే భావోద్వేగాలతో సాగే అద్భుతమైన ప్రేమకథా చిత్రం '28° సీ'. నవీన్ చంద్ర మరోసారి తన నటనతో ఆకట్టుకోబోతున్నారు. వైవిధ్యమైన స్క్రీన్‌ప్లేతో ఈ సినిమా తెరకెక్కింది'' అన్నారు. ఈ చిత్రానికి కెమేరా: వంశీ పచ్చిపులుసు, నేపథ్య సంగీతం: శ్రీచరణ్ పాకాల, సహ నిర్మాతలు: సంజయ్ జూపూడి, విక్రమ్ జూపూడి.

ఓటీటీ
ఇది చూడొచ్చు

ఓ తండ్రి కథ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తెలుగు చిత్రం రామం రాఘవం ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

తల్లిదండ్రులకు పిల్లల మీద ఉండేది మమకారం. వారి మాట వినకూడదని పిల్లల మూర్ఖత్వం. జన్మనిచ్చిన తల్లి... జీవితాన్నిచ్చే తండ్రి తమ కన్నపిల్లల బంగారు భవిష్యత్తు కోసమే కాస్తంత కటువుగా మారతారు. ఆ కటుత్వం మాటున ఆప్యాయత, అనురాగాలుంటాయి. అవి అర్థం చేసుకోని పిల్లలు ఎంతో నష్టపోతారు. ఆ నేపథ్యంలో వచ్చిన సినిమానే 'రామం రాఘవం'. తల్లి ప్రేమ మీద ఎన్నో సినిమాలు వచ్చాయి. తండ్రి ప్రేమను ఇంత లోతుగా చూపించిన సినిమా ఇదే. ప్రముఖ రచయిత, నటుడు, దర్శకుడు సముద్రఖని అందించిన ఈ కథకు నటుడు ధన్‌రాజ్ దర్శకత్వం వహించారు.



'రామం రాఘవం' అనేది పిల్లలకు పెద్దలు చెప్పిన పాఠం అయితే, పిల్లలకు ఇదో గుణపాఠం. అంతలా ఏముందీ సినిమాలో ఓ సారి చూద్దాం. దశరథ రామం కోనసీమ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో ఓ నిజాయితీ గల అధికారి. తనలాగే తన కొడుకు రాఘవను నీతీ నిజాయితీతో నిండిన మంచి వ్యక్తిలా తీర్చిదిద్దాలనుకుంటాడు. కానీ రాఘవ చదువు కూడా కనీసం సరిగ్గా చదువుకోకుండా ఇంటా బయటా తండ్రికి తలవంపులు తెస్తుంటాడు. అంతేకాదు తనను మందలించిన తండ్రి మీద విపరీతమైన ద్వేషాన్ని పెంచుకుని ఆఖరికి తన తండ్రి అడ్డు తొలగించుకోవాలి అనుకుంటాడు. రాఘవ చేసిన ప్రతి తప్పును క్షమించి కాస్తంత మందలిస్తూ అంతులేని బాధను అనుభవిస్తుంటాడు రామం. ఆఖరికి రాఘవ తన తండ్రి కోసం చేసిన ప్రయత్నమేంటి? దాని వల్ల రాఘవ పొందిన లాభం ఏంటి? అన్నది మాత్రం ఓటీటీ వేదికైన సన్ నెక్ట్స్‌లో చూడాల్సిందే. నటుడిగా ధన్‌రాజ్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితం. మరీ ముఖ్యంగా కామెడీ పాత్రలతో ప్రేక్షకులను బాగానే మెప్పించారు. నటుడిగా ధన్‌రాజ్ నాణేనికి ఓ వైపు మాత్రమే, ఈ సినిమాతో ధన్‌రాజ్ తన దర్శకత్వ ప్రతిభను ఘనంగా చాటారనే చెప్పుకోవాలి. ఓ పక్క కథను అందించి, కథలోని తండ్రి పాత్రకు ఊపిరి పోసింది సముద్రఖని అయితే మరో పక్క అదే కథకు దర్శకత్వం వహించి, కొడుకు పాత్రలో ఒదిగిపోయి ఆ కథకు జీవితాన్నిచ్చింది ధన్‌రాజ్. కొన్ని సినిమాలు ఆనందం కోసం చూస్తాం. ఇలాంటి సినిమాలు మాత్రం మన జీవితం కోసం చూడాలి. మరీ ముఖ్యంగా మీ తల్లిదండ్రుల కోసం చూడాలి. వీలైతే మీ తల్లిదండ్రులతో కలిసి ఈ 'రామం రాఘవం' చూడండి.

– హరికృష్ణ ఇంటూరు

ఐపీఎల్ విజేతలు (2008 నుంచి 2024 వరకు)

2008 రాజస్తాన్ రాయల్స్
2009 డెక్కన్ చార్జర్స్
2010 చెన్నై సూపర్ కింగ్స్
2011 చెన్నై సూపర్ కింగ్స్
2012 కోల్‌కతా నైట్‌రైడర్స్
2013 ముంబై ఇండియన్స్
2014 కోల్‌కతా నైట్‌రైడర్స్
2015 ముంబై ఇండియన్స్
2016 సన్‌రైజర్స్ హైదరాబాద్
2017 ముంబై ఇండియన్స్
2018 చెన్నై సూపర్ కింగ్స్
2019 ముంబై ఇండియన్స్
2020 ముంబై ఇండియన్స్
2021 చెన్నై సూపర్ కింగ్స్
2022 గుజరాత్ టైటాన్స్
2023 చెన్నై సూపర్ కింగ్స్
2024 కోల్‌కతా నైట్‌రైడర్స్



ఐపీఎల్ ట్రోఫీతో 10 జట్ల కెప్టెన్లు కమిన్స్, హార్దిక్ పాండ్యా, రిషభ్ పంత్, అజింక్య రహానే, అక్షర్ పటేల్, రజత్ పాటీదార్, రుతురాజ్ గైక్వాడ్, సంజూ సామ్సన్, శుబ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ (ఎడమ నుంచి)

నేటి నుంచి పరుగుల పండుగ

ఐపీఎల్ 18వ సీజన్‌కు రంగం సిద్ధం | **తొలి పోరులో నేడు బెంగళూరుతో కోల్‌కతా ఢీ** | **10 జట్లతో మొత్తం 73 మ్యాచ్‌లు** | **మే 25న ఫైనల్ పోరు**

2008 మండు వేసవిలో ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్, బెంగళూరు రాయల్ చాలెంజర్స్ తలపడ్డాయి. ఈ మొదటి పోరులో మెకల్లమ్ తన మెరుపు బ్యాటింగ్‌తో అగ్గి పుట్టించాడు. 73 బంతుల్లోనే 10 ఫోర్లు, 13 సిక్సర్లతో 158 పరుగులు చేసి అతను అంటించిన మంట ఆ తర్వాత అంతకంతా పెరిగి దావానంలా మారి అన్ని వైపులకు వ్యాపించిపోయింది. టి20 క్రికెట్‌లో ఉండే బ్యాటింగ్ ధమాకా ఏమిటో అందరికీ చూపించేసింది. ఐపీఎల్ అంటే క్రికెట్ మాత్రమే కాదని... అంతకు మించిన వినోదమని సగటు అభిమాని ఆటతో పాటు ఊగిపోయేలా చేసింది ఈ లీగ్.


ఐపీఎల్‌లో 17 సీజన్లు ముగిసిపోయాయి. ఇన్నేళ్లలో ఎన్నో మార్పులు వచ్చాయి. లీగ్‌లో ఆటగాళ్లు మారగా, కొన్ని నిబంధనలూ మారాయి. దిగ్గజాలు స్వల్పకాలం పాటు తామూ ఓ చేయి వేసి తప్పుకోగా, తర్వాతి తరం ఆటను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఆటలో ఎన్ని మార్పులు వచ్చినా మారనిది లీగ్‌పై అభిమానం మాత్రమే. ఇన్ని సీజన్లలో కలిపి 1030 మ్యాచ్‌లు జరిగినా ఇప్పటికీ అదే ఉత్సాహం. అంతర్జాతీయ మ్యాచ్‌కంటే వేగంగా సీట్లు నిండిపోతుండగా, ఆటగాళ్ల రాక సినిమా ట్రైలర్‌లా కనిపిస్తోంది. ఇలాంటి వీరాభిమానం మధ్య ఐపీఎల్ 18వ పడిలోకి అడుగు పెడుతోంది.

కోల్‌కతా: ఇండియన్ ప్రీమియర్ లీగ్–2025కు రంగం సిద్ధమైంది. నేడు మొదలు కానున్న 18వ సీజన్ 65 రోజుల పాటు జోరుగా సాగనుంది. ఈడెన్ గార్డెన్స్ మైదానంలో శనివారం జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడుతుంది. 2008 తర్వాత ఇరు జట్ల మధ్య సీజన్ తొలి మ్యాచ్ జరగడం ఇదే మొదటిసారి కావడం విశేషం. 69 లీగ్ మ్యాచ్‌లు, ఆపై 4 'ప్లే ఆఫ్స్' సమరాల తర్వాత మే 25న ఇదే మైదానంలో జరిగే ఫైనల్ పోరుతో టోర్నీ ముగుస్తుంది. గత మూడు సీజన్ల తరహాలోనే ఇప్పుడు కూడా 10 జట్లు టైటిల్ కోసం అమీతుమీ తేల్చుకోనున్నాయి. మొదటి మ్యాచ్‌కు వాన అంతరాయం కలిగించే సూచనలు కనిపిస్తున్నాయి. శ్రేయా ఘోషాల్, కరణ్ ఔజ్‌లా, దిశా పటాని ఆట, పాటలతో కూడిన ప్రత్యేక ప్రారంభోత్సవ కార్యక్రమం కూడా జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ప్రేమించే లీగ్ మళ్లీ వచ్చిన నేపథ్యంలో టోర్నీకి సంబంధించిన పలు విశేషాలు...

2025 లీగ్ వివరాలు

- మొత్తం 13 వేదికల్లో టోర్నీ జరుగుతుంది. 7 టీమ్‌లకు ఒకే ఒక హోం గ్రౌండ్ ఉండగా... 3 జట్లు రెండు వేదికలను హోం గ్రౌండ్‌లుగా ఎంచుకున్నాయి. ఢిల్లీ తమ మ్యాచ్‌లను ఢిల్లీతోపాటు విశాఖపట్నంలో, పంజాబ్ తమ మ్యాచ్‌లను ముల్లన్‌పూర్‌తో పాటు ధర్మశాలలో, రాజస్తాన్ తమ మ్యాచ్‌లను జైపూర్‌తో పాటు గువాహటిలో ఆడుతుంది.
- ఐపీఎల్ ప్రదర్శనను బట్టి 10 టీమ్‌లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో చెన్నై, కోల్‌కతా, రాజస్తాన్, బెంగళూరు, పంజాబ్ ఉండగా... గ్రూప్ 'బి'లో ముంబై, హైదరాబాద్, గుజరాత్, ఢిల్లీ, లక్నో ఉన్నాయి. ప్రతీ టీమ్ తమ గ్రూప్‌లోని మిగతా 4 జట్లతో రెండు మ్యాచ్‌ల చొప్పున (8 మ్యాచ్‌లు), మరో గ్రూప్‌లో ఒక జట్టుతో రెండు మ్యాచ్‌లు (2), మిగతా నాలుగు టీమ్‌లతో ఒక్కో మ్యాచ్ (4) ఆడతాయి. అందరికీ సమానంగా 14 మ్యాచ్‌లు వస్తాయి. వీటిలో 7 సొంత గ్రౌండ్‌లలో ఆడతాయి.
- కొత్త సీజన్‌లో కొన్ని మార్పులు కూడా వచ్చాయి. బంతిని షైన్ చేసేందుకు ఉమ్మి (సలైవా)ను వాడేందుకు అనుమతినిచ్చారు. హైట్‌కు సంబంధించిన వైడ్‌లు, ఆఫ్ సైడ్ వైడ్‌లను తేల్చేందుకు కూడా డీఆర్‌ఎస్ సమయంలో 'హాక్ ఐ' ని ఉపయోగిస్తారు. స్లో ఓవర్ రేట్ నమోదు చేస్తే కెప్టెన్లపై జరిమానా వేయడాన్ని, సస్పెన్షన్ విధించడాన్ని తొలగించారు. దానికి బదులుగా డీ మెరిట్ పాయింట్లు విధిస్తారు. రాత్రి మ్యాచ్‌లలో మంచు ప్రభావం ఉందని భావిస్తే రెండో ఇన్నింగ్స్ సమయంలో 10 ఓవర్ల తర్వాత ఒక బంతిని మార్చేందుకు అవకాశం ఇస్తారు. ఇప్పటి వరకు బంతి దెబ్బ తిందని భావించి మార్చే విచక్షణాధికారం అంపైర్లకే ఉండేది. అయితే ఇప్పుడు ఫీల్డింగ్ కెప్టెన్ బంతి మార్చమని కోరవచ్చు.
- **అన్ని మ్యాచ్‌లు రాత్రి 7 గంటల 30 నిమిషాలకు మొదలవుతాయి. మొత్తం షెడ్యూల్‌లో 12 రోజులు మాత్రం ఒకే రోజు రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. అప్పుడు తొలి మ్యాచ్ మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు ప్రారంభమవుతుంది.**
- గత ఏడాదితో పోలిస్తే ఐదు టీమ్‌లు కొత్త కెప్టెన్లతో బరిలోకి దిగుతున్నాయి. అక్షర్ పటేల్ (ఢిల్లీ క్యాపిటల్స్), రిషభ్ పంత్ (లక్నో సూపర్ జెయింట్స్), శ్రేయస్ అయ్యర్ (పంజాబ్ కింగ్స్), అజింక్య రహానే (కోల్‌కతా నైట్‌రైడర్స్), రజత్ పాటీదార్ (రాయల్ చాలెంజర్స్ బెంగళూరు) ఆయా టీమ్‌లకు తొలిసారి సారథులుగా వ్యవహరించనున్నారు. నిషేధం కారణంగా ముంబై తొలి మ్యాచ్‌కు పాండ్యా స్థానంలో సూర్య కుమార్... గాయం నుంచి సామ్సన్ కోలుకోకపోవడంతో రాజస్తాన్ రాయల్స్ తొలి మూడు మ్యాచ్‌లకు రియాన్ పరాగ్ కెప్టెన్లుగా మైదానంలోకి దిగుతారు. వేలంలో రూ. 27 కోట్లకు అమ్ముడుపోయి రికార్డు సృష్టించిన రిషభ్ పంత్‌పై ఇప్పుడు ఆటగాడిగా, కెప్టెన్‌గా అందరి దృష్టి ఉంది.

300 దాటతారా!



ఐపీఎల్‌లో ఇప్పటి వరకు టీమ్ అత్యధిక స్కోరు 287 పరుగులు. గత ఏడాది బెంగళూరుపై సన్‌రైజర్స్ ఈ స్కోరు సాధించింది. ఐపీఎల్‌లో మొత్తం 250కు పైగా స్కోరు10 సార్లు నమోదైతే ఇందులో ఎనిమిది 2024లోనే వచ్చాయి. కొత్త సీజన్‌లో ఇలాంటి మరిన్ని మెరుపు ప్రదర్శనలు రావచ్చని అంతా భావిస్తున్నారు. బ్యాటర్లు జోరు సాగితే తొలిసారి లీగ్‌లో 300 స్కోరు కూడా దాటవచ్చు.

2008 నుంచి 2025 వరకు...



స్వప్నిల్

ఐపీఎల్ తొలి సీజన్‌లో జట్టుతో ఉండి ఈసారి 18వ సీజన్‌లో కూడా బరిలోకి దిగబోయే ఆటగాళ్లు 9 మంది ఉండటం విశేషం. ధోని, కోహ్లి, రోహిత్, మనీశ్ పాండే, రహానే, అశ్విన్, జడేజా, ఇషాంత్ శర్మ, స్వప్నిల్ సింగ్ ఈ జాబితాలో ఉన్నారు. వీరిలో కోహ్లి ఒక్కడే ఒకే ఒక జట్టు తరఫున కొనసాగుతున్నాడు. ఇందులో 34 ఏళ్ల లెఫ్టార్మ్ స్పిన్నర్ స్వప్నిల్ సింగ్ ప్రస్థానం భిన్నం. 2008లో ముంబై టీమ్‌తో ఉన్నా... 2016లో పంజాబ్ తరఫున తొలి మ్యాచ్ ఆడే అవకాశం వచ్చింది. మొత్తంగా 5 సీజన్లే అవకాశం దక్కించుకున్న అతను 14 మ్యాచ్‌లు మాత్రమే ఆడగలిగాడు.

రోహిత్, కోహ్లి మళ్లీ టి20ల్లో...



గత ఏడాది టి20 వరల్డ్ కప్ విజయం తర్వాత ఈ ఫార్మాట్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి రిటైర్మెంట్ పలికారు. ఇప్పుడు వారి టి20 ఆటను చూసే అవకాశం మళ్లీ ఐపీఎల్‌లోనే కలగనుంది.

ఆ ఒక్కటీ అడక్కు!



ఐపీఎల్ రాగానే ఎమ్మెస్ ధోనికి ఇదే ఆఖరి సీజనా అనే చర్చ మళ్లీ మొదలవుతుంది! గత నాలుగేళ్లుగా అతను 'డెఫినెటీ నాట్' అంటూ చిరునవ్వులు చిందిస్తూనే ఉన్నాడు. లీగ్‌లో బ్యాటర్‌గా ధోని ప్రభావం దాదాపు సున్నాగా మారిపోయింది. అతని స్థాయి ఆట ఎంతో కాలంగా అస్సలు కనిపించడం లేదు. తప్పనిసరి అయితే తప్ప బ్యాటింగ్‌కు రాకుండా బౌలర్లను ముందుగా పంపిస్తున్నాడు. ఒక రకంగా టీమ్ 10 మందితోనే ఆడుతోంది! అయితే చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్ ఆలోచనలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. ఆటగాడిగా ఎలా ఉన్నా అతను మైదానంలో ఉంటే చాలు అని వారు భావిస్తున్నారు. అధికారికంగా కెప్టెన్ కాకపోయినా జట్టును నడిపించడంలో, వ్యూహాల్లో, టీమ్‌కు పెద్ద దిక్కుగా అతనికి అతనే సాటి. ఫిట్‌గానే ఉన్నాడు కాబట్టి అతను తనకు నచ్చినంత కాలం ఆడతాడేమో.

ఐపీఎల్ 2025 షెడ్యూల్

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక	సమయం
మార్చి 22	కోల్‌కతా నైట్‌రైడర్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	కోల్‌కతా	రాత్రి గం. 7:30
మార్చి 23	సన్‌రైజర్స్ హైదరాబాద్ X రాజస్తాన్ రాయల్స్	హైదరాబాద్	మధ్యాహ్నం.గం 3:30
మార్చి 23	చెన్నై సూపర్ కింగ్స్ X ముంబై ఇండియన్స్	చెన్నై	రాత్రి గం.7:30
మార్చి 24	ఢిల్లీ క్యాపిటల్స్ X లక్నో సూపర్ జెయింట్స్	విశాఖపట్నం	రాత్రి గం.7:30
మార్చి 25	గుజరాత్ టైటాన్స్ X పంజాబ్ కింగ్స్	అహ్మదాబాద్	రాత్రి గం.7:30
మార్చి 26	రాజస్తాన్ రాయల్స్ X కోల్‌కతా నైట్‌రైడర్స్	గువాహటి	రాత్రి గం.7:30
మార్చి 27	సన్‌రైజర్స్ హైదరాబాద్ X లక్నో సూపర్ జెయింట్స్	హైదరాబాద్	రాత్రి గం.7:30
మార్చి 28	చెన్నై సూపర్ కింగ్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	చెన్నై	రాత్రి గం.7:30
మార్చి 29	గుజరాత్ టైటాన్స్ X ముంబై ఇండియన్స్	అహ్మదాబాద్	రాత్రి గం.7:30
మార్చి 30	ఢిల్లీ క్యాపిటల్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్	విశాఖపట్నం	మధ్యాహ్నం గం.3:30
మార్చి 30	రాజస్తాన్ రాయల్స్ X చెన్నై సూపర్ కింగ్స్	గువాహటి	రాత్రి గం.7:30
మార్చి 31	ముంబై ఇండియన్స్ X కోల్‌కతా నైట్‌రైడర్స్	ముంబై	రాత్రి గం.7:30
ఏప్రిల్ 1	లక్నో సూపర్ జెయింట్స్ X పంజాబ్ కింగ్స్	లక్నో	రాత్రి గం.7:30
ఏప్రిల్ 2	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X గుజరాత్ టైటాన్స్	బెంగళూరు	రాత్రి గం.7:30
ఏప్రిల్ 3	కోల్‌కతా నైట్‌రైడర్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్	కోల్‌కతా	రాత్రి గం.7:30
ఏప్రిల్ 4	లక్నో సూపర్ జెయింట్స్ X ముంబై ఇండియన్స్	లక్నో	రాత్రి గం.7:30
ఏప్రిల్ 5	చెన్నై సూపర్ కింగ్స్ X ఢిల్లీ క్యాపిటల్స్	చెన్నై	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 5	పంజాబ్ కింగ్స్ X రాజస్తాన్ రాయల్స్	ముల్లన్‌పూర్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 6	కోల్‌కతా నైట్‌రైడర్స్ X లక్నో సూపర్ జెయింట్స్	కోల్‌కతా	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 6	సన్‌రైజర్స్ హైదరాబాద్ X గుజరాత్ టైటాన్స్	హైదరాబాద్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 7	ముంబై ఇండియన్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	ముంబై	రాత్రి గం.7:30
ఏప్రిల్ 8	పంజాబ్ కింగ్స్ X చెన్నై సూపర్ కింగ్స్	ముల్లన్‌పూర్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 9	గుజరాత్ టైటాన్స్ X రాజస్తాన్ రాయల్స్	అహ్మదాబాద్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 10	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X ఢిల్లీ క్యాపిటల్స్	బెంగళూరు	రాత్రి గం.7:30
ఏప్రిల్ 11	చెన్నై సూపర్ కింగ్స్ X కోల్‌కతా నైట్‌రైడర్స్	చెన్నై	రాత్రి గం.7:30
ఏప్రిల్ 12	లక్నో సూపర్ జెయింట్స్ X గుజరాత్ టైటాన్స్	లక్నో	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 12	సన్‌రైజర్స్ హైదరాబాద్ X పంజాబ్ కింగ్స్	హైదరాబాద్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 13	రాజస్తాన్ రాయల్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	జైపూర్	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 13	ఢిల్లీ క్యాపిటల్స్ X ముంబై ఇండియన్స్	ఢిల్లీ	రాత్రి గం.7:30
ఏప్రిల్ 14	లక్నో సూపర్ జెయింట్స్ X చెన్నై సూపర్ కింగ్స్	లక్నో	రాత్రి గం.7:30
ఏప్రిల్ 15	పంజాబ్ కింగ్స్ X కోల్‌కతా నైట్‌రైడర్స్	ముల్లన్‌పూర్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 16	ఢిల్లీ క్యాపిటల్స్ X రాజస్తాన్ రాయల్స్	ఢిల్లీ	రాత్రి గం.7:30
ఏప్రిల్ 17	ముంబై ఇండియన్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్	ముంబై	రాత్రి గం.7:30
ఏప్రిల్ 18	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X పంజాబ్ కింగ్స్	బెంగళూరు	రాత్రి గం.7:30
ఏప్రిల్ 19	గుజరాత్ టైటాన్స్ X ఢిల్లీ క్యాపిటల్స్	అహ్మదాబాద్	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 19	రాజస్తాన్ రాయల్స్ X లక్నో సూపర్ జెయింట్స్	జైపూర్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 20	పంజాబ్ కింగ్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	ముల్లన్‌పూర్	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 20	ముంబై ఇండియన్స్ X చెన్నై సూపర్ కింగ్స్	ముంబై	రాత్రి గం.7:30
ఏప్రిల్ 21	కోల్‌కతా నైట్‌రైడర్స్ X గుజరాత్ టైటాన్స్	కోల్‌కతా	రాత్రి గం.7:30
ఏప్రిల్ 22	లక్నో సూపర్ జెయింట్స్ X ఢిల్లీ క్యాపిటల్స్	లక్నో	రాత్రి గం.7:30
ఏప్రిల్ 23	సన్‌రైజర్స్ హైదరాబాద్ X ముంబై ఇండియన్స్	హైదరాబాద్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 24	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X రాజస్తాన్ రాయల్స్	బెంగళూరు	రాత్రి గం.7:30
ఏప్రిల్ 25	చెన్నై సూపర్ కింగ్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్	చెన్నై	రాత్రి గం.7:30
ఏప్రిల్ 26	కోల్‌కతా నైట్ రైడర్స్ X పంజాబ్ కింగ్స్	కోల్‌కతా	రాత్రి గం.7:30
ఏప్రిల్ 27	ముంబై ఇండియన్స్ X లక్నో సూపర్ జెయింట్స్	ముంబై	మధ్యాహ్నం గం.3:30
ఏప్రిల్ 27	ఢిల్లీ క్యాపిటల్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	ఢిల్లీ	రాత్రి గం.7:30
ఏప్రిల్ 28	రాజస్తాన్ రాయల్స్ X గుజరాత్ టైటాన్స్	జైపూర్	రాత్రి గం.7:30
ఏప్రిల్ 29	ఢిల్లీ క్యాపిటల్స్ X కోల్‌కతా నైట్‌రైడర్స్	ఢిల్లీ	రాత్రి గం.7:30
ఏప్రిల్ 30	చెన్నై సూపర్ కింగ్స్ X పంజాబ్ కింగ్స్	చెన్నై	రాత్రి గం.7:30
మే 1	రాజస్తాన్ రాయల్స్ X ముంబై ఇండియన్స్	జైపూర్	రాత్రి గం.7:30
మే 2	గుజరాత్ టైటాన్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్	అహ్మదాబాద్	రాత్రి గం.7:30
మే 3	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X చెన్నై సూపర్ కింగ్స్	బెంగళూరు	రాత్రి గం.7:30
మే 4	కోల్‌కతా నైట్ రైడర్స్ X రాజస్తాన్ రాయల్స్	కోల్‌కతా	మధ్యాహ్నం గం.3:30
మే 4	పంజాబ్ కింగ్స్ X లక్నో సూపర్ జెయింట్స్	ధర్మశాల	రాత్రి గం.7:30
మే 5	సన్‌రైజర్స్ హైదరాబాద్ X ఢిల్లీ క్యాపిటల్స్	హైదరాబాద్	రాత్రి గం.7:30
మే 6	ముంబై ఇండియన్స్ X గుజరాత్ టైటాన్స్	ముంబై	రాత్రి గం.7:30
మే 7	కోల్‌కతా నైట్‌రైడర్స్ X చెన్నై సూపర్ కింగ్స్	కోల్‌కతా	రాత్రి గం.7:30
మే 8	పంజాబ్ కింగ్స్ X ఢిల్లీ క్యాపిటల్స్	ధర్మశాల	రాత్రి గం.7:30
మే 9	లక్నో సూపర్ జెయింట్స్ X రాయల్ చాలెంజర్స్ బెంగళూరు	లక్నో	రాత్రి గం.7:30
మే 10	సన్‌రైజర్స్ హైదరాబాద్ X కోల్‌కతా నైట్‌రైడర్స్	హైదరాబాద్	రాత్రి గం.7:30
మే 11	పంజాబ్ కింగ్స్ X ముంబై ఇండియన్స్	ధర్మశాల	మధ్యాహ్నం గం.3:30
మే 11	ఢిల్లీ క్యాపిటల్స్ X గుజరాత్ టైటాన్స్	ఢిల్లీ	రాత్రి గం.7:30
మే 12	చెన్నై సూపర్ కింగ్స్ X రాజస్తాన్ రాయల్స్	చెన్నై	రాత్రి గం.7:30
మే 13	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X సన్‌రైజర్స్ హైదరాబాద్	బెంగళూరు	రాత్రి గం.7:30
మే 14	గుజరాత్ టైటాన్స్ X లక్నో సూపర్ జెయింట్స్	అహ్మదాబాద్	రాత్రి గం.7:30
మే 15	ముంబై ఇండియన్స్ X ఢిల్లీ క్యాపిటల్స్	ముంబై	రాత్రి గం.7:30
మే 16	రాజస్తాన్ రాయల్స్ X పంజాబ్ కింగ్స్	జైపూర్	రాత్రి గం.7:30
మే 17	రాయల్ చాలెంజర్స్ బెంగళూరు X కోల్‌కతా నైట్‌రైడర్స్	బెంగళూరు	రాత్రి గం.7:30
మే 18	గుజరాత్ టైటాన్స్ X చెన్నై సూపర్ కింగ్స్	అహ్మదాబాద్	మధ్యాహ్నం గం.3:30
మే 18	లక్నో సూపర్ జెయింట్స్ X సన్‌రైజర్స్ హైదరాబాద్	లక్నో	రాత్రి గం.7:30
మే 20	క్వాలిఫయర్-1	హైదరాబాద్	రాత్రి గం.7:30
మే 21	ఎలిమినేటర్	హైదరాబాద్	రాత్రి గం.7:30
మే 23	క్వాలిఫయర్-2	కోల్‌కతా	రాత్రి గం.7:30
మే 25	ఫైనల్	కోల్‌కతా	రాత్రి గం.7:30



అన్ని మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

విదేశీ మహిళ దాతృత్వంతో ఆర్థికంగా నిలదొక్కుకున్న కుమ్మరిగూడెం గ్రామస్తులు

గిర్ జాతి ఆవుల దానం.. విదేశాలకు నెయ్యి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిన గ్రామస్తులు

యూఎస్, యూకే, జర్మనీ వంటగదుల్లో ఘుమఘుమలాడుతున్న కుమ్మరిగూడెం నెయ్యి

అప్పుల ఊబిలో అన్నదాత..

ఆవు వచ్చి రక్షించింది..

సాక్షి ప్రతినిధి, వరంగల్/వేలేరు: కుమ్మరిగూడెం.. హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో కేవలం 300 జనాభా, 72 ఇళ్లున్న ఓ కుగ్రామం.. ఇక్కడి అన్నదాతలు ఒకప్పుడు అప్పుల ఊబిలో కూరుకుపోయి విలవిల్లాడారు.



ఇప్పుడదే గ్రామం అంతర్జాతీయ గుర్తింపు సాధించింది. స్వచ్ఛమైన దేశవాళీ ఆవు నెయ్యిని స్థానికంగా విక్రయించడంతోపాటు అమెరికా, యూకే, జర్మనీ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది. కేవలం ఏడేళ్ల వ్యవధిలోనే అప్పుల ఊబి నుంచి బయటపడి ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసింది.

జర్మన్ మహిళ దాతృత్వంతో..

➤ సత్యసాయి బాబా భక్తురాలు, దాతృత్వశీలి అయిన మోనికా రేటరింగ్(జర్మనీ) భారత్‌లో పర్యటిస్తూ.. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న అన్నదాతలను, ఆపన్నులను ఆదుకుంటున్నారు. ఈ క్రమంలో 2018లో హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పాలేకర్ సాగు విధానంపై శిక్షణ పొందిన కుమ్మరిగూడెంవాసి మారుపాక కోటి, మహర్షి గోశాల నిర్వాహకుడు సర్జన రమేష్ ద్వారా కుమ్మరిగూడెం సహా చుట్టుపక్కల గ్రామాల్లో స్వయంగా పర్యటించారు.అన్నదాతల ఇబ్బందులను ఆమె గుర్తించారు. వారిని ఎలాగైనా ఆదుకోవాలనుకున్న మోనికా రేటరింగ్.. గ్రామస్తులను పాడిపరిశ్రమ వైపు ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన 30 మంది రైతులను గుజరాత్ తీసుకెళ్లి రూ. 50 వేల చొప్పున 30 గిర్ జాతి ఆవులను కొనిచ్చారు. అలాగే నెయ్యి తీసే యంత్రాన్ని కూడా రైతులకు అందించారు.



సొంత డబ్బుతో ఆవులను కొనుగోలు చేసి కుమ్మరిగూడెం వాసులకు అందజేస్తున్న మోనికా రేటరింగ్ (ఫైల్)

విదేశాలకు ఎగుమతి..

మోనికా రెటరింగ్ అందించిన ఆర్థిక చేయూతతో కుమ్మరిగూడెం రైతులు క్రమంగా నిలదొక్కుకున్నారు. ముఖ్యంగా స్వచ్ఛమైన గిర్ జాతి ఆవు పాలతో గ్రామస్తులు నెలకు సుమారు 50కిలోల మేర తయారు చేస్తున్న నెయ్యికి భారీ డిమాండ్ ఏర్పడింది. సాధారణంగా కిలో ఆవు నెయ్యి తయారీకి 20 లీటర్ల పాలు అవసర మవుతుంది. కుమ్మరిగూడెం రైతులు మాత్రం కిలో నెయ్యి తయారీకి 30 నుంచి 35 లీటర్ల పాలను ఉపయో గిస్తున్నారు. స్వచ్ఛతకు మారుపేరుగా మారడంతో కిలో రూ.4 వేలకు పైగా వెచ్చించి మరీ కొంటున్నారు. ఆదిలాబాద్, విజయవాడ, విశాఖపట్నం వాసులు కూడా ఫోన్ చేసి ఆర్డర్లు ఇస్తున్నారు. అమెరికాలోని డాలస్, యూకేలోని లండన్, జర్మనీలో ఉంటున్న వారు సైతం ఫోన్ చేసి నెయ్యి ఆర్డర్ చేస్తున్నారు. వారికి స్పీడ్ పోస్ట్, కార్గో సర్వీస్‌ల ద్వారా నెయ్యిని పంపిస్తున్నారు. హనుమ కొండ, వరంగల్, హైదరాబాద్‌లలోని ఆయుర్వేద వైద్యులు సైతం ఇక్కడి నుంచే తీసుకెళ్తున్నారు.



విదేశాలకు సరఫరా చేసేందుకు సిద్ధం చేసిన నెయ్యి, నెయ్యి ప్యాకెట్

ఇంటి ఖర్చులకు ఉపయోగపడుతోంది..

నాకున్న ఎకరంతోపాటు కొంత భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నా. అలాగే పశుపోషణ చేస్తున్నాను. ప్రస్తుతం ఒక గిర్ ఆవు పాలు ఇస్తోంది. ప్రతి నెలా పాలబిల్లు రూ. 7–8 వేలు వస్తోంది. దీంతో మా కుటుంబ నెలవారీ ఖర్చులు, ఇతర అవసరాలకు ఈ డబ్బు ఎంతో ఉపయోగపడుతుంది.

– మారుపాక రవి, కుమ్మరిగూడెం గ్రామస్తుడు

ప్రభుత్వం రుణాలు మంజూరు చేయాలి..

మేము గ్రామంలోనే నెయ్యి తయారు చేసి దేశవిదేశాలకు సరఫరా చేస్తున్నాం. ఇక్కడ తయారు చేసిన నెయ్యికి చాలా డిమాండ్ ఉంది. మాకు ప్రభుత్వం సహకారం అందించి రుణాలు మంజూరు చేస్తే చిన్న తరహా పరిశ్రమ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

– మారుపాక రాజు, పాలకేంద్రం నిర్వాహకుడు, కుమ్మరిగూడెం

సంతృప్తిగా ఉంది..

కుమ్మరిగూడెం ఏడేళ్లలో సాధించిన ప్రగతిని చూసి ఎంతో ఆనందిస్తున్నా. ఇప్పుడు ఈ గ్రామంలో పర్యటిస్తుంటే ఇంగ్లిష్ మాట్లాడే యువకులు నా వెంట నడుస్తూ విజయగాథలు వివరిస్తుంటే నా మనసు గర్వంతో ఉప్పొంగుతోంది. గ్రామస్తులు ఫోన్ చేసి వారి ఆవులను చూసేందుకు రావాలని, జీవితంలో ఎంతో బాగుపడ్డామని చెబుతుండటం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది.

– మోనికా రేటరింగ్

త్వరలో అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకొస్తాం: శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: న్యాయవాదుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. న్యాయవాదులపై దాడుల ను అరికట్టేందుకు త్వరలోనే అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకువస్తామని తెలిపారు. ఆ ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్న ట్టు వెల్లడించారు. శుక్రవారం అసెంబ్లీలో తెలంగాణ న్యాయవాదుల సంక్షేమ నిధి చట్టం, తెలంగాణ న్యాయవాదుల గుమా స్తాల సంక్షేమ నిధి చట్టం సవరణల బిల్లులపై చర్చ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లులకు బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్‌లు మద్దతు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమ నిధికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.100 కోట్లు కార్పస్ ఫండ్ ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మరో రూ.100 కోట్లు ఇవ్వాలని, సుప్రీంకోర్టులో కూడా తెలంగాణ న్యాయవాదులు సమర్థంగా వాదించే స్థాయికి తెచ్చేలా ప్రత్యేక న్యాయకళాశాల ఏర్పాటు చేయాలని సూచించారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, బీజేపీ తరఫున పాయల్ శంకర్‌లు బిల్లులకు మద్దతు తెలిపారు.

పోసానికి బెయిల్ మంజూరు



గుంటూరు లీగల్: సినీ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళిపై గుంటూరు సీఐడీ పోలీస్ పెట్టిన కేసులో బెయిల్ మంజూరైంది. ఎక్సైజ్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి పూచీ కత్తుతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ శనివారం వెల్లడించారు. ఈ విధానంలో పోసాని కృష్ణమురళికి రూ.లక్ష చొప్పున ఇద్దరు హామీ ఉండాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

బతుకు 'పాల'బాట



కామారెడ్డిలో ఏకైక డెయిరీ కళాశాల ● చదువు పూర్తవకముందే ఉద్యోగం

నాలుగున్నర దశాబ్దాల్లో వెయ్యి మందికి పైగా చదువు | దేశ, విదేశాల్లో ఉద్యోగాలు | సొంతంగా డెయిరీ పరిశ్రమల ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక డెయిరీ కళాశాల కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉంది. నాలుగున్నర దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నతోద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ చదువు పూర్తవకముందే ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో అనేక ఉద్యోగావకాశాలు దక్కుతాయి. రాష్ట్రంలో ప్రముఖ డెయిరీ సంస్థ అయిన జెర్సీ డెయిరీ డైరెక్టర్లంతా ఈ కళాశాల విద్యార్థులు కావడం విశేషం. రాష్ట్రంలోని వివిధ డెయిరీ సంస్థల్లో కీలక స్థానాల్లో పనిచేస్తున్న వారంతా ఇక్కడ చదువుకున్నవారే. కామారెడ్డి పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో 1978లో బీఎస్సీ డెయిరీ కోర్సును ప్రారంభించారు. ఇంటర్ చదివిన వారికి.. నేరుగా సాధారణ డిగ్రీ కోర్సుల్లా డెయిరీ కోర్సులో ప్రవేశం కల్పించేవారు. తరువాతి కాలంలో బీటెక్ డెయిరీ కోర్సుగా మార్పుచెంది.. ఎంసెట్ ద్వారా సీట్ల కేటాయింపు మొదలైంది. డెయిరీ కోర్సు ఎంచుకున్న వారికి.. ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయించేవారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో కొనసాగిన డెయిరీ కోర్సును 2007 సెప్టెంబర్ 1న శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోకి మార్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వ విద్యాలయం పరిధిలోకి తీసుకువచ్చారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో.. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలకు సంబంధించిన 60 ఎకరాల భూమిని డెయిరీ కళాశాలకు కేటాయించారు. కాలేజీ భవనం, హాస్టళ్ల నిర్మాణాలకు రూ.11 కోట్లు మంజూరు చేసిన అప్పటి సీఎం వైఎస్సార్.. భవనాల నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. కాలేజీ భవనంతో పాటు బాలికలు, బాలుర హాస్టళ్లు, ఆడిటోరియం, ల్యాబ్‌లకు భవనాలు నిర్మించారు. పీజీ కోర్సులకు అవసరమైన మేర సౌకర్యాలు కూడా ఉన్నాయి. అప్పటి నుంచి అదే భవనంలో కళాశాల కొనసాగుతోంది. ప్రాక్టికల్స్‌లో భాగంగా విద్యార్థులు పాల పదార్థాలు తయారు చేసి.. డెయిరీ పార్లర్‌ను కూడా నిర్వహిస్తున్నారు. విద్యార్థులు కోవా, దూద్ పేడా, రసగుల్లా, గులాబ్‌జామ్ వంటివి తయారు చేసి విక్రయిస్తారు.



పాల ఉత్పత్తులు తయారు చేస్తున్న విద్యార్థులు

వెయ్యి మందికి పైగా చదువు..

కళాశాల స్థాపించినప్పటి నుంచి.. ఇప్పటి వరకు 900 పైచిలుకు డెయిరీ కోర్సులు చదివారు. వారిలో చాలామంది దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోనూ డెయిరీ రంగంలో ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ చదివిన వారిలో కొందరు విద్యార్థులు సొంతంగా డెయిరీ ఉత్పత్తుల సంస్థలను స్థాపించారు కూడా. మరెందరో వివిధ డెయిరీ సంస్థల్లో పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లోనూ చాలామంది ఉద్యోగాలు చేస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా విజయ డెయిరీ, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, సూపర్‌వైజర్లు వంటి ఉద్యోగ అవకాశాలు కూడా పొందే వీలుంది. రాష్ట్ర స్థాయిలో ఉపకార వేతనాలు, జాతీయ స్థాయిలో మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తారు.

పీజీ కోర్సులు వస్తే మరింత ప్రయోజనం

కళాశాలలో పీజీ కోర్సులు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది. రాష్ట్రంలో ఎక్కడా డెయిరీ కళాశాలలు లేవు. ఏకైక కామారెడ్డి కళాశాలలో పీజీ కోర్సులు లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు వెళ్లి పీజీ కోర్సులు చదవాల్సి వస్తోంది. ఇతర రాష్ట్రాల్లో ఉన్నత విద్యనభ్యసించాలంటే ఖర్చుతో కూడుకున్నది కావడంతో.. చాలా మంది బీటెక్‌తోనే చదువును ఆపేస్తున్నారు. ఇక్కడే పీజీ కోర్సులు ప్రారంభిస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుందని విద్యార్థులు అంటున్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంచి భవిష్యత్తు ఉన్న కోర్సు



బీటెక్ డెయిరీ కోర్సు చదివిన వారెవరూ ఖాళీగా ఉండే పరిస్థితి లేదు. అందరికీ అనేక అవకాశాలు దొరుకుతున్నాయి. మా కళాశాలలో చదివినవారు ప్రపంచవ్యాప్తంగా డెయిరీ సంస్థల్లో ఉన్నతోద్యోగాలు చేస్తున్నారు. మన రాష్ట్రంలోని అన్ని డెయిరీల్లోనూ మనవారే కీలక పాత్ర పోషిస్తున్నారు. కొందరు సొంతంగా డెయిరీ సంస్థలు నెలకొల్పారు. ఏటా 40 మందికి ప్రవేశం పొందడానికి అవకాశం ఉంది. ఎంపీసీ చదివిన విద్యార్థులకు ఎంసెట్ ద్వారా డెయిరీ కోర్సులో 35 మందికి సీట్లు దక్కుతాయి. ఐదు సీట్లను రైతు విభాగాల కోటా ద్వారా భర్తీ చేస్తాం.

– డాక్టర్ ఉమాపతి, కళాశాల డీన్



విద్యార్థులు తయారు చేసిన పాల ఉత్పత్తులు



డెయిరీ పార్లర్ వద్ద పాల ఉత్పత్తుల విక్రయాలు



శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు హాజరైన బీఆర్ఎస్ ఎంపీలు



శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల మంత్రి పొన్నం ప్రభాకర్



విద్యుదాఘాతంతో 2019లో మరణించిన రైతు సంజీవ రెడ్డి భార్య సరితకి రూ.5లక్షల పరిహారం చెక్కును అందజేస్తున్న ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ

ఆయిల్‌పామ్ సాగు పెంపుపై కేంద్రం ప్రశంస

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరగడాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రశంసించింది. కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి గురువారం జాతీయ స్థాయిలో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్, ఆయిల్‌పామ్ పథకం అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉద్యానవన సంచాలకురాలు యాస్మిన్ బాషా.. రాష్ట్రంలో ఉద్యాన వన పంటల విస్తీర్ణం పెంపుతో పాటు ఆయిల్‌పామ్ సాగు గురించి వివరించారు. 2024–25లో సాధించిన ప్రగతి, 2025–26లో ప్రతిపాదించిన లక్ష్యాలు, దానికి కావలసిన మొక్కల లభ్యత, మిల్లుల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.103 కోట్లతో 39,515 ఎకరాల్లో 11,685 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేసినట్లు యాస్మిన్ బాషా తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ పథకం మొదలుపెట్టిన 2021–22 సంవత్సరం నుండి.. ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని సమీక్షించిన కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సెక్రటరీ, ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం మార్గదర్శిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఉద్యానశాఖ సంచాలకురాలు యాస్మిన్ బాషాను అభినందించారు.

పుస్తక రచనతో భావితరాలకు స్వీయ అనుభవాలు

'అంతరంగాలు.. అనంతరంగాలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన జేడీ లక్ష్మీనారాయణ

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ కవయిత్రి, జేడీ ఫౌండేషన్ కన్వీనర్ పింగిలి కవితారెడ్డి రచించిన 'అంతరంగాలు.. అనంతరంగాలు'పుస్తకాన్ని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, జేడీ ఫౌండేషన్ చైర్మన్ వి.వి.లక్ష్మీనారాయణ శుక్రవారం ఆవిష్కరించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని జేడీ ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ అనుభవాలు భావితరాలకు అందించడానికి పుస్తక రచన దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు మార్కులతో కూడిన విద్య కంటే విలువలతో కూడిన విద్య నేర్పాలని, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని సూచించారు. అందుకే జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాలు ఏర్పాటుచేసి విలువల బడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సామాజిక విశ్లేషకురాలు అనంతలక్ష్మి, ఎమ్ఎల్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని తేలిపోయింది

బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: డీలిమిటేషన్ విషయం ఇంకా కొలిక్కిరాక ముందే బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు చెన్నైలో జరిగే సభకు వెళుతున్నారని, దీంతో ఆ రెండు పార్టీలు ఒక్కటేనని తేలిపోయిందని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, ఇంటింటి సర్వేలో బీసీల జనాభాను తగ్గించి చూపించారని, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై తమకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. 56 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఆహ్వానిస్తున్నామని, కానీ దానిలో ముస్లిం మైనారిటీలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి సమయం ఇస్తున్నామని, ఈలోపు ఒక నిర్ణయం తీసుకోకపోతే సోమవారం అసెంబ్లీలో లేవనెత్తుతామని పాయల్ శంకర్ అన్నారు.

రామగిరికి పర్యాటక సిరి



జాతీయస్థాయిలో రామగిరి ఖిలాకు కీర్తి


- ప్రతిపాదిత రోప్‌వే జాబితాలో చోటు
- మాస్టర్ ప్లాన్‌లో రూ.5 కోట్లు కేటాయింపు
- కాళేశ్వరం నుంచి మంథని ఆలయాల అభివృద్ధికి నిధులు
- ఇకో పార్కుగా ఎల్‌మడుగు

అభివృద్ధికి అవకాశం ఉన్న పర్యాటక ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా.. తెలంగాణలో తొలిసారిగా రోప్‌వే పర్యాటకానికి అవకాశం కల్పించింది. భువనగిరి జిల్లా యాదగిరి గుట్టపై 2 కిలోమీటర్ల రోప్‌వేను తొలిసారిగా ఏర్పాటు చేస్తుండగా.. రాష్ట్రంలో మరో నాలుగు ప్రతిపాదిత రోప్‌వేలలో పెద్దపల్లి జిల్లా రామగిరి కోటకు చోటు కల్పించారు. -మంథని

జిల్లాలోని రామగిరి ఖిలాను జాతీయస్థాయిలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మాస్టర్‌ప్లాన్‌తో ముందుకు సాగుతున్నారు. ఇక్కడి ప్రాచీన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించింది. రామగిరి ఖిలా క్రీస్తు శకం ఒకటో శతాబ్దంలో రామగిరి కోటగా రూపుదిద్దుకుంది. ఈ కోట శత్రు దుర్భేద్యమైన రక్షణ స్థావరంగా వందల ఏళ్లపాటు వివిధ వంశాల రాజులకు ఆశ్రయమిచ్చింది.

ప్రాచీన శిల్పకళా సంపదకు చిరునామా.. రామగిరి ఖిలా

ఎంతో ఎత్తున్న దుర్గం, అనేక రాతి కట్టడాలు, బురుజులు, ఫీనాలతో విరాజిల్లుతోంది. దుర్గం అంతర్భాగంలో సాలుకోట, సింహాల కోట, జంగేకోట, ప్రతాపరుద్రుల కోట, అశ్వాల, కొలువుశాల, మొఘల్ శాల, చెరసాల, గజశాల, భజనశాల, సభాస్థలితో పాటు రహస్య స్థలాలు, రహస్య మార్గాలు, సొరంగాలు, తీపులు, ఫిరంగి గుండ్లు ఇక్కడ దర్శనమిస్తాయి. తెలంగాణలోని దుర్గాల్లో ఈ దుర్గం పటిష్టంగా ఉండి.. వజ్రకూటంగా ప్రసిద్ధి చెందింది. సీతమ్మ కొలను గుంటపై పసుపు, ఎరుపు రంగు నీరు దర్శనమివ్వడం విశేషం. పిల్లల ఫిరంగి నుంచి దూరితే సంతానప్రాప్తి లభిస్తుందని పర్యాటకుల విశ్వాసం. రామగిరి ఖిలాపై సుందర దృశ్యాలు, ప్రాకారాలు.. సందర్శకులను ఆకర్షిస్తాయి. శ్రీరాముని మూల విగ్రహాలున్న స్థలంలో కొండ చరియకింద వెయ్యిమంది తలదాచుకోవచ్చు. రామగిరి కోటలో ఇరువైపులా 9 ఫిరంగులు, 40 తోపులు ఉన్నాయి. శ్రీరాముడు వనవాసకాలంలో రామగిరికోటపై తపస్సు చేసి గుహలో శివలింగాన్ని ప్రతిష్టించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడి కొండపై నుంచి వచ్చే నీటి ధార.. బిలం నుంచి లోయలోకి ప్రవహిస్తోంది. ఈ ద్వారం వద్ద సీతాదేవి స్నానమాచరించినట్లు భక్తుల నమ్మకం. కొండపై సీతారాముల విగ్రహాలతో పాటు నంది విగ్రహం ఉంది. నీటిధార నేరుగా శివలింగం, నంది విగ్రహాలపై పడటం విశేషం. రామగిరి కొండ పైనుంచి వర్షాకాలం జలపాతాలు కనువిందు చేస్తాయి. రోప్‌వే ద్వారా పర్యాటకుల్ని గుట్టపైకి తీసుకొచ్చేలా ప్రతిపాదనలు చేశారు. కేంద్రం నుంచి అనుమతి రాగానే.. రామగిరి ఖిలాకు పర్యాటకుల సందడి పెరగనుంది.



ఖిలాపై పురాతన కట్టడాలు



ఖిలాపై పర్యాటకుల సందడి (ఫైల్)

గోదావరి నది మధ్య సహజసిద్ధంగా ఏర్పడిన అతి పెద్ద లోయలాంటి సరస్సు ఎల్‌మడుగు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల మధ్య మంథని మండలం ఖాన్‌సాయిపేట – శివ్వారం అటవీ ప్రాంతంలోని ఎల్‌మడుగు రెండు గుట్టల నడుమ ప్రవహిస్తోంది. ఈ సరస్సు చుట్టూ అనుకున్న దట్టమైన అటవీ ప్రాంతం, ఎత్తయిన కొండలు, గుట్టలు.. రెండు కొండల మధ్యనుంచి ప్రవహించే గోదావరి నది.. ఆ సరస్సులో సందడి చేసే పక్షుల కిలకిలారావాలు, నీటిలో ఎగిరే చేపల విన్యాసాలు కనువిందు చేస్తాయి. చిన్న చిన్న చేపపిల్లలు గుంపుగా కదులుతున్న దృశ్యం.. కళ్లెదుటే ఆక్వేరియం ఉన్నట్టు అనిపిస్తుంది. సుమారు రెండు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉండే ఈ సరస్సులో.. ఈ సుందర దృశ్యాలను కచ్చితంగా చూడాల్సిందే అనడం అతిశయోక్తి లేదు. ప్రకృతి అందాలతో కనువిందు చేసే ఎల్‌మడుగును ఇకో పార్కుగా అభివృద్ధి చేసేందుకు రూ.2 కోట్లు కేటాయించారు. ఇప్పటికే మంథని మండలం ఖానాపూర్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గోదావరి వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కాళేశ్వరంలో పర్యాటక అభివృద్ధికి రూ.115 కోట్లు, మంథనిలోని గోదావరి నది తీరంలో గౌతమేశ్వర ఘాట్ అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ఇటీవల మంథనిలో పర్యటించగా, పర్యాటక శాఖ కమిషనర్ న్యాలకొండ ప్రకాశ్‌రెడ్డి సైతం రామగిరిని సందర్శించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్.. మంత్రి శ్రీధర్‌బాబు సతీమణి కాగా, పర్యాటక శాఖ కమిషనర్ ఈ ప్రాంతానికి సంబంధించిన ఐపీఎస్ అధికారి కావడం.. మంథనికి కలిసివస్తుందన్న ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతోంది.

లోయలాంటి సరస్సు ఎల్‌మడుగు



రెండు గుట్టల మధ్య నుంచి ప్రవహిస్తున్న గోదావరి(ఎల్ మడుగు)



జొన్న పంటకు దన్నుగా..

తిరుమలాయపాలెం: వన్యప్రాణులు, పక్షుల నుండి పంటను కాపాడుకునేందుకు రైతులు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బాలాజీనగర్ తండా గ్రామ పంచాయతీ పరిధి రమణా తండాకు చెందిన నెర్సుల ఉపేందర్ సైతం అలాంటి ప్రయత్నమే చేశాడు. ఆయన మొక్కజొన్న సాగు చేయగా.. రాత్రి సమయంలో అడవి పందులు, మధ్యాహ్నం రామచిలుకలు దాడి చేస్తున్నాయి. దీంతో పంట చేను వద్ద చెట్లకు ఖాళీ బీర్ సీసా, ఇంకో చిన్న సీసా.. ఈ రెండింటికి కలిపి ప్లాస్టిక్ కవర్ కట్టాడు. గాలికి ప్లాస్టిక్ కవర్ ఊగినప్పుడల్లా రెండు సీసాలు కొట్టుకుని శబ్దం వస్తోంది. దీంతో పందులు, పక్షులు దగ్గరకు రావడం లేదని రైతు తెలిపాడు.



శ్రమ.. సౌఖ్యం

గుప్పెడంత లేని ఈ గిజిగాడు పక్షి ఆకులూ రేకులూ ముక్కున కరచుకుని వచ్చి ఏకాగ్రతతో అందమైన గూడును అల్లుకుంటుంది. ఈ క్రమంలో తన శక్తినంతా కూడదీసుకుని శ్రమిస్తుంది. తరువాత తను నిర్మించుకున్న అందమైన గూడులో ఇలా హాయిగా విశ్రమిస్తుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ప్రకృతి కనికట్టు..

పైన ఎండ.. మాడు పగలగొడుతోంది. కింద రోడ్డుపైన మాత్రం నీరు ప్రవహిస్తున్నట్టు కనిపిస్తోంది. ఇదంతా ప్రకృతి కనికట్టు. ఎండ తీవ్రత 40 డిగ్రీలు దాటిపోవడంతో కర్నూలు, హైదరాబాద్ రహదారిపై ఇలా ఎండమావులు ఏర్పడ్డాయి. దూరం నుంచి చూసేవారు అక్కడ నీరు ఉన్నట్టు భ్రమపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



మార్కెట్‌లోకి 'ఫల మహారాజు'

పండ్లలో రారాజు మామిడి మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. రుచికి పెట్టిందిపేరైన నెల్లూరు జిల్లా ఉలవపాడు బంగినపల్లి మామిడి పండ్లు నెల్లూరు బస్టాండ్ వద్ద వ్యాపారులు అమ్మకానికి పెట్టారు. దీంతో నగర ప్రజలు ఈ పండ్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా...

మందుల దుకాణాల్లో ఈగల్ తనిఖీలు

సాక్షి, అమరావతి: విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈగల్, డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ అధికారులు రాష్ట్రంలో మందుల దుకాణాలు, మందుల ఏజెన్సీలలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్, ఇతర నిషేధిత మత్తు మందులను విక్రయిస్తున్నారన్న సమాచారంతో విస్తృతంగా దాడులు నిర్వహించారు. మొత్తం 100 బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఈగల్ విభాగం ఐజీ ఆకే రవికృష్ణ చెప్పారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్ చెప్పారు.

జేఎన్‌టీయూ వీసీ అమెరికా పర్యటనకు అనుమతి

సాక్షి, అమరావతి: జేఎన్‌టీయూ కాకినాడ వైస్ చాన్సలర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ అమెరికా పర్యటనకు ప్రభుత్వం సెలవులు మంజూరు చేసింది. ఆయన మే 10 నుంచి 17వరకు వ్యక్తిగత పర్యటన నిమిత్తం యూఎస్ వెళ్లనున్నారు. ఈమేరకు సెలవు అభ్యర్థనను ఆమోదిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. సెలవుపై వెళ్లిన సమయంలో ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మంత్రి ఫరూక్‌కు సతీవియోగం


షహనాజ్(ఫైల్)

నంద్యాల(అర్బన్): రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సతీమణి షహనాజ్(69) శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో మృతి చెందారు. గత రెండేళ్లుగా శ్వాసకోశ ఇబ్బందులతో చికిత్స పొందుతున్న ఆమె తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు హైదరాబాద్ లోని అగాపుర పాన్ మండి ఖబరిస్తాన్ లో కుటుంబ సభ్యులు నిర్వహించారు. తన తల్లిదండ్రుల అంత్యక్రియలు జరిగిన చోటే తననూ సాగనంపాలంటూ గతంలో ఆమె కోరిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

పోషకాల పండు.. లాభాలు మెండు అవకాడో

విదేశీ పంటలకు అల్లూరి జిల్లా ఆలవాలంగా మారింది. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతంలో స్ట్రాబెర్రీ, లిచీ, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటలు మంచి ఫలితాలను ఇస్తుండగా తాజాగా ఈ కోవలోకి అవకాడో వచ్చి చేరింది. కాఫీ చెట్లకు నీడ కోసం పెంచుతున్న ఈ చెట్లు పోషక విలువలతో ఉన్న పళ్లను కూడా ఇస్తున్నాయి.


ఉద్యానవన పరిశోధన క్షేత్రంలో సాగులో ఉన్న అవకాడో మొక్కలు




అవకాడో మొక్క

చింతపల్లి: గిరిజన ప్రాంతానికి మేలైన, అనువైన రకాలను గుర్తించడానికి అల్లూరి జిల్లా చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు నిరంతరం ప్రయోగాలు చేస్తుంటారు. ఏజెన్సీలో లాభదాయకమైన పంటలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో గతంలో యాపిల్, డ్రాగన్ ఫ్రూట్, స్ట్రాబెర్రీ, లిచీ వంటి మొక్కలను ప్రభుత్వం సరాఫరా చేసింది. చింతపల్లి మండలంలో గిరిజన రైతులు వాటిని పండించి మంచి ఫలితాలను పొందుతున్నారు. ఇప్పుడు ఆ జాబితాలోకి అవకాడో వచ్చి చేరింది. నిజానికి రెండు దశాబ్దాల క్రితమే కేంద్ర కాఫీ బోర్డు అధికారులు





కాఫీ మొక్కలకు నీడ కోసమని అవకాడో మొక్కలను మండలంలో గొందిపాకలు పంచాయతీలోని పలు గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ మొక్కలపై రైతులకు అవగాహన లేకపోయినా కాఫీ చెట్లకు నీడనిస్తాయనే ఉద్దేశంతో పెంపకం సాగించారు. ఈ మొక్కలు పెరిగి క్రమేపీ పండ్ల దశకు చేరుకున్నాయి. అయితే ఈ అవకాడో పండ్లకు మార్కెట్‌లో విలువ తెలియక వాటిని రైతులు వృథాగా వదిలేశారు. కొన్నేళ్ల క్రితం ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గ్రామానికి వచ్చి ఈ అవకాడో పండ్లను చూసి దాని విశిష్టత, ఆ పండ్లకు మార్కెట్‌లో ఉన్న విలువను రైతులకు వివరించారు. దాంతో రైతులు నాటి నుంచి మార్కెట్‌లో ఈ అవకాడో పండ్ల అమ్మకాన్ని ప్రారంభించారు. దాంతో వ్యాపారస్తులు సైతం గ్రామాలకు వచ్చి రైతుల నుంచి ఈ పండ్లను కొనుగోలు చేస్తున్నారు. దీంతో చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానంలో ఆరు దేశ, విదేశీ రకాలను దిగు మతి చేసుకొని ఎకరం విస్తీర్ణంలో ప్రయోగాత్మకంగా సాగు చేపట్టారు.



చింతపల్లి ఉద్యానవన పరిశోధన స్థానం

ప్రత్యేక శ్రద్ధతో గిరి రైతుల సాగు

చింతపల్లి మండలంలో గొందిపాకలు, చిక్కుడుబట్టి, చినబరడ, పెదబరడ మొదలైన గ్రామాల్లో రైతులకు ఐటీడీఏ గతంలో వివిధ రకాల పండ్ల మొక్కలతోపాటు అవకాడో మొక్కలను పంపిణీ చేసింది. రైతులు ఈ మొక్కలను తమ పొలాల్లో వేసి పెంచుతున్నారు. ప్రస్తుతం అవి పెరిగి పెద్దవై దిగుబడులను ఇస్తున్నాయి. ఈ అవకాడో పండ్లకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది.

ఔషధ గుణాలు, పోషకాలు అధికం

అవకాడో పండు ఇతర పండ్ల మాదిరిగా కాకుండా అత్యధిక పోషకాలు, ఔషధ గుణాలు కలిగి ఉన్నట్లు శాస్త్రవేత్తలు, పోషకాల నిపుణులు గుర్తించారు. ప్రధానంగా ఈ పండు క్యాన్సర్ కారకాలను నిరోధించడంతోపాటు కంటి చూపు, మధుమేహం, స్థూలకాయం తగ్గుదలకు, సంతానోత్పత్తికి, జీవక్రియ మెరుగుదలకు ఎంతో ఉపయోగపడుతున్నట్లు పరిశోధనలో గుర్తించారు.

చింతపల్లిలో కొత్త రకాలపై పరిశోధనలు



అవకాడో పండ్లకు దేశీయంగానే కాకుండా విదేశాల్లోను మంచి గిరాకీ ఉంది. దీనిని గుర్తించి చింతపల్లి ఉద్యానవన పరిశోధన స్థానంలో గత ఏడాది టీకేడి–1, హాస్ మొక్కల సాగు చేపట్టగా ఈ ఏడాది కొత్తగా పింకిర్టన్, ప్యూర్ట్, రీడ్ వంటి కొత్త రకాలను ఇక్కడికి తీసుకువచ్చి పరిశోధనలు జరుపుతున్నాం. గిరిజన రైతాంగం పండించి ప్రస్తుతం మార్కెట్‌లో అమ్ముతున్న అవకాడోకు శాస్త్రీయ నామం లేదు. దాంతో పంటకు మంచి గిట్టుబాటు ధర లభించడంలేదు. ప్రస్తుతం మా క్షేత్రంలో గత ఏడాది మూడు వెరైటీలు, ఈ ఏడాది 3 రకాలపై పరిశోధనలు జరుపుతున్నాం. ఈ కొత్త రకాలను శాస్త్రీయ నామంతో మార్కెట్‌లో ప్రవేశపెట్టవచ్చు. దీంతో మంచి ధర వస్తుంది. ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ, మిరియాలు పంటల వలే ఈ అవకాడో పంటను విస్తరించడానికి మేలైన రకాల కోసం ప్రయోగాలు చేపడుతున్నాం.

– శెట్టి బిందు, ప్రధాన శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన స్థానం, చింతపల్లి

బాలాజీ రైల్వే డివిజన్ ప్రసక్తే లేదు

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్



సాక్షి, న్యూఢిల్లీ: తిరుపతిని ప్రధాన కార్యాలయంగా చేసుకుని కొత్తగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు ప్రసక్తే లేదని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. రైల్వే డివిజన్ అనేది పనిభారం, ట్రాఫిక్ సరళి, ఇతర కార్యచరణ, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసే అంశమన్నారు. ప్రస్తుతం గుంతకల్ డివిజనే తిరుపతి సహా దాని అధికార పరిధిలోని లైన్ల అవసరాలను తీర్చుతున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు.

రాష్ట్రంలో నాలుగు ఎస్‌టీపీఐ సెంటర్లు: జితిన్ ప్రసాద


నిరంజన్ రెడ్డి


నత్వానీ

చిన్న పట్టణాలు, నగరాలతో పాటు దేశం అంతటా ఐటీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు కేంద్రం పలు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఎలక్ట్రానిక్స్, సమాచార శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు 'ది సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్' (ఎస్‌టీపీఐ)లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐటీ రంగాన్ని మెరుగుపరిచేందుకు ఎస్‌టీపీఐ సెంటర్ల ఏర్పాటు, అవసరాలపై రాజ్యసభ ఎంపీ నిరంజన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. కాకినాడ, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో ఇవి ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 20–24మధ్య స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం'(డబ్ల్యూఈఎఫ్)కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌లు హాజరయ్యారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. డబ్ల్యూఈఎఫ్‌కు ఎన్ని రాష్ట్రాల నుంచి ఎవరెవరు వెళ్లారు అనే వివరాలపై రాజ్యసభ ఎంపీ పరిమళ్ నత్వానీ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి పై విధంగా సమాధానమిచ్చారు.

వెలగలేరు రెగ్యులేటర్, బీడీసీ పునరుద్ధరణకు రూ.39.77 కోట్లు

సాక్షి, అమరావతి: గతేడాది వరదలకు దెబ్బతిన్న వెలగలేరు రెగ్యులేటర్, బుడమేరు డైవర్షన్ ఛానల్ (బీడీసీ)ను శాశ్వతంగా పునరుద్ధరించేలా రూ.39.77 కోట్లతో పనులు చేపట్టడానికి పరిపాలన అనుమతులిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెలగలేరు రెగ్యులేటర్‌కు మెకానికల్, ఎలక్ట్రికల్ పరికరాలను మార్చి మరమ్మతులు చేయడానికి రూ.1.80 కోట్లు, బీడీసీకి 500 మీటర్ల పొడవున రెండువైపులా వరద రక్షణ గోడ (ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్) నిర్మాణానికి రూ.37.97 కోట్లను మంజూరు చేశారు. గతేడాది సెప్టెంబరు 1న బుడమేరు వరద విజయవాడను ముంచెత్తడంతో భారీ నష్టం సంభవించింది. బుడమేరు పరీవాహక ప్రాంతంలో ఆక్రమణలను తొలగించి.. ఆధునికీకరించి విజయవాడకు ముంపు ముప్పును శాశ్వతంగా తప్పిస్తామని అప్పట్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ నేడు తూతూమంత్రంగా మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వచ్చే ఏడాదిలో 'పోలవరం' పూర్తయ్యేలా చర్యలు

- లోక్‌సభలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ వెల్లడి
- లక్ష్యం మేరకు ఎప్పటికప్పుడు నిధుల విడుదల
- గోదావరి–కృష్ణా–పెన్నా–కావేరి నదుల అనుసంధానానికి డీపీఆర్ పూర్తి

సాక్షి, న్యూఢిల్లీ : పోలవరం నీటి పారుదల ప్రాజెక్టును 2026లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది రూ.12 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. మోదీ ప్రధాని అయ్యాకే ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభం అయ్యాయని స్పష్టం చేశారు. శుక్రవారం లోక్‌సభలో కేంద్ర జల శక్తి శాఖ పద్దులపై జరిగిన చర్చలో ఆయన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ.. పోలవరం కోసం 2024లో కేంద్ర కేబినెట్ ఆమోదించిన రూ.12 వేల కోట్ల గ్రాంట్‌లో రూ.5,512 కోట్లు ఇప్పటికే విడుదల చేశామని, 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.5,936 కోట్లు కేటాయించామని చెప్పారు. అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 2.91 లక్షల హెక్టార్ల భూమికి నీటితో పాటు విశాఖపట్టణానికి 23.44 టీఎంసీల నీటిని అందించగలుగుతామమన్నారు. 540 గ్రామాలకు మంచి నీటి ద్వారా 28.5 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మరోవైపు దేశంలో 30 నదుల అనుసంధానానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఇందులో 16 ద్వీపకల్ప నదులు, 14 హిమానీ నదులు ఉన్నాయన్నారు. ఇప్పటికే 11 నదుల అనుసంధానానికి డీపీఆర్ పూర్తయిందని తెలిపారు. అయితే అన్ని రాష్ట్రాలు నదుల అనుసంధానానికి ఆమోదం తెలపని కారణంగా ప్రక్రియ ఆగిందన్నారు. గోదావరి–కృష్ణా–పెన్నా–కావేరి నదుల అనుసంధానానికి డీపీఆర్ పూర్తయిందని, ఈ ప్రాజెక్టు ఆమోదం కోసం సంబంధిత రాష్ట్రాలతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు.

పీఎంఏవై-అర్బన్ 2.0లో 3.53 లక్షల ఇళ్ల మంజూరు

కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

సాక్షి, న్యూఢిల్లీ : ప్రధానమంత్రి ఆవాస్ యోజన–అర్బన్ 2.0 కింద దేశ వ్యాప్తంగా పది రాష్ట్రాల్లో 3.53 లక్షల ఇళ్ల నిర్మాణానికి గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ ఇళ్ల నిర్మాణాలతో లబ్ధి పొందే రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మరో ఎనిమిది రాష్ట్రాలున్నట్లు మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం ఆమోదించిన ఇళ్లలో ఒంటరి మహిళలు, వితంతువులతో సహా 2.67 లక్షలకు పైగా ఇళ్లు మహిళలకు మాత్రమే మంజూరయ్యాయని తెలిపింది. 90 ఇళ్లు ట్రాన్స్‌జెండర్లకు కేటాయించినట్లు పేర్కొంది. మొత్తం మంజూరైన ఇళ్లలో ఎస్సీ లబ్ధిదారులకు 80,850 , ఎస్టీలకు 15,928, ఓబీసీ వర్గానికి 2,12,603 ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించింది. ఈ పథకం కింద ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలను కేంద్రం సాయంగా అందించనుంది.

ఆధ్యాత్మిక సమాచారం



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 58,872 మంది స్వామివారిని దర్శించుకోగా 23,523 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.71 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

తిరుచ్చిపై సిరులతల్లి విహారం



తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరించారు. సిరులతల్లి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా సత్యదేవుని ఆలయ వార్షికోత్సవం



అన్నవరం: సత్యదేవుని నూతన ఆలయానికి 13 సంవత్సరాలు పూర్తయి, 14వ ఏట అడుగు పెట్టిన సందర్భంగా రత్నగిరిపై శుక్రవారం ఘనంగా వార్షికోత్సవం నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకూ పండితులు సత్యదేవునికి లక్ష తులసి పూజ, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 2012 మార్చి 14న జరిగిన సత్యదేవుని నూతనాలయ శిఖర ప్రతిష్ఠలో పాల్గొన్న విశ్రాంత వేద పండితుడు గొర్తి సుబ్రహ్మణ్య ఘనపాఠి, అర్చకులు గాడేపల్లి సత్యనారాయణ, శేషగిరి, విశ్రాంత వ్రత పురోహితులు ఆకొండి వ్యాసమూర్తి, ప్రయాగ వేంకట రమణలను ఈఓ వీర్ల సుబ్బారావు ఘనంగా సత్కరించారు.

ముగిసిన సరమ్మ ఉత్సవాలు

లింగపాలెం : ఏలూరు జిల్లాలోని మండల కేంద్రమైన లింగపాలెంలో వేంచేసిన సరమ్మ తల్లి పేరంటాళ్ల మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలు 11 రోజుల పాటు అంగరంగా వైభవంగా జరిగాయి. అమ్మవారికి పెద్ద ఎత్తున భక్తులు పూజలు చేశారు. కృష్ణా, ఖమ్మం జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి ఉత్సవాలను తిలకించారు. దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో ఆఖరి రోజైన శుక్రవారం దాతల సహకారం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం జరిగింది.

ఘనంగా భక్తాంజనేయస్వామి వార్షికోత్సవం



మునుసూరు: పురోహితుల వేద మంత్రోచ్చారణల నడుమ శుక్రవారం భక్తాంజనేయ స్వామి ఆలయ ఏడో వార్షికోత్సవం ఏలూరు జిల్లా మునుసూరు మండలం చెక్కపల్లిలో ఘనంగా నిర్వహించారు.

విద్యా సమాచారం



సిద్ధాంతాల సమన్వయంతో పరిశోధనలు

తిరుపతి సిటీ : సిద్ధాంతాల సమన్వయంతో పరిశోధనలు చేయాల్సిన అవసరముందని ద్రవిడ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తిరుపతిరావు తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీ ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో పీఎం ఉష పథకం కింద 'రీసెంట్ డిసిప్లినరీ ట్రెండ్స్ ఇన్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్స్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం వర్సిటీ సావేరీ అతిథిగృహంలో ప్రారంభం అయ్యింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సమాజానికి రచనలు మార్గదర్శిగా దోహదపడతాయని వెల్లడించారు.

ఎస్పీడబ్ల్యూలో బయోటెక్ ఫెస్ట్



తిరుపతి సిటీ : పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల బయోటెక్నాలజీ విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ నారాయణమ్మ అధ్యక్షతన శుక్రవారం బయోటెక్ రెవల్యూషన్ ది నెక్ట్స్ ఫ్రాంటియర్– ట్రాన్స్‌ఫార్మింగ్ సైన్స్ టు సొల్యూషన్ అనే అంశంపై బయోటెక్ ఫెస్ట్ నిర్వహించించారు. ఐజర్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో బయోటెక్నాలజీ పాత్ర, ప్రాముఖ్యత, అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బయోటెక్నాలజీ సైన్స్ ఎక్స్‌పో ప్రారంభించారు.

'కళైకావేరి'తో ఎస్వీయూ ఒప్పందం



తిరుపతి సిటీ : తమిళనాడులోని తిరుచిరాపల్లికు చెందిన కళై కావేరి లలిత కళల కళాశాలలో పలు అంశాలపై ఎస్వీయూ కళలప్రదర్శన అధ్యయన విభాగం శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు అధ్యాపకులు, విద్యార్థులు పరస్పర అభ్యసన, పరిశోధన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించునే వెసులుబాటు ఉంటుంది.

ఎస్వీయూలో 'సింపోజియం'



తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'క్రైడర్స్–2025 గోష్ఠి (సింపోజియం)ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొత్త నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.







సేమ్యాల వర్షం





ఇది రంజాన్ మాసం. మరో వారంలో రంజాన్ పండగ రాబోతూ ఉంది. ఇప్పుడు ఉప వాసాలు సాగుతూ ఉన్నాయి. ఈ సీజన్‌లో హైదరాబాద్ పాత బస్తీలో చాలా సందడి ఉంటుంది. అక్కడ అందరూ వెళ్లి పండగ కోసం సేమ్యాలు కొంటూ ఉంటారు. రంజాను పండుగలో సేమ్యాలు వండటం ఆనవాయితీ. అందుకోసమని మెషిను ద్వారా, చేతి ద్వారా సేమ్యాలు తయారు చేసి అమ్ముతుంటారు. అయితే చేతి సేమ్యాలకే డిమాండ్ ఎక్కువ. ఇక్కడ మీరు చూస్తున్నది చెన్నైలో ఒక మహిళ రంజాన్ సీజనులో అమ్మడానికి తయారు చేసి ఆరబెడుతున్న సేమ్యాలు. ఫొటోలు చూస్తుంటే సేమ్యాల వర్షం కురుస్తున్నట్టుగా లేదూ?

● మన సినిమా



యు కాన్ట్ వెయిట్ టు వాచ్ ఇట్

సముద్రపు అమ్మాయి, సాహసగత్తె మోఆనా కొత్త సాహసాలతో తయారైన యానిమేషన్ సినిమా 'మోఆనా2' నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చేసింది. ఫస్ట్ పార్ట్ చూసిన వాళ్ళకి ఇది ఇంకా బాగా నచ్చుతుంది. కాని ఇది మీ ఎగ్జామ్స్ టైం. సో ఎగ్జామ్స్ అయిపోగానే ఫస్ట్ మీ ఛాయిస్ 'మోఆనా2' అవ్వాలి. ఎందుకంటే ఈసారి మోఆనా ఇంకా చాలా సాహసాలు చేసింది. మోటుఫెటు అనే కొత్త దీవికి వెళుతుంది. ఫస్ట్‌పార్ట్‌లో లాగానే మావోయి మొఆనా2లో కూడా ఓ టాస్కులో హెల్ప్ అవుతాడు. డిస్నీ విజువల్స్‌లో ఎప్పటిలాగే మాయ చేశారు. మోఆనా ధైర్యంగా సముద్రంలో తిరుగుతుంది. మోఆనా చేసే ఈ అడ్వెంచర్‌లో బోలెడన్ని వింత క్యారెక్టర్స్ తగులుతాయి. అవి భలే తమాషాగా ఉంటాయి. అవి ఏంటి, అలాగే మోఆనాకి తన పూర్వికులు దొరుగుతారా లేదా అన్నది మాత్రం మీ ఎగ్జామ్స్ అయ్యాక జియో హాట్ స్టార్ ట్యూన్ చేయండి. మోఆనాతో ఎంజాయ్ చేయండి. ఆల్ ది బెస్ట్ ఫర్ యువర్ ఎగ్జామ్స్ కిడ్స్ అండ్ హావ్ ఎ బ్లాస్టింగ్ హాలిడేస్.


- ఇంటూరు హరికృష్ణ

● మహనీయులు

దేశానికి ఎనలేని సేవలందించిన వి.వి.గిరి

పిల్లలూ! మన రాష్ట్రం పక్కనే ఒడిశా రాష్ట్రం ఉంది. ఆ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తెలుగువారు భారీ సంఖ్యలో స్థిరపడ్డారు. అలా తెలుగు వారు ఉన్న ఒక ఊరిలో పుట్టాడు ఓ బాలుడు. వారి తల్లిదండ్రులది తూర్పుగోదావరి జిల్లా చింతలపూడి. అక్కడి నుంచి ఒడిశా వెళ్లి స్థిరపడ్డారు. ఆ బాలుడి తండ్రి ఆ కాలంలో పేరెన్నికగన్న న్యాయవాది.

ఆ బాలుడు ఒడిశాలోనే కాలేజీ చదువు పూర్తి చేసుకొని, మద్రాసు (ప్రస్తుతం చెన్నై)లోని మద్రాసు యూనివర్సిటీలో చేరాడు. 1913లో 19 ఏళ్ల వయసులో లా చదివేందుకు ఐర్లాండ్ వెళ్లాడు. ఆ తర్వాత మొదటి ప్రపంచం యుద్ధం జరుగుతున్న సమయంలో డబ్లిన్ నుంచి లండన్ వెళ్లి అక్కడ మహాత్మాగాంధీని కలుసుకున్నాడు. 1916లో స్వదేశం తిరిగి వచ్చి, మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా మారాడు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



అన్ని బిసెంట్ ప్రారంభించిన స్వపరిపాలన ఉద్యమంలో చేరాడు. ఆ తర్వాత మహాత్మాగాంధీ పిలుపు మేరకు న్యాయవాద వృత్తిని వదిలి, దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నాడు. మద్యం అమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం చేసినందుకు 1922లో ఆయన్ని మొదటిసారి అరెస్టు చేశారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1951 ఎన్నికల్లో పాతపట్నం లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఆయన ఎన్నికయ్యారు. కేంద్రంలోనూ కార్మికశాఖ మంత్రిగా పనిచేసి, ఎన్నో సంస్కరణలకు ప్రాణం పోశారు. ఉత్తరప్రదేశ్‌కు, కేరళకు, కర్ణాటకకు గవర్నర్‌గా పనిచేశారు. దేశానికి ఉపరాష్ట్రపతిగా సేవలందించారు. 1969లో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఆయనే వరాహగిరి వెంకటగిరి (వి.వి.గిరి). దేశానికి ఆయన అందించిన సేవలకు గుర్తుగా 1975లో ప్రభుత్వం ఆయనకు 'భారతరత్న' పురస్కారం అందించింది. 1980 జనవరి 24న చెన్నైలో మరణించారు.

అంబానీ బ్రదర్స్



ఈ అన్నదమ్ములను అంబానీ బ్రదర్స్ అనొచ్చా? ఇంత చిన్న వయసులో వ్యాపారంలో ధమధమలాడిస్తుంటే అనక తప్పదు మరి. ఈ అన్నదమ్ముల్లో పెద్దవాడి వయసు 17. మిగిలినవారికి 15, 13, 11. వీళ్లను అందరూ 'బిల్లింగ్స్లియా బాయ్స్' అనీ 'యమ్మీ బ్రదర్స్' అనీ అంటుంటారు.

అమెరికాలోని జార్జియా రాష్ట్రానికి చెందిన జాషువా, ఇషయా, కాలెబ్, మైకా అన్నదమ్ములు. చిన్న వయసులోనే చాలా ఫేమస్ అయ్యారు. అందుకు వారు చేసే వ్యాపారమే కారణం. వారు కుకీలు(బిస్కెట్లు) తయారు చేసి అమ్ముతుంటారు. అలా స్థానికంగా వారు పేరు తెచ్చుకున్నారు. వ్యాపారం ప్రారంభించాలన్న ఆలోచన వారికి ఎలా వచ్చింది? ఒకరోజు కుకీలు ఎలా తయారు చేయాలో వారికి వారి తాతమ్మ సరదాగా నేర్పింది. దాంతో ఆ నలుగురు అప్పుడప్పుడూ ఆ కుకీలు చేసి వీధిలో పంచేవారు. అవి చాలా కొత్తగా, రుచికరంగా ఉన్నాయని అందరూ మెచ్చుకునేవారు. దీంతో దాన్నే వ్యాపారంగా మార్చుకోవచ్చని వారికి ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన రాగానే వెళ్లి వాళ్ల నాన్నకు చెప్పారు. ఆయన అంగీకరించడంతో వెంటనే పని మొదలుపెట్టారు. కుటుంబమంతా వారికి సహకరించింది. అలా 'యమ్మీ బ్రదర్స్' సంస్థ ప్రారంభమైంది. సుమారు 36 రకాల కుకీలు వారు తయారు చేసి మార్కెట్‌లో పెట్టగా, జనం వాటిని ఎగబడి కొన్నారు. అలా వారి కుకీలకు డిమాండ్ పెరిగింది. సంస్థలో మైకా ఆర్థిక అధికారి అయితే, ఇషయా మార్కెటింగ్ ఆఫీసర్, కాలెబ్ ఆపరేటింగ్ అధికారి, జాషువా ఎగ్జిక్యూటివ్ అధికారి. నలుగురూ ఒక్కొక్క పనిని పంచుకుని క్రమపద్ధతిలో చేస్తారు. తమ పనిలో చిన్న తేడా కూడా రాకుండా చూసుకుంటారు. మొదట స్థానికంగా మొదలైన వారి కార్యకలాపాలు ఆ తర్వాత దేశమంతా వ్యాపించాయి. దేశంలో ఎక్కడి నుంచి ఆర్డర్ చేసినా వారు కుకీలను పంపిస్తారు. రుచి, నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడరు. ప్రారంభించిన రెండేళ్లలోనే దాదాపు నాలుగు లక్షలను కుకీలను అమ్మేశారు. ప్రస్తుతం వారి వ్యాపారాన్ని మరింత విస్తరించే ప్రయత్నంలో ఉన్నారు. అయితే ఒక్క పక్క వ్యాపారం చేస్తూనే, చదువును నిర్లక్ష్యం కాలేజీకి, స్కూల్‌కి వెళ్లి చదువుకుంటున్నారు.

కామిక్ బుక్స్ కథ తెలుసా మీకు?

పిల్లలూ! మీలో చాలామందికి కామిక్ బుక్స్ చదివే అలవాటు ఉంటుంది. రాత్రి పడుకునే ముందు వాటిని చదివి, ఆ తర్వాతే నిద్రపోతుంటారు. మరి వాటి వెనకున్న కథేమిటో మీకు తెలుసా? బొమ్మలతో కూడిన కథలనే కామిక్స్ అంటారు. బొమ్మలు, సంభాషణలతో ఒక పుస్తకం రూపొందితే దాన్ని 'కామిక్ బుక్' అంటారు. ప్రపంచంలో మొట్టమొదటి కామిక్ బుక్ ఏదనేదానిపై నిర్ధారణ లేదు. 1884 మే 3న 'Ally Sloper's Half Holiday' అనే బ్రిటిష్ కామిక్ బుక్ వెలువడింది. ఇందులో అల్లీ స్లోపర్ అనే వ్యక్తి తనకు అప్పులిచ్చినవారి నుంచి తప్పించుకోవడానికి వివిధ మార్గాల నుంచి జారుతూ బయటపడుతుంటాడు. ఆ రోజుల్లో సిరీస్‌గా వచ్చిన ఈ కామిక్స్ పిల్లల్ని విశేషంగా అలరించాయి. ఆ తర్వాత1890 నుంచి 1953 వరకు 'కామిక్ కట్స్' అనే బ్రిటిష్ కామిక్






పుస్తకం వెలువడేది. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందింది. అప్పట్లో దినపత్రికలతో సమానంగా జనం వీటిని ఆదరించారు. ఆ సమయంలో వీటికి 'కార్టూన్' అనే పేరు వచ్చింది. 1933లో 'Famous Funnies: A Carnival of Comics' తొలిసారి అమెరికన్ స్టైల్ కామిక్ బుక్ విడుదలైంది. కేవలం సరదా కథలు, జోకులే కాకుండా, ఒక కథను పలు భాగాలుగా, బొమ్మల రూపంలో చెప్పే ప్రక్రియ అందరికీ చేరువైంది. ఆ తర్వాతి కాలంలో సూపర్‌మేన్, స్పైడర్‌మేన్, బ్యాట్‌మేన్ వంటి కామిక్ హీరోలు వచ్చారు.

కామిక్ బుక్స్ బ్రిటన్, అమెరికా దేశాల్లో ప్రఖ్యాతి పొందినా, అతిపెద్ద కామిక్ బుక్ మార్కెట్ మాత్రం జపాన్ దేశమే. 1995 నాటికి చైనాలోని మాంగా మార్కెట్‌లో సుమారు రూ.5 వేల కోట్ల విలువైన కామిక్ బుక్స్ ఉండేవి. అక్కడ ఏటా 1.9 మిలియన్ల కామిక్ పుస్తకాలు అమ్ముడుపోతుంటాయి. దీన్ని జపాన్ జనాభాతో పోల్చి చూస్తే, ఒక్కో వ్యక్తి వద్ద 15 కామిక్ పుస్తకాలు ఉన్నట్లు లెక్క. ప్రస్తుతం మాంగా మార్కెట్‌లో రోజూ వేల కొద్దీ కామిక్ బుక్స్ అమ్ముడవుతూ ఉంటాయి. జపాన్ తర్వాత అమెరికా, కెనడాల్లోనూ కామిక్ బుక్స్ ఏటా కోట్ల సంఖ్యలో అమ్ముడవుతున్నాయి. ఈ పుస్తకాల ఆధారంగా ఎన్నో సినిమాలు, కార్టూన్ సిరీస్‌లు తీశారు. మనదేశంలో ఎన్నో ఏళ్ల నుంచి పంచతంత్ర కథలు, అమరచిత్ర కథలు, రామాయణ, మహాభారత ప్రఖ్యాతి పొందాయి. వాటిని బొమ్మల రూపంలోకి మార్చి, అనేక పుస్తకాలుగా ప్రచురించారు. వాటికి నేటికీ ఎంతో ఆదరణ ఉంది. దీంతోపాటు ఆయా ప్రాంతాల్లో ప్రఖ్యాతి పొందిన జానపద కథలు, సాహసవీరుల కథలు, పురాణాలను సైతం చిత్రాలలోకి మలిచి, పిల్లల పుస్తకాలుగా తీసుకొచ్చారు. తెలుగులో తెనాలి రామకృష్ణుని కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, అక్బర్ బీర్బల్ కథలు, మర్యాద రామన్న కథలు, పరమానందయ్య శిష్యుల కథలు, జాతక కథలు, శ్రీకృష్ణలీలలు వంటివి బొమ్మలతో కూడిన పుస్తకాల రూపంలో వచ్చాయి. చందమామ, బాలమిత్ర, బుజ్జాయి వంటి మాసపత్రికలు పిల్లల కోసం ప్రత్యేకంగా నడిచాయి. పిల్లలూ! ఇదీ కామిక్ బుక్స్ వెనకాలున్న కథ. మీకు కామిక్ పుస్తకాలు చదివే అలవాటు లేదా? ఇప్పుడు చేసుకోండి. రోజుకో కథ చదవండి. ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయి. సరేనా!

ప్రపంచ శాంతి కోసం ఆ పాప ఏం చేసిందో తెలుసా?







'నేను బతుకుతానా అమ్మా?' అని అమాయకంగా అడిగింది సడాకో. తల్లి ఏమీ చెప్పలేక పక్కకు వెళ్లి ఏడ్చింది. సడాకోను ఆసుపత్రిలో ఉంచి రకరకాల చికిత్సలు అందిస్తున్నారు. 12 ఏళ్ల సడాకోది జపాన్ దేశం. ఆటపాటల్లో, చదువులో ఉత్సాహంగా ఉంటుంది. అలాంటి పిల్ల ఒక రోజు ఉన్నట్టుండి అనారోగ్యం పాలైంది. డాక్టర్లు తనకు రకరకాల పరీక్షలు చేశారు. పిడుగులాంటి వార్త తెలిసింది. ఆ చిన్నారి పాపకు లుకేమియా. అంటే క్యాన్సర్.

తనకీ పరిస్థితి ఎందుకు వచ్చిందని సడాకో తల్లిని అడిగింది.

'అణుబాంబు వల్ల' అంది తల్లి.

1945 ఆగస్టులో అమెరికా జపాన్ మీద అణుబాంబు వేసే సమయానికి సడాకో వయసు రెండేళ్లు. సరిగ్గా బాంబు వేసిన ప్రదేశానికి మైలు దూరంలోనే సడాకో కుటుంబం ఉంటోంది. ఆ బాంబు దాడి నుంచి ఆ కుటుంబం ఎలాగో తప్పించుకుని బతికింది. కానీ అణుధార్మికత వల్ల సడాకోకు క్యాన్సర్ వచ్చింది.

'అలాంటి బాంబును ఎందుకు వేశారు? ఎందుకు ఇంత నష్టం కలిగించారు?' అని అడిగింది సడాకో.

తల్లి దగ్గర సమాధానం లేదు. ఏమని చెప్పగలదు? దేశాల మధ్య వైరంలో సామాన్యులే బాధితులు అని ఆ చిన్నారికి ఎలా అర్థం చేయించాలి?

'ఇకపై ఎక్కడా ఇలాంటివి జరగకుండా ఉండాలంటే ఏం చేయాలి?' అని మరో ప్రశ్న వేసింది సడాకో.

'ప్రపంచంలో శాంతి నెలకొనాలి' అంది తల్లి.


'అవును! శాంతి నెలకొనాలి. ప్రపంచంలో అందరూ హాయిగా ఉండాలి. ఎవరికీ ఏ కష్టం రాకుండా ఉండాలి' అని సడాకో నిర్ణయించుకుంది. కానీ తాను ఏం చేయగలుగుతుంది? తట్టిందో ఆలోచన.

జపాన్ దేశ నమ్మకం ప్రకారం కాగితంతో కొంగు బొమ్మలు చేసి దేవుణ్ని ప్రార్థిస్తే అనుకున్నది నెరవేరుతుంది. వెంటనే ఆస్పత్రి మంచం మీదే సడాకో కాగితాలతో కొంగ బొమ్మలు చేయడం ప్రారంభించింది. ఒకటి.. రెండు.. మూడు.. చేతులు నొప్పి పుట్టేవి. అలసట వచ్చేది. అయినా సడాకో ఆగిపోకుండా బొమ్మలు చేసేది.

అలా చేస్తూ ఉంది. చేస్తూనే ఉంది. 1300 బొమ్మలు తయారు చేసింది. ఆపై చేయలేకపోయింది. 12 ఏళ్లకే సడాకో క్యాన్సర్‌తో మరణించింది. ప్రపంచంలో శాంతి నెలకొనాలన్న తన కోరిక ఇంకా సజీవంగా ఉంది. ఈ విషయం తెలిసిన జపాన్ ప్రభుత్వం సడాకో కోసం స్మారకం నిర్మించింది. కాగితపు కొంగ బొమ్మ పట్టుకున్న సడాకో విగ్రహాన్ని చూస్తే ప్రపంచంలో శాంతి నెలకొనాలన్న తన ఆశ కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. నేటికీ అనేక మంది ఆ విగ్రహం దగ్గరికి వెళ్లి కాగితంతో కొంగ బొమ్మలు చేసి అక్కడ పెడతారు. ప్రపంచంలో శాంతి నెలకొనాలని ప్రార్థిస్తారు.

కాని నేటికీ యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. పసిపిల్లల ప్రాణాలు తీస్తూనే ఉన్నాయి. పిల్లలు ఈ పెద్దల్ని చూసి ఏమనుకుంటారు? వీరికి బుద్ధి లేదు అనే కదూ?

● బాలల కథ



మూడొంకాయలు

ఒక ఊరిలో ఎల్లన్న అనే వ్యక్తి ఉండేవాడు. అతనికి చిన్నప్పటి నుంచి వంకాయ కూరంటే చానా ఇష్టం. ఒకరోజు పక్కూరికి పోతా వుంటే దారి నడుమ చెట్టుకు మూడు వంకాయలు కనబన్నాయి. 'లొట్టలేసుకుంటా బిరబిరా ఆ మూడు కాయల్ని తెంపుకోని, పరుగు పరుగున ఇంటికి తిరిగి వచ్చేసినాడు.

పెండ్లాన్ని పిల్చి 'ఏమే!... ఈ మూడు కాయల్తో ఘుమఘుమలాడేలా గుత్తి వంకాయ కూరొండు. రుచి బాగుండాలి' అని పని మీద వెళ్లిపోయాడు.

ఆమె చానా అమాయకురాలు. మొగుడు ఎట్లా చెప్తే అట్లా చేయడం తప్ప ఆమెకు ఏమీ తెలీదు. దాంతో మొగుడు చెప్పినట్లే ఆ మూడు వంకాయలూ తీసుకోని, మాంచి మసాలా చేసి, వంకాయలకు నాలుగువైపులా గాట్లు పెట్టి, లోపలంతా మసాలా కూరి పొయ్యిమీదికి ఎక్కిచ్చింది.



కాసేపున్నాక ఆమెకు వంకాయలు బాగా ఉడికినాయా లేదా అని అనుమానమొచ్చింది. ఒకటి తీసుకోని నోట్లో ఏసుకోని వుడికిందో లేదో చూసింది. బాగా ఉడికిందిలే ఇంకా భయం లేదు నా మొగుడు బాగా మెచ్చుకొంటాడు అనుకొంది. కాసేపున్నాక ఆమెకు ఉప్పూ కారం బాగా పట్టిందా లేదా అని అనుమానమొచ్చింది. ఇంగోదాన్ని తీసి నోట్లో ఏసుకోని ఉప్పూకారం పట్టిందో లేదో చూసింది. బాగా సరిపోయింది ఇంక భయం లేదు అనుకొంది.

అంతలో ఆమె మొగుడు పనులన్నీ పూర్తిచేసుకొని వంకాయ కూర తిందామని వురుక్కుంటా ఇంటికొచ్చినాడు. పళ్లెం తెచ్చుకొని ముందు పెట్టుకోని 'ఏమే! వాసన అదిరిపోతా వుంది! కూర ఏద్దురా. ఆకలి చంపేస్తా ఉంది' అన్నాడు.

భార్య అతని పళ్లెంలో ఒక్క వంకాయనే వేసింది. అది చూసి వాడదిరిపడ్డాడు.

'అదేందే! నేను తెచ్చినేది మూడయితే నువ్వు ఒకటే ఏసినావు. మిగతా రెండూ ఏమయిపోయినాయి' అన్నాడు కోపంగా.

దానికామె వంట చేస్తా... చేస్తా... ఉడికిందో లేదో చూద్దామని ఒకటి, ఉప్పూకారం పట్టిందో లేదో చూద్దామని మరొకటి తిన్నా' అనింది.

దానికి అతను 'ఏమే! నీకు తెలీదా వంకాయ కూరంటే నాకెంత ఇష్టమో? ఐనా తెలిసి తెలిసీ ఎట్లా తింటివే ఆ రెండూ' అన్నాడు కోపంగా.

ఆ అమాయకురాలు వానీ పళ్ళెంలో వున్న ఆ ఒక్క వంకాయను గబుక్కున నోట్లో వేసుకోని నములుతా 'ఇదిగో ఇట్లా తింటి' అని చూపిచ్చింది.

అన్ని దేశాల్లో కరెన్సీ విలువ ఒకటే ఉండదు ఎందుకు?

ప్రతి దేశానికీ ఆయా దేశపు సంస్కృతి చరిత్ర, మానవ సంబంధాలు, ఆర్థిక సంబంధాలు రాజకీయ విధానం ఉంటాయి. దేశాలు వేర్వేరు అయినా మానవులందరికీ ఆహారం, గాలి, నీరు వంటి ప్రాథమిక అవసరాలతో పాటు వాహనాలు, నగలు, కంప్యూటర్లు, కాగితం, పుస్తకాలు, భవనాలు, లోహ పరికరాలు, మందులు, చెప్పులు, మోటార్లు, పెన్నులు, రంగులు, కళ్లద్దాలు, ఎరువులు, విమానాలు మొదలైన వేలాది వస్తువులు, పరికరాలు సాధారణం.



అయితే అన్ని వస్తువులు, అన్ని దేశాల్లో, అన్ని స్థాయిల్లో అన్ని రుతువుల్లో తయారు కావు. ఇచ్చి పుచ్చుకోవడం అవసరం. భారతదేశంలో తయారయ్యే కొన్ని వస్తువులు, సేవలు అమెరికాకు, అమెరికాలో ఉత్పత్తి అయ్యే పరికరాలు సేవలు భారత దేశానికీ అవసరం. మన వస్తువును ఇచ్చి అదే సమయంలో వారి వస్తువును మార్పిడి చేసుకునే వస్తు మార్పిడి విధానం వల్ల సమస్యలున్నాయి కాబట్టి ఈ రోజు మనం కొన్ని వస్తువులను అమెరికాకు ఇచ్చి దానికి సంబంధించిన గుర్తుగా ఒక టోకెన్ తీసుకుంటాం. అదే టోకెన్‌ను రేపు నేను వారికి ఇచ్చి వారి వస్తువుల్ని తీసుకోగలను. మానవ శ్రమ వల్లనే వస్తువులకు విలువ ఏర్పడ్డం వల్ల బల్ల విలువ, సెల్‌ఫోను విలువ ఒకేలా ఉండదు. కాబట్టి టోకెన్ల సంఖ్య మార్పిడి చేసుకొనే వస్తువు మీద ఆధారపడి ఉంటుంది. ఇలా వస్తుమార్పిడి వేర్వేరు దేశాల్లోనే కాకుండా ఒకే దేశంలో వేర్వేరు ప్రజలకు అవసరం అవుతుంది. కాబట్టి టోకెన్లు అంతర్జాతీయంగా, జాతీయంగానూ అవసరం. ఆ టోకెన్లనే కరెన్సీ అంటారు. రూపాయి మన కరెన్సీకి ప్రమాణం. అమెరికాకు డాలర్ ప్రమాణం, ఐరోపా దేశాలకు యూరో ప్రమాణం.

అంతర్జాతీయంగా బంగారాన్ని ప్రమాణంగా ఎంచుకున్నారు. అత్యంత విలువైంది. కాబట్టి మన దేశంలో 10 గ్రాముల్ని దాదాపు 30 వేల రూపాయలకు అమ్మితే అమెరికాలో 500 డాలర్లు పెడితే 10 గ్రాములు వస్తుంది. అంటే 500 డాలర్ల విలువ 30 వేల రూపాయల విలువ సమానం. మరో మాటలో చెప్పాలంటే ప్రతి డాలరుకు ఆ సమయంలో 60 రూపాయల మారకం విలువ అన్నట్టు అర్థం. ఐరోపాదేశాలు కూడబలుక్కుని తమదేశాల్లో ఉన్న వివిధ రకాల కరెన్సీలకు ప్రత్యామ్నాయంగా 'యూరో'ను సార్వత్రికంగా వాడుతున్నారు. ప్రపంచ దేశాలన్నీ పరస్పర అవగాహనకు వస్తే ఒకే కరెన్సీని చలామణీ చేసుకోవడం అసాధ్యం కాదు.

బిజినెస్ రీల్

స్విస్ వాచీల స్టోర్స్ విస్తరణలో బ్రైట్‌లింగ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: స్విస్ లగ్జరీ వాచీల దిగ్గజం బ్రైట్‌లింగ్ వచ్చే ఏడాదిన్నర వ్యవధిలో కొత్తగా ఆరు బొటిక్ స్టోర్స్‌ను ఏర్పాటు చేయనుంది. దీంతో వీటి సంఖ్య 10కి చేరనుంది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు పుణె తదితర నగరాల్లో నాలుగు బొటిక్ స్టోర్స్ ఉన్నట్లు బ్రైట్‌లింగ్ ఇండియా ఎండీ ప్రదీప్ భానోత్ తెలిపారు. దేశీయంగా స్విస్ వాచీల మార్కెట్ సుమారు రూ. 2,500 కోట్లుగా ఉంటోందని ఆయన చెప్పారు. పరిశ్రమ ఏటా సుమారు 15 శాతం ఎదుగుతుండగా, తాము అంతకు మించి వృద్ధిని నమోదు చేస్తున్నట్లు ప్రదీప్ చెప్పారు. స్మార్ట్ వాచీలు వచ్చినప్పటికీ .. హోదాకు నిదర్శనంగా ఉండే బ్రైట్‌లింగ్‌లాంటి లగ్జరీ వాచీల ప్రాధాన్యతను గుర్తించే వారు పెరుగుతున్నారని ఆయన తెలిపారు. అలాగే వాటిపై ఖర్చు చేసే సామర్థ్యాలు పెరుగుతుండటం కూడా వ్యాపార వృద్ధికి దోహదపడనుందని వివరించారు. ప్రస్తుతం హైదరాబాద్ స్టోర్‌లో సుమారు రూ. 3.11 లక్షల నుంచి సుమారు రూ. 17 లక్షల పైచిలుకు విలువ చేసే వాచీలు అందుబాటులో ఉన్నాయి. 140 ఏళ్ల బ్రైట్‌లింగ్ చరిత్రలో అత్యంత ప్రాధాన్యమున్న వాచీలను ఇందులో మార్చి 25 వరకు ప్రదర్శిస్తున్నారు.

సైబర్‌సెక్యూరిటీ కోసం ఐబీ-కార్ట్ 3.0

హైదరాబాద్/పుణె: బ్యాంకింగ్ రంగంలో సైబర్‌సెక్యూరిటీని మెరుగుపర్చే దిశగా క్విక్ హీల్ టెక్నాలజీస్‌లో భాగమైన సెక్రైట్, ఐడీఆర్‌బీటీ (ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ) కలిసి ఐబీ-కార్ట్ 3.0 ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించాయి. ఇందులో అధునాతన నియంత్రణలు, సందర్భోచితమైన ఇంటెలిజెన్స్ ఫీడ్స్ మొదలైన ఫీచర్లు ఉంటాయి. బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగానికి పటిష్టమైన సైబర్‌సెక్యూరిటీ సొల్యూషన్స్‌ను అందించే దిశగా ఇదొక కీలక మైలురాయని క్విక్ హీల్ టెక్నాలజీస్ సీఈవో విశాల్ సాల్వి తెలిపారు.

ఎంఅండ్ఎం వాహన ధరలూ పెరగనున్నాయ్



ముంబై: ఏప్రిల్ 1 నుంచి ఎస్‌యూవీ, వాణిజ్య వాహన ధరలను 3% వరకు పెంచుతున్నట్లు మహీంద్రా అండ్‌మహీంద్రా (ఎంఅండ్ఎం) తెలిపింది. ఇన్‌పుట్ వ్యయాలు, కమోడిటీ ధరలు నిర్వహణ ఖర్చులు అధికమవడంతో ధరలు పెంచక తప్పట్లేదని చెప్పుకొచ్చింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-3-2025

విశాఖ	420-00
చిత్తూరు	470-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	480-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	420-00
వరంగల్	422-00
రిటైల్ ధర	4.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,549.75	3.43
NTPC	353	3.29
ONGC	242	2.72
BAJFINANCE	8,911.10	2.67
BPCL	279.11	2.56

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	5,138.00	-1.6
M&M	2,787.20	-1.45
WIPRO	264.3	-1.38
HINDALCO	697	-1.27
INFY	1,595.40	-1.25

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,006
ఎన్ఎస్ఈ	1,59,844
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,44,007
ఎఫ్ఐఐ	+ 7,470
డీఐఐ	- 3,202

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.30 $ (రాత్రి 11.30కు)	68.07 (క్రితం ముగింపు)
బ్రెంట్	72.15 $ (రాత్రి 11.30కు)	72 00 (క్రితం ముగింపు)

హెచ్‌సీఎల్ గ్రూప్‌తో ప్రుడెన్షియల్ జత

హెల్త్ ఇన్సూరెన్స్ జేవీపై కన్ను

న్యూఢిల్లీ: దేశీయంగా ఆరోగ్య బీమా బిజినెస్ నిర్వహణకు వామ సుందరి ఇన్వెస్ట్‌మెంట్స్(ఢిల్లీ)తో యూకే సంస్థ ప్రుడెన్షియల్ పీఎల్‌సీ తాజాగా చేతులు కలిపింది. ఇందుకు అనుగుణంగా ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ గ్రూప్ ప్రమోటర్ సంస్థ వామ సుందరితో భాగస్వామ్య కంపెనీ(జేవీ) ఏర్పాటుకు తెరతీసింది. తద్వారా దేశీయంగా స్టాండెలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ బిజినెస్ నిర్వహణను చేపట్టనుంది. నియంత్రణ సంస్థల అనుమతుల తదుపరి జేవీలో యూకే అనుబంధ సంస్థ ప్రుడెన్షియల్ గ్రూప్ హోల్డింగ్స్ 70 శాతం వాటా పొందనుండగా.. మిగిలిన 30 శాతం వాటాను వామ తీసుకోనుంది. దేశీయంగా పెరుగుతున్న ఆరోగ్య బీమా అవసరాలకు అనుగుణంగా జేవీ సేవలు అందించనున్నట్లు ప్రుడెన్షియల్ పీఎల్‌సీ సీఈవో అనిల్ వాధ్వానీ పేర్కొన్నారు. వెరసి 2047కల్లా అందరికీ ఆరోగ్య బీమా ప్రభుత్వ విజన్‌కు మద్దతివ్వనున్నట్లు తెలియజేశారు. ప్రుడెన్షియల్ పీఎల్‌సీతో భాగస్వామ్యం ద్వారా దేశవ్యాప్తంగా ఆరోగ్య బీమాను మరింత విస్తరించడంతోపాటు.. నాణ్యమైన సేవలు అందించనున్నట్లు వామ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శిఖర్ మల్హోత్రా పేర్కొన్నారు.



బ్యాక్‌గ్రౌండ్ ఇదీ

దేశీయంగా జీవిత బీమా వెంచర్ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ 2016లో లిస్టయ్యింది. తద్వారా తొలిసారి ఇన్సూరెన్స్ రంగ కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యింది. ఈ బాటలో పాక్షిక వాటా విక్రయం ద్వారా ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీని సైతం లిస్ట్ చేసే యోచనలో ఉన్నట్లు గత నెలలో ప్రుడెన్షియల్ ప్రకటించింది. ఇక 1976లో ఏర్పాటైన హెచ్‌సీఎల్ గ్రూప్ ఐటీ రంగంలో దిగ్గజ కంపెనీగా సేవలందిస్తున్న సంగతి తెలిసిందే. టెక్నాలజీ, హెల్త్‌కేర్, టాలెంట్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్‌లు సైతం గ్రూప్ అందిస్తోంది.

మున్సిపల్ బాండ్లకు వెబ్‌సైట్

ఎన్ఎస్ఈ ఆవిష్కరణ

న్యూఢిల్లీ: మున్సిపల్ బాండ్ల కోసం ప్రత్యేకించిన వెబ్‌సైట్‌ను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎన్ఎస్ఈ) ఆవిష్కరించింది. తద్వారా దేశీయంగా మున్సిపల్ బాండ్ల మార్కెట్లలో క్రెడిబిలిటీ, విజిబిలిటీని పెంచనున్నట్లు ఎన్ఎస్ఈ పేర్కొంది. దేశీ మున్సిపల్ బాండ్లపై సమగ్ర డేటాను అందించడం ద్వారా మార్కెట్లో లావాదేవీలు నిర్వహించేవారికి వెబ్‌సైట్ ప్రధాన కేంద్రంగా నిలవనున్నట్లు తెలియజేసింది. బాండ్ల జారీ, క్రెడిట్ రేటింగ్స్, లావాదేవీల పరిమాణం, వాస్తవిక ఈల్డ్స్, ధరలు తదితరాలను అందించనుంది. అంతేకాకుండా దేశీయంగా తొలి మున్సిపల్ బాండ్ ఇండెక్స్ అయిన నిఫ్టీ ఇండియా మున్సిపల్ బాండ్ ఇండెక్స్ గత చరిత్ర తదితర పూర్తి వివరాలకు వేదిక కానుంది. పారదర్శకంగా, సులభంగా బాండ్ల సమాచారాన్ని పొందగలగడంతోపాటు.. ఇన్వెస్టర్లలో అవగాహన పెంచే లక్ష్యాలతో వెబ్‌సైట్‌ను తీసుకువచ్చినట్లు ఎన్ఎస్ఈ వివరించింది. ఎప్పటికప్పుడు సంబంధిత తాజా సమాచారాన్ని నిర్మాణాత్మక పద్ధతిలో సమకూర్చడం ద్వారా మున్సిపల్ బాండ్లను పెట్టుబడి సాధనంగా విశ్వసించేందుకు వెబ్‌సైట్ దోహదపడనున్నట్లు తెలియజేసింది. సంస్థాగత,



రిటైల్ ఇన్వెస్టర్లు భారీ స్థాయిలో వీటిలో లావాదేవీలు నిర్వహించేందుకు వెబ్‌సైట్ సహకరించనున్నట్లు ఎన్ఎస్ఈ ఎండీ, సీఈవో ఆశిష్ చౌహాన్ పేర్కొన్నారు. వెరసి పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇది మద్దతివ్వనున్నట్లు తెలియజేశారు. ముని బాండ్లుగా పిలిచే వీటిని స్థానిక ప్రభుత్వాలు, ఏజెన్సీలు, రోజువారీ నిధుల అవసరాలకు జారీ చేస్తాయి. జాతీయ రహదారులు, రహదారులు, స్కూళ్ల నిర్మాణ ప్రాజెక్టులకు నిధులు సమకూర్చేందుకు సైతం వీటిని వినియోగిస్తాయి.

డిజిలాకర్‌తో సెబీ జట్టు



న్యూఢిల్లీ: దేశీయంగా సెక్యూరిటీస్ మార్కెట్లో ఎవరూ క్లెయిమ్ చేయని అసెట్స్ పరిమాణాన్ని తగ్గించేందుకు, ఇన్వెస్టర్ల భద్రతను మెరుగుపర్చేందుకు డిజిటల్ డాక్యుమెంట్ స్టోరేజీ ప్లాట్‌ఫాం డిజిలాకర్‌తో మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ జట్టు కట్టింది. దీనితో తమ డీమ్యాట్, మ్యూచువల్ హోల్డింగ్స్ సమాచారాన్ని డిజిలాకర్‌లో భద్రపర్చుకునేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. డిజిలాకర్ యూజర్లు ఇకపై తమ డీమ్యాట్ ఖాతాల్లోని షేర్లు, మ్యూచువల్ ఫండ్ యూనిట్స్ స్టేట్‌మెంట్లను, కన్సాలిడేటెడ్ అకౌంట్ స్టేట్‌మెంట్లను డిజీలాకర్ ద్వారా పొందవచ్చు, అందులోనే భద్రపర్చుకోవచ్చని సెబీ ఒక సర్క్యులర్‌లో తెలిపింది. ఇందుకోసం డిజిలాకర్‌లో రిజిస్టర్ చేసుకోవాలని అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు, ఆర్‌టీఏలు, డిపాజిటరీలకు సూచించింది. నిరుపయోగంగా ఉన్న ఖాతాలు, కాంటాక్ట్ లేదా బ్యాంక్ వివరాలు అందుబాటులో లేకపోవడం వంటి అంశాల కారణంగా క్లెయిమ్ కాకుండా మిగిలిపోయే అసెట్స్ సంబంధించిన సమస్యను పరిష్కరించేందుకు ఇది ఉపయోగపడనుంది. ఏప్రిల్ 1 నుంచి ఈ సర్క్యులర్ అమల్లోకి వస్తుంది. డిజిలాకర్ ఇప్పటికే బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్లు, బీమా పాలసీ సర్టిఫికెట్లు, ఎన్‌పీఎస్ అకౌంట్ స్టేట్‌మెంట్లు మొదలైన వాటిని భద్రపర్చుకునేందుకు సర్వీసులు అందిస్తోంది.

వాణిజ్య ప్రాజెక్ట్‌లో ట్రంప్ ఆర్గనైజేషన్

- ట్రిబెకా డెవలపర్స్, కుందన్ స్పేసెస్ జత
- ట్రంప్ బ్రాండ్‌తో పుణేలో కమర్షియల్ ప్రాజెక్ట్



న్యూఢిల్లీ: రియల్టీ సంస్థ ట్రిబెకా డెవలపర్స్, కుందన్ స్పేసెస్‌తో జత కట్టింది. తద్వారా పుణేలో 'ట్రంప్ వరల్డ్ సెంటర్' పేరుతో రూ. 2,500 కోట్ల విలువైన ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది. వెరసి దేశీ వాణిజ్య రియల్టీలోకి సైతం యూఎస్ కంపెనీ.. ట్రంప్ ఆర్గనైజేషన్ ప్రవేశిస్తోంది. పుణేలో ట్రంప్ వరల్డ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు ట్రిబెకా డెవలపర్స్, కుందన్ స్పేసెస్ సంయుక్తంగా ప్రకటించాయి. దీంతో ఈ ప్రాంతంలో ఇప్పటికే రెసిడెన్షియల్ ప్రాపర్టీలను కలిగిన ట్రంప్ ఆర్గనైజేషన్ కమర్షియల్ రియల్టీ ద్వారా పోర్ట్‌ఫోలియోను విస్తరించుకోనున్నట్లు తెలియజేశాయి. ట్రంప్ బ్రాండుతో పుణే, కోల్‌కతా, గురుగ్రామ్‌లలో రెసిడెన్షియల్ ప్రాజెక్టులను ట్రిబెకా అభివృద్ధి చేస్తోంది. 4.3 ఎకరాలలో చేపడుతున్న ట్రంప్ వరల్డ్ సెంటర్ ప్రాజెక్టు ద్వారా రూ. 2,500 కోట్లకుపైగా అమ్మకాలు నమోదుకాగలవని అంచనా వేస్తోంది. 16 లక్షల చదరపు అడుగులలో విస్తరించనున్న ప్రాజెక్టులో భాగంగా 27 ఫ్లోర్లలో ఆఫీసు స్థలాలను అభివృద్ధి చేయనుంది.

జొమాటో పేరు మార్పునకు ఎంసీఏ ఆమోదం

న్యూఢిల్లీ: ఫుడ్, గ్రాసరీ డెలివరీ సేవల సంస్థ జొమాటో పేరును 'ఎటర్నల్ లిమిటెడ్'గా మార్చే ప్రతిపాదనకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ (ఎంసీఏ) ఆమోదముద్ర వేసింది. ఈ మార్పు మార్చి 20 నుంచి అమల్లోకి వస్తుందని కంపెనీ తెలిపింది. తమ ఫుడ్ డెలివరీ వ్యాపార విభాగం పేరు జొమాటోగానే కొనసాగుతుందని, కార్పొరేట్ సంస్థ పేరు, స్టాక్ టికర్ మాత్రం మారతాయని పేర్కొంది. ఎటర్నల్‌లో నాలుగు ప్రధాన వ్యాపారాలు (జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్, హైపర్‌ప్యూర్) ఉన్నాయి.

ఐపీవోకు ఫిజిక్స్‌వాలా



- ఎస్ఎస్ఎఫ్ ప్లాస్టిక్స్ సైతం
- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

న్యూఢిల్లీ: ఎడ్యుటెక్ యూనికార్న్ ఫిజిక్స్‌వాలా పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు ముందస్తు గోప్యతా దరఖాస్తు ద్వారా సెబీని ఆశ్రయించింది. దీంతో ప్రాస్పెక్టస్ వివరాలను పబ్లిక్‌కు వెల్లడించకుండా నిలువరించేందుకు కంపెనీకి వీలుంటుంది. కాగా.. స్టాక్ ఎక్స్ఛేంజీల మెయిన్‌బోర్డులో లిస్టయ్యేందుకు వీలుగా సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసినట్లు ఫిజిక్స్‌వాలా తాజాగా ప్రకటించింది. అయితే ముందస్తు ఫైలింగ్ ద్వారా ఐపీవోకు వెళ్లడంపై గ్యారంటీలేదని స్పష్టం చేసింది. వెరసి ఫుడ్ డెలివరీ దిగ్గజం స్విగ్గీ, సూపర్ మార్ట్ కంపెనీ విశాల్ మెగా మార్ట్ బాటలో ఐపీవోకు గోప్యతా దరఖాస్తును ఎంచుకుంది.

పలు కంపెనీలు

ఇంతకుముందు 2023లోనూ ఆతిథ్య రంగ కంపెనీ ఓయో కాన్ఫిడెన్షియల్ మార్గంలో సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. అంతకంటే ముందు 2022 డిసెంబర్‌లో టాటా ప్లే(స్కై) రహస్య దరఖాస్తు చేసి 2023 ఏప్రిల్‌లో సెబీ అనుమతి పొందింది. అయితే ఈ రెండు సంస్థలూ పబ్లిక్ ఇష్యూ చేపట్టకపోవడం గమనార్హం! కాగా.. 2020లో ఏర్పాటైన ఫిజిక్స్‌వాలా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ విధానాల్లో దేశవ్యాప్తంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. గతేడాది సెప్టెంబర్‌లో హార్న్‌బిల్ క్యాపిటల్ ఆధ్వర్యంలో 21 కోట్ల డాలర్ల(రూ. 1,800 కోట్లు) పెట్టుబడులు అందుకుంది. 2.8 బిలియన్ డాలర్ల విలువలో నిధులు సమకూర్చుకుంది. ముందస్తు ఫైలింగ్ ఎంచుకుంటే సెబీ తుది అనుమతి తదుపరి ఐపీవోకు 18 నెలల గడువు లభిస్తుంది. సాధారణ పద్ధతిలో అయితే 12 నెలల్లోగా పబ్లిక్ ఇష్యూ చేపట్టవలసి ఉంటుంది.

రూ. 550 కోట్లపై కన్ను

ప్యాకేజింగ్ సొల్యూషన్స్ కంపెనీ ఎస్ఎస్ఎఫ్ ప్లాస్టిక్స్ సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. వీటి ప్రకారం రూ. 550 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఐపీవోలో భాగంగా రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 250 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు, సంబంధిత సంస్థలు విక్రయానికి ఉంచనున్నాయి. ప్రస్తుతం ప్రమోటర్లు 100 శాతం వాటా కలిగి ఉన్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, ప్లాంటు, మెషీనరీ తదితర పెట్టుబడి వ్యయాలతో పాటు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా బాటిళ్లు, కంటెయినర్లు, మూతలు, టబ్‌లు, ఇంజినీరింగ్ ప్లాస్టిక్ విడిభాగాలు తదితర ఉత్పత్తులను రూపొందిస్తోంది. వ్యక్తిగత సంరక్షణ, పానీయాలు, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, లూబ్రికెంట్స్, ఫార్మాస్యూటికల్స్ రంగాలలో ప్రొడక్టులను వినియోగిస్తారు. 2024 సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల్లో రూ. 397 కోట్ల ఆదాయం, రూ. 15 కోట్ల నికర లాభం ఆర్జించింది.

రిజిస్టర్‌కాని సలహాదారులతో ముప్పు

- తప్పుదోవ పట్టించే 70 వేల పోస్టుల తొలగింపు
- సెబీ హోల్‌టైమ్ మెంబర్ అనంత నారాయణ్



ముంబై: నమోదుకాని పెట్టుబడి సలహాదారులు, రీసెర్చ్ అనలిస్టులు పెద్ద ముప్పుగా పరిణమించారని సెబీ పూర్తికాల సభ్యుడు అనంత నారాయణ్ వ్యాఖ్యానించారు. పెట్టుబడులకు పెరుగుతున్న ఆసక్తిని వీరు సొమ్ము చేసుకుంటున్నట్లు చెప్పారు. సోషల్ మీడియా కంపెనీల సాయంతో ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించే 70,000 హ్యాండిళ్లు, పోస్టులను గత ఆరు నెలల్లో (2024 అక్టోబర్ నుంచి) తొలగించినట్లు తెలిపారు. సెబీ గతేడాది ఫిన్‌ఫ్లుయెన్సర్ కార్యాచరణను ప్రకటించడం తెలిసిందే. దీని కింద ఈ చర్యలు తీసుకుంది. ముంబైలో రిజిస్టర్డ్ (నమోదిత) ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ల సమావేశంలో భాగంగా నారాయణ్ మాట్లాడారు. నిబంధనలు అనుసరించే విషయంలో సలహాదారుల సాయం కోరారు. రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ సంస్థల గుర్తింపునకు సెబీ 'పే రైట్' హ్యాండిల్ సాయపడుతుందని గుర్తు చేశారు.

ఎఫ్‌పీఐల పెట్టుబడులపై ఆందోళన అక్కర్లేదు..

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐలు) విక్రయాలపై వస్తున్న ఆందోళనలకు నారాయణ్ స్పందించారు. పరిస్థితి అంత దారుణంగా ఏమీ లేదన్నారు. అయినప్పటికీ భారత్‌కు విదేశీ నిధులు అవసరమన్నారు. ''2025 ఫిబ్రవరి నాటికి ఎఫ్‌పీఐలు భారత ఈక్విటీల్లో రూ.62 లక్షల కోట్ల పెట్టుబడులు కలిగి ఉన్నారు. డెట్ సాధనాల్లో రూ.5.9 లక్షల కోట్ల పెట్టుబడులు వారికి ఉన్నాయి''అని గణాంకాలను తెలియజేశారు. గత ఐదేళ్లలో భారత ఈక్విటీ, డెట్ మార్కెట్లలోకి 54 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చినట్లు గుర్తు చేశారు. అంతకుముందు ఐదేళ్లలో వచ్చిన 19 బిలియన్ డాలర్ల కంటే ఎంతో అధికంగా ఉన్నట్లు తెలిపారు. నిలకడైన వృద్ధి, స్థిరమైన స్థూల ఆర్థిక పరిస్థితులు, మెరుగైన పరిపాలన విదేశీ ఇన్వెస్టర్లను తప్పకుండా ఆకర్షిస్తాయన్నారు. మరింత మెరుగైన పెట్టుబడుల అనుభవం కోసం ఎఫ్‌పీఐలు సహా భాగస్వాములు అందరితో కలసి పనిచేస్తున్నట్లు ప్రకటించారు. మ్యూచువల్ ఫండ్స్ నుంచి ఈక్విటీల్లో స్థిరమైన పెట్టుబడులు రావడాన్ని ప్రశంసించారు.

యస్ బ్యాంక్‌కు రికవరీ నిధులు

జేసీ ఫ్లవర్స్ నుంచి రూ. 429 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ యస్ బ్యాంక్ తాజాగా రుణ రికవరీకింద రూ. 429 కోట్లు అందుకుంది. జేసీ ఫ్లవర్స్ ఆస్తుల(రుణాల) పునర్‌నిర్మాణ కంపెనీ(ఏఆర్‌సీ) నుంచి నిధులు లభించాయి. 2022లో చేపట్టిన మొండిబకాయిల(ఎన్‌పీఏలు) విక్రయం ద్వారా తాజా నిధులు అందుకుంది. 2022 డిసెంబర్‌లో ఎన్‌పీఏలుగా మారిన రూ. 48,000 కోట్ల విలువైన రుణ పోర్ట్‌ఫోలియోను జేసీ ఫ్లవర్స్‌కు బదిలీ చేసింది. వీటికి సంబంధించి సెక్యూరిటీ వసూళ్ల పోర్ట్‌ఫోలియో కింద సింగిల్ ట్రస్ట్ నుంచి రూ. 429 కోట్లు లభించినట్లు యస్ బ్యాంక్ పేర్కొంది.

బీఎస్ఈలో యస్ బ్యాంక్ షేరు 1.4 శాతం బలపడి రూ. 17.18 వద్ద ముగిసింది.



హిండాల్కో భారీ పెట్టుబడులకు సై

వివిధ విభాగాలపై రూ. 45,000 కోట్లు

ముంబై: ప్రయివేట్ రంగ మెటల్ దిగ్గజం హిండాల్కో ఇండస్ట్రీస్ భవిష్యత్‌లో వివిధ విభాగాలపై రూ. 45,000 కోట్లు వెచ్చించనుంది. అల్యూమినియం, కాపర్, స్పెషాలిటీ అల్యూమినా బిజినెస్‌లపై పెట్టుబడులు వినియోగించనున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ దిగ్గజం చైర్మన్ కుమార మంగళం బిర్లా పేర్కొన్నారు. హిండాల్కో కొత్త బ్రాండ్‌ను ఆవిష్కరిస్తూ ఏర్పాటు చేసిన ఒక ఈవెంట్‌లో తుది ఉత్పత్తులతోపాటు.. తదుపరి తరం, హైప్రిసిషన్ ఇంజినీర్డ్ ప్రొడక్టుల తయారీకి కట్టుబడి ఉన్నట్లు తెలియజేశారు. ఇందుకు రూ. 45,000 కోట్ల పెట్టుబడులు వెచ్చించనున్నట్లు తెలిపారు. అయితే ఇందుకు గడువును వెల్లడించలేదు. సోలార్ మాడ్యూల్స్, బ్యాటరీ స్టోరేజీ తయారీలో అల్యూమినియం, కాపర్ అంతర్గత భాగాలని పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన విభాగంలో 150 మెగావాట్లు జత చేసుకుంటున్నట్లు వెల్లడించారు. తద్వారా మొత్తం విద్యుత్ ప్రసార సామర్థ్యం 350 మెగావాట్లకు చేరనున్నట్లు తెలియజేశారు.

కీలక టెక్నాలజీ భాగస్వామిగా భారత్

నాస్కామ్ ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సాంకేతిక రంగంలో గణనీయంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ ప్రెసిడెంట్ రాజేశ్ నంబియార్ తెలిపారు. ఈ నేపథ్యంలో గ్లోబల్ టెక్నాలజీ వ్యవస్థలో అత్యంత ప్రాధాన్యత గల కీలక భాగస్వామిగా భారత్ ఉంటోందని ఆయన నాస్కామ్ గ్లోబల్ కాన్‌ఫ్లుయెన్స్ 2025లో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. అసాధారణ ప్రతిభావంతుల లభ్యత భారత్‌కి సానుకూలాంశంగా ఉంటోందని నంబియార్ వివరించారు. గ్లోబల్ స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ మొదలైన విభాగాలు) మార్కెట్లో భారత్‌కి 28 శాతం, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌లో 23 శాతం వాటా ఉందని తెలిపారు. మరోవైపు, అందరికీ ఏఐ ప్రయోజనాలు లభించాలన్న లక్ష్య సాధన దిశగా కేంద్రం పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని వాణిజ్య, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద చెప్పారు. పరిశ్రమ దిగ్గజాలు పరిశోధన, అభివృద్ధిపై (ఆర్అండ్‌డీ) మరింతగా దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.

వస్తు ఎగుమతులను సేవలు అధిగమించాలి

- 2025-26లో రూ.39లక్షల కోట్లకు చేరుకోవాలి
- ఏటా 15-18 శాతం వృద్ధి సాధ్యమే
- అంతర్జాతీయంగా వస్తు ఎగుమతులకు సవాళ్లు
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: సేవల రంగం ఎగుమతులు వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2025-26) 450 బిలియన్ డాలర్లను (సుమారు రూ.39లక్షల కోట్లు) చేరుకోవాలని.. తద్వారా వస్తు ఎగుమతుల విలువను అధిగమించాలని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఈ లక్ష్యంతో పనిచేయాలని పరిశ్రమకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయంగా నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో వస్తు ఎగుమతులు సవాళ్లను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కనుక సేవల రంగం ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న 385-390 బిలియన్ డాలర్ల నుంచి 2025-26లో 450 బిలియన్ డాలర్లను చేర్చేందుకు పరిశ్రమ కృషి చేయాలని కోరారు. 2023-24లో సేవల ఎగుమతులు 341 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 5 శాతం పెరిగాయి. 2024 ఏప్రిల్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 11 నెలల్లో సేవల ఎగుమతులు క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే 14 శాతం పెరిగి 355 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో వస్తు ఎగుమతులు 3.1 శాతం క్షీణించి 437 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దీంతో మరింత పెద్ద లక్ష్యాలతో పని చేయాలంటూ 'నాస్కామ్ గ్లోబల్ కన్‌ఫ్లుయెన్స్' ఆరంభ సమావేశంలో భాగంగా మంత్రి పరిశ్రమకు పిలుపునిచ్చారు. దేశంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) పెద్ద ఎత్తున ఏర్పాటవుతుండడం, కొత్త టెక్నాలజీలతో సేవల ఎగుమతుల్లో ఏటా 15-18 శాతం వృద్ధి సాధించగలమన్నారు. దేశంలో 1,650 జీసీసీలు పనిచేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు.

పర్యాటకం, ఫైనాన్షియల్ రంగాల్లో అవకాశాలు

దేశ సేవల ఎగుమతుల్లో 200 బిలియన్ డాలర్ల మేర ఐటీ, ఐటీ సంబంధిత సేవలే ఉన్నట్లు మంత్రి గోయల్ తెలిపారు. అదే సమయంలో పర్యాటకం, ఫైనాన్షియల్ సర్వీసెస్‌లోనూ సేవల ఎగుమతుల వృద్ధికి పెద్ద మొత్తంలో అవకాశాలు రానున్నట్లు చెప్పారు. అయినప్పటికీ సేవల ఎగుమతుల్లో ఐటీ, ఐటీఈఎస్ ముందుంటాయన్నారు. క్లయింట్ లొకేషన్ నుంచి కాకుండా, మారుమూల ప్రాంతాల నుంచి మరిన్ని సేవలను అందించడంపై ఐటీ పరిశ్రమ దృష్టి పెట్టాలని కోరారు. దీనివల్ల పోటీతత్వం పెరిగి, వ్యయాలు తగ్గుతాయన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే, భారత్‌లో వేతనాలు చెల్లించడం ఇందులో ఉన్న మరో ప్రయోజనంగా పేర్కొన్నారు.

శభాష్ నవాజ్

45 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్స్‌లతో 105 నాటౌట్

- 205 పరుగుల లక్ష్యాన్ని 16 ఓవర్లలోనే ఛేదించిన పాకిస్తాన్
- మూడో టి20లో న్యూజిలాండ్ ఓటమి ● రేపు నాలుగో టి20

ఆక్లాండ్: ఓపెనర్ హసన్ నవాజ్ (45 బంతుల్లో 105 నాటౌట్; 10 ఫోర్లు, 7 సిక్స్‌లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. ఫలితంగా న్యూజిలాండ్ పర్యటనలో పాకిస్తాన్ జట్టు తొలి విజయం నమోదు చేసుకుంది. 5 మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన మూడో మ్యాచ్‌లో పాకిస్తాన్ 9 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలుపొందింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో పేలవ ప్రదర్శనతో విమర్శలు మూటగట్టుకున్న పాకిస్తాన్... మూడో మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. మొదట బౌలర్లు మెరుగైన ప్రదర్శన చేయగా... ఆనక బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. దీంతో ప్రస్తుతం సిరీస్‌లో పాకిస్తాన్ 1–2తో నిలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 19.5 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. మార్క్ చాప్‌మన్ (44 బంతుల్లో 94; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) భారీ అర్ధశతకంతో ఆకట్టుకోగా... కెప్టెన్ బ్రేస్‌వెల్ (18 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించాడు. పాకిస్తాన్ బౌలర్లలో హారీస్ రవూఫ్ 3 వికెట్లు పడగొట్టగా... షాహీన్ షా అఫ్రిది, అబ్రార్ అహ్మద్, అబ్బాస్ అఫ్రిది తలా 2 వికెట్లు తీశారు. 205 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ 16 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 207 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హసన్ నవాజ్ కెరీర్‌లో తొలి సెంచరీ నమోదు చేసుకోగా... కెప్టెన్ సల్మాన్ ఆఘా (31 బంతుల్లో 51 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), మొహమ్మద్ హారీస్ (20 బంతుల్లో 41; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. న్యూజిలాండ్ బౌలర్లలో డఫీ ఒక వికెట్ పడగొట్టాడు. ఇరు జట్ల మధ్య ఆదివారం నాలుగో టి20 జరుగుతుంది.


చాప్‌మన్

రెండు డకౌట్‌ల తర్వాత...

ఈ సిరీస్ ద్వారానే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన నవాజ్... తొలి రెండు మ్యాచ్‌ల్లో డకౌట్‌గా వెనుదిరిగాడు. అయినా మేనేజ్‌మెంట్ అతడిపై నమ్మకం ఉంచి మూడో మ్యాచ్‌లో అవకాశం ఇవ్వగా... తన విధ్వంసకర బ్యాటింగ్‌తో రికార్డులు తిరగరాశాడు. అతడి దూకుడుతో భారీ లక్ష్య ఛేదనలో పాకిస్తాన్ ఏమాత్రం వెనకడుగు వేయలేదు. తొలి ఓవర్‌లో రెండు సిక్సర్లతో హెచ్చరికలు జారీచేసిన హారీస్... రెండో ఓవర్‌లో రెండు ఫోర్లు బాదాడు. మొదట హారీస్‌కు అండగా నిలిచిన నవాజ్... ఆ తర్వాత బ్యాట్‌కు పనిచెప్పడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. తొలి వికెట్‌కు 74 పరుగులు జోడించిన అనంతరం హారీస్ అవుట్ కాగా... పవర్ ప్లే (6 ఓవర్లలో) ముగిసేసరికి పాకిస్తాన్ 75/1తో నిలిచింది. అంతర్జాతీయ టి20ల్లో ఆ జట్టుకు ఇదే అత్యధిక పవర్ ప్లే స్కోరు. 2016లో ఇంగ్లండ్‌పై చేసిన 73 పరుగులు రెండో స్థానానికి చేరింది. కెప్టెన్ సల్మాన్ ఆఘా రాకతో పాక్ దూకుడు మరింత పెరిగింది. వీలు చిక్కినప్పుడల్లా నవాజ్ సిక్సర్లతో రెచ్చిపోగా... అతడికి సల్మాన్ అండగా నిలిచాడు. ఈ క్రమంలో నవాజ్ 44 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. పాకిస్తాన్ తరఫున అంతర్జాతీయ టి20ల్లో ఇదే వేగవంతమైన శతకం. 2021లో దక్షిణాఫ్రికాపై బాబర్ ఆజమ్ (49 బంతుల్లో) చేసిన సెంచరీ రెండో స్థానంలో ఉంది. 'గత రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యా. ఒక్క పరుగు కూడా చేయకుండానే అవుటయ్యా. దీంతో బాగా ఒత్తిడికి గురయ్యా. అయినా మేనేజ్‌మెంట్ నాకు మరో అవకాశం ఇచ్చింది. తొలి పరుగు చేసినప్పుడు భారం తీరినట్లు అనిపించింది. దీంతో స్వేచ్ఛగా ఆడి జట్టును గెలిపించాలనుకున్నా' అని నవాజ్ అన్నాడు. నవాజ్, సల్మాన్ అబేధ్యమైన రెండో వికెట్‌కు 133 పరుగులు జోడించి జట్టును విజయ తీరాలకు చేర్చారు. 200 పైచిలుకు పరుగుల లక్ష్యాన్ని 16 ఓవర్లలోపు పూర్తి చేసిన తొలి జట్టుగా పాకిస్తాన్ నిలిచింది. ఓవరాల్‌గా పాకిస్తాన్‌కు ఇది రెండో పెద్ద ఛేదన. కెప్టెన్ సల్మాన్ కూడా ఈ మ్యాచ్‌లోనే తొలి అంతర్జాతీయ అర్ధశతకం పూర్తిచేసుకున్నాడు.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫెర్ట్ (సి) సల్మాన్ (బి) రవూఫ్ 19; అలెన్ (సి) రవూఫ్ (బి) షాహీన్ అఫ్రిది 0; చాప్‌మన్ (సి) షాదాబ్ (బి) షాహీన్ అఫ్రిది 94; డారిల్ మిచెల్ (సి) రవూఫ్ (బి) షాదాబ్ 17; నీషమ్ (ఎల్బీ) (బి) అబ్బాస్ అఫ్రిది 3; మిచెల్ హే (బి) అబ్రార్ 9; బ్రేస్‌వెల్ (బి) రవూఫ్ 31; జేమీసన్ (బి) అబ్రార్ 0; ఇష్ సోధి (సి) హారీస్ (బి) రవుఫ్ 10; డఫీ (సి) ఇర్ఫాన్ (బి) అబ్బాస్ 2; సియర్స్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 204. వికెట్ల పతనం: 1–3, 2–43, 3–98, 4–135, 5–141, 6–164, 7–164, 8–193, 9–194, 10–204. బౌలింగ్: షాహీన్ షా అఫ్రిది 4–0–36–2; అబ్రార్ అహ్మద్ 3–0–43–2; రవూఫ్ 4–0–29–3; అబ్బాస్ అఫ్రిది 2.5–0–24–2; షాదాబ్ ఖాన్ 4–0–33–1; ఖుష్‌దిల్ షా 1–0–18–0; సల్మాన్ ఆఘా 1–0–13–0.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: హారీస్ (సి) హే (బి) డఫీ 41; హసన్ నవాజ్ (నాటౌట్) 105; సల్మాన్ ఆఘా (నాటౌట్) 51; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (16 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి) 207. వికెట్ల పతనం: 1–74. బౌలింగ్: జెమీసన్ 3–0–54–0; డఫీ 3–0–37–1; సియర్స్ 4–0–51–0; బ్రాస్‌వెల్ 2–0–23–0; ఇష్ సోధి 2–0–28–0; నీషమ్ 1–0–9–0.


నవాజ్

44 హసన్ నవాజ్ సెంచరీ చేసేందుకు తీసుకున్న బంతులు. పాకిస్తాన్ తరఫున అంతర్జాతీయ టి20ల్లో ఇదే వేగవంతమైన సెంచరీ. బాబర్ ఆజమ్ (2021లో దక్షిణాఫ్రికాపై: 49 బంతుల్లో) రెండో స్థానంలో ఉన్నాడు.

'నా ఆలోచనలను త్వరలోనే పంచుకుంటా'

ఒలింపిక్స్ ఆతిథ్య దేశాల ఎంపికపై ఐఓసీ కొత్త అధ్యక్షురాలు కొవెంట్రీ కీలక వ్యాఖ్యలు

కోస్టా నవారినో (గ్రీస్): అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) అధ్యక్షురాలిగా ఎంపికైన కిర్‌స్టీ కొవెంట్రీ భవిష్యత్తు ఒలింపిక్ ఆతిథ్య దేశాల అంశంలో కీలక వ్యాఖ్యలు చేసింది. 2036లో భారత్‌లో విశ్వక్రీడలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో కొవెంట్రీ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. భవిష్యత్‌లో ఒలింపిక్స్ ఆతిథ్య దేశాల అంశంలో తన ఆలోచనలను త్వరలోనే వెల్లడిస్తానని కొవెంట్రీ పేర్కొంది. 'ఈ ప్రక్రియ సుదీర్ఘ కాలం సాగుతుంది. భవిష్యత్తు ఆతిథ్య దేశం ఎంపికలో సభ్యులందరి పాత్ర ఉంటుంది. దీనిపై నాకు కొన్ని ఆలోచనలు ఉన్నాయి. వాటిని త్వరలోనే ఐఓసీ సభ్యులతో పంచుకుంటాను' అని కొవెంట్రీ పేర్కొంది. గురువారం జరిగిన ఐఓసీ ఎన్నికల్లో కొవెంట్రీ భారీ ఆధిక్యంతో విజయం సాధించింది. జూన్ 23తో ప్రస్తుత అధ్యక్షుడు థామస్ బాచ్ పదవీ కాలం ముగిసిన అనంతరం కొవెంట్రీ పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టనుంది. జింబాబ్వేకు చెందిన 41 ఏళ్ల కిర్‌స్టీ కొవెంట్రీ ప్రస్తుతం ఆ దేశ క్రీడా శాఖ మంత్రిగానూ వ్యవహరిస్తోంది. 2033 వరకు కొవెంట్రీ ఐఓసీ అధ్యక్షురాలిగా కొనసాగనుంది. ఆమె అధ్యక్షతన 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్, 2032 బ్రిస్బేన్ ఒలింపిక్స్ జరగనున్నాయి. దీంతో పాటు 2036 ఒలింపిక్స్ ఆతిథ్య దేశం ఎంపిక కూడా కొవెంట్రీ హయాంలోనే ఖాయం కానుంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం పదికి పైగా దేశాలు పోటీ పడుతున్నాయి. వీటిలో భారత్‌తో పాటు ఖతర్, సౌదీ అరేబియా కూడా ఉన్నాయి. 'లెటర్ ఆఫ్ ఇంటెంట్' సమర్పించడంతో... భారత్ తమ ఆసక్తిని ఇప్పటికే వెల్లడించింది. దీనిపై ఐఓసీ పూర్తి అధ్యయనం చేయనుంది. 2036 ఒలింపిక్స్‌కు సంబంధించిన ఆతిథ్య హక్కుల అంశంలో 2026లోగా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ సన్నాహాలపై త్వరలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ అవుతానని... ఆయన అధ్యక్షుడిగా ఉన్నప్పుడే 2017లో లాస్ ఏంజెలిస్‌కు ఆతిథ్య హక్కులు దక్కాయని కొవెంట్రీ తెలిపింది. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ ద్వారా క్రికెట్ టి20 ఫార్మాట్ రూపంలో మళ్లీ విశ్వ క్రీడల్లో భాగం కానుంది. ఈ నేపథ్యంలో గ్రీస్‌లో జరిగిన ఐఓసీ సెషన్‌లో కిర్‌స్టీ కొవెంట్రీతో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్ జై షా మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఐఓసీ అధ్యక్షురాలిగా ఎన్నికైనందుకు ఆమెకు అభినందనలు తెలిపారు.


ఐఓసీ అధ్యక్షురాలు కిర్‌స్టీ కొవెంట్రీతో ఐసీసీ అధ్యక్షుడు జై షా

వాల్ట్ ఫైనల్లో ప్రణతి నాయక్



న్యూఢిల్లీ: అంతర్జాతీయ జిమ్నాస్టిక్స్ సమాఖ్య (ఎఫ్ఐజీ) ఆపరేటస్ వరల్డ్‌కప్‌లో భారత జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ వాల్ట్ ఈవెంట్‌లో ఫైనల్లోకి ప్రవేశించింది. బెంగాల్‌కు చెందిన 29 ఏళ్ల ప్రణతి వాల్ట్ క్వాలిఫయింగ్‌లో 13.317 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. గత ఏడాది ఈజిప్ట్‌లో జరిగిన ప్రపంచకప్‌లో వాల్ట్ ఈవెంట్‌లోనే కాంస్య పతకాన్ని నెగ్గిన ప్రణతి టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. 2019 ఆసియా చాంపియన్‌షిప్‌లో, 2022 ఆసియా చాంపియన్‌షిప్‌లో ప్రణతి కాంస్య పతకాలను సొంతం చేసుకుంది. 'క్వాలిఫయింగ్‌లో ప్రణతి ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. ఫైనల్లో మరింత మెరుగ్గా రాణిస్తే ఆమెకు పతకం ఖాయం' అని ఆమె కోచ్ అశోక్ కుమార్ మిశ్రా తెలిపారు. ఫైనల్ శనివారం జరుగుతుంది.

మరో విజయం సాధిస్తే...

2026 ప్రపంచకప్ ఫుట్‌బాల్ ప్రధాన టోర్నీకి న్యూజిలాండ్, న్యూ కాలడోనియా అర్హత



వెల్లింగ్టన్: వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు అర్హత సాధించేందుకు న్యూజిలాండ్, న్యూ కాలడోనియా జట్లు ఒక్క విజయం దూరంలో నిలిచాయి. ఓసియానియా జోన్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఈ రెండు జట్లు ఫైనల్‌కు దూసుకెళ్లాయి. ఈనెల 24న ఈ రెండు జట్ల మధ్య జరిగే ఫైనల్లో గెలిచిన జట్టు 2026 ప్రపంచకప్ టోర్నీ బెర్త్‌ను అధికారికంగా ఖరారు చేసుకుంటుంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్స్‌లో న్యూజిలాండ్ 7–0 గోల్స్ తేడాతో ఫిజీ జట్టుపై గెలుపొందగా... న్యూ కాలడోనియా జట్టు 3–0తో తాహితి జట్టును ఓడించింది. ఫిజీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ తరఫున క్రిస్టోఫర్ వుడ్ (6వ, 56వ, 60వ నిమిషాల్లో) మూడు గోల్స్‌తో 'హ్యాట్రిక్' నమోదు చేశాడు. సర్‌ప్రీత్ సింగ్ (16వ నిమిషంలో), టైలర్ గ్రాంట్ బిండన్ (23వ నిమిషంలో), టిమోతీ జాన్ పేన్ (32వ నిమిషంలో), బార్బరూసెస్ (73వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. తాహితి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో న్యూ కాలడోనియా తరఫున జార్జెస్ గోప్ ఫెనెపెజ్ (50వ, 76వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... లూయిస్ వాయా (90+1వ నిమిషంలో) ఒక గోల్ సాధించాడు. న్యూజిలాండ్ జట్టు ఇప్పటికి రెండుసార్లు (1982లో, 2010లో) ప్రపంచకప్ ప్రధాన టోర్నీలో పోటీపడింది. మరోవైపు న్యూ కాలడోనియా జట్టు ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించలేదు.

హైదరాబాద్ పరాజయం

రాణించిన కెప్టెన్ మమత



గువాహటి: జాతీయ అండర్–23 మహిళల వన్డే ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన నాలుగో క్వార్టర్ ఫైనల్లో ఉత్తరప్రదేశ్ జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో మమత సారథ్యంలోని హైదరాబాద్ జట్టుపై విజయం సాధించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 49.1 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటైంది. స్టార్ ప్లేయర్ గొంగడి త్రిష (14 బంతుల్లో 3) విఫలమవ్వగా... కెప్టెన్, వికెట్ కీపర్ మమత (83 బంతుల్లో 77; 7 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. సాక్షి రావు (37 బంతుల్లో 36; 1 ఫోర్), కావ్య (63 బంతుల్లో 30; 3 ఫోర్లు) రాణించారు. ఉత్తరప్రదేశ్ బౌలర్లలో గరిమా యాదవ్, సోనమ్ యాదవ్ 3 వికెట్ల చొప్పున తీయగా... ఏక్తాకు 2 వికెట్లు లభించాయి. అనంతరం ఉత్తరప్రదేశ్ జట్టు 44.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 203 పరుగులు సాధించి విజయం ఖరారు చేసుకుంది. తృప్తి సింగ్ (99 బంతుల్లో 73; 10 ఫోర్లు), ముస్కాన్ మాలిక్ (92 బంతుల్లో 68 నాటౌట్; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేసి ఉత్తరప్రదేశ్ విజయంలో కీలకపాత్ర పోషించారు. హైదరాబాద్ బౌలర్లలో కేసరి ధృతి, సాక్షి రావు ఒక్కో వికెట్ తీశారు.

భారత్ డబుల్ ధమాకా





- 'ఇండియన్ టూర్' స్క్వాష్ టోర్నీలో భారత్‌కే రెండు టైటిల్స్
- విజేతలుగా నిలిచిన అనాహత్, వీర్ చోత్రాని

చెన్నై: స్క్వాష్ రాకెట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఆర్ఎఫ్ఐ) ఇండియన్ టూర్ టోర్నమెంట్‌లో భారత క్రీడాకారులు అనాహత్ సింగ్, వీర్ చోత్రాని చాంపియన్స్‌గా అవతరించారు. శుక్రవారం ముగిసిన ఈ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ 82వ ర్యాంకర్, 17 ఏళ్ల అనాహత్ సింగ్... పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ 76వ ర్యాంకర్ వీర్ చోత్రాని టైటిల్స్‌ను సొంతం చేసుకున్నారు. భారత్‌కే చెందిన ఆకాంక్ష సాలుంఖేతో జరిగిన తుది పోరులో అనాహత్ సింగ్ 11–6, 8–11, 11–8, 11–5తో గెలుపొందింది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో వీర్ చోత్రాని 3–11, 12–10, 11–6, 11–7తో మెల్విల్ సియానిమనికో (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. తొలి గేమ్‌ను కోల్పోయిన వీర్ ఆ తర్వాత విజృంభించి వరుసగా మూడు గేమ్‌లను సొంతం చేసుకున్నాడు.

శంకర్ సంచలనం

ప్రపంచ 2వ ర్యాంకర్ అంటోన్సెన్‌పై విజయం ● సెమీస్‌లో గాయత్రి-ట్రెసా జోడీ





బాసెల్: స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత యువతార శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ పెను సంచలనం సృష్టించాడు. ప్రపంచ రెండో ర్యాంకర్ ఆండెర్స్ అంటోన్సెన్ (డెన్మార్క్)పై శంకర్ అద్భుత విజయం సాధించాడు. తమిళనాడుకు చెందిన 21 ఏళ్ల శంకర్ శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 18–21, 21–12, 21–5తో అంటోన్సెన్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. 2022 ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన శంకర్ 66 నిమిషాల పోరులో అంటోన్సెన్ ఆట కట్టించాడు. ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో రెండుసార్లు రజతం, ఒకసారి కాంస్య పతకం నెగ్గిన అంటోన్సెన్ తొలి గేమ్ గెలిచినప్పటికీ... ఆ తర్వాత ప్రపంచ 68వ ర్యాంకర్ శంకర్ ధాటికి చేతులెత్తేశాడు. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 31వ ర్యాంకర్ క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్)తో శంకర్ తలపడతాడు. మరోవైపు మహిళల డబుల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ జోడీ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. క్వార్టర్ ఫైనల్లో గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 21–18, 21–14తో పుయ్ లామ్ యెంగ్–ఎన్గా టింగ్ యెయుంగ్ (హాంకాంగ్) జంటపై విజయం సాధించింది.

ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టు కోచ్ పదవికి లూయిస్ గుడ్‌బై



లండన్: ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టుకు కోచ్ పదవి నుంచి జాన్ లూయిస్ తప్పుకున్నాడు. మహిళల టి20 ప్రపంచకప్‌లో పేలవ ప్రదర్శనకు తోడు యాషెస్ సిరీస్‌లో మెరుగైన ఫలితాలు సాధించలేకపోవడంతో జాన్ లూయిస్ కోచింగ్ బాధ్యతల నుంచి వైదొలిగాడు. 2022 నుంచి జాన్ ఇంగ్లండ్ మహిళల జట్టు కోచ్‌గా వ్యవహరిస్తుండగా... ఆ జట్టు 2024 టి20 ప్రపంచకప్‌లో గ్రూప్ దశకే పరిమితమైంది. ఇక వేర్వేరు ఫార్మాట్లలో ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌ల్లోనూ ఇంగ్లండ్ జట్టు పేలవ ప్రదర్శన కనబర్చింది. 'ఐసీసీ మహిళల టి20 ప్రపంచకప్‌తో పాటు ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్‌లో ఇంగ్లండ్ ప్రదర్శన స్థాయికి తగ్గట్లు లేదు. జట్టులో ప్రతిభకు లోటు లేదు. మరో మెరుగైన కోచ్‌ను నియమిస్తాం. త్వరలో జరగనున్న వన్డే ప్రపంచకప్, టి20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ మంచి ఫలితాలు సాధిస్తుందనే నమ్మకముంది' అని ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

విద్యా శాఖ ఇక రాష్ట్రాలకు

- ట్రంప్ నిర్ణయం, ఫెడరల్ డిపార్ట్‌మెంట్ మూసివేత
- దానివల్ల ఒరిగేదేమీ లేదని వ్యాఖ్య, విద్యావేత్తల ధ్వజం



ఉత్తర్వులపై సంతకం చేసే కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రంప్

వాషింగ్టన్: అమెరికా విద్యా వ్యవస్థను ప్రక్షాళనలో భాగంగా ఆ శాఖను మూసేస్తామని పలుమార్లు చెప్పిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేయడం కలకలం రేపుతోంది. కేంద్ర స్థాయిలో విద్యా శాఖను మూసేస్తు ఉత్తర్వులపై గురువారం ఆయన సంతకం చేయడంపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. విద్యా శాఖ బాధ్యతలు ఇకపై రాష్ట్రాలే ఎక్కడికక్కడ చూసుకుంటాయని ఈ సందర్భంగా ట్రంప్ తేల్చి చెప్పారు. ఫెడరల్ విద్యా శాఖ వల్ల ఒరిగేదేమీ లేదని కూడా వ్యాఖ్యలు చేశారు. దాని మూసివేతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, అథారిటీని రాష్ట్రాలకు అప్పగించాలని విద్యా శాఖ మంత్రి లిండా మెక్‌మహాన్‌ను ఆదేశించారు. ''విద్యలో యూరప్, చైనాల కంటే కూడా అమెరికా వెనకబడి ఉంది. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి, డబ్బు ఆదా చేయడానికి ఈ చర్య అవసరం''అని చెప్పుకొచ్చారు. డోజ్ సారథి హోదాలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సూచనలతో ట్రంప్ సర్కారు చేపడుతున్న చర్యల్లో ఇది అత్యంత నిర్దయాకమైనది. అల్పాదాయ విద్యార్థులకు రుణాలు, గ్రాంట్లు సహా కీలక విధులను నిర్వహించడానికి విద్యా శాఖ కొనసాగే అవకాశముందని వైట్‌హౌస్ ఇదివరకే తెలిపింది. ట్రంప్ నిర్ణయానికి ముందు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా మీడియాతో అదే అన్నారు. విద్యా శాఖ ఇప్పుడున్న దానికంటే చాలా చిన్నదిగా కొనసాగుతుందని వ్యాఖ్యానించారు.

డెమొక్రాట్ల ధ్వజం, హెరిటేజ్ ఫౌండేషన్

ట్రంప్ నిర్ణయంపై డెమొక్రాట్లు, విద్యావేత్తలు మండిపడుతున్నారు. ఇది నిరంకుశమైన చర్య అని డెమొక్రాట్ సెనేట్ చక్ షూరమ్ అన్నారు. దీన్ని ట్రంప్ తీసుకున్న అత్యంత కఠినమైన చర్యల్లో ఒకటిగా అభివర్ణించారు. అమెరికాలోని అతి పెద్ద టీచర్స్ యూనియన్ కూడా ట్రంప్ ప్రణాళికలను తప్పుబట్టింది, రిపబ్లికన్ల మితవాద థింక్ ట్యాంక్ హెరిటేజ్ ఫౌండేషన్ మాత్రం ఈ చర్యను స్వాగతించింది.

చెల్లుబాటయ్యేనా...?

ట్రంప్ నిర్ణయం ఏ మేరకు చెల్లుబాటవుతుందనేది చూడాలి. ఎందుకంటే 1979లో ఉనికిలోకి వచ్చిన ఫెడరల్ విద్యా శాఖను కాంగ్రెస్, సెనేట్ ఆమోదం లేకుండా మూసేసే అధికారం అధ్యక్షునికి లేదు. మహా అయితే నిధులు, సిబ్బందిని తగ్గించవచ్చు. ఈ నిర్ణయం అమలును సెనేట్లో 60 మంది సమర్థించాలి. కానీ అధికార రిపబ్లికన్లకు సెనేట్‌లో 53–47 మెజారిటీ మాత్రమే ఉంది. అమెరికాలో విద్య విషయంలో కేంద్రానికి ఇప్పటికే పరిమిత పాత్ర ఉంది. ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలకు కేంద్రం 13 శాతం నిధులు మాత్రమే ఇస్తుంది. మిగతా నిధులను రాష్ట్రాలు, స్థానిక కమ్యూనిటీలు సమకూరుస్తాయి. అమెరికాలో పాఠశాల విద్య పూర్తిగా ఉచితం. దీన్ని స్థానిక అధికారులే నడిపిస్తారు. కానీ అల్పాదాయ పాఠశాలలు, ప్రత్యేకావసరాలున్న విద్యార్థులకు ఫెడరల్ నిధులు చాలా కీలకం. అంతేగాక ఉన్నత విద్య కోసం లక్షలాది అమెరికన్లు వాడుకునే ఫెడరల్ విద్యార్థి రుణాలపై కూడా తాజా ఉత్తర్వులు తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

సీనియర్ న్యాయవాదికి షోకాజ్ నోటీస్

మొట్టమొదటిసారిగా సుప్రీం ఫుల్ బెంచ్ నిర్ణయం

న్యూఢిల్లీ: అనుచిత ప్రవర్తన ఆరోపణలెదుర్కొంటున్న సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రాకు షోకాజ్ నోటీసు పంపాలని సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ నిర్ణయించింది. ఆయనకు ఇచ్చిన సీనియర్ హోదాను ఎందుకు తొలగించరాదో తెలిపాలని కోరనుంది. సీనియర్ లాయర్‌కు సుప్రీంకోర్టు ఫుల్‌బెంచ్ ఇలా నోటీసు ఇవ్వడం ఇదే మొదటిసారని చెబుతున్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుప్రీం జడ్జీలందరూ హాజరై ఈ మేరకు ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. షోకాజ్ నోటీసు ఇవ్వాలని సెక్రటరీ జనరల్ భరత్ పరాశర్‌ను కోరారు. సీనియర్ హోదాను రద్దు చేసుకునేందుకు ముందుగా వాదనను వినిపించేందుకు మల్హోత్రాకు ఒక అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. ఫిబ్రవరి 20వ తేదీన ఓ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జి మసీహ్‌ల ధర్మాసనం మల్హోత్రా తీరును తీవ్రంగా తప్పుబట్టింది. ఎన్నిసార్లు హెచ్చరించినా కోర్టును తప్పుదోవ పట్టించడం మానుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. శిక్షాకాలం పూర్తి కాక మునుపే ఖైదీలను విడిపించే ప్రయత్నాల్లో భాగంగా వాస్తవాలను దాచినట్లు మల్హోత్రాపై ఆరోపణలు చేసింది. ఆయనకు ఇచ్చిన సీనియర్ గుర్తింపు రద్దు చేసే విషయాన్ని ప్రధాన న్యాయమూర్తికే వదిలేస్తున్నామని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఫుల్ బెంచ్ షోకాజ్ నోటీసు ఇవ్వాలనే నిర్ణయం తీసుకుంది. కాగా, మల్హోత్రాకు సుప్రీంకోర్టు 2024 ఆగస్టు 14న సీనియర్ లాయర్ హోదా ఇచ్చింది.

అధికారం కోల్పోయినా బాధపడం: సీఎం యోగి

అయోధ్య: అయోధ్యలో రామాలయం కలను సాకారం చేసే క్రమంలో అధికారం కోల్పోయినా తాము బాధపడమని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. అయోధ్యలో శుక్రవారం సాహితీ వేడుకలను ఆయన ప్రారంభించారు. 2017లో ముఖ్యమంత్రి అయ్యాక అయోధ్య నగరాభివృద్ధికి చేపట్టిన పనులను, తీసుకున్న చర్యలను వివరించారు. రామజన్మభూమి ఉద్యమానికి మూడు తరాలు అంకితమయ్యాయంటూ ఆయన.. వీరిలో గోరఖ్ పీఠం మహంత్ దివంగత దిగ్విజయ్ నాథ్, మహంత్ అవైద్యనాథ్‌తోపాటు తను కూడా ఉన్నట్లు చెప్పారు. మీరు అయోధ్యకు వెళ్లినా వివాదమవుతోందని చాలా మంది అధికారులు నాతో అన్నారు. వివాదం అయితే కానివ్వండి. అయోధ్య గురించి కూడా మనం ఆలోచించాలి. మనం ఎవరి కోసం అధికారంలోకి వచ్చామని వారిని అడిగా'అని చెప్పారు. రామాలయం కోసం అధికారాన్ని కోల్పోయినా తాము బాధపడబోమన్నారు.

26న తెరచుకోనున్న తులిప్ గార్డెన్

శ్రీనగర్: ఆసియాలోనే అతిపెద్ద తులిప్ గార్డెన్ పర్యాటకులకు కనువిందు చేయనుంది. కశ్మీర్ లోయలోని జబర్వాన్ కొండలు, చారిత్రక దాల్ సరస్సు మధ్యలో ఉన్న ఈ తులిప్ పూల వనంలోకి ఈ నెల 26 నుంచి సందర్శకులను అనుమతించనున్నారు. గతంలో సిరాజ్ బాగ్‌గా పరిచయమున్న దీనిని 2007లో ఇందిరాగాంధీ మెమోరియల్ తులిప్ గార్డెన్‌గా పేరు మార్చారు. ఈ వనంలో తులిప్ మొక్కలను దశలవారీగా నాటారు. దీంతో, రంగురంగుల్లో తులిప్ పూలు నెలకుపైగా చూపరులను అలరించనున్నాయి. ఈ ఏడాది మరో రెండు కొత్త రకాలను గార్డెన్‌లో నాటామని, దీంతో ఇక్కడున్న తులిప్ వెరైటీలు 74కు చేరాయని అధికారులు వివరించారు. తులిప్‌తోపాటు నాలుగైదు రకాల పూలమొక్కలను కూడా ఉన్నాయన్నారు. మొత్తం 55 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ వనంలో 17 లక్షల వరకు తులిప్ గడ్డలను నాటినట్లు వివరించారు. మొదట్లో 50 వేల తులిప్ గడ్డలను నెదర్లాండ్స్ నుంచి తెప్పించి నాటినట్లు తెలిపారు. ప్రజల ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని గార్డెన్‌ను విస్తరణ జరుగుతూ వచ్చిందన్నారు. గతేడాది గార్డెన్‌కు దేశ విదేశాల నుంచి 4.65 లక్షల మంది సందర్శకులు వచ్చారని తెలిపారు.

బస్సుకు నిప్పు పెట్టింది డ్రైవరే

నలుగురు ఉద్యోగుల సజీవ దహనంపై పోలీసుల వెల్లడి

పుణె: పుణె సమీపంలోని హింజవాడిలో బుధవారం ఉదయం ఓ ప్రైవేట్ బస్సులో మంటలు చెలరేగి నలుగురు ఉద్యోగులు సజీవ దహనమైన ఘటన వెనుక కుట్ర కోణమందని పోలీసులు తెలిపారు. తోటి ఉద్యోగులతో విభేదాల నేపథ్యంలో కక్ష తీర్చుకునేందుకు ఓ డ్రైవర్ ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పింప్రి చించ్వాడ్ డీసీపీ విశాల్ గైక్వాడ్ తెలిపారు. వ్యోమా గ్రాఫిక్స్ అనే ప్రైవేట్ సంస్థలో పనిచేసే జనార్దన్ హంబర్డేకర్ అనే డ్రైవర్‌కు కొందరు తోటి ఉద్యోగులతో విభేదాలున్నాయి. అదేసమయంలో, అతడి వేతనంలో కోత పడింది. వీటన్నిటిని మనస్సులో పెట్టుకున్న జనార్ధన్ కొందరిపై కక్ష తీర్చుకోవాలనుకున్నాడు. ఇందు కోసం వేసిన పథకంలో భాగంగా బెంజీన్ అనే మండే స్వభావమున్న రసాయనాన్ని కొనుగోలు చేశాడు. బుధవారం సుమారు 14 మంది ఉద్యోగులతో వస్తున్న బస్సులో జనార్దన్ కూడా ఉన్నాడు. హింజవాడి సమీపంలో ఉండగా బెంజీన్‌తో తడిపిన గుడ్డకు నిప్పుపెట్టి, బస్సులో విసిరేసి కిందికి దూకాడు. బస్సు ఆగేసరికే మంటలు చెలరేగి వెనుక సీట్లో ఉన్న నలుగురిని దహించి వేశాయి. మరో ఆరుగురికి కాలిన గాయాలయ్యాయి. కిందికి దూకిన జనార్దన్ కూడా కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. డిశ్చార్జి అయ్యాక అతడిని అరెస్ట్ చేస్తామని డీసీపీ గైక్వాడ్ వివరించారు. అయితే, ప్రాణాలు కోల్పోయిన వారిలో జనార్దన్ కక్ష తీర్చుకోవాలనుకున్న వారు లేరని ఆయన తెలిపారు.

జుత్తు గురించి వెక్కిరింత లైంగిక వేధింపు కాదు

బాంబే హైకోర్టు వ్యాఖ్య

ముంబై: పని ప్రదేశంలో తోటి ఉద్యోగిని జుత్తు గురించి వెక్కిరిస్తూ పాట పాడటం, ఎగతాళి చేయడం లైంగిక వేధింపుగా భావించలేమని బాంబే హైకోర్టు పేర్కొంది. జస్టిస్ సందీప్ మర్నె ఈ నెల 18న ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఆరోపణలన్నీ నిజమని తేలినా కూడా లైంగికపరమైన వేధింపుగా పరిగణించలేమని స్పష్టం చేస్తూ పుణెలోని హెచ్‌డీఎఫ్‌సీ అసోసియేట్ రీజినల్ మేనేజర్ వినోద్ కచావేకి ఊరట కల్పించారు. తన జుత్తు గురించి వెక్కిరింతగా మాట్లాడటంతోపాటు, జుత్తుపై ఒక పాట కూడా పాడినట్లు ఒక ఉద్యోగిని ఆయనపై ఫిర్యాదు చేసింది. అంతే కాదు, మహిళా ఉద్యోగులుండగా ఒక పురుష ఉద్యోగి మర్మావయాలపై ఎగతాళిగా మాట్లాడారని తెలిపింది. ఈ మేరకు బ్యాంకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ విచారణ జరిపి, పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం కింద దోషిగా నిర్ధారించింది. దీంతో ఇండస్ట్రియల్ కోర్టు 2024లో వినోద్ స్థాయిని అసోసియేట్ రీజినల్ మేనేజర్ నుంచి డిప్యూటీ రీజినల్ మేనేజర్‌కు తగ్గించింది. దీనిని సవాల్ చేస్తూ వినోద్ కచావే బాంబే హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం పై వ్యాఖ్యలు చేసింది. వినోద్ కచావే లాయర్ సనా రయీస్ ఖాన్ వాదనలు వినిపిస్తూ..సహోద్యోగి జుత్తును సరిగ్గా దువ్వుకోవాలంటే జేసీబీ కావాల్సిందేనంటూ వ్యాఖ్యానించారన్నారు. వినోద్‌పై వచ్చిన మరో ఆరోపణను ప్రస్తావిస్తూ ఆమె.. ఆ సమయంలో ఆ ఉగ్యోగి అక్కడ లేనే లేరని వివరించారు. ఇవి రెండూ లైంగిక వేధింపుల కిందకి రావని చెప్పారు. ఆ ఉద్యోగిని సంస్థ నుంచి రాజీనామా చేశాకనే ఈ ఫిర్యాదులు చేశారన్నారు. వాదనలు విన్న జస్టిస్ సందీప్ మర్నె.. వినోద్ లైంగిక వేధింపుల ఉద్దేశంతోనే ఆ వ్యాఖ్యలు చేసినట్లుగా భావించలేమన్నారు. బ్యాంకు అంతర్గత కమిటీ నివేదికతో పాటు పుణె ఇండస్ట్రియల్ కోర్టు ఉత్తర్వులను కొట్టివేస్తూ తీర్పు వెలువరించారు.

మాతృభాషలో విద్యాబోధన జరగాలి

జాతి ఐక్యతను సవాల్ చేయడం ఆందోళనకరం

- ఆర్ఎస్ఎస్ అత్యున్నత నిర్ణాయక మండలి వెల్లడి

బెంగళూరు: రోజువారీ కార్యకలాపాలతో పాటు విద్యాబోధన మాతృభాషలోనే జరగాలన్నదే తమ అభిమతమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) తెలిపింది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణపై ప్రస్తుతం జరుగుతున్న చర్చ రాజకీయ ప్రేరేపితమని పేర్కొంది. నూతన విద్యా విధానంలో భాగమైన త్రిభాషా సూత్రాన్ని తమిళనాడులోని అధికార డీఎంకే వ్యతిరేకించడంపై మండిపడింది. దేశ ఐక్యతకు భగ్నం కలిగించే ఆందోళనకరమైన విషయంగా అభివర్ణించింది. ఆర్ఎస్ఎస్ అత్యున్నత నిర్ణాయక మండలి అఖిల భారతీయ ప్రతినిధి సభ(ఏబీపీఎస్) మూడు రోజుల సమావేశాలు శుక్రవారం బెంగళూరులో మొదలయ్యాయి. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సారథ్యంలో జరిగే ఈ సమావేశాల్లో 32 అనుబంధ సంఘాల అధిపతులు, వలంటీర్లు పాల్గొంటున్నారు. మొదటి రోజు చర్చల వివరాలను సంఘ్ సంయుక్త ప్రధాన కార్యదర్శి సీఆర్ ముకుంద మీడియాకు వివరించారు. మణిపూర్‌లో పరిస్థితులు, ఉత్తరం–దక్షిణం అంటూ విభేదాలను సృష్టించేందుకు జరుగుతున్న పరిణామాలు, కీలక అంశాలపై లోతైన చర్చలు జరుపుతున్నామని చెప్పారు. త్రిభాషా సూత్రంపై తలెత్తిన వివాదంపై ఎటువంటి తీర్మానం తాము చేయలేదని ముకుంద చెప్పారు. రోజువారీ ఉత్తర ప్రత్యుత్తరాలతోపాటు విద్యా బోధన మాతృభాషలోనే జరగాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటోందని స్పష్టం చేశారు. మణిపూర్ అంశంపై ముకుంద మాట్లాడుతూ.. గత 20 నెలలుగా అస్థిర పరిస్థితులు కొనసాగుతున్న రాష్ట్రంలో నేడు కొంత మెరుగైన వాతావరణం కనిపిస్తోందన్నారు. రాజకీయపరంగా, పరిపాలనా పరంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితంగా మణిపూర్‌లో సానుకూల పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ముమ్ముందు సాధారణ వాతావరణం నెలకొంటుందని ఆర్ఎస్ఎస్ ఆశిస్తోందని వివరించారు. 'మణిపూర్‌లో బాధితుల కోసం ఆర్ఎస్ఎస్ సహాయ శిబిరాలు నిర్వహించింది. కుకీ, మెయితీలను దగ్గరికి చేర్చేందుకు ప్రయత్నిస్తోంది'అని తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపైనా చర్చించనున్నామన్నారు. 'దేశవ్యాప్తంగా ఆర్ఎస్ఎస్‌కు 83,129 శాఖలున్నాయి. ఇందులో 10 వేల శాఖలు గతేడాదిలో ఏర్పడినవే. తమిళనాడులో శాఖల సంఖ్య 4 వేలు దాటింది'అని ముకుంద చెప్పారు.

ఆప్ ఢిల్లీ చీఫ్‌గా సౌరభ్ భరద్వాజ్

పంజాబ్ అధ్యక్షుడిగా సిసోడియా

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ శుక్రవారం పార్టీ కీలక పునర్వ్యవస్థీకరణ చర్యలను ప్రకటించింది. పార్టీ ఢిల్లీ విభాగం చీఫ్ బాధ్యతలను మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్‌కు అప్పగించింది. అదేవిధంగా, పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం పంజాబ్ విభాగం బాధ్యతలను సీనియర్ నేత మనీశ్ సిసోడియాకు కట్టబెట్టింది. ఆప్ చీఫ్ కేజ్రీవాల్ నివాసంలో శుక్రవారం జరిగిన రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. ఆప్ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) సందీప్ పాఠక్ అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం పార్టీ ఢిల్లీ చీఫ్‌గా ఉన్న గోపాల్ రాయ్ ఇకపై గుజరాత్ బాధ్యతలను పర్యవేక్షిస్తారని చెప్పారు. రాజ్యసభ ఎంపీగా ఉన్న పాఠక్ పార్టీ ఛత్తీస్‌గఢ్ విభాగానికి, గోవాకు పంకజ్ గుప్తా ఇన్‌చార్జిలుగా ఉంటారు. ఈ మూడు రాష్ట్రాల అసెంబ్లీలకు రెండేళ్లలో ఎన్నికలు జరగనున్నాయి.



సముద్ర జలాలపై తేలియాడుతున్న ఈ గుండ్రటి నిర్మాణాలను బ్లూమ్స్ అంటారు. ఇవి సముద్ర జలాల్లోని కలుషిత కార్బన్‌డయాక్సైడ్‌ను పీల్చుకునే ఫైటోప్లాంక్టన్‌లను పెంచుతాయి. గిగాబ్లూ అనే సంస్థ న్యూజిలాండ్‌లోని డునెడిన్‌లో పసిఫిక్ మహాసముద్రంలో ఈ ప్రాజెక్టును చేపట్టింది.

సైన్యం చేతికి సుడాన్ అధ్యక్ష భవనం

ఆర్ఎస్ఎఫ్‌తో రెండేళ్ల పోరులో పైచేయి

కైరో: సుడాన్‌లో దాదాపు రెండేళ్ల పోరాటం తర్వాత రాజధాని ఖార్టూంలోని రిపబ్లికన్ ప్యాలెస్‌ను సైన్యం శుక్రవారం తిరిగి స్వాధీనం చేసుకుంది. 21వ తేదీన, రంజాన్ మాసంలో 21వ రోజున సైనికులు ప్యాలెస్‌లోకి ప్రవేశించినట్లు సోషల్ మీడియాలో వీడియోలు వైరలవుతున్నాయి. సైనికులు రాజప్రాసాదం లోనికి వెళ్లినట్టు తొలుత ఓ సైనికాధికారి, తర్వాత సమాచార మంత్రి ఖలీద్ అల్ ఐసర్ ధ్రువీకరించారు. ప్యాలెస్‌ను సైన్యం తిరిగి స్వాధీనం చేసుకుందంటూ ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. సాయుధ ఆర్ఎస్ఎఫ్ గ్రూప్‌పై సుడాన్ సైన్యానికి ఇది మరో విజయమని భావిస్తున్నారు.

సైనిక తిరుగుబాటు

సుడాన్ ఏళ్లుగా యుద్ధ సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. అధ్యక్షుడు ఒమర్ అల్ బషీర్ నిరంకుశ పాలనపై ప్రజలు 2019లో తిరుగుబాటు చేశారు. ఫలితంగా తెరపైకొచ్చిన ప్రజాస్వామ్య ప్రభుత్వ పాలన మూణ్నాళ్ల ముచ్చటగానే ముగిసింది. 2021లో సైన్యాధిపతి అబ్దుల్ అల్ ఫతా బుర్హాన్, పారామిలటరీ రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్ఎస్ఎఫ్) కమాండర్ మహ్మద్ హందాన్ డగ్లో నేతృత్వంలోని సైనిక తిరుగుబాటుతో ప్రజాస్వామ్యం పట్టాలు తప్పింది. కానీ 2023లో ఆర్ఎస్ఎఫ్‌ను విలీనం చేసుకునేందుకు సైన్యం యత్నించడం వాటి మధ్య విభేదాలకు, పరస్పర యుద్ధానికి దారితీసింది. మిత్రరాజ్యాల సాయుధ గ్రూపులతో కలిసి ఆర్ఎస్ఎఫ్‌పై సైన్యం పోరాడుతోంది. ఈ అంతర్యుద్ధం 28 మందికి పైగా పౌరుల మరణానికి దారితీసింది. లక్షల మంది ఇళ్లు వీడి పారిపోయారు. పలు ప్రాంతాలను కరువు కబళించింది. సైన్యం, ఆర్ఎస్ఎఫ్ రెండూ తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘన అభియోగాలను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా ఆర్ఎస్ఎఫ్ మారణహోమానికి పాల్పడుతున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది.

ఒడెసాపై విరుచుకుపడ్డ రష్యా డ్రోన్లు

కీవ్: ఉక్రెయిన్‌లోని నల్లసముద్ర తీర నగరం ఒడెసా డ్రోన్ దాడులతో దద్దరిల్లింది. ఇంధన వసతులపై తాత్కాలికంగా దాడులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా రష్యా దాడులకు తెగబడింది. చెక్ రిపబ్లిక్ అధ్యక్షుడు పీటర్ పావెల్ ఒడెసాలో కీలక సమావేశంలో పాల్గొనటానికి ముందు శుక్రవారం ఉదయం ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. గురువారం రాత్రి నగరంలోని మూడు ప్రాంతాలపై జరిగిన దాడులతో మౌలిక వసతులు, వాణిజ్య కేంద్రాల్లో భారీగా మంటలు చెలరేగాయని తెలిపారు. ఫైరింజన్లతో అదుపులోకి తెచ్చామన్నారు. జపొరిఝియా ప్రాంతంపై రష్యా గైడ్ బాంబులతో నివాసప్రాంతాలపై చేసిన దాడిలో చిన్నారి సహా ఆరుగురు గాయపడ్డారని చెప్పారు. రష్యా ప్రయోగించిన 214 డ్రోన్లలో 114 డ్రోన్లను కూల్చివేశామని ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. అదేసమయంలో, తమ వొల్గొగ్రాడ్, బెల్గొరోడ్, కస్క్, రొస్టొవ్ ప్రాంతాలపైకి ఉక్రెయిన్ ప్రయోగించిన 43 డ్రోన్లలో 34 డ్రోన్లను కూల్చామని రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. ఇలా ఉండగా, ఉక్రెయిన్ డ్రోన్ దాడితో రష్యాలోని క్రాస్నోడార్ ప్రాంతంలోని ఆయిల్ డిపోకు బుధవారం అంటుకున్న మంటలు అదుపులోకి రాలేదు.

అమెరికా వర్సిటీలు వద్దు బాబోయ్!

ట్రంప్ రాకతో ప్రతికూల పరిస్థితులు

- వర్సిటీలకు ఇచ్చే నిధుల్లో భారీగా కోతలు
- విదేశీ విద్యార్థులకు ఇకపై మరిన్ని కష్టాలు
- ఉన్నత విద్య కోసం అమెరికాకు రాకపోవడమే మంచిదంటున్న నిపుణులు

అమెరికా విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అభ్యసించాలని ప్రపంచవ్యాప్తంగా కోట్లాది విద్యార్థులు ఆరాటపడుతుంటారు. అక్కడ నాణ్యమైన విద్య లభిస్తుందన్న నమ్మకమే ఇందుకు కారణం. అత్యాధునిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం, నవీన ఆవిష్కరణలు, పరిశోధనలకు అవసరమైన పూర్తి సౌకర్యాలతో అమెరికా వర్సిటీలు ఆకట్టుకున్నాయి. అయితే, ఈ ఏడాది పరిస్థితిలో చాలావరకు మార్పులు వచ్చినట్లు నిపుణులు చెబుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత యూనివర్సిటీలు కష్టకాలం మొదలైందని అంటున్నారు. అందుకే ఉన్నత విద్య కోసం అమెరికా వర్సిటీలను ఎంచుకోకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. వర్సిటీలకు ఇచ్చే నిధుల్లో భారీగా కోత విధిస్తూ ట్రంప్ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. అంతే కాకుండా ఆంక్షలు సైతం పెంచారు. అమెరికా వర్సిటీల్లో విద్యాభ్యాసం గతంలో ఉన్నట్లు ఇకపై సులభంగా ఉండబోదు. ముఖ్యంగా విదేశీ విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఇక వేళ ఇక్కడ చదువుకోడానికి సిద్ధపడితే భారీగా ఖర్చు చేయాల్సి రావొచ్చు.

పరిశోధనలకు నిధులు కట్

అమెరికాలో ఉన్నత విద్య ప్రధానంగా ప్రభుత్వ మద్దతుపై ఆధారపడిందే. ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే వర్సిటీలు చాలావరకు మనుగడ సాగిస్తుంటాయి. మెడిసిన్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ వంటి రంగాల్లో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేస్తూ ఉంటుంది. ఇలాంటి గ్రాంట్లలో ట్రంప్ భారీగా కోతలు విధించారు. దీనివల్ల పరిశోధన కార్యక్రమాలు, శాస్త్రీయ ఆవిష్కరణలకు ఆటంకాలు తలెత్తబోతున్నాయి. నిధుల కొరత వల్ల పరిశోధనలు పూర్తిగా ఆగిపోయినా ఆశ్చర్యం లేదు. విదేశీ విద్యార్థులకు ఆర్థికంగా సహకరించే పరిస్థితి ఉండబోదు. వారికి రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్స్, స్కాలర్‌షిప్స్ అందించే అవకాశాలు కుదించుకుపోతున్నాయి. ఒకవైపు వనరులు కరిగిపోతే మరోవైపు సౌకర్యాలు తగ్గిపోతాయనడంలో ఆశ్చర్యం లేదు.

నిత్యం భయం భయంగానే

అమెరికా విశ్వవిద్యాలయాల్లో స్వేచ్ఛాయుత వాతావరణం ఉండేది. విద్యార్థులు నిర్భయంగా రాజకీయ చర్చలు జరిపేవారు. తమకు నచ్చిన సంస్థలకు మద్దతు ప్రకటించేవారు. వర్సిటీల ప్రాంగణాల్లో ఆందోళనలు, నిరసనలకు ఎలాంటి ఆటంకాలు ఉండేవి కావు. ట్రంప్ వచ్చిన తర్వాత ఇలాంటి కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఉగ్రవాద, తీవ్రవాద సంస్థలకు మద్దతు ప్రకటించినట్లు అనుమానం వస్తే చాలు వర్సిటీల నుంచి బహిష్కరిస్తున్నారు. విదేశీ విద్యార్థులకు బలవంతంగా బయటకు పంపిస్తున్నారు. కొందరిపై కేసులు సైతం నమోదు చేస్తున్నారు. యూనివర్సిటీల్లో భయంభయంగా గడపాల్సి వస్తోందని విదేశీ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమపై ఎన్నో రకాల ఆంక్షలు అమల్లోకి వచ్చాయని చెబుతున్నారు.

ఇతర దేశాల్లో మెరుగైన అవకాశాలు

అమెరికా వర్సిటీల్లో నెలకొన్న ప్రతికూల పరిణామాలను చైనా వర్సిటీలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. విదేశీ విద్యార్థులను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నాయి. రీసెర్చ్ అండ్ టెక్నాలజీకి నిధుల కేటాయింపులు భారీగా పెంచబోతున్నట్లు చైనా ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇన్నోవేషన్‌లో అమెరికాను వెనక్కి నెట్టేసి గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు కెనడా, యూకే, జర్మనీ, ఆస్ట్రేలియా వర్సిటీలు సైతం అంతర్జాతీయ విద్యార్థులపై వల విసురుతున్నాయి. అమెరికా కంటే మెరుగైన వసతులు, నిధులు, స్వేచ్ఛ అందుబాటులో ఉన్నప్పుడు మరో దేశాన్ని ఎంచుకుంటే తప్పేం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికా నుంచి త్వరలో 295 మంది అక్రమ వలసదార్ల రాక

న్యూఢిల్లీ: అక్రమ వలసదార్లపై అమెరికా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే వందలాది మందిని బలవంతంగా వారి స్వదేశాలకు తరలించింది. ఈ ఏడాది ఇప్పటివరకు 300 మందికిపైగా భారతీయులను వెనక్కి పంపించింది. త్వరలో మరో 295 మంది భారతీయులను అమెరికా ప్రభుత్వం మన దేశానికి తరలించబోతోందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ శుక్రవారం వెల్లడించారు. ఈ మేరకు రాజ్యసభలో ప్రకటన చేశారు. వీరంతా యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) కస్టడీలో ఉన్నట్లు అమెరికా ప్రభుత్వం నుంచి సమాచారం అందిందని పేర్కొన్నారు. డొనాల్డ్ ట్రంప్ సర్కారు అనుమతి ఇచ్చిన వెంటనే వెనక్కి వచ్చేస్తారని చెప్పారు. 2025లో ఇప్పటిదాకా 388 మంది భారతీయులు అమెరికా నుంచి తిరిగివచ్చారని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పలువురు భారతీయులను సైనిక విమానాల్లో అమెరికా నుంచి వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. అయితే, వారికి సంకెళ్లు వేయడం పట్ల భారతీయుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. మనవాళ్లను అవమానిస్తున్నా నరేంద్ర మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అయితే, అక్రమ వలసదార్లను బయటకు వెళ్లగొట్టడం కొత్తేమీ కాదు. 2009 నుంచి ఇప్పటివరకు.. గత 16 ఏళ్లలో 15,700 మంది భారతీయ అక్రమ వలసదార్లను అమెరికా సర్కారు వెనక్కి పంపించింది. అయితే, సంకెళ్లు వేసే పద్ధతి 2012లోనే ప్రారంభమైంది. భారతీయులకు సంకెళ్లు వేసి పంపిస్తుండడం పట్ల తమ నిరసనను అమెరికా ప్రభుత్వానికి తెలియజేశామని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ శుక్రవారం లోక్‌సభలో ప్రకటించారు. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.


నమీబియా మొట్టమొదటి అధ్యక్షురాలిగా నెటుంబో



విండ్‌హోక్: ఆఫ్రికా దేశం నమీబియా అధ్యక్షురాలిగా నెటుంబో నాండి ఎన్‌డయిట్వాహ్(72) శుక్రవారం ప్రమాణం చేశారు. ఆఫ్రికా ఖండంలో ప్రత్యక్ష విధానంలో అధ్యక్షురాలిగా ఎన్నికైన రెండో మహిళగా, నమీబియాకు తొలి అధ్యక్షురాలిగా చరిత్ర నెలకొల్పారు. గతేడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో ఆమెకు 58 శాతం ఓట్లు పడ్డాయి. వలస పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ముందున్న సౌత్ వెస్ట్ ఆఫ్రికా పీపుల్స్ ఆర్గనైజేషన్ (స్వాపో) 1990లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలో అధికారంలో ఉంది. ఆ పార్టీకి నెటుంబో మద్దతుదారు. తమ దేశంలో భూమే అతిపెద్ద సమస్యని ఆమె చెప్పారు. ''మొత్తం 30 లక్షల జనాభాలో శ్వేతజాతీయులు 1.8 శాతం మాత్రమే. కానీ మొత్తం సాగుభూమిలో 70 శాతం వారి చేతుల్లోనే ఉంది'' అన్నారు. అత్యధిక నిరుద్యోగం, అసమానతలు, పేదరికం తమ ముందున్న ప్రధాన సమస్యలని తెలిపారు. వీటిని పరిష్కరించగలిగితే తమ దేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.

తిరుపతి నుంచి పశుపతినాథ్ దాకా...

- వామపక్ష తీవ్రవాదంపై షా
- 2026 మార్చి చివరికల్లా పూర్తిగా నిర్మూలిస్తాం
- రాజ్యసభలో ప్రకటన



సాక్షి, న్యూఢిల్లీ: గతంలో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి నుంచి నేపాల్‌లోని పశుపతినాథ్ వరకు వామపక్ష తీవ్రవాదం ఉండేదని హోం మంత్రి అమిత్ షా గుర్తు చేశారు. రెడ్ కారిడార్ ఏర్పాటు చేసి రాష్ట్రాలు, జిల్లాలు, తహశీల్‌లు, ఠాణాలను వామపక్ష తీవ్రవాదులు కబ్జా చేశారన్నారు. వ్యవస్థలను పూర్తిగా నాశనం చేసి ప్రభుత్వాలు ఏర్పాటు చేశారని, సమాంతర కరెన్సీ, స్టాంప్ పేపర్లు చలామని అయ్యేదని చెప్పారు. సంవాద్, సురక్ష, సమన్వయ్ అనే సిద్ధాంతాల ఆధారంగా నక్సలిజంపై తమ ప్రభుత్వం పోరాడుతోందని శుక్రవారం రాజ్యసభలో స్పష్టం చేశారు. 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలిస్తామని తేల్చి చెప్పారు. సూర్యరశ్మి కూడా ప్రవేశించని దట్టమైన అడవుల్లో నీళ్లు, నిద్రాహారాలు మాని సమాధానం కోసం భద్రతా బలగాలు అత్యున్నత బలిదానాలు చేశాయని గుర్తుచేశారు. ''నక్సలిజాన్ని రూపుమాపేందుకు వినూత్న పద్ధతులు, అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం. మా ప్రభుత్వ హయాంలోనే దేశానికి నక్సలిజం నుంచి విముక్తి కల్పిస్తాం. ఇందులో సందేహం లేదు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద ఘటనలు 70 శాతం తగ్గాయి. ఈశాన్య రాష్ట్రాల్లో ప్రశాంతత నెలకొంది'' అని తెలిపారు.

అవినీతిని దాచేందుకే భాషపై రాద్ధాంతం

అవినీతిని వెలుగులోకి రాకుండా చేసేందుకు, రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్ష పార్టీలు భాషపై రాద్ధాంతం చేస్తున్నాయని అమిత్ షా మండిపడ్డారు. సీఎంలు, ఎంపీలు, సాధారణ ప్రజలతో వారి మాతృభాషల్లోనే తాను మాట్లాడతానని చెప్పారు. ''మా ప్రభుత్వం అన్ని భారతీయ భాషలను ప్రోత్సహిస్తుంది. భాష విషయంలో దేశంలో ఇప్పటికే చాలా విభేదాలున్నాయి. మరోసారి వివాదాలు తలెత్తరాదు. ఇతర భారతీయ భాషలకు హిందీ మిత్ర భాషే తప్ప పోటీ కాదు'' అన్నారు. హిందీని రుద్దుతున్నారన్న ఆరోపణలను ఖండించారు. ''కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు వ్యతిరేకమనడం హాస్యాస్పదం. ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతింటాయనే తమిళనాడు ప్రభుత్వం తమిళంలో మెడికల్, ఇంజనీరింగ్ విద్యాబోధనకు అవకాశాలను కల్పించడం లేదు'' అని ఆరోపించారు.

ఖారవేలుడు గాడిదలతో తొక్కించిన నగరం..?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

శాతవాహన యుగం

1. కొంతమంది చరిత్రకారులు శాతవాహనుల తొలి రాజధాని 'ధాన్యకటకం' కాదని తేల్చారు. అయితే వారి తొలి రాజధాని ఏది?
   1) కొండాపురం 2) రాచకొండ
   3) ఏలేశ్వరం 4) కోటిలింగాల
2. శాతవాహనులు కర్ణాటక ప్రాంతానికి చెందిన వారని అభిప్రాయపడినవారు?
   1) వి.వి. మిరాసి 2) పి.టి. శ్రీనివాస్
   3) డాక్టర్ సుక్తాంకర్
   4) డాక్టర్ కె.గోపాలాచారి
3. శాతవాహనులు విదర్భ ప్రాంతానికి చెందిన వారని అభిప్రాయపడినవారు?
   1) వి.వి. మిరాసి 2) పి.టి. శ్రీనివాస్
   3) కె.పి.జయస్వాల్ 4) డాక్టర్ సుక్తాంకర్
4. శాతవాహనుల తొలి ప్రాంతం మహారాష్ట్ర అని అభిప్రాయపడినవారు?
   1) వి.వి. మిరాసి 2) సుక్తాంకర్
   3) పి.టి.శ్రీనివాస్ 4) కె.పి.జయస్వాల్
5. శాతవాహనుల మూలస్థానం పైఠాన్ ప్రాంత మని పేర్కొన్నవారు?
   1) డాక్టర్ కె.గోపాలాచారి
   2) కె.వి.జయస్వాల్
   3) వి.వి.మిరాసి 4) డాక్టర్ సుక్తాంకర్
6. కరీంనగర్ జిల్లాలో మహానగర శిథిలాలు బయల్పడిన ప్రాంతం ఏది?
   1) కోటిలింగాల 2) కదంబపూర్
   3) తొగర్రాయి 4) పెద్దబంకూర్
7. నాణేలపై కనిపిస్తున్న తొలి శాతవాహన రాజు ఎవరు?
   1) శ్రీముఖుడు 2) నారన
   3) గోబద 4) సమగోపుడు
8. శాతవాహన వంశ స్థాపకుడు, మొదటి పాలకుడు ఎవరు?
   1) మొదటి శాతకర్ణి 2) కన్హుడు
   3) రెండో శాతకర్ణి 4) శ్రీముఖుడు
9. శ్రీముఖుడి పాలనా కాలం?
   1) క్రీ.పూ. 231-200
   2) క్రీ.పూ. 231-208
   3) క్రీ.పూ. 231-205
   4) క్రీ.పూ. 225-200
10. శ్రీముఖుడు మొదట అవలంబించిన మతం?
    1) జైనం 2) వైదికం
    3) బౌద్ధం 4) శైవం
11. పుష్యమిత్ర శుంగుడు ఉత్తర భారతదేశంలో మౌర్యవంశాన్ని నిర్మూలించి మగధలో క్రీ.పూ. 187లో శుంగవంశాన్ని స్థాపించే సమయంలో పాలన కొనసాగిస్తున్న శాతవాహన రాజు?
    1) శ్రీముఖుడు 2) కన్హుడు
    3) మొదటి శాతకర్ణి 4) రెండో శాతకర్ణి
12. రాప్సన్, బారువా అనే చరిత్రకారులు ఏ నదిని 'కణ్ణబెణ్ణ'గా పేర్కొన్నారు?
    1) గంగా 2) గోదావరి
    3) కృష్ణా 4) వైన్ గంగా
13. శ్రీముఖుడి తర్వాత రాజ్యాధికారానికి వచ్చిన పాలకుడు?
    1) కన్హుడు 2) పులోమావి
    3) గౌతమీపుత్ర శాతకర్ణి
    4) మొదటి శాతకర్ణి
14. నానాఘాట్ శాసనాన్ని వేయించిందెవరు?
    1) దేవీ నాగానిక 2) గౌతమీ బాలాశ్రీ
    3) గౌతమీపుత్ర శాతకర్ణి
    4) రెండో శాతకర్ణి
15. రెండో శాతకర్ణి మగధ, కళింగ ప్రాంతాలను కూడా ఆక్రమించి పాలన సాగించాడని ఏ పురాణంలో పేర్కొన్నారు?
    1) మత్స్య 2) గరుడ
    3) వరాహ 4) యుగ పురాణం
16. ఏ పాలకుడి కాలంలో శక, యవన, కళింగ, పహ్లావాదులు శాతవాహనుల రాజ్య భాగాలను ఆక్రమించారు?
    1) స్వాతికర్ణ 2) లంబోదరుడు
    3) అపీలకుడు 4) మేఘస్వాతి
17. 'బృహత్కథ', 'వాత్స్యాయన కామసూత్ర', 'కావ్య మీమాంస'లో ఏ పాలకుడికి సంబంధించిన ప్రశంస కనిపిస్తుంది?
    1) శ్రీముఖుడు 2) మొదటి శాతకర్ణి
    3) కుంతల శాతకర్ణి 4) రెండో శాతకర్ణి
18. శర్వవర్మ, గుణాఢ్యుడు ఎవరి ఆస్థానంలో ఉండేవారు?
    1) కుంతల శాతకర్ణి 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) హాలుడు
    4) మొదటి పులోమావి
19. శాతవాహనుల్లో 15వ రాజు?
    1) హాలుడు
    2) మొదటి పులోమావి
    3) గౌరకృష్ణ 4) రెండో శాతకర్ణి
20. 'గాథాసప్తశతి' గ్రంథ రచయిత ఎవరు?
    1) హాలుడు 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) మొదటి పులోమావి
    4) గౌతమీపుత్ర శాతకర్ణి
21. 'త్రి సముద్ర తోయ పీతవాహన' అనేది ఎవరి బిరుదు?
    1) మొదటి పులోమావి
    2) గౌతమీపుత్ర శాతకర్ణి
    3) యజ్ఞశ్రీ శాతకర్ణి 4) మొదటి శాతకర్ణి



22. ఏ పాలకుడి కాలంలో తెలుగు ప్రాంతమంతా శాతవాహనుల ఆధీనంలోకి వచ్చింది?
    1) గౌతమీపుత్ర శాతకర్ణి
    2) రెండో పులోమావి
    3) మొదటి పులోమావి 4) హాలుడు
23. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలన్నింటినీ కలిపి పాలించిన చివరి శాతవాహన చక్రవర్తి ఎవరు?
    1) రెండో శాతకర్ణి 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) శివశ్రీ 4) రెండో పులోమావి
24. శాతవాహన వంశానికి చెందిన చివరి పాలకులు రాజ్యాన్ని పంచుకొని పాలించారని కొంతమంది చరిత్రకారుల అభిప్రాయం. ఆ సమయంలో తెలంగాణ ప్రాంతం ఎవరి పాలనలో ఉందని వారు పేర్కొన్నారు?
    1) కౌశికీ పుత్ర శాతకర్ణి
    2) నాలుగో పులోమావి
    3) విజయశ్రీ 4) చంద్రశ్రీ
25. 'ధాన్యకటకం'ను రాజధానిగా చేసుకొని పాలించిన రాజు?
    1) గౌతమీపుత్ర శాతకర్ణి
    2) రెండో పులోమావి
    3) నాలుగో పులోమావి 4) హాలుడు
26. శాతవాహనుల్లో చివరి పాలకుడెవరు?
    1) విజయశ్రీ 2) చంద్రశ్రీ
    3) శివశ్రీ 4) నాలుగో పులోమావి
27. నాలుగో పులోమావిని ఓడించే నాటికి శ్రీశాంతమూలుడు ఎక్కడ బలవంతమైన నాయకుడిగా ఉన్నాడు?
    1) విదర్భ 2) విజయపురి
    3) మహారాష్ట్ర 4) కళింగ
28. శాతవాహన పాలకుల వరసక్రమం?
    1) యజ్ఞశ్రీ శాతకర్ణి, రెండో పులోమావి, గౌతమీపుత్ర శాతకర్ణి
    2) రెండో పులోమావి, గౌతమీపుత్ర శాతకర్ణి, హాలుడు, యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) గౌతమీపుత్ర శాతకర్ణి, రెండో పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి
    4) హాలుడు, గౌతమీపుత్ర శాతకర్ణి, రెండో పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి
29. శాతవాహనుల కాలంలో ద్రవ్యపరమైన ఆదాయాన్ని భద్రపరిచే వ్యక్తిని ఏమని పిలిచేవారు?
    1) మహామాత్రులు 2) హిరణ్యకుడు
    3) మహాసేనాపతి 4) నిబంధకారుడు
30. శాతవాహనుల కాలంలో రాజాజ్ఞలు, రాజ్య వ్యవహారాలను పత్రాల్లో రాసి భద్రపరిచే వ్యక్తి?
    1) నిబంధకారుడు 2) లేఖకుడు
    3) హిరణ్యకుడు 4) అమాత్యుడు
31. నిబంధకారులకు మరో పేరు?
    1) అమాత్యులు 2) మహామాత్రులు
    3) అక్షపటకులు 4) భాండాగారికులు
32. కరీంనగర్ జిల్లాలోని మునులగుట్ట అనేది?
    1) వైదిక స్థావరం 2) విద్యా కేంద్రం
    3) బౌద్ధ స్థావరం 4) జైన స్థావరం
33. శాతవాహన కాలంలో 'కులపెద్దలను' ఏ పేరుతో పిలిచేవారు?
    1) గ్రామణి 2) నిబంధకారులు
    3) అక్షపటకులు 4) గహపతులు
34. శాతవాహనుల కాలంలో పంటలో ఎన్నో వంతును భూమిశిస్తుగా వసూలు చేసేవారు?
    1) 6 2) 5 3) 4 4) 3
35. శాతవాహన శాసనాల్లో కనిపిస్తున్న 'స్కంధావారం' అనే పదానికి అర్థం?
    1) మిలటరీ క్యాంప్ 2) కంటోన్మెంట్
    3) రక్షణదుర్గం 4) రాజకోట
36. శాతవాహన శాసనాల్లో కనిపిస్తున్న 'కటకం' అనే పదానికి అర్థం?
    1) సైనిక శిబిరం 2) రక్షణ దుర్గం
    3) రాజకోట 4) సైన్యాగారం
37. ఖారవేలుడు ఏ నగరాన్ని గాడిదలతో తొక్కించి నేలమట్టం చేశాడు?
    1) వినుకొండ 2) పిథుండ
    3) హన్మకొండ 4) ఓరుగల్లు
38. శాతవాహన కాలంనాటి చేతివృత్తిదారులైన 'సాలెవారు' అంటే?
    1) వధకులు 2) కాసకారులు
    3) కోలికులు 4) తిలపిష్టకులు
39. శాతవాహనుల కాలంలో 'గధికులు' అనే చేతివృత్తి వారు చేసే పని?
    1) మెరుగు పెట్టడం
    2) కుండల తయారీ
    3) కంచు పని
    4) సుగంధ ద్రవ్యాల తయారీ
40. శాతవాహనుల కాలంలో వృత్తిపనివారు చెల్లించే పన్ను పేరేమిటి?
    1) కరుకర 2) శ్రేణి
    3) శ్రేష్ఠి 4) కాలిక
41. శాతవాహనుల కాలంలో 'సేలవధకులు'గా ఎవరిని పేర్కొనేవారు?
    1) కవులు 2) సాలెవారు
    3) శిల్పులు 4) మేదరివారు
42. శాతవాహనుల కాలంలో 'వసకరులు' అంటే ఎవరు?
    1) కంచు పనివారు 2) సాలెవారు
    3) శిల్పులు 4) మేదరివారు
43. కులాలు వేటి నుంచి ఆవిర్భవించాయి?
    1) వృత్తి సంఘాలు 2) ధర్మాలు
    3) స్మృతులు 4) వర్తక సంఘాలు
44. శాతవాహనుల కాలం నాటి ప్రజల ప్రధాన ప్రయాణ సాధనం?
    1) గుర్రం బండి 2) ఎడ్ల బండి
    3) కుక్కల బండి 4) ఒంటె బండి
45. శాతవాహనుల కాలంలో విదేశాలతో వర్తకం చేసేవారిని ఏమని పిలిచేవారు?
    1) శ్రేణులు 2) నిగమాలు
    3) సార్థవాహులు 4) బిడారులు
46. శాతవాహనుల 'నాణేల'పై ప్రధానంగా కనిపించేది?
    1) ఓడముద్ర 2) చాపముద్ర
    3) వృషభం 4) సింహం
47. శాతవాహనుల 'టంకసాల' నగరం ఏది?
    1) కొండాపురం 2) పెదబంకూరు
    3) ధూళికట్ట 4) హన్మకొండ
48. శాతవాహనులతో ఎక్కువగా వర్తక వ్యాపారం నిర్వహించిన విదేశీయులు?
    1) ఆరేబియన్లు 2) పర్షియన్లు
    3) గ్రీకులు 4) రోమన్లు
49. శాతవాహనులు సముద్ర తీరంతోపాటు ఏ నదుల ద్వారా కూడా విదేశీ వ్యాపారం నిర్వహించేవారు?
    1) కృష్ణా, గోదావరి 2) మూసీ, గోదావరి
    3) మూసీ, కృష్ణా 4) గంగా–గోదావరి
50. 'గౌతమీ బాలశ్రీ' ఎవరి తల్లి?
    1) మొదటి శాతకర్ణి 2) రెండో శాతకర్ణి
    3) శ్రీముఖుడు 4) గౌతమీపుత్ర శాతకర్ణి
51. శాతవాహనుల కాలంలో అధికంగా చెలామణిలో ఉన్న లోహం ఏది?
    1) వెండి 2) బంగారం
    3) రాగి 4) కంచు

సమాధానాలు

1) 4; 2) 3; 3) 1; 4) 3; 5) 1; 6) 2; 7) 3; 8) 4; 9) 2; 10) 1; 11) 3; 12) 4; 13) 1; 14) 1; 15) 4; 16) 2; 17) 3; 18) 1; 19) 4; 20) 1; 21) 2; 22) 1; 23) 2; 24) 1; 25) 2; 26) 4; 27) 2; 28) 4; 29) 2; 30) 1; 31) 3; 32) 4; 33) 4; 34) 1; 35) 1; 36) 4; 37) 2; 38) 3; 39) 4; 40) 1; 41) 3; 42) 4; 43) 1; 44) 2; 45) 3; 46) 1; 47) 1; 48) 4; 49) 2; 50) 4; 51) 1.

ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఉన్న 'బీచ్' ఏ రాష్ట్రంలో ఉంది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

మాదిరి ప్రశ్నలు

1. బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమని పిలుస్తారు?
   1) కర్ణావతి 2) భాగీరథి
   3) జమున 4) పద్మ
2. కింది వాటిలో గంగానది ఒడ్డున లేని నగరం ఏది?
   1) వారణాసి 2) అలహాబాద్
   3) కాన్పూర్ 4) లక్నో
3. జతపరచండి.
   జాబితా-I
   i) కుమవున్ హిమాలయాలు
   ii) నేపాల్ హిమాలయాలు
   iii) పంజాబ్ హిమాలయాలు
   iv) అస్సాం హిమాలయాలు
   జాబితా-II
   a) ఇండస్, సట్లెజ్ మధ్య
   b) కాళీ, తీస్తా మధ్య
   c) తీస్తా, బ్రహ్మపుత్ర మధ్య
   d) సట్లెజ్, కాళీ మధ్య
   1) i-c, ii-d, iii-b, iv-a
   2) i-c, ii-b, iii-d, iv-a
   3) i-d, ii-b, iii-a, iv-c
   4) i-d, ii-c, iii-a, iv-b
4. సాత్పురా, వింధ్య పర్వతాల మధ్య ప్రవహించే నది ఏది?
   1) నర్మద 2) గండక్
   3) తపతి 4) గోదావరి
5. భారతదేశంలో బ్రహ్మపుత్ర నది మొదట ఏ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది?
   1) అస్సాం 2) త్రిపుర
   3) సిక్కిం 4) అరుణాచల్‌ప్రదేశ్
6. కజిరంగా జాతీయ పార్కు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) అస్సాం 2) బిహార్
   3) పశ్చిమ బెంగాల్
   4) కర్ణాటక
7. కింది వాటిలో సరైన జత ఏది?
   1) బందీపూర్ - తమిళనాడు
   2) మానస్ - ఉత్తరప్రదేశ్
   3) రణతంబోర్ - రాజస్థాన్
   4) సిమ్లిపాల్ - జార్ఖండ్
8. 'ఘనా' పక్షి సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
   1) ఒడిశా 2) కర్ణాటక
   3) రాజస్థాన్ 4) పశ్చిమ బెంగాల్
9. కింది వాటిలో బయోస్ఫియర్ రిజర్వ్ కానిది ఏది?
   1) అగస్త్యమలై 2) నల్లమలై
   3) నీలగిరి 4) పంచమర్హి
10. భారతదేశంలో తొలి జీవ వైవిధ్య రక్షిత స్థలాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) గ్రేట్ నికోబార్
    2) గల్ఫ్ ఆఫ్ మన్నార్
    3) నందాదేవి 4) నీలగిరి
11. ప్రసిద్ధి చెందిన 'కన్హ వన్యమృగ సంరక్షణ కేంద్రం' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) బిహార్ 2) మధ్యప్రదేశ్
    3) కర్ణాటక 4) అస్సాం
12. కేరళలోని ఏ అభయారణ్యం ఏనుగులకు ప్రసిద్ధి చెందింది?
    1) పరకల్ 2) పెరియార్
    3) చంద్రప్రభ 4) కన్హ
13. జతపరచండి.

జాబితా - I	జాబితా - II
i) సిమ్లిపాల్	a) ఉత్తరప్రదేశ్
ii) బందీపూర్	b) ఒడిశా
iii) మానస్	c) కర్ణాటక
iv) చంద్రప్రభ	d) అస్సాం

    1) i-c, ii-d, iii-a, iv-b
    2) i-d, ii-c, iii-b, iv-a
    3) i-b, ii-c, iii-d, iv-a
    4) i-a, ii-b, iii-c, iv-d
14. 'సైలెంట్ వ్యాలీ' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) తమిళనాడు
    2) కేరళ 3) అస్సాం
    4) అరుణాచల్ ప్రదేశ్
15. 'రంగనతిట్టు' పక్షి సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) కేరళ 2) అస్సాం
    3) రాజస్థాన్ 4) కర్ణాటక
16. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఏ తేదీన నిర్వహిస్తారు?
    1) జూన్ 5 2) జూన్ 9
    3) అక్టోబర్ 5 4) సెప్టెంబర్ 10
17. భారత్‌లో అతిపెద్ద పులుల సంరక్షణ కేంద్రం ఏది?
    1) గిర్ అడవి (గుజరాత్)
    2) బందీపూర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం (కర్ణాటక)
    3) నాగార్జున శ్రీశైలం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)
    4) దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్)
18. మధ్యప్రదేశ్‌లోని 'పన్నా' నేషనల్ పార్కు ద్వారా ప్రవహించే నది ఏది?
    1) నర్మద 2) తపతి
    3) కెన్ 4) సట్లెజ్
19. కింది వాటిలో ఖడ్గ మృగాలకు ప్రసిద్ధి చెందిన జాతీయ పార్కు ఏది?
    1) దచిగామ్ 2) సలీం అలీ
    3) రోహులా 4) జల్దపార
20. భారత్‌లో ఏర్పాటు చేసిన తొలి జాతీయ పార్కు ఏది?
    1) గిర్ నేషనల్ పార్క్
    2) జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్
    3) సిమ్లిపాల్ నేషనల్ పార్క్
    4) జల్దపార నేషనల్ పార్క్
21. భారతదేశంలో తొలి పక్షి సంరక్షణ కేంద్రం ఏది?
    1) వేదాంతంగల్ 2) రంగనతిట్టు
    3) ఘనా 4) కొల్లేరు
22. జాతీయ పార్కులకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) గిండి జాతీయ పార్కు - తమిళనాడు
    2) వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ జాతీయ పార్కు - ఉత్తరాఖండ్
    3) దుద్వా జాతీయ పార్కు - ఉత్తరప్రదేశ్
    4) వాల్మీకి జాతీయ పార్కు - ఛత్తీస్‌గఢ్



23. భారతదేశ వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని ఏ సంవత్సరంలో రూపొందించారు?
    1) 1954 2) 1964
    3) 1972 4) 1986
24. 'నామ్‌దఫా' టైగర్ రిజర్వ్ ఏ రాష్ట్రంలో ఉంది?
    1) అస్సాం 2) అరుణాచల్ ప్రదేశ్
    3) బిహార్ 4) ఒడిశా
25. జతపరచండి.

టైగర్ రిజర్వ్	రాష్ట్రం
i) నామేరి	a) కర్ణాటక
ii) కవ్వాల్	b) ఛత్తీస్‌గఢ్
iii) ఇంద్రావతి	c) తెలంగాణ
iv) బద్రా	d) అస్సాం

    1) i-b, ii-c, iii-a, iv-d
    2) i-d, ii-c, iii-b, iv-a
    3) i-a, ii-c, iii-d, iv-b
    4) i-b, ii-d, iii-a, iv-c
26. రోహులా జాతీయ పార్కు ఏ రాష్ట్రంలో ఉంది?
    1) ఉత్తరాఖండ్ 2) హిమాచల్ ప్రదేశ్
    3) ఉత్తరప్రదేశ్ 4) రాజస్థాన్
27. 'గరమ్ పానీ' శాంక్చుయరీ ఏ రాష్ట్రంలో ఉంది?
    1) రాజస్థాన్ 2) మధ్యప్రదేశ్
    3) ఉత్తర ప్రదేశ్ 4) అస్సాం
28. కింది వాటిలో రాజస్థాన్‌కు చెందని వన్యమృగ సంరక్షణ కేంద్రం ఏది?
    1) సరిస్క 2) రామ్‌గఢ్ బంధీ
    3) తీర్థాన్ 4) ఫల్వారి
29. వన్య మృగ సంరక్షణ కేంద్రాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
    1) భీమ బంద్ - బిహార్
    2) దచిగామ్ - జమ్ము-కశ్మీర్
    3) హజారీ బాగ్ - జార్ఖండ్
    4) దండేలి - ఒడిశా
30. కింది వాటిలో యునెస్కో జాబితాలో లేని భారత బయోస్ఫియర్ రిజర్వ్ ఏది?
    1) సుందర్‌బన్స్ 2) కాంచన గంగ
    3) మన్నార్ సింధు శాఖ
    4) నందా దేవి
31. 'ఆపరేషన్ టైగర్ ప్రాజెక్టు'ను ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
    1) 1952 2) 1972
    3) 1973 4) 1985
32. 'సత్కోషియా' టైగర్ రిజర్వ్ ఏ రాష్ట్రంలో ఉంది?
    1) అస్సాం 2) ఒడిశా
    3) కర్ణాటక 4) రాజస్థాన్
33. ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఉన్న 'గహిర్మాత బీచ్' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) తమిళనాడు 2) గుజరాత్
    3) పశ్చిమ బెంగాల్ 4) ఒడిశా
34. భారత్‌లో 'ఆపరేషన్ క్రొకడైల్'ను ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
    1) 1972 2) 1973
    3) 1975 4) 1985
35. మనదేశంలో మొసళ్ల సంరక్షణకు 'క్రొకడైల్ బ్యాంక్'ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) కోల్‌కతా 2) విశాఖపట్నం
    3) ముంబై 4) చెన్నై
36. 'సంజయ్ దుబ్రి టైగర్ రిజర్వ్' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) తమిళనాడు 2) మధ్యప్రదేశ్
    3) న్యూఢిల్లీ 4) కర్ణాటక
37. 11వ ప్రపంచ జీవ వైవిధ్య సదస్సును ఎక్కడ నిర్వహించారు?
    1) కాన్‌కున్ 2) ఢిల్లీ
    3) హైదరాబాద్
    4) కౌలాలంపూర్
38. ఆసియా సింహాలకు ఆవాసమైన 'గిర్' జంతు సంరక్షణ కేంద్రం ఏ ప్రాంతంలో ఉంది?
    1) జునాగఢ్ 2) భావనగర్
    3) గాంధీనగర్ 4) కాంబే
39. కింది వాటిలో సరికానిది ఏది?
    1) ఏనుగులకు సంబంధించిన ప్రాజెక్టు (ప్రాజెక్టు ఎలిఫెంట్)ను 1992లో ప్రారంభించారు
    2) ప్రాజెక్టు ఎలిఫెంట్ ప్రకారం, ఏనుగులు ఉండే ప్రాంతాన్ని గ్రీన్, ఎల్లో, రెడ్ మూడు ప్రాంతాలుగా విభజించారు
    3) భారతదేశంలో అతి వేగంగా అంతరించి పోతున్న తాబేళ్ల జాతి.. ఆలివ్ రిడ్లే తాబేళ్లు
    4) 'ఆపరేషన్ కార్బెట్ సీ టర్టిల్' అనే కార్యక్రమాన్ని 1975లో ప్రారంభించారు
40. రాజాజీ, కార్బెట్ ఏనుగుల రిజర్వ్‌లు ఏ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి?
    1) ఉత్తరప్రదేశ్, బిహార్
    2) మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్
    3) మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్
    4) ఉత్తరాఖండ్
41. 'కోల్డ్ డెజర్ట్ బయోస్ఫియర్ రిజర్వ్' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) హిమాచల్‌ప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
    3) మేఘాలయ 4) అస్సాం
42. జాతీయ పార్కులు, అవి ఉన్న ప్రాంతాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
    1) కిష్టవార్ - జమ్ము-కశ్మీర్
    2) బోర్‌విల్లీ - ఉత్తరప్రదేశ్
    3) బన్నార్ గట్టా - కర్ణాటక
    4) మాధవ్ - మధ్యప్రదేశ్
43. కింది వాటిలో అరిచే జింకలు ఉన్న జాతీయ పార్కు ఏది?
    1) గిండి జాతీయ పార్కు
    2) శివపురి జాతీయ పార్కు
    3) దుద్వా జాతీయ పార్కు
    4) బోర్‌విల్లీ జాతీయ పార్కు
44. 'రాణి ఝాన్సీ' వన్యమృగ సంరక్షణ కేంద్రం ఉన్న ప్రాంతం ఏది?
    1) మధ్యప్రదేశ్ 2) ఉత్తరప్రదేశ్
    3) బిహార్
    4) అండమాన్ నికోబార్
45. 'సంజయ్ గాంధీ నేషనల్ పార్కు' అని దేన్ని పిలుస్తారు?
    1) బోర్‌విల్లీ నేషనల్ పార్కు
    2) కజిరంగా నేషనల్ పార్కు
    3) నాగర్‌సోల్ నేషనల్ పార్కు
    4) శివపురి నేషనల్ పార్కు
46. 'ఇంటాంకీ' వన్యమృగ సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మణిపూర్ 2) నాగాలాండ్
    3) మిజోరాం 4) అస్సాం
47. 2016లో 13వ ప్రపంచ జీవ వైవిధ్య సదస్సును ఎక్కడ నిర్వహించారు?
    1) బాన్ 2) హేగ్
    3) హైదరాబాద్ 4) కాన్‌కున్
48. 'భగవాన్ మహావీర్' వన్యమృగ సంరక్షణ కేంద్రం ఎక్కడ ఉంది?
    1) మహారాష్ట్ర 2) తెలంగాణ
    3) గోవా 4) సిక్కిం
49. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) నందన్ కానన్ నేషనల్ పార్కు - ఒడిశా
    2) సోనాయ్ రూపాయ్ వన్యమృగ సంరక్షణ కేంద్రం - అస్సాం
    3) నవగావ్ జాతీయ పార్కు - పశ్చిమ బెంగాల్
    4) అన్షి జాతీయ పార్కు - కర్ణాటక
50. డాక్టర్ సలీం అలీ బర్డ్ శాంక్చుయరీ ఎక్కడ ఉంది?
    1) గోవా 2) కేరళ
    3) తమిళనాడు 4) అస్సాం
51. 'ఇందిరాగాంధీ వైల్డ్ లైఫ్ శాంక్చుయరీ' అని దేన్ని పిలుస్తారు?
    1) పెరియార్ శాంక్చుయరీ
    2) శికారీ దేవి శాంక్చుయరీ
    3) రంగనతిట్టు బర్డ్ శాంక్చుయరీ
    4) అన్నామలై శాంక్చుయరీ
52. 'గోవింద్ పశు విహార్' వన్యమృగ సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) ఉత్తరప్రదేశ్ 2) రాజస్థాన్
    3) మహారాష్ట్ర 4) పశ్చిమ బెంగాల్
53. 'భిత్తర్ కానికా' వన్యమృగ సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) తమిళనాడు 2) కేరళ
    3) గోవా 4) ఒడిశా
54. చంబల్, బెట్వా, కెన్‌లు ఏ నదికి ఉపనదులు?
    1) నర్మద 2) తపతి
    3) యమున 4) దామోదర్
55. కింది వాటిలో పెన్నా నదికి ఉపనది కానిది ఏది?
    1) కుందేరు 2) సగిలేరు
    3) లోకపావని 4) చెయ్యేరు
56. సోన్ నది గంగానదిలో ఎక్కడ కలుస్తుంది?
    1) అలహాబాద్ 2) పాట్నా
    3) రుద్ర ప్రయాగ 4) ఛాప్రా
57. నర్మదానది దేశంలో ఏయే రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తోంది?
    1) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్
    2) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్
    3) మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్
    4) మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్
58. దిబాంగ్, లోహిత్ ఏ నదికి ఉపనదులు?
    1) గంగా 2) సింధు
    3) యమున 4) బ్రహ్మపుత్ర
59. గంగా నది ఏ రాష్ట్రంలో అత్యధిక దూరం ప్రవహిస్తోంది?
    1) పశ్చిమ బెంగాల్
    2) ఉత్తరప్రదేశ్ 3) బిహార్
    4) ఉత్తరాఖండ్
60. కింది వాటిలో సరైంది ఏది?
    1) దామోదర్ నది చోటానాగ్‌పూర్ పీఠభూమిలోని 'టోరి' అనే ప్రాంతంలో జన్మిస్తోంది
    2) చంబల్ నది మధ్యప్రదేశ్‌లోని 'మౌ' అనే ప్రదేశంలో జన్మిస్తోంది
    3) పెన్నా నది కర్ణాటకలో నంది దుర్గ కొండల్లో జన్మిస్తోంది
    4) పైవన్నీ సరైనవే

సమాధానాలు

1) 4 2) 4 3) 3 4) 1 5) 4
6) 1 7) 3 8) 3 9) 2 10) 4
11) 2 12) 2 13) 3 14) 2 15) 4
16) 1 17) 3 18) 3 19) 4 20) 2
21) 1 22) 4 23) 3 24) 2 25) 2
26) 2 27) 4 28) 3 29) 4 30) 2
31) 3 32) 2 33) 4 34) 3 35) 4
36) 2 37) 3 38) 1 39) 3 40) 4
41) 1 42) 2 43) 4 44) 4 45) 1
46) 2 47) 4 48) 3 49) 3 50) 1
51) 4 52) 1 53) 4 54) 3 55) 3
56) 2 57) 3 58) 4 59) 2 60) 4

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

వరల్డ్ ఎర్త్ డేని ఎప్పుడు నిర్వహిస్తారు..?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ



జీవ వైవిధ్యం

భూమిపై ఉన్న విభిన్న జీవ జాతుల సముదాయాన్నే 'జీవ వైవిధ్యం'గా పేర్కొనవచ్చు. ఇది మానవుడికి అనేక విధాలుగా ఉపయోగపడుతూ భూమిపై మనుగడ సాగించడానికి తోడ్పడుతోంది. ఆహార, శక్తి వనరులు, ఔషధాలు, కలప, నార, పీచు రూపంలో మొక్కలు మానవుడికి ఉపయోగపడుతున్నాయి. జంతువులు, బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, భూమిపై ఉన్న ప్రతి జీవి మానవుడికి ఏదో ఒక విధంగా ఉపయోగపడుతున్నాయి.

ఇంతటి ప్రాధాన్యం ఉన్న జీవ వైవిధ్యానికి ప్రస్తుతం అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న చర్యల వల్ల నష్టం వాటిల్లుతోంది. ఇంతకుముందెన్నడూ లేనివిధంగా దీనికి తీవ్ర స్థాయిలో ముప్పు పొంచి ఉన్నట్లు యూఎన్ఈపీ (United Nations Environment Programme) ఇటీవల ప్రకటించింది. గత శతాబ్దకాలంలో అనేక వన్య జీవులు కనుమరుగైన నేపథ్యంలో జీవ వైవిధ్యాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల్లో పర్యావరణ అంశాల ప్రాధాన్యం పెంచారు. అందువల్ల అభ్యర్థులు ఈ అంశంపై అవగాహన పెంచుకోవాలి.

జీవ వైవిధ్యం - నేపథ్యం

జీవ సంబంధ వైవిధ్యం (Biological Diversity) అనే పదాన్ని మొదట రేమండ్ ఎఫ్. డాస్మన్ అనే పరిరక్షణవేత్త 1968లో "A Different Kind of Country" పుస్తకంలో ఉపయోగించాడు. 1985లో వాల్టర్ జి. రోజెన్ అనే శాస్త్రవేత్త 'జీవ వైవిధ్యం'(Bio diversity) అనే సంక్షిప్త పదాన్ని ప్రతిపాదించాడు.

జీవులతో ముడిపడి ఉన్న అన్ని రకాల వైవిధ్యాలను జీవ సంబంధ వైవిధ్యంగా పేర్కొంటారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్ (IUCN) ప్రకారం.. ఒక భౌగోళిక ప్రాంతంలోని మొత్తం జన్యువులు, జాతులు, జీవావరణ వ్యవస్థల సముదాయమే జీవ వైవిధ్యం. ప్రకృతిలో ఇది సహజంగా ఉంటుంది. జీవ వైవిధ్య పరిరక్షణ భావన 1980 నుంచి బలపడింది. అడవులను సంరక్షించడంలో భాగంగా.. అక్కడ ఉండే అన్ని రకాల జీవులు, వాటి తెగలు, వాటిలోని విభిన్న జన్యువులు, జీవులు మధ్య ఉన్న సంబంధాలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు సూచించారు.

జీవ వైవిధ్యం - వివిధ స్థాయిలు

1. **జన్యు వైవిధ్యం (Genetic Diversity):** ఒక జాతి జీవుల్లో ఉండే విభిన్న జన్యువుల సముదాయమే జన్యు వైవిధ్యం.
ఉదా: మనుషుల్లో వివిధ తెగలు (ఆస్ట్రలాయిడ్, మంగోలాయిడ్, నిగ్రాయిడ్); మానవుడిలో విభిన్న రక్త గ్రూపులు.

2. **జాతి వైవిధ్యం (Species Diversity):** ఒక నిర్దిష్ట ప్రాంతంలోని విభిన్న జాతులకు చెందిన జీవుల సముదాయాన్ని 'జాతి వైవిధ్యం'గా పేర్కొంటారు. దీని ఆధారంగా ప్రపంచంలో అత్యధిక జీవ వైవిధ్యం ఉన్న 17 మెగా బయోడైవర్సిటీ దేశాలను గుర్తించారు. ఈ రకమైన వైవిధ్యం జీవుల వర్గీకరణలో ఉపయోగపడుతుంది.

3. **ఆవరణ వ్యవస్థ వైవిధ్యం (Ecosystem Diversity):** విభిన్న రకాల భూచర, జలచర ఆవరణ వ్యవస్థల సముదాయాన్ని 'ఆవరణ వ్యవస్థ వైవిధ్యం' అంటారు.

పైన పేర్కొన్నవాటితో పాటు మైక్రోబియల్ డైవర్సిటీ, అగ్రి బయోడైవర్సిటీ లాంటి విభిన్న స్థాయి జీవ వైవిధ్యం కూడా ఉంటుంది. రాబర్ట్ విట్టేకర్ అనే శాస్త్రవేత్త జీవ వైవిధ్యాన్ని 3 రకాలుగా విభజించాడు.

1. **α – జీవ వైవిధ్యం:** దీన్ని Species Richness అంటారు. ఒక ఆవరణ వ్యవస్థలోని జాతి వైవిధ్యాన్ని ఇది తెలుపుతుంది.
2. **β – వైవిధ్యం:** రెండు భిన్న ఆవరణ వ్యవస్థల్లో జాతి వైవిధ్యంలోని భేదాన్ని ఇది తులనాత్మకంగా తెలుపుతుంది.
3. **γ – వైవిధ్యం:** ఒక విశాల భౌగోళిక ప్రాంతంలోని విభిన్న జీవ సమాజాల్లో మొత్తం వైవిధ్యాన్ని 'గామా వైవిధ్యం'గా పేర్కొంటారు.

మెగా బయోడైవర్సిటీ దేశాలు

మెక్సికో 2002లో ప్రపంచవ్యాప్తంగా అధిక జీవ వైవిధ్యం, సంప్రదాయ విజ్ఞానానికి నిలయంగా ఉన్న దేశాలను (Like-minded Mega Diverse Countries) గుర్తించింది. Conservation International గుర్తించిన 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితా..

1. ఆస్ట్రేలియా 2. బ్రెజిల్
3. చైనా 4. కొలంబియా
5. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో
6. ఇక్వెడార్ 7. ఇండియా
8. ఇండోనేషియా 9. మడగాస్కర్
10. మలేషియా 11. మెక్సికో
12. పపువ న్యూగినియా
13. పెరూ
14. ఫిలిప్పీన్స్
15. దక్షిణాఫ్రికా
16. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా
17. వెనిజులా

ఈ జాబితాలో పేర్కొన్న మొదటి దేశంలో అత్యధిక జీవ వైవిధ్యం, చివరి దేశంలో తక్కువ జీవ వైవిధ్యం ఉంటుంది.

జీవ వైవిధ్య హాట్ స్పాట్స్

అధిక జీవ వైవిధ్యానికి నిలయంగా ఉండి ముప్పు పొంచి ఉన్న జీవ భౌగోళిక ప్రాంతాలను 'బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్'గా పేర్కొంటారు. నార్మన్ మేయర్స్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్త ఈ భావనను మొదటిసారిగా ప్రతిపాదించాడు. 1985–90లో ఈయన ప్రచురించిన "The Environment" అనే ఆర్టికల్‌లో దీని గురించి ప్రస్తావించాడు. 1996లో Conservation International ఈ భావనపై పరిశోధన చేసి మేయర్స్‌తో ఏకీభవించింది.

ఏదైనా ఒక భౌగోళిక ప్రాంతాన్ని బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌గా గుర్తించడంలో రెండు అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు.

1. కనీసం 1500 జాతుల నాళిక కణజాలయుత మొక్కలు (Vascular Plants) ఎండమిక్ (స్థానియ) జాతులుగా ఆ ప్రాంతానికే పరిమితమై ఉండాలి.
2. కనీసం 70 శాతం తమ సహజ ఆవాసాన్ని లేదా వృక్షజాలాన్ని కోల్పోయి ఉండాలి.

1999లో ఇలాంటి 25 ప్రాంతాలను గుర్తించారు. ఆ తర్వాత మరో 10 ప్రదేశాలను గుర్తించారు. నార్మన్ మెయర్స్ 1999లో "Hotspots: Earth's Biologically Richest and Most Endangered Terrestrial Eco-region" పుస్తకాన్ని ప్రచురించారు. 2000లో దీన్ని 'నేచర్' అనే అంతర్జాతీయ పత్రికలో ప్రచురించారు. 2007లో రస్సెల్ మిట్టర్ మియర్ అనే శాస్త్రవేత్త "Hotspots Revisited" అనే గ్రంథాన్ని రచించాడు.

ప్రపంచంలో ప్రస్తుతం 35 బయోడైవర్సిటీ హాట్‌స్పాట్లు ఉన్నాయి. అవి:

ఉత్తర, మధ్య అమెరికా
1. కాలిఫోర్నియా ఫ్లోరిస్టిక్ ప్రావిన్స్
2. మ్యాడ్రియన్ పైన్ ఓక్ ఉడ్‌లాండ్స్
3. మిసో అమెరికా 4. కరేబియన్ దీవులు

దక్షిణ అమెరికా
1. టంబెస్ చోకో మ్యాగ్దెలిన
2. ట్రాపికల్ ఆండీస్
3. చిలీయన్ వింటర్ రెయిన్‌ఫాల్ వాల్దివియన్ ఫారెస్ట్
4. బ్రెజిల్ సిర్రాడో
5. బ్రెజిల్ అట్లాంటిక్ ఫారెస్ట్

యూరప్, మధ్య ఆసియా
1. కాకాసస్
2. మధ్య ఆసియా అడవులు
3. మధ్యధరా ప్రాంతం
4. ఇరాన్ అనతోలియన్

ఆఫ్రికా
1. పశ్చిమ ఆఫ్రికా – గినియా అడవులు
2. సక్కులెంట్ కరూ
3. కేప్ ఫ్లోరోస్టిక్ ప్రాంతం
4. మపుటలాండ్ – పాండో లాండ్ ఆల్బని
5. తూర్పు ఆఫ్రికా తీర అడవులు
6. ఈస్టర్న్ అఫ్రోమోంటేన్
7. హార్న్ ఆఫ్ ఆఫ్రికా
8. మడగాస్కర్ – హిందూ మహాసముద్ర దీవులు

ఆసియా పసిఫిక్
1. పశ్చిమ కనుమలు – శ్రీలంక
2. హిమాలయాలు 3. ఇండో బర్మా
4. నైరుతి చైనా 5. ఫిలిప్పీన్స్
6. సుందా లాండ్ 7. వాలేసియా
8. న్యూ కాలిడోనియా
9. ఈస్ట్ మెలనేసియా అడవులు
10. పాలినేసియా మైక్రోనేసియా
11. న్యూజిలాండ్ 12. జపాన్
13. నైరుతి ఆస్ట్రేలియా 14. తూర్పు ఆస్ట్రేలియా

మాదిరి ప్రశ్నలు

1. ఐక్యరాజ్యసమితి 'జీవ వైవిధ్య దశాబ్దం'గా దేన్ని ప్రకటించింది?
ఎ) 2001–10 బి) 2011– 20
సి) 2021–30 డి) 1991–2000
2. 'అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం' ఏ రోజు నిర్వహిస్తారు?
ఎ) ఏప్రిల్ 22 బి) మే 22
సి) జూన్ 20 డి) డిసెంబర్ 21
3. "Convention on Biological Diversity" అంతర్జాతీయ ఒప్పందాన్ని రూపొందించింది?
ఎ) యునెస్కో బి) యూఎన్ఈపీ
సి) ఎ, బి డి) ఏదీకాదు
4. భారత్‌లోని ఏ ప్రాంతంలో 'లయన్ టెయిల్డ్ మకాక్' అనే కోతి కనిపిస్తుంది?
ఎ) పశ్చిమ కనుమలు
బి) ఈశాన్య హిమాలయాలు
సి) తూర్పు కనుమలు
డి) అండమాన్ నికోబార్ దీవులు
5. "Conservation International" అనే అంతర్జాతీయ పరిరక్షణ సంస్థ ఎక్కడ ఉంది?
ఎ) మెక్సికో బి) నైరోబి
సి) లండన్ డి) వాషింగ్టన్
6. ప్రపంచంలోని 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితాలో లేనిది?
ఎ) శ్రీలంక బి) వెనిజులా
సి) కొలంబియా డి) ఇండోనేసియా
7. ప్రపంచంలోని మెగా బయోడైవర్సిటీ కేంద్రాల్లో భారత్ స్థానం?
ఎ) 3 బి) 5 సి) 7 డి) 9
8. జీవవైవిధ్య సంరక్షణ కోసం కుదుర్చుకున్న "Convention on Biological Diversity" (BD) అంతర్జాతీయ ఒప్పందం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
ఎ) 1993 బి) 1994
సి) 1995 డి) 1996
9. 'నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ' ఎక్కడ ఉంది?
ఎ) చెన్నై బి) బెంగళూరు
సి) తిరువనంతపురం డి) గాంగ్‌టక్
10. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (UNEP) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
ఎ) జెనీవా బి) న్యూఢిల్లీ
సి) వాషింగ్టన్ డి) నైరోబి
11. 'వరల్డ్ ఎర్త్ డే'ను ఎప్పుడు నిర్వహిస్తారు?
ఎ) మార్చి 22 బి) ఏప్రిల్ 22
సి) సెప్టెంబర్ 16 డి) అక్టోబర్ 12
12. భారత్‌లో ఉభయచర వైవిధ్యం అధికంగా ఉన్న ప్రాంతం ఏది?
ఎ) వింధ్య పర్వతాలు
బి) పశ్చిమ కనుమలు
సి) పశ్చిమ హిమాలయాలు
డి) తూర్పు కనుమలు
13. బట్టమేక పక్షులు (Great Indian Bustard) ఎక్కువగా ఏ రాష్ట్రంలో కనిపిస్తాయి?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) తెలంగాణ
సి) మధ్యప్రదేశ్ డి) రాజస్థాన్
14. కర్ణాటకలో ఎన్ని టైగర్ రిజర్వులు ఉన్నాయి?
ఎ) 4 బి) 5 సి) 6 డి) 7
15. ఏ జీవి నుంచి లభించే ప్రత్యేక నూనెను ఔషధాలు, పర్‌ఫ్యూమ్‌ల తయారీలో ఉపయోగిస్తారు?
ఎ) చింకారా బి) కృష్ణజింక
సి) కస్తూరి జింక డి) సాంబారు దుప్పి
16. 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్' చిహ్నం ఏది?
ఎ) ధ్రువ ఎలుగుబంటి
బి) పాండా
సి) నీలి తిమింగలం డి) ఏదీకాదు
17. 'వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా' ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూరు బి) గౌహతి
సి) డెహ్రాడూన్ డి) తిరువనంతపురం
18. దేశంలో ఆసియా సింహం సంరక్షిత ప్రాంతం ఏది?
ఎ) గిర్ అడవులు
బి) వేనాడ్ అభయారణ్యం
సి) పెంచ్ జాతీయ పార్కు
డి) పైవన్నీ

సమాధానాలు

1) బి; 2) బి; 3) బి; 4) ఎ; 5) డి; 6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) డి; 11) బి; 12) బి; 13) డి; 14) సి; 15) సి; 16) బి; 17) సి; 18) ఎ.

A European visitor to the..

BANK EXAMS

GENERAL ENGLISH



Model Questions

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Though many companies (1)/ believe that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ No error (5)
2. Eat has the selectional restriction (1)/ that it must be following by a kind of food, (2)/ so 'I eat sky' (3)/ is not possible. (4)/ No error (5)
3. There was (1)/ no way he could (2)/ keep going (3)/ below all that pressure. (4)/ No error (5)
4. It was not until morning (1)/ that the sheer scale (2)/ of the damage (3)/ could be seen. (4)/ No error (5)
5. Trade sanctions (1)/ were imposed (2)/ against any country (3)/ that refuses to sign the agreement. (4)/ No error (5)

Directions (Q. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. You'll have to study <u>any books</u> on Freud before writing a paper on psychoanalysis.
1) Much books 2) few books
3) some books 4) more books
5) No correction required
7. A European visitor to the Far East must accommodate <u>self from</u> the habits of life that may seem very strange to him.
1) Himself to 2) his self to
3) himself for 4) his self from
5) No correction required
8. He joined postgraduate course in the same college in which he had studied <u>for the three previous years.</u>
1) from previous three years
2) during the previous three years
3) three years previous
4) during the three previous years
5) No correction required
9. She always <u>manage</u> to hurt her mother's feelings.
1) do manage
2) does manage
3) did manages
4) do managed
5) No correction required
10. It is the people <u>who matters</u> in a democracy.
1) whom matters
2) whose matters
3) whose matter
4) who matter
5) No correction required

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. We were surprised to know that our friend was of royal ______.
1) dissent 2) decent
3) descent 4) dissuade
5) dispute
12. ______ of the highly educated people is a huge ______ on the country's resources.
1) Fight, draw
2) Position, aspect
3) Plight, drain
4) Struggle, issue
5) Rank, exhaust
13. No ______ reasons have been given for the sudden flight of refugees ______ this area.
1) proper, for
2) correct, along
3) suitable, among
4) valid, from
5) compelling, counter
14. The modern ______ of communication have ______ distance.
1) ways, deep
2) methods, destroyed
3) paths, shortened
4) means, annihilated
5) gadgets, developed
15. These remarks about the dominance of casteism in elections are quite ____ to the present ____.
1) apposite, position
2) opposite, fact
3) relevance, media
4) significance, party
5) applaudable, generation

Directions (Q. 16 - 20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) These days technology has revolutionized the very concept of a wrist watch. 3
B) Almost a majority of the people wear a watch worn round the wrist, it measures time in minutes, hours etc. 1
C) The day is not far when we shall have a little TV fitted into a wrist watch. 4
D) A wrist watch may be wound or automatic. 2
E) Wrist watches have become an integral part of human beings, due to their utilities. 6
F) One may have a choice of leather or metal of gold or silver while choosing a strap for the wrist watch. 5

16. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
1)A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The international fight against Islamic State moved up a _____ (21) on Saturday as Turkish police arrested a Belgian suspect heading for Syria in connection with _____ (22) week's Paris attacks, hours after the UN Security Council unanimously ______ (23) all its members to combat the extremist group.

A day after the EU imposed _____ (24) new external border controls, authorities in Belgium raised the alert level in the capital to level four - signifying a "serious and imminent threat" as the _______ (25) for the remaining jihadi who killed 130 people in Paris entered its second week. The presumed ringleader of the Paris attacks, Abdelhamid Abaaoud, a 28-year-old Belgian national of Moroccan origin, was ______ (26) to have been in Syria but died in a ferocious seven-hour gunfight ______ (27) police at a rundown apartment in St-Denis, north of Paris, on Wednesday. Another ______ (28) member of the unit, Salah Abdelslam, a 26-year-old Frenchman living in Brussels, is the subject of an international manhunt. His brother, Brahim, who blew himself up in the attacks, spent time in a Belgian prison with Abaaoud, while a third Molenbeek resident, Bilal Hadfi, was also among the Paris suicide bombers. Belgian Special Forces ______ (29) four people in the capital's Place du Grand Sablonon Saturday afternoon, while the Brussels Metro system is expected to be shut down until Sunday afternoon at the earliest. Shops ______ (30) closed, some shopping malls were shuttered, professional football was cancelled, concerts were called off and music venues, museums, and galleries shut their doors for the weekend.

21. 1) gear 2) ahead 3) above 4) always 5) alone
22. 1) lost 2) last 3) late 4) lastly 5) lasted
23. 1) urge 2) urging 3) urged 4) pledged 5) plead
24. 1) tight 2) treat 3) tread 4) tough 5) track
25. 1) hate 2) hurt 3) heat 4) hurt 5) hunt
26. 1) thought 2) thinking 3) think 4) thinned 5) thanked
27. 1) from 2) with 3) for 4) form 5) firm
28. 1) suspense 2) suspect 3) suspected 4) suspecting 5) suspects
29. 1) convicted 2) allowed 3) acquitted 4) arrested 5) prosecuted
30. 1) are to 2) will be 3) will been 4) have been 5) were

KEY

1) 3; 2) 2; 3) 4; 4) 5; 5) 4; 6) 3; 7) 1; 8) 2; 9) 2; 10) 4; 11) 3; 12) 3; 13) 4; 14) 4; 15) 1; 16) 4; 17) 1; 18) 5; 19) 1; 20) 3; 21) 1; 22) 2; 23) 3; 24) 4; 25) 5; 26) 1; 27) 2; 28) 3; 29) 4; 30) 5.